
'సామాన్యులకు వైద్యం
ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు.
అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 282

గురువారం 2-1-2025



వెల్‌డన్ వైశాలి
ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సొంతం -14లో



విడదీత.. లాభాల మోత!
కాసులు కురిపిస్తున్న దేశీ కార్పొరేట్ కంపెనీల 'విభజన'.. -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆనందం పంచాలని...
'2025లోనూ మరింతగా కష్టపడి పనిచేసి వికసిత్ భారత్ దిశగా అడుగులు వేద్దా'మంటూ ప్రధాని మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
వివరాలు 6లో ▸



కుట్రలను సమర్థిస్తున్నారా?
ఆప్, బీజేపీ మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. కేజ్రీవాల్ మోహన్ భగవత్‌కు రాసిన లేఖపై బీజేపీ మండిపడుతోంది.
వివరాలు 6లో ▸



ఐరాస భద్రతామండలిలో..
ఉగ్రవాదానికి పుట్టినిల్లుగా పిలిచే పాకిస్తాన్ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యదేశంగా చేరింది.
వివరాలు 6లో ▸



స్మార్ట్ పీపుల్ కావాలి
హెచ్–1బీ వీసాలను ట్రంప్ సమర్థించారు. అమెరికాకు ఎల్లప్పుడూ సమర్థవంతులైన వ్యక్తులే అవసరమని నొక్కి చెప్పారు.
వివరాలు 6లో ▸

ఉత్తరానికి వెళ్లే రైలు

సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్, మేడ్చల్ వరకు రెండు కొత్త మెట్రో కారిడార్లు

జేబీఎస్ నుంచి శామీర్‌పేట 22 కి.మీ.. ప్యారడైజ్ నుంచి మేడ్చల్‌కు 23 కి.మీ.

కొత్త సంవత్సరం తొలి రోజున సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం.. డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశాలు

గత నవంబర్‌లోనే ఫ్యూచర్‌సిటీ, పటాన్‌చెరు, ఇతర మెట్రో మార్గాలపై ప్రకటన

అన్నీ పూర్తయితే.. 11 కారిడార్లతో 240.4 కిలోమీటర్లకు చేరనున్న హైదరాబాద్ మెట్రో

ఉత్తర తెలంగాణవాసులకు ప్రయాణం ఇక సులువు: పొన్నం



మొత్తంగా మెట్రో ఇదీ..

	కారిడార్లు	కిలోమీటర్లు
ఇప్పటికే ఉన్న మార్గం	3	69
రెండో దశలో పార్ట్–ఏ	5	76.4
రెండో దశలో పార్ట్–బీ	3	95
అన్నీ పూర్తయితే మొత్తం మెట్రో:	11	240.4

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ ఉత్తర ప్రాంత ప్రజలకు నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభవార్త చెప్పారు. నగర ఉత్తర ప్రాంతాలను అనుసంధానిస్తూ రెండు కీలకమైన మెట్రో రైలు కారిడార్లను నిర్మించాలని నిర్ణయించారు. ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు 23 కిలోమీటర్లు, జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కిలోమీటర్ల పొడవుతో రెండు కారిడార్లకు ఆమోదం తెలిపారు. వీటికి సంబంధించి డీపీఆర్ తయారు చేయాలని.. మెట్రో రైల్ ఫేజ్–2 'బీ'లో భాగంగా ఈ రెండు కారిడార్లను కూడా కేంద్రం అనుమతి కోసం పంపించాలని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని ఆదేశించారు. సీఎం బుధవారం ఈ అంశంపై పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, ఎన్వీఎస్ రెడ్డిలతో చర్చించారు.

ప్రతిపాదిత కారిడార్లు ఇవీ..

ప్యారడైజ్ మెట్రోస్టేషన్ నుంచి తాడ్‌బండ్, బోయిన పల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా మేడ్చల్ వరకు దాదాపు 23 కిలోమీటర్లు కారిడార్ ఉంటుంది. ఇది నిజామాబాద్/ఆదిలాబాద్ వెళ్లే మార్గం (నేషనల్ హైవే నంబర్ 44) వెంట కొనసాగుతుంది. అలాగే జేబీఎస్ (జూబ్లీ బస్‌స్టేషన్) మెట్రోస్టేషన్ నుంచి విక్రంపురి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, అల్వాల్, బొల్లారం, హకీంపేట్, తూముకుంట, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్‌పేట్ వరకు 22 కిలోమీటర్ల

మిగతా 2వ పేజీలో ▶



వేడుకల వేళ ఉన్మాదం

వాహనంతో దూసుకొచ్చిన ఆగంతకుడు.. ఆపై కాల్పులు
10 మంది దుర్మరణం
అమెరికాలో ఘటన

అమెరికాలో నూతన సంవత్సరం మొదలైన తొలి క్షణాలే కొందరికి ఆఖరి క్షణాలయ్యాయి. సంబరాల్లో మునిగిపోయిన జనంపైకి ఓ ఆగంతకుడు ట్రక్కుతో దూసుకెళ్లాడు. తర్వాత విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో పది మంది ప్రాణాలు కోల్పోగా, మరో 35 మంది గాయపడ్డారు. పోలీసులు ఆ ఆగంతకుడిని హతమార్చారు. లూసియానా రాష్ట్రంలోని ఫ్రెంచ్ క్వార్టర్ ప్రాంత బార్బన్ వీధిలో ఈ దారుణం చోటుచేసుకుంది.

6లో

అన్నదాతకు అండగా..



కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

- డీఏపీపై వన్–టైమ్ స్పెషల్ ప్యాకేజీ పొడిగింపు
- 50 కిలోల డీఏపీ ఎరువు రూ.1,350కి లభ్యం
- కేంద్రంపై రూ.3,850 కోట్ల భారం
- రెండు పంటల బీమా పథకాలు మరో ఏడాది పొడిగింపు
- పథకాల అమలుకు రూ.824.77 కోట్లతో 'ఫండ్ ఫర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ'
- నిధుల కేటాయింపులు రూ.69,515.71 కోట్లకు పెంపు

6లో

హైస్పీడ్‌లోనూ అదుపులోనే!



అత్యాధునిక టెక్నాలజీతో ట్రిపుల్ ఆర్ నిర్మాణం

సాక్షి, హైదరాబాద్: వాహనాలు పరిమితికి మించిన వేగంతో దూసుకుపోయినా అదుపు తప్పకుండా ఉండేలా రీజినల్ రింగురోడ్డు (ట్రిపుల్ ఆర్)ను నిర్మించబోతున్నారు. ప్రస్తుతం మన దేశంలో ఎక్స్‌ప్రెస్‌వేల మీద గరిష్ట వేగాన్ని కేంద్ర ప్రభుత్వం గంటకు 120 కి.మీ.లకు పరిమితం చేసిన విషయం తెలిసిందే. కానీ, కొన్నిచోట్ల దీన్ని లెక్కచేయకుండా పరిమితికి మించిన వేగంతో వాహనాలు దూసుకుపోతూ ప్రమాదాలకు గురవుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని ట్రిపుల్ ఆర్‌ను గంటకు 180 కి.మీ నుంచి 200 కి.మీ. వేగాన్ని కూడా తట్టుకునే స్థాయిలో నిర్మించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ట్రిపుల్ ఆర్ నిర్మాణం ఇలా..

- ట్రిపుల్ ఆర్‌ను 8 వరసలకు ప్రతిపాదించినా.. ప్రస్తుతం నాలుగు వరసలతోనే నిర్మిస్తారు. భవిష్యత్తులో ట్రాఫిక్ పెరిగాక మలిదశలో మిగతా నాలుగు లేన్లను నిర్మిస్తారు.
- రోడ్డు మీద సెంట్రల్ మీడియన్ 15 మీటర్లుగా ఉంటుంది. దానిని ఆనుకుని ఉండే (రెండువైపులా కలిపి) నాలుగు వరసలను తదుపరి దశలో

మిగతా 3వ పేజీలో ▶

120 కి.మీ. వేగం దాటినా వాహనాలు సురక్షితం

రోడ్డు నాణ్యత విషయంలో కచ్చితమైన చర్యలు

ప్రత్యేక జాగ్రత్తలతో డిజైన్ చేస్తున్న ఎన్‌హెచ్ఏఐ

న్యూస్‌రీల్

22 నుంచి జేఈఈ మెయిన్ మొదటి సెషన్



బీటెక్, బీఈ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్–2025 మొదటి దశ షెడ్యూల్ బుధవారం విడుదలైంది. ఈ నెల 22 నుంచి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు.
- వివరాలు 3లో▶

'గేటెడ్' నేరాల నిరోధానికి యాప్



గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో నేరాల నిరోధానికి ఒక యాప్‌ను రూపొందించాలని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లను హైకోర్టు ఆదేశించింది. ఇతర నివాసితులకు ఇబ్బందులు కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది.
- వివరాలు 3లో▶

పాత సీనియారిటీనీ లెక్కించాలి



గ్రామానికో రెవెన్యూ అధికారి నియామక ప్రక్రియలో సీనియారిటీ అంశం సమస్యగా మారుతోంది. మళ్లీ మాతృశాఖలోకి వస్తున్నందున తమ పాత సీనియారిటీని కూడా పరిగణనలోకి తీసుకోవాలని పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు కోరుతున్నారు.
- వివరాలు 3లో▶

'వసతి'లో దిద్దుబాటు



సంక్షేమ వసతి గృహాల నిర్వహణలో లోపాలు, ఫుడ్‌పాయిజన్ ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం దిద్దుబాటుకు ఉపక్రమించింది. రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీలు, హాస్టళ్ల నిర్వహణను పర్యవేక్షించే బాధ్యతను జిల్లా అదనపు కలెక్టర్లకు అప్పగించింది.
- వివరాలు 2లో▶

మొదటిసారి గెలవడం ఓకే రెండోసారి గెలవడమే గొప్ప

సీఎం 'న్యూ ఇయర్' క్లాస్



నూతన సంవత్సరం సందర్భంగా సీఎం రేవంత్‌ని కలిసిన సీతక్క, ఇందిరా శోభన్

- పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులకు రాజకీయ హితబోధ
- కలిసి పనిచేసే స్థానిక నేతలకు శుభాకాంక్షలు చెప్పండి
- శుభకార్యాలకు వెళ్తూ తరచూ కార్యకర్తలతో మమేకం కండి
- శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన నేతలతో సీఎం

సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సరం తొలిరోజు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నేతలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పొలిటికల్ క్లాస్ తీసుకున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్‌పర్సన్లు, కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో సీఎం రేవంత్‌ను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో బుధవారం కలిసి కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మొదటిసారి గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలతో సీఎం సరదాగా మాట్లాడుతూ.. తన రాజకీయ అనుభవాన్ని పంచుకున్నారు. 'ప్రజాప్రతినిధిగా మీరు చేసే పనులన్నీ ప్రజలకు రిజిస్టర్ అవుతుంటాయి. అన్ని విషయాలను వారు గుర్తుపెట్టుకుంటారు. మొదటిసారి మీపై చాలా అంచనాలతో గెలిపిస్తారు. అది గొప్ప విషయమేమీ కాదు. మీరేంటో తెలిసిన తర్వాత, మీ పనితీరు అర్థం చేసుకున్న తర్వాత రెండోసారి గెలిపిస్తేనే గొప్ప విషయం. పెళ్లిళ్లు, ఇతర కార్యక్రమాలకు వెళ్లి వస్తుండాలి. కార్యకర్తలతో మమేకం కావాలి. మీరు ఈజీగా తీసుకుంటే ఫలితాలు వేరే విధంగా ఉంటాయి. ప్రజలు ఒకసారి ప్రతికూల తీర్పు ఇచ్చిన తర్వాత అసలు రాజకీయమంటే ఏంటో అర్థమవుతుంది'అని

మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి



నా 'పథకం' అమలయింది..
నీ పథకం సంగతి తర్వాత చూద్దాం!!

డిజిటల్ సేఫ్టీ వెల్‌నెస్, డ్రగ్స్‌ఫ్రీ వెల్‌నెస్.. ఇదీ మన సంస్కృతి

డ్రగ్స్, డిజిటల్ డిస్ట్రాక్షన్స్ నుంచి టీనేజర్స్‌ని బయటపడేసే ప్రయత్నానికి పయనీర్‌గా నిలిచింది హైదరాబాద్‌కి చెందిన పద్నాలుగేళ్ల అమ్మాయి.. ఆమె డిజైన్ చేసిన డిజిటల్ సేఫ్టీ వెల్‌నెస్, డ్రగ్స్‌ఫ్రీ– వెల్‌నెస్ ఆన్‌లైన్ కోర్స్‌లకు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సర్టిఫికెట్స్‌నీ అందిస్తోంది!

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్న సంస్కృతిపై ప్రత్యేక కథనం



13లో

నన్ను ఏదోలా జైలుకు పంపే కుట్ర



రేవంత్‌రెడ్డికే కాదు ఆయన తాతముత్తాతలు దిగొచ్చినా భయపడేదిలేదు: కేటీఆర్

2లో

ఫార్ములా–ఈ రేస్ కావాలని నేను, వద్దని రేవంత్ తీసుకున్న నిర్ణయాలపై కేబినెట్లో చర్చ జరగలేదు. నాపై కేసు పెడితే.. రేవంత్‌పై కూడా కేసు పెట్టాలి. ఇక్కడ ఫార్ములా–ఈ రేస్ రద్దు వల్ల రూ. 600 కోట్లు నష్టం జరిగిందని గుర్తించాలి.

- ఇప్పటికే నాపై ఆరుసార్లు కేసులు పెట్టి జైలుకు పంపే ప్రయత్నాలు
- ఫార్ములా–ఈ అంశంలో రేవంత్‌పైనా కేసు పెట్టాలి
- రైతు భరోసా పథకం కోసం రైతులు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వడం ఎందుకు?
- స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం
- పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారీ సభ నిర్వహించే యోచన ఉన్నట్టు వెల్లడి

‘వసతి’లో దిద్దుబాటు చర్యలు!

వసతి గృహ పాఠశాలలు, గురుకులాల్లో ఇకపై నిరంతర తనిఖీలు

- నిర్వహణ బాధ్యతలు జిల్లా అదనపు కలెక్టర్లకు అప్పగింత
- బాలికల వసతి గృహాల్లో మహిళా ఏఐఎస్ అధికారుల రాత్రిబస
- నాణ్యమైన విద్య, డైట్, వైద్యం, ఇతర సదుపాయాలపై సమీక్ష
- ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాల నిర్వహణలో లోపాలు, వరుసగా ఫుడ్‌పాయిజన్ సంఘటనలు వెలుగు చూసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీలు, ఇతర పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణను పర్యవేక్షించే బాధ్యతను జిల్లా అదనపు కలెక్టర్ల (స్థానిక సంస్థలు)కు అప్పగించింది. అలాగే ప్రతినెలా క్రమం తప్పకుండా బాలికల వసతి గృహ పాఠశాలలను సందర్శించి రాత్రిబస చేయాలని మహిళా ఐఏఎస్ అధికారులను ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. విద్య, మౌలిక సదుపాయాలతో పాటు ప్రభుత్వ వసతి గృహ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీలు, అన్ని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల పనితీరులో నాణ్యతను పెంపొందించాలని ప్రభుత్వం జిల్లా అదనపు కలెక్టర్లకు సూచించింది.

చేపట్టాల్సిన చర్యలు ఇవీ..

వసతి గృహాల పనితీరుపై అదనపు కలెక్టర్లు క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించడంతో పాటు తరగతి గదులు, హాస్టళ్లు, డార్మిటరీల్లో పారిశుద్ధ్యం వంటి సదుపాయాల కల్పన, నిర్వహణ చూడాల్సి ఉంటుంది. – ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యా ప్రమాణాలు ఉండేలా చూడాలి. – ఇకపై అదనపు కలెక్టర్లు జిల్లా కొనుగోలు కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తూ, వసతి గృహ పాఠశాలలకు అవసరమైన వస్తువులను సమీకరించాలి. – తనిఖీలు, రాత్రి బసల ద్వారా నిర్దేశిత కామన్ డైట్ మెను కచ్చితంగా అమలయ్యేలా చూడాలి. సరైన నాణ్యత, పరిమాణంలో విద్యార్థులకు ఆహారం అందిస్తున్నారా? లేదా? పరిశీలించాలి. – కనీసం పక్షం రోజులకోసారి వసతి గృహాల్లో బస చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడి క్షేత్ర స్థాయి పరిస్థితులు, సవాళ్లను అర్థం చేసుకోవడం ద్వారా సంస్థ ప్రధానోపాధ్యాయులకు తగిన రీతిలో దిశానిర్దేశం చేయాలి. రాత్రి బసల్లో తమ దృష్టికి వచ్చిన అంశాలను నమోదు చేయడంతో పాటు నెలవారీ ప్రగతి నివేదికలో పొందుపర్చాలి. – మౌలిక సదుపాయాలు, రక్షణ, విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, విద్యా ప్రమాణాలను అంచనా వేసి, అవసరమైన దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి. తమ దృష్టికి వచ్చిన అంశాలు, తీసుకోవాల్సిన చర్యలను సిఫారసు చేస్తూ జిల్లా కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులకు నివేదిక సమర్పించాలి. – మారుమూల, గిరిజన ప్రాంతాల్లోని వసతి గృహ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలి. – విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది నుంచి వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి. – వీటికి కేటాయించే నిధుల వినియోగాన్ని పర్యవేక్షించాలి. – వసతి గృహాల నిర్వహణ సాఫీగా ఉండేలా సంబంధిత ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖలతో సమన్వయం చేసుకోవాలి. – అదనపు కలెక్టర్లు, కలెక్టర్లకు నెలవారీ నివేదికలు సమర్పించాలి. – ఈ నివేదికల ఆధారంగా కలెక్టర్లు ప్రతి నెలా సంబంధిత శాఖల అధికారులు, ఆయా విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి కామన్ డైట్ చార్ట్, సదుపాయాలు, సంక్షేమ చర్యలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలను సమీక్షించాలి.

మహిళా ఏఐఎస్ అధికారులకు బాధ్యతలు..

మహిళా ఏఐఎస్ అధికారులు తప్పనిసరిగా బాలికల వసతి గృహాల్లో రాత్రిబస చేసి విద్యార్థినులు, సిబ్బందితో మాట్లాడి సదుపాయాలతో పాటు సంస్థల నిర్వహణలో లోపాలను అంచనా వేయాలి. ఈ సందర్భంగా విద్య, సదుపాయాలు, సంక్షేమంపై సమీక్ష నిర్వహించాలి. అనంతరం 7 రోజుల్లోగా సంబంధిత శాఖకు తమ నివేదికను సమర్పించాలి. అందులో తమ దృష్టికి వచ్చిన అంశాలు, సిఫారసులు, అత్యవసరంగా తీసుకోవాల్సిన చర్యలను సూచించాలి. సంబంధిత శాఖలు ఈ నివేదికల ఆధారంగా అవసరమైన చర్యలను తీసుకుని ప్రగతి నివేదికను ప్రతి త్రైమాసికానికి ఓసారి సాధారణ పరిపాలన శాఖకు సమర్పించాలి. ఎస్సీల అభివృద్ధి శాఖ నోడల్ విభాగంగా వ్యవహరిస్తూ ఒకే పాఠశాలను నెలలో రెండు సార్లు తనిఖీ చేయకుండా షెడ్యూల్‌ను నిర్వహించాలి.

డ్రగ్స్ రాకెట్‌పై ఉక్కుపాదం

డ్రగ్స్ కంట్రోల్‌పై వార్షిక నివేదిక విడుదల సందర్భంగా మంత్రి దామోదర



డ్రగ్స్ కంట్రోల్‌పై వార్షిక నివేదిక విడుదల చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, డీసీఏ డీజీ కమలాసన్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నియంత్రణ విషయంలో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారు. డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) ఆధ్వర్యంలో రూపొందించిన వార్షిక నివేదికను బుధవారం మంత్రి నివాసంలో డీసీఏ డీజీ కమలాసన్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో డీసీఏను బలోపేతం చేసేందుకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నిషేధిత, నకిలీ మందులు, ఎమ్మార్పీ ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా రాష్ట్రానికి డ్రగ్స్ సరఫరా చేస్తూ డ్రగ్స్ రాకెట్ నడుపుతున్న అక్రమార్కుల పట్ల కఠినంగా వ్యవహరించామని, 2024లో 573 కేసులను నమోదు చేసినట్లు వెల్లడించారు. 2023లో కేవలం 56 కేసులు నమోదైన విషయాన్ని తెలియజేశారు. నకిలీ మందులు తయారీ చేసి సరఫరా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసిన డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులను రాజనర్సింహ అభినందించారు. రాష్ట్రంలో డ్రగ్స్ రాకెట్ నిర్వహించే వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన కేసులను నమోదు చేయాలని ఆదేశించారు. అనుమతులు లేని మెడికల్, ఫార్మా కంపెనీలపై చర్యలు చేపట్టాలన్నారు. మందుల కొనుగోలులో ప్రజలు అవగాహన పెంచుకోవాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ రాందాస్, డిప్యూటీ డైరెక్టర్లు రాజవర్ధన చారి, పి.సరళ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు గోవిందసింగ్ నాయక్, అనిల్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుటుంబం

ఉత్తరానికి వెళ్లే రైలు

▶ మొదటి పేజీ తరువాయి

కారిడార్ నిర్మిస్తారు. ఇది కరీంనగర్/రామగుండం వెళ్లే రాజీవ్ రహదారి వెంట కొనసాగుతుంది. ఇప్పటికే ఈ రెండు మార్గాల్లో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ కారిడార్ల నిర్మాణానికి హెచ్ఎండీఏ నిర్ణయించింది కూడా. ఈ క్రమంలో ఎక్స్‌ప్రెస్ కారిడార్లు, మెట్రో కలసి డబుల్ డెక్కర్ మార్గంగా నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. ఇవి పూర్తయితే ట్రాఫిక్ సమస్యకు మంచి పరిష్కారం లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. గతంలో తాను మల్కాజిగిరి ఎంపీగా ఉన్నందున ఆ ప్రాంతం ట్రాఫిక్ సమస్యలపై, కారిడార్ల రూట్ మ్యాప్‌లపై అవగాహన ఉందని... అయినా రూట్‌మ్యాప్ విషయంలో ప్రస్తుత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సూచనలు, సలహాలను తీసుకోవాలని మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డికి సీఎం రేవంత్ సూచించారు.

మూడు నెలల్లో డీపీఆర్

సీఎం ఆదేశాల మేరకు ఉత్తర ప్రాంతంలోని రెండు మెట్రో కారిడార్లకు సంబంధించి మూడు నెలల్లో డీపీఆర్ రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఈ రెండు కారిడార్లను మెట్రో రెండో దశలోని పార్ట్ ‘బీ’లో భాగంగా పరిగణిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి డీపీఆర్‌కు అనుమతి లభించిన వెంటనే కేంద్ర ప్రభుత్వ ఆమోదానికి పంపిస్తామని వెల్లడించారు. వీటి నిర్మాణాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టనున్నట్టు తెలిపారు.

రెండు నెలల కిందే రెండోదశ ఆమోదం

హైదరాబాద్ మెట్రో రైల్ రెండోదశ పనులకు రాష్ట్ర ప్రభుత్వం గత నవంబర్‌లోనే ఆమోదం తెలిపింది. రూ.24,269 కోట్ల అంచనా వ్యయంతో 76.4 కిలోమీటర్ల మేర పార్ట్–ఏ కింద ఐదు కారిడార్ల నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేశారు. అలాగే పార్ట్–బీ కింద శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ) వరకు 40 కిలోమీటర్ల పొడవున ఆరో కారిడార్ నిర్మించనున్నారు. ఇప్పుడు కొత్తగా ప్రతిపాదించిన ప్యారడైజ్– మేడ్చల్, జేబీఎస్– శామీర్‌పేట కారిడార్లను కూడా పార్ట్–బీలోనే చేర్చనున్నారు. ఇప్పటికే మూడు కారిడార్లలో నడుస్తున్న 69 కిలోమీటర్ల తొలిదశ మెట్రో రైలు ప్రాజెక్టు ప్రపంచంలోనే పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్మించిన అతిపెద్ద ప్రాజెక్టుగా అధికారులు చెబుతున్నారు. రెండో దశలోని పార్ట్–ఏ, పార్ట్–బీ మార్గాలు కూడా పూర్తయితే... హైదరాబాద్ మెట్రోరైల్ 11 కారిడార్లు, 240.4 కిలోమీటర్లకు చేరుతుంది.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి

ఉత్తర ప్రాంతాలకు ఎంతో మేలు: మంత్రి పొన్నం

శామీర్‌పేట, మేడ్చల్‌లకు రెండు కొత్త మెట్రో కారిడార్లను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ తీసుకున్న నిర్ణయం మంచి పరిణామమని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఉత్తర తెలంగాణ జిల్లాలు కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ వైపు వెళ్లే వాహనాలకు, ప్రయాణికులకు నగరంలోని ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బంది ఎదురవుతోందని గుర్తు చేశారు. ఈ రూట్లలో ఇప్పటికే ఎక్స్‌ప్రెస్ రోడ్లు మంజూరవడం, తాజాగా మెట్రో నిర్మాణం చేపట్టనుండటంతో.. ఈ ప్రాంతాల ప్రజల కష్టాలు తీరుతాయని మంత్రి చెప్పారు.

మొత్తంగా మెట్రో ఇదీ..

ఇప్పటికే ఉన్న మార్గం:
3 కారిడార్లు.. 69 కిలోమీటర్లు
- ఎల్‌బీనగర్ – మియాపూర్: 30 కిలోమీటర్లు
- నాగోల్ – రాయదుర్గం: 28 కిలోమీటర్లు
- జేబీఎస్ – ఎంజీబీఎస్: 11 కిలోమీటర్లు

రెండో దశలో పార్ట్–ఏ:
5 కారిడార్లు.. 76.4 కిలోమీటర్లు
- నాగోల్– శంషాబాద్ ఎయిర్‌పోర్టు (ఎయిర్‌పోర్ట్ కారిడార్): 36.6 కిలోమీటర్లు
- రాయదుర్గ్ –కోకాపేట్ నియోపోలీస్: 11.6 కిలోమీటర్లు
- ఎంజీబీఎస్– చంద్రాయణగుట్ట (ఓల్డ్ సిటీ కారిడార్): 7.5 కిలోమీటర్లు
- మియాపూర్ – పటాన్‌చెరు: 13.4 కిలోమీటర్లు
- ఎల్‌బీ నగర్ – హయత్‌నగర్: 7.1 కిలోమీటర్లు

రెండో దశలో పార్ట్–బి:
3 కారిడార్లు.. 95 కిలోమీటర్లు
- శంషాబాద్ ఎయిర్‌పోర్టు– ఫోర్త్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ): 40 కిలోమీటర్లు
- జేబీఎస్ – శామీర్‌పేట: 22 కిలోమీటర్లు
- ప్యారడైజ్ నుంచి మేడ్చల్: 23 కిలోమీటర్లు

అన్నీ పూర్తయితే మొత్తం మెట్రో:
11 కారిడార్లు.. 240.4 కిలోమీటర్లు

కోతలు పెడితే రైతులు తిరగబడతారు

4న జరిగే కేబినెట్ సమావేశంలో ఇదే అంశంపై చర్చ!: హరీశ్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రైతుభరోసా పథకం అమలులో కోతలు పెట్టేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుస్తీలు పడుతోందని, ఈనెల 4న జరగనున్న కేబినెట్ సమావేశంలో దీనిపైనే చర్చించాలని నిర్ణయించిందని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. బుధవారం సంగారెడ్డిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకం కోసం రైతుల నుంచి కొత్తగా దరఖాస్తులు తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చిందన్నారు. తప్పుడు సమాచారం ఇస్తే తీసుకోబోయే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని రైతు నుంచి డిక్లరేషన్ తీసుకోవాలని చూస్తోందని హరీశ్ తెలిపారు. ఈ పథకంలో కోతలు విధిస్తే రైతులు తిరగబడతారని హెచ్చరించారు. ఏడాది పంట కాలం ఉండే చెరుకు, అల్లం, పసుపు వంటి పంటలు సాగు చేసే రైతులకు ఒకే పంటకు రైతుభరోసా ఇవ్వాలని చూస్తోందన్నారు. ఎలాంటి షరతుల్లేకుండా ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాలని హరీశ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పనులకు వెళ్తున్న 1.04 కోట్ల మంది రైతు కూలీలందరికీ ఏడాదికి రూ.12,000 ఆర్థిక సాయాన్ని అందించాలన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయని, ఈ నేరాల్లో రాష్ట్రం ఎల్లో జోన్‌లోకి వెళ్లిందని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. నేరాలను అదుపు చేయడం కోసం కాకుండా, రాజకీయ కక్షసాధింపు పనులకు పోలీసులను ఎక్కువగా వినియోగించడమే ఇందుకు కారణమని ఆరోపించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, కె.మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఎన్ఐఎన్ డైరెక్టర్‌గా భారతీ కులకర్ణి



లాలాపేట: ఐసీఎంఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) నూతన డైరెక్టర్‌గా భారతీ కులకర్ణి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం తార్నాకలోని ఎన్ఐఎన్‌లో డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. భారతీ కులకర్ణి పుణే యూనివర్సిటీ నుంచి పీడియాట్రిషన్ పూర్తి చేశారు. అమెరికాలోని హాప్‌కిన్స్ బ్లూమ్‌బర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నుంచి మాస్టర్ డిగ్రీని పూర్తి చేశారు. గత 20 సంవత్సరాల నుంచి ఎన్ఐఎన్ సైంటిస్టుగా, మూడేళ్ల నుంచి న్యూఢిల్లీలోని ఐసీఎంఆర్‌లో పునరుత్పత్తి, శిశు ఆరోగ్యం, పోషకాహార విభాగానికి అధిపతిగా పని చేస్తున్నారు. తల్లి, పిల్లల్లోని పోషకాహార సమస్యలపై పరిశోధనలు చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనా పత్రాలను సమర్పించారు. పలు అవార్డులను అందుకున్నారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి బీసీలకు ఇస్తారా?

టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్

సాక్షి, హైదరాబాద్: పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీసీలను పట్టించుకోని బీఆర్ఎస్.. ప్రజలు అధికారం నుంచి తప్పించాక మళ్లీ బీసీల పేరుతో డ్రామాలు ఆడుతోందని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీశ్ మండిపడ్డారు. మరో సారి బీసీలను మోసం చేసే కుట్ర చేస్తోందని బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరోపించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు తగ్గించిన ఘనత బీఆర్ఎస్‌దేనని విమర్శించారు. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి బీసీలకు ఇవ్వగలరా? అని ప్రశ్నించారు. మాజీమంత్రి హరీశ్‌రావు పోలీసు వ్యవస్థను చిన్నచూపు చూసేలా మాట్లాడుతున్నారని, తెలంగాణ రాష్ట్ర శాంతిభద్రతలను బిహార్‌తో పోల్చడం సరికాదని సతీశ్ వ్యాఖ్యానించారు.

మొదటిసారి గెలవడం ఓకే.. రెండోసారి గెలవడమే గొప్ప

▶ మొదటి పేజీ తరువాయి

క్లాస్ తీసుకున్నారు. అక్కడే ఉన్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఉద్దేశించి.. ఆయన ఎలా గెలుస్తున్నారో అడిగి తెలుసుకోవాలని సూచించారు.

మీరే మాట్లాడండి..

కొత్త ఏడాదిలో ప్రజలకు మరింత చేరువ కావాలని ప్రజాప్రతినిధులకు సీఎం సూచించారు. తాను కూడా మరింత పట్టుదలతో పనిచేస్తానని చెప్పారు. ఉదయం నుంచి మంత్రులకు, పార్టీ నేతలకు తానే ఫోన్లు చేసి శుభాకాంక్షలు తెలియజేశానని తెలిపారు. ‘ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా మీ కోసం పనిచేసే నేతలు, కార్యకర్తలకు ఫోన్లు చేసి శుభాకాంక్షలు తెలపండి. వీలున్నప్పుడల్లా వారితో మాట్లాడండి. స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా కేడర్‌ను కలుపుకుని ముందుకెళ్లండి. ప్రజాప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి’ అని సూచించారు.

నా రిపోర్టు నా దగ్గరే ఉంది

తన పనితీరుకు 100కి 100 మార్కులు వేసుకోబోనని సీఎం రేవంత్ అన్నట్టు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తనతో సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరు గురించి వచ్చిన ప్రోగ్రెస్ రిపోర్టులు తన దగ్గర ఉన్నాయని, తన రిపోర్టు కూడా తన దగ్గరే ఉందని తెలిపారు. ఈ రిపోర్టులను త్వరలోనే అందరికీ పంపిస్తానని కూడా చెప్పినట్టు తెలిసింది. సీఎంగా అధికారిక బాధ్యతలు అలవాటు అయినందున.. ఇక నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలకు మరింత సమయం కేటాయిస్తానని సీఎం చెప్పారు. ఉద్యోగ నియామకాల్లో జోక్యం చేసుకోవద్దని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు తీసుకుని పారదర్శకంగా నియామకాలు చేయకపోతే తప్పుడు సంకేతాలు వెళ్తాయని నేతలకు స్పష్టంచేసినట్లు తెలిసింది. అంగన్‌వాడీలు, రేషన్ డీలర్ల నియామకంలో తమకు కొన్ని అధికారాలు ఇవ్వాలని ఓ మంత్రి కోరిన సందర్భంలో సీఎం ఈ వ్యాఖ్యలు చేసినట్టు సమాచారం.

సీఎం మాటలు స్ఫూర్తినిచ్చాయి: ఎంపీ చామల

ప్రజాప్రతినిధి హోదాలో తొలిసారి సీఎం రేవంత్‌ను కలవడం స్ఫూర్తినిచ్చిందని, ఆయన చెప్పిన మాటలు తన బాధ్యతను మరింత పెంచాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌ను ఎప్పుడు కలిసినా ఏదో ఉత్తేజం వస్తుందని, ఈసారి మాత్రం రాజకీయ అనుభవాల గురించి ఆయన చెప్పిన మాటలు ఎప్పటికీ మర్చిపోలేనని బుధవారం ‘సాక్షి’తో మాట్లాడుతూ ఆయన చెప్పారు.

బీసీల రిజర్వేషన్ల పెంపుపై సర్కార్ కాలయాపన: కవిత

ఈ నెల 3న ఇందిరా పార్కు వద్ద బీసీ మహాసభ



బీసీ మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కవిత

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేసే ప్రయత్నం చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై ఒత్తిడి కోసం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ మహాసభ పోస్టర్‌ను బుధవారం ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలన్న డిమాండ్‌తో సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఈ నెల 3న ఇందిరా పార్కు వద్ద భారీ సభను తలపెట్టామని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కూడా సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని ఆరోపించారు. బీసీ మహాసభకు తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ విద్యార్థి జేఏసీతో పాటు వివిధ ప్రజా సంఘాలు, కుల సంఘాలు మద్దతు ప్రకటించాయని కవిత వెల్లడించారు. బీసీల కోసం పోరాటం చేస్తున్న ఎమ్మెల్సీ కవితకు తాము వెన్నుదన్నుగా నిలుస్తామని సర్పంచ్‌ల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ తెలిపారు.

నన్ను ఏదోలా జైలుకు పంపే కుట్ర

రేవంత్‌కే కాదు ఆయన తాతముత్తాతలు దిగొచ్చినా భయపడేదిలేదు: కేటీఆర్

- ఇప్పటికే నాపై ఆరుసార్లు కేసులు పెట్టి జైలుకు పంపే ప్రయత్నాలు
- ఫార్ములా–ఈ అంశంలో రేవంత్‌పైనా కేసు పెట్టాలి
- రైతు భరోసా పథకం కోసం రైతులు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వడం ఎందుకు?
- వారిని మోసగించే ఉద్దేశం.. రైతు భరోసాను కుదించే ప్రయత్నం

సాక్షి, హైదరాబాద్: తనను ఏదో ఒక రకంగా జైలుకు పంపాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని.. ఇప్పటికే తనపై కేసులు నమోదు చేసేందుకు ఆరుసార్లు ప్రయత్నించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డికే కాదు ఆయన తాత ముత్తాతలు దిగొచ్చినా కూడా భయపడేది లేదని వ్యాఖ్యానించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బుధవారం తెలంగాణ భవన్‌లో వివిధ జిల్లాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కేటీఆర్ ముచ్చటించారు. అనంతరం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వివరాలు కేటీఆర్ మాటల్లోనే..

‘‘ఫార్ములా–ఈ రేస్ విషయంలో అవినీతే లేనప్పుడు ఏసీబీ కేసు ఎందుకు? ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ తప్పుల తడకగా ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధం లేని అంశాలను ఇరికించారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ వేధింపుల కోసం ఈ కేసును వాడుకోవాలని చూస్తున్నా... న్యాయస్థానాలపై, దేశ న్యాయవ్యవస్థపై మాకు పూర్తి నమ్మకం ఉంది. ఫార్ములా–ఈ రేస్ కావాలని నేను, వద్దని రేవంత్ తీసుకున్న నిర్ణయాలపై కేబినెట్లో చర్చ జరగలేదు. నాపై కేసు పెడితే.. రేవంత్‌పై కూడా కేసు పెట్టాలి. ఇక్కడ ఫార్ములా–ఈ రేస్ రద్దు వల్ల రూ. 600 కోట్లు నష్టం జరిగిందని గుర్తించాలి.

రైతులు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వడమెందుకు?

రైతు భరోసా పెట్టుబడి సాయానికి పెట్టే కోతలతో రైతుల్లో తిరుగుబాటు వస్తుంది. రైతులను మోసగించే ఏకైక ఉద్దేశంతోనే రైతు భరోసాను కుదించే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ఎక్కడా లేని విధంగా పంటల సాగుపై సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలనే అంశాన్ని రైతులపై రుద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. 14.50 లక్షల కోట్ల అప్పులను బ్యాంకులు మాఫీ చేసినప్పుడు లేని సెల్ఫ్ డిక్లరేషన్ రైతుల విషయానికి వచ్చేసరికి ఎందుకు? ప్రస్తుత ఏడున్నర వేల కోట్ల బడ్జెట్ దాటకుండా రైతు భరోసాను నామమాత్రంగా అమలు చేసే ప్రయత్నంలో భాగమే ఇది.



తెలంగాణ భవన్‌లో సురేశ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్‌లతో కలిసి కేక్ కట్ చేస్తున్న కేటీఆర్. చిత్రంలో మహమూద్ అలీ, మధుసూదనాచారి, మల్లారెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతాం

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలన్న ఆలోచన రేవంత్ సర్కార్‌కు లేదు. అందుకోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా ఒక కుట్రకు తెర లేపింది. అందులో భాగంగానే శాసనసభలో సుప్రీం కోర్టు కేసు ప్రస్తావనతోపాటు, ట్రిపుల్ టెస్ట్, ప్రత్యేక బీసీ కమిషన్ సిఫార్సుల నివేదిక వంటి కారణాలను ప్రస్తావించింది. వీటిని అడ్డుపెట్టుకొని ఎవరో ఒకరితో కోర్టులో కేసు వేయించి స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది.

ఆ సొమ్ములో ఢిల్లీ కాంగ్రెస్‌కు ఎంత పోతోంది?

దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నట్టుగా ముఖ్యమంత్రి, మంత్రులు ఉన్నారు. ఒక్కొక్క మంత్రి ఒక్కొక్క అవినీతి దుకాణం తెరిచారు. ప్రతి ఒక్కరూ డబ్బులు సంపాదించే పని పెట్టుకున్నారు. అప్పు చేయకపోవడమే అభివృద్ధి అన్న రేవంత్... ఇప్పుడు లక్షల కోట్ల అప్పు ఎందుకు చేశారో చెప్పాలి. రూ.లక్షా 35 వేల కోట్లలో ఢిల్లీ కాంగ్రెస్‌కు ఎంత డబ్బుపోతోందో బయటపెట్టాలి?.

భారీ బహిరంగసభ నిర్వహించే యోచన

వచ్చే ఏప్రిల్ 27న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం జరుగుతుంది. అదే సమయంలో భారీ బహిరంగ సభ నిర్వహించే ఆలోచన చేస్తున్నాం. దీంతోపాటు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడతాం. ఆ తర్వాత గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేస్తాం. అక్టోబర్‌లో పార్టీ అధ్యక్షుడి ఎన్నిక కూడా ఉంటుంది. 60లక్షల బీఆర్ఎస్ కార్యకర్తల అభీష్టం మేరకు మరోసారి పార్టీ అధినేత కేసీఆర్ గారిని అధ్యక్షుడిగా ఎన్నుకుంటాం. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు..’’ అని కేటీఆర్ చెప్పారు.

మైత్రి మూవీస్ నిర్మాతల
అరెస్టు వద్దు

'సంధ్య థియేటర్' కేసుపై హైకోర్టులో ఊరట

సాక్షి, హైదరాబాద్: పుష్ప–2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటపై చిక్కడపల్లి పోలీసులు దాఖలు చేసిన కేసులో మైత్రి మూవీస్ నిర్మాతలు యలమంచిలి రవిశంకర్, యర్నేని నవీన్‌కు హైకోర్టు ఊరటనిచ్చింది. తదుపరి ఆదేశాలిచ్చే వరకు వారిని అరెస్టు చేయవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 'మైత్రి మూవీ మేకర్స్ పేరుతో సినిమా నిర్మాణ, పంపిణీ సంస్థను నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు 30కి పైగా సినిమాలను నిర్మించాం. అలాగే 'పుష్ప 2'తో సహా 30 ఇతర సినిమాలను పంపిణీ చేశాం. సంధ్య థియేటర్ వద్ద డిసెంబర్ 4న జరిగిన తొక్కిసలాట కారణంగా ఊపిరాడక తన భార్య, కుమారుడు కుప్పకూలారని చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో భాస్కర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. మహిళ మృతిచెందగా, బాలుడు చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదంతో మాకు ఎలాంటి సంబంధం లేదు. నిర్మాతలైనంత మాత్రాన ఘటనకు బాధ్యులను చేస్తూ క్రిమినల్ కేసు నమోదు చేయడం చట్టవిరుద్ధం. మాపై ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలి'అని రవిశంకర్, నవీన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.సుజన విచారణ చేపట్టారు. పిటిషనర్ల పాత్ర సినిమా నిర్మాణానికి మాత్రమే పరిమితమని వారి తరఫు న్యాయవాది వాదించారు. ఒక్కసారి బయ్యర్లకు విక్రయించిన తర్వాత వారి పాత్ర ఏమీ ఉండదని చెప్పారు. ఎటువంటి సంబంధంలేని నిర్మాతలపై క్రిమినల్ కేసు నమోదు చేయడం సరికాదని, ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్లను అరెస్టు చేయవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

10 రోజులపాటు సీబీటీ విధానంలో నిర్వహణ

- రెండు పేపర్లకు కలిపి 2,75,753 మంది దరఖాస్తు
- ఫిబ్రవరిలో డీఎస్సీ వేస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- కోటి ఆశలతో పుస్తకాలతో కుస్తీ పడుతున్న అభ్యర్థులు
- ఇంకా భర్తీ కావాల్సిన టీచర్ పోస్టులు 17 వేలు
- రాష్ట్రంలో ఇప్పటికే 3 లక్షల మంది టెట్ అర్హులు

నేటి నుంచి టెట్ పరీక్షలు



సాక్షి, హైదరాబాద్: టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షలు నేటి నుంచి ప్రారంభమవుతున్నాయి. 10 రోజులపాటు 20 సెషన్లలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈసారి టెట్ పేపర్–1కు 94,327 మంది, పేపర్–2కు 1,81,426 మంది దరఖాస్తు చేసుకున్నారు. రోజూ ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష ఉంటుంది. టెట్ కోసం 17 జిల్లాల్లో 92 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

డీఎస్సీపై కోటి ఆశలు: ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో గత ఏడాది 11 వేల టీచర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. ఇంకా 17 వేల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. దీంతో టీచర్ ఉద్యోగార్థులు కొండంత ఆశతో పుస్తకాలతో కుస్తీ పడుతూ ప్రిపేరవుతున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే టెట్ అర్హత సాధించినవారు దాదాపు 3 లక్షల మంది ఉన్నారు. డీఎస్సీలో టెట్‌కు వెయిటేజీ ఉండటంతో వీరిలో కొంతమంది స్కోర్ పెంచుకునేందుకు మళ్లీ టెట్ రాస్తున్నారు. టెట్ అర్హత లేనివారు ఈసారి ఎలాగైనా అర్హత సాధించాలని కష్టపడుతున్నారు. ప్రైవేటు స్కూళ్లలో పని చేసే టీచర్లు కూడా టెట్, డీఎస్సీ కలిపి కోచింగ్ తీసుకుంటున్నారు. హైదరాబాద్ కేంద్రంగా టెట్, డీఎస్సీ కోసమే 418 కోచింగ్ కేంద్రాలు వెలిశాయి. ఇవి కాకుండా కొన్ని ఆన్‌లైన్ కోచింగ్ ఇస్తున్నాయి. ఈసారి టెట్ పరీక్షలో ఇంటర్ వరకూ సిలబస్‌ను తీసుకొచ్చారు. జాతీయ విద్యా విధానంలో మానసిక బోధన విధానానికి అత్యంత ప్రాధాన్యమిస్తుండటంతో.. ఆ కోణంలోనూ టెట్ ప్రశ్న పత్రాన్ని రూపొందించినట్లు సమాచారం.

తాజా యూడైస్ ప్రకారమే పక్కా లెక్క..

రాష్ట్రవ్యాప్తంగా 26 వేల ప్రభుత్వ స్కూళ్లున్నాయి. వీటిల్లో 22.63 లక్షల మంది చదువుతున్నారు. ఈ స్కూళ్లలో 1,26,518 మంది టీచర్లు ఉన్నారు. ప్రైవేటు స్కూళ్లలో 1,43,258 మంది టీచర్లు పనిచేస్తున్నారు. రాష్ట్రంలో 5,800 ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటిలో ఐదు తరగతులకు ఒకే టీచర్ బోధించే పరిస్థితి ఉంది. యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ (యూడైస్) లెక్క ప్రకారం ఇంకా 17 వేల టీచర్ పోస్టుల భర్తీ చేయాల్సి ఉంది.

పాత సీనియారిటీనీ లెక్కించాలి

గ్రామానికో రెవెన్యూ అధికారి నియామకంలో చిక్కుముడి

- జీరో సర్వీసుతో ఇతర శాఖలకు వెళ్లిన పూర్వ వీఆర్వో, వీఆర్ఏలు
- ఇప్పుడు మళ్లీ రెవెన్యూలోకే వస్తుండటంతో పాత సీనియారిటీ కలపాలని డిమాండ్
- తేల్చకపోతే పరీక్ష రాయబోమని, పాత శాఖల్లోనే ఉంటామని పట్టు
- సీనియారిటీ సంగతి ఇప్పుడే ఎందుకంటున్న ఉన్నతాధికారులు

సాక్షి, హైదరాబాద్: గ్రామానికో రెవెన్యూ అధికారి నియామక ప్రక్రియలో సీనియారిటీ అంశం సమస్యగా మారుతోంది. మళ్లీ మాతృశాఖలోకి వస్తున్నందున తమ పాత సీనియారిటీని కూడా పరిగణనలోకి తీసుకోవాలని పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు కోరుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇతర శాఖల్లోకి వెళ్లిన తమకు సీనియారిటీ వర్తింపచేయని కారణంగా సర్వీసు కోల్పోయామని, ఇప్పుడు సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవడం ద్వారా తమకు జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే రెవెన్యూ ఉన్నతాధికారులు మాత్రం ఈ విషయంలో స్పష్టత ఇవ్వడం లేదు. నియామక ప్రక్రియ ఇప్పుడే మొదలైందని, ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా రూపొందించలేదని, అప్పుడే సీనియారిటీ అంశాన్ని తెరపైకి తీసుకురావద్దని, ఈ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని దాటవేస్తుండడం గమనార్హం.



సీనియారిటీ లేకుండానే ఇతర శాఖల్లోకి..

గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న చాలా మంది వీఆర్వోలు, వీఆర్ఏల సీనియారిటీని పరిగణనలోకి తీసుకోకుండా జీరో సర్వీసుతో ఇతర శాఖల్లోకి పంపారు. విద్యాశాఖ, మున్సిపల్.. తదితర శాఖల్లోకి వెళ్లిన వీఆర్వోలు, వీఆర్ఏల సర్వీసు కలపకుండానే జూనియర్ అసిస్టెంట్ కేడర్‌లో నియమించారు. వీరికి రెవెన్యూలో పనిచేసిన సర్వీసును కలిపితే అప్పటికే ఆయా శాఖల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు నష్టపోతారని, ఎప్పటి నుంచో పని చేస్తున్న వారి కంటే ముందు కొత్తగా రెవెన్యూ నుంచి వచ్చిన వారు పదోన్నతులకు అర్హత పొందుతారనే కారణంతో సీనియారిటీ ఇవ్వకుండానే ఇతర శాఖల్లో విలీనం చేశారు. ఈ విషయంలో అప్పుడే వివాదం ఏర్పడింది. అయినా ఆ సమస్యను గత ప్రభుత్వం పరిష్కరించలేదు. ఇప్పుడు జూనియర్ రెవెన్యూ అధికారి పేరుతో గ్రామానికో రెవెన్యూ అధికారి నియామకం కోసం ఇతర శాఖల్లోకి వెళ్లిన వీఆర్వోలు, వీఆర్ఏల నుంచి సుముఖత పత్రాలను రెవెన్యూ వర్గాలు సేకరించాయి. సుముఖత వ్యక్తం చేసిన వారిలో డిగ్రీ, ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి పరీక్ష పెట్టి మళ్లీ రెవెన్యూలోకి తీసుకోవాలనేది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది. అయితే, తమ పాత శాఖలోకి మళ్లీ తీసుకునేందుకు పరీక్ష ఎందుకని ప్రశ్నిస్తున్న పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు ఇప్పుడు సీనియారిటీ అంశాన్ని ముందుకు తీసుకువస్తున్నారు. గతంలో రెవెన్యూలో పనిచేసినప్పుడు ఏడాదిన్నర నుంచి పదేళ్ల వరకు సర్వీసును కోల్పోయామని, ఇతర శాఖల్లో దాదాపు రెండేళ్లు పనిచేశామని, మళ్లీ ఇప్పుడు జీరో సర్వీసుతో రెవెన్యూలోకి రావడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సీనియారిటీని పరిగణనలోకి తీసుకోకుండా పరీక్ష పెట్టినా రాసేందుకు చాలా మంది సుముఖంగా లేరని తెలుస్తోంది. ఇతర శాఖల్లోనే ఉంటే గత రెండేళ్ల సర్వీసుతో పదోన్నతులకు వీలుంటుందనే భావనలో పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు ఉన్నారు. పరీక్ష పెట్టాలా వద్దా అన్నదానిపైనే ఇంకా నిర్ణయం తీసుకోని పరిస్థితుల్లో ఇప్పుడు కొత్తగా సీనియారిటీ సమస్య తెరపైకి రావడం ప్రభుత్వ వర్గాలకు తలనొప్పిగా మారనుంది.

కోదండరాంను కలసి విన్నపం..

సీనియారిటీ అంశంపై కొందరు పూర్వ వీఆర్వోలు బుధవారం తెలంగాణ జనసమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాంను కలిశారు. రెవెన్యూ శాఖలోకి తీసుకుంటున్న తమకు సీనియారిటీ వర్తింపజేసేలా ప్రభుత్వంతో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. కోదండరాంను కలసిన వారిలో రీడిప్లాయ్‌డ్ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరి ఈశ్వర్, నేతలు ముత్యాలు, బసవరాజు, భానుశ్రీ, మాధవి, హైమావతి తదితరులున్నారు.

22 నుంచి జేఈఈ మెయిన్
మొదటి సెషన్

- 19వ తేదీ నుంచి అందుబాటులోకి హాల్‌టికెట్లు
- ఈ వారంలోనే ఆన్‌లైన్‌లో సిటీ ఇంటిమేషన్ స్లిప్‌లు
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్‌టీఏ

సాక్షి, హైదరాబాద్: బీటెక్, బీఈ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్–2025 మొదటి దశ షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బుధవారం విడుదల చేసింది. ఈ నెల 22 నుంచి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు ఈ నెల 19వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని ఎన్‌టీఏ ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థులు jeemain.nta.nic.in వెబ్‌సైట్‌లో తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌ను ఎంటర్ చేసి హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించింది. సిటీ ఇంటిమేషన్ స్లిప్‌లను కూడా ఇదే విధానంలో తీసుకోవాలని కోరింది. సిటీ ఇంటిమేషన్ స్లిప్‌లను ఈ వారంలోనే ఆన్‌లైన్‌లో పెట్టనున్నట్లు వెల్లడించింది. విద్యార్థులకు పరీక్ష కేంద్రం ఏ నగరంలో పడిందో తెలిపేదే సిటీ ఇంటిమేషన్ స్లిప్. ఇది అడ్మిట్ కార్డు కాదు.. అడ్మిట్ కార్డులు 19 నుంచి అందుబాటులో ఉంటాయి. జేఈఈ మెయిన్ పరీక్షను తెలుగు సహా మొత్తం 13 భాషల్లో నిర్వహిస్తున్నారు. మొదటి సెషన్ కోసం దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 13.8 లక్షల మంది రిజిస్టర్ చేసుకొన్నారు. గత ఏడాదితో పోల్చితే ఇది 1.6 లక్షలు అధికం.

పరీక్ష షెడ్యూల్ ఇదీ.

పేపర్: బీఈ/బీటెక్
పరీక్ష తేదీలు: జనవరి 22, 23, 24, 28, 29
షిఫ్టులు: మొదటి షిఫ్టు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్టు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు
పేపర్: 2ఏ (బీ ఆర్క్), 2బీ (బీ ప్లానింగ్), 2ఏ–2బీ (బీ ఆర్క్– బీ ప్లానింగ్)
పరీక్ష తేదీ: జనవరి 30
షిఫ్టు: మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు.

సంధ్య థియేటర్ ఘటనపై 4 వారాల్లోగా
నివేదికివ్వండి

తెలంగాణ డీజీపీ, హైదరాబాద్ సీపీలకు ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: పుష్ప–2 బెనిఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) స్పందించింది. డిసెంబర్ 4న బెనిఫిట్ షోకి హీరో అల్లు అర్జున్ రావడం, పోలీసులు లాఠీచార్జ్ చేయడం వల్లే థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగిందని న్యాయవాది రామారావు ఫిర్యాదు చేశారు. ఈ కారణంగానే రేవతి అనే మహిళ మృతి చెందిందని, ఆమె కుమారుడికి తీవ్రగాయాలయ్యాయని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎన్‌హెచ్‌ఆర్సీ.. తెలంగాణ డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసింది. సంధ్య థియేటర్ ఘటనపై సీనియర్ ర్యాంక్ పోలీసు అధికారితో విచారణ జరిపించాలని ఆదేశించిన ఎన్‌హెచ్‌ఆర్సీ.. ఈ ఘటనపై 4 వారాల్లోగా నివేదికను సమర్పించాలని డీజీపీ, సీపీలకు ఇచ్చిన నోటీసుల్లో పేర్కొంది.



హైస్పీడ్‌లోనూ అదుపులోనే!

▶ మొదటి పేజీ తరువాయి

నిర్మిస్తారు. రోడ్డు చివరి వైపు నాలుగు వరసలను (2 ప్లస్ 2) ప్రస్తుతం నిర్మిస్తారు.

- ఈ నాలుగు వరసలు ఒక్కో వైపు 11 మీటర్లు ఉంటుంది. రెండు వైపులా కలిపి 22 మీటర్లు. ఇందులో 3 ప్లస్ 3 మీటర్లు పేవ్ షోల్డర్ ఏరియా ఉంటుంది. ఏదైనా కారణంతో వాహనాలను నిలపాల్సి వస్తే.. పేవ్ షోల్డర్ పరిధిలో నిలుపుతారు. ప్రధాన క్యారేజ్ వే 15 మీటర్లు ఉంటుంది.

150 ఎంఎంతో తారు వరసలు

రోడ్డు మీద తారు లేయర్లు 150 ఎంఎం మందంతో వేస్తారు. ఇందులో మొదట 100 ఎంఎం మందంతో డెన్స్ బిటుమినస్ కాంక్రీట్ ఉంటుంది. ఇది రోడ్డుకు పటుత్వాన్ని అందిస్తుంది. తారుతో పాటు వివిధ మిశ్రమాలను ఇందులో కలుపుతారు. దీని జీవిత కాలం 20 సంవత్సరాలు. ఆ తర్వాత పాత లేయర్‌ను మిల్లింగ్‌తో తొలగించి కొత్త లేయర్ వేయాల్సి ఉంటుంది. దాని మీద 50 ఎంఎం మందంతో డెన్స్ బిటుమినస్ మెకడం (డీబీఎం)ను పరుస్తారు. ఇది సర్ఫేస్ లేయర్. చాలా నునుపుగా ఉంటుంది. వాహనాలు వేగంగా వెళ్లినప్పుడు జారకుండా ఇది నియంత్రిస్తుంది. దీని జీవితకాలం కనిష్టంగా నాలుగేళ్లు. ఆ తర్వాత పైభాగంలో పటుత్వం కోల్పోతుంది. అప్పుడు మిల్లింగ్ ద్వారా దాన్ని తొలగించి కొత్త లేయర్ పరవాల్సి ఉంటుంది.

రోడ్డు కేంబర్ కీలకం

వాహనాలు వేగంగా ప్రయాణించే రోడ్లకు రోడ్ కేంబర్ చాలా కీలకం. కేంబర్ అంటే రోడ్డు వాలు. నేల సమాంతరంగా ఉన్నప్పుడు వాలు ఎంత ఉండాలి? మలుపుల వద్ద ఎంత ఉండాలి? అన్నది దీనిపై ఆధారపడి ఉంటుంది. తారుకు ప్రధాన శత్రువు నీరు. నీళ్లు నిలిస్తే తారు కణాలు విడిపోయి రోడ్డు మీద గుంతలు ఏర్పడతాయి. అందువల్ల నీళ్లు నిలువకుండా నిర్ధారిత వాలును అనుసరించాల్సి ఉంటుంది.

మలుపుల్లో సూపర్ ఎలివేషన్

మలుపుల వద్ద వేగంగా తిరిగినప్పుడు వాహనం అదుపుతప్పి బోల్తాపడే ప్రమాదం ఉంటుంది. దాన్ని నియంత్రించేందుకు రోడ్డు చివరలు కాస్త ఎత్తుగా ఉండేలా డిజైన్ చేస్తారు. దాన్నే సూపర్ ఎలివేషన్ అంటారు. ఎత్తు పల్లాల్లో ఉండే మలుపుల్లో ఈ ఎలివేషన్ వేర్వేరుగా ఉంటుంది. రోడ్డు వెడల్పు, వాహనాల వేగం, ఎత్తు పల్లాలు... వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని ఎన్ని డిగ్రీల కోణంలో తిరగాలి? ఎంత ఎత్తు ఉండాలి? అన్న లెక్కలుంటాయి. దాన్ని కచ్చితంగా అనుసరించాలని నిర్ణయించారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లను వినియోగించి కచ్చితత్వంతో రోడ్డును డిజైన్ చేస్తున్నారు. మలుపు 700 మీటర్ల నిడివితో ఉండేలా డిజైన్ చేస్తున్నారు. అప్పుడు వాహనం మలుపు తిరిగిన ఫీలింగ్ రాదు.

అతి వేగం ప్రమాదకరమే..

'ఎక్స్‌ప్రెస్‌వేల మీద గంటకు 200 కి.మీ. వేగంతో వాహనాలు దూసుకుపోయినా చాలా సందర్భాల్లో ప్రమాదాలు జరగటం లేదు. అలా అని 200 కి.మీ. వేగంతో దూసుకుపోయేందుకు ఆ రోడ్డు సురక్షితమని అనుకోకూడదు. మన ప్రమాణాల ప్రకారం 120 కి.మీ. వేగంతో వెళ్లినప్పుడు వాహనంలో ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు తలెత్తకుండా రోడ్డు నియంత్రిస్తుంది. అంతకు మించితే పరిస్థితులు చేయిదాటిపోతాయి. 180 –200 కి.మీ. వేగాన్ని తట్టుకునేలా రోడ్డు ఉన్నా.. వాహనం తయారీ పరిమితులు, డ్రైవింగ్ మెళకువలు, వాతావరణం వంటివన్నీ ప్రభావితం చేస్తాయి. రోడ్డు బాగుంది కదా అని అంత వేగంగా దూసుకుపోతే ప్రమాదాలకు అవకాశాలెక్కువ' అని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'తో చెప్పారు.

అసైన్డ్ భూములపై
హక్కులు ఎప్పుడు?

యాజమాన్య హక్కుల కోసం 18 లక్షల మందికిపైగా పేద రైతుల ఎదురుచూపులు

- దీనిపై ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ.. ప్రభుత్వం ఏర్పాటై ఏడాది దాటినా కదలని ఫైలు
- దక్షిణాది రాష్ట్రాల్లో ఇప్పటికే అసైన్డ్ భూములపై హక్కులిచ్చిన ఆయా ప్రభుత్వాలు
- ఈ అంశంపై భిన్నాభిప్రాయాలెన్నో.. బిల్లు పెడతారా, కమిటీ వేస్తారా?
- భూబదలాయింపు నిరోధ చట్టానికి సవరణ చేస్తేనే సమస్యకు పరిష్కారం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా అసైన్డ్ భూములకు హక్కులు కల్పించే అంశంలో అడుగు ముందుకుపడటం లేదు. రాష్ట్రంలోని 18 లక్షల మందికి పైగా పేద రైతులు అసైన్డ్ భూములపై హక్కులు ఎప్పుడు కల్పిస్తారా అని ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు వెంటనే దీనిని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. భూపరిపాలన అంశాలపై దృష్టి సారించి ఎంతో కొంత ముందుకెళుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. అసైన్డ్‌పై హక్కుల అంశాన్ని మాత్రం పక్కన పెట్టినట్టు వ్యవహరిస్తోందని విమర్శిస్తున్నారు.

చట్టాన్ని సవరించాల్సిందే!

భూమి లేని పేదలకు ఆర్థిక భద్రత కల్పించడం, సామాజిక గుర్తింపు ఇవ్వడమే ప్రధాన ఉద్దేశంగా తెలంగాణలో దశాబ్దాలుగా భూమి పంపిణీ జరుగుతోంది. పలు రకాల భూములను పేదలకు కేటాయిస్తూ వస్తున్నారు. ఇలా అసైన్ చేసిన భూములు అన్యాక్రాంతం కాకూడదనే ఉద్దేశంతో అసైన్‌మెంట్ భూముల బదలాయింపు నిషేధ చట్టం (పీవోటీ)– 1977 తీసుకొచ్చారు. దాని ప్రకారం ప్రభుత్వం నుంచి ఉచితంగా భూమి పొందినవారు.. ఆ భూమిని ఇతరులకు విక్రయించకూడదు. దానం చేయకూడదు. కౌలుకు కూడా ఇవ్వకూడదు. వారసత్వంగా అనుభవిస్తూ వెళ్లే హక్కులు మాత్రమే ఉంటాయి. అయితే మాజీ సైనికులు పదేళ్ల తర్వాత, రాజకీయ బాధితులు మార్కెట్ ధర చెల్లించి ఉంటే వెంటనే అమ్ముకునే హక్కులు కల్పించారు. అయితే రైతుల అసైన్డ్ భూముల క్రయ, విక్రయ లావాదేవీలు జరగాలంటే భూబదలాయింపు నిరోధ చట్టాన్ని సవరించాలి. ఇందుకోసం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాల్సి ఉంటుంది.

కొన్ని రాష్ట్రాల్లో ఇచ్చేశారు!

అసైన్డ్ భూములపై పేదలకు హక్కులు కల్పించడంలో కొన్ని దక్షిణాది రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయి. అసైన్ చేసి 20 ఏళ్లు దాటితే వాటిపై అసైనీలకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కర్ణాటకలో 15 ఏళ్లకు, తమిళనాడులో 20 ఏళ్లకు, కేరళలో 25 ఏళ్లకు అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు వస్తాయి. మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్‌లలో అయితే పదేళ్లకే యాజమాన్య హక్కులు వస్తాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో కూడా అసైన్డ్ భూములపై హక్కులు కల్పించాలనే డిమాండ్ రోజురోజుకూ ఊపందుకుంటోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ దిశగా పలుమార్లు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. దీనిపై ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

భిన్నాభిప్రాయాలతో..

అసైన్డ్ భూములపై పేదలకు హక్కులు కల్పించే అంశంలో భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ హక్కుల కల్పన ద్వారా తెలంగాణలో పెరిగిన భూముల ధరలతో పేద రైతులకు ఆర్థిక స్థిరత్వం వచ్చే అవకాశాలు ఉన్నాయి. కుటుంబ అవసరాల కోసం అత్యవసర పరిస్థితుల్లో భూములను అమ్ముకుని గట్టెక్కవచ్చనే అభిప్రాయాలు ఉన్నాయి. అయితే ఇలా హక్కులిస్తే ఎస్సీ, ఎస్టీల చేతుల్లో ఉన్న భూకమతాల సంఖ్య తగ్గిపోతుందని.. సంపన్నుల చేతుల్లోకి భూమి వెళుతుందనే వాదన కూడా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలతో కమిటీ వేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందనే చర్చ జరిగింది. కానీ ప్రభుత్వం భూభారతి చట్టం, ఇతర భూసంబంధిత అంశాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టడంతో ఈ అసైన్డ్ భూముల అంశం పక్కన పడింది. ఇప్పటికైనా అసైన్డ్ భూముల విషయంలో ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలనే వాదన వినిపిస్తోంది.

తెలంగాణలోని పేదలకు అసైన్‌చేసిన/హక్కులిచ్చిన భూముల వివరాలివీ..

కార్యక్రమం	లబ్ధిదారుల సంఖ్య	విస్తీర్ణం (ఎకరాల్లో)
ప్రభుత్వ భూముల పంపిణీ	12,34,552	16,56,150
ఇనాం రద్దు భూములు	1,18,132	5,89,134
భూదాన ఉద్యమం భూములు	36,236	99,155
కౌలు చట్టం	1,06,965	5,95,280
భూమి కొనుగోలు	37,018	53,553
సీలింగ్ మిగులు భూములు	1,85,202	3,14,981
అటవీభూములపై హక్కుల కల్పన	93,494	3,00,092
సాదా బైనామాల క్రమబద్ధీకరణ	6,18,369	8,65,000
మొత్తం	24,29,968	44,73,345

'గేటెడ్' నేరాల నిరోధానికి యాప్

రూపొందించాలని పోలీస్ కమిషనర్లకు హైకోర్టు ఆదేశం

- క్లబ్ హౌస్‌లలో అసాంఘిక కార్యకలాపాలపై కఠినచర్యలు
- డ్రగ్స్, లిక్కర్ వినియోగంపై ఉక్కుపాదం మోపాలి
- ఫిర్యాదు చేసినవారి వివరాలు గోప్యంగా ఉంచాలి
- సిటీ పోలీస్ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని సూచన



సాక్షి, హైదరాబాద్: గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో నేరాల నిరోధానికి ఒక యాప్‌ను రూపొందించాలని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లను హైకోర్టు ఆదేశించింది. ఇతర నివాసితులకు ఇబ్బందులు కలిగించేలా చట్టవిరుద్ధ కార్యకలాపాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. హద్దు మీరితే హైదరాబాద్ సిటీ పోలీస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి ఫేజ్–13లోని ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్స్ విల్లాస్ క్లబ్ హౌస్ అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారిందని.. దీనిపై ఫిర్యాదు చేసినా యాజమాన్య సంఘం చర్యలు తీసుకోవడం లేదంటూ హరిగోవింద్ ఖురానారెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టి.. తీర్పు వెలువరించారు.

కమిషనర్లకు అధికారం..

హైదరాబాద్ పోలీస్ చట్టంలోని సెక్షన్ 22 కింద ఊరేగింపుల నియంత్రణ, వీధుల్లో, బహిరంగ ప్రదేశాల్లో క్రమశిక్షణ పాటించటం, ఏదైనా వీధి లేదా బహిరంగ ప్రదేశాల్లో సంగీతం, పాటల నియంత్రణ, హైదరాబాద్ సిటీ లౌడ్ స్పీకర్ నియమాలు–1963, హైదరాబాద్, సికింద్రాబాద్ (పబ్లిక్ ప్లేస్ ఆఫ్ హాల్ట్/పీస్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌టైన్‌మెంట్/ అమ్యూజ్‌మెంట్) నియమాలు–2005, శబ్ద కాలుష్య (నియంత్రణ) నియమాలు–2000, జీవో 172లోని పర్యావరణం, అడవులు, సైన్స్ అండ్ టెక్నాలజీ (ఈఎస్‌టీ) నిబంధనల ప్రకారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసే అధికారం కమిషనర్, ఇతర పోలీసు ఉన్నతాధికారులకు ఉంది అని హైకోర్టు స్పష్టంచేసింది.

తీర్పులో పేర్కొన్న సూచనలు, ఆదేశాలు..

1) ఇందూ ఫార్చ్యూన్ ఫీల్డ్స్ విల్లా ఓనర్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక కమిటీ సభ్యుల నుంచి ముగ్గురు సభ్యులతో కూడిన ఉప కమిటీని ఏర్పాటు చేయాలి. వీరు ప్రధానంగా సీనియర్ సిటిజన్లు/మహిళలు/రిటైర్డ్ ఉద్యోగులై ఉండాలి. వీరు క్లబ్‌హౌస్ వంటి ప్రదేశాల్లో నిఘా ఉంచవచ్చు.
2) అసోసియేషన్ ఓ యాప్ లాంటి ప్లాట్‌ఫామ్/అప్లికేషన్‌ను రూపొందించాలి. దీని ద్వారా సభ్యులు ఫిర్యాదులు/సందేశాలను పంపవచ్చు. దీని నిర్వహణకు ప్రత్యేక టీమ్ ఉండాలి. సబ్–కమిటీ సభ్యులు మాత్రమే యాక్సెస్ కలిగి ఉండేలా చర్యలు చేపట్టాలి. ఫిర్యాదులు/సందేశాలను ఆ సభ్యులకు పంపాలి. సబ్–కమిటీ సభ్యులు ఫిర్యాదుదారుడి గుర్తింపును గోప్యంగా ఉంచాలి.
3) వచ్చిన ఫిర్యాదులపై వెంటనే చర్య తీసుకొని కార్యనిర్వాహక కమిటీకి నివేదించాలి. ఏదైనా చట్టవిరుద్ధమైన చర్యలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
4) గేటెడ్ కమ్యూనిటీ క్లబ్‌హౌస్ వినియోగానికి అసోసియేషన్ నిర్దిష్టంగా చేయవలసినవి, చేయకూడని పనుల జాబితాను రూపొందించాలి. క్లబ్‌హౌస్‌ను దుర్వినియోగం చేస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించాలి.
5) నగర పోలీసు చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధానికి, నేరాల నియంత్రణకు, ఇతర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గేటెడ్ కమ్యూనిటీలు/అసోసియేషన్లు/ఫ్లాట్ అసోసియేషన్లకు అవసరమైన సలహాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ జారీ చేయాలి.
6) వేధింపులు, నేరాలు జరిగినప్పుడు గేటెడ్ కమ్యూనిటీలు/అసోసియేషన్లు/ఫ్లాట్ అసోసియేషన్లలో తగిన చర్యలు తీసుకోవడానికి సంబంధిత పోలీస్ స్టేషన్/టాస్క్‌ఫోర్స్‌కు అవసరమైన సూచనలను కూడా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ జారీ చేయాలి.
7) వీలైతే గేటెడ్ కమ్యూనిటీలు/అసోసియేషన్లు/ఫ్లాట్ అసోసియేషన్లలోని నేరాలపై ఫిర్యాదు చేయడానికి, సమాచారం ఇచ్చే వ్యక్తి/ఫిర్యాదుదారుడి గుర్తింపును గోప్యంగా ఉంచేందుకు సంబంధిత పోలీస్ స్టేషన్లకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ (యాప్)ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అందించాలి.



జీవితం అనేది పరిష్కరించాల్సిన సమస్య కాదు.
అనుభవించాల్సిన వాస్తవం.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 2 జనవరి 2025

మణిపూర్ చల్లారుతుందా?

ఇరవై నెలల నుంచి మహోగ్రంగా మండుతున్న మణిపూర్‌లో తొలిసారి ఒక చల్లని సాంత్వన వాక్యం వినబడింది. రాష్ట్రంలో ఇంతవరకూ జరిగిన హింసాకాండకు క్షమాపణ కోరుతున్నానని నూతన సంవత్సర ఆగమనవేళ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్ సింగ్ ప్రకటించారు. అనుకోనిది చోటు చేసుకున్నప్పుడు క్షమాపణ కోరటంవల్ల వెంటనే అంతా చక్కబడుతుందని అనుకోనవసరం లేదు. కానీ నేరగాళ్లపై చర్య తీసుకుంటారన్న విశ్వాసం కలిగినప్పుడు బాధిత పక్షంలో ప్రతీకార వాంఛ సన్నగిల్లుతుంది. వారిని రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలనుకునేవారి ఆటలు సాగవు. కానీ ఇన్నాళ్లుగా మణిపూర్‌లో జరిగింది వేరు. 2023 మే నెలలో ఘర్షణలు రాజుకున్నప్పుడు బీరేన్ సింగ్ చాలా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. రెండు ప్రధాన తెగలు మొయితీ–కుకీలు ఘర్షణ పడుతున్నారన్న సంగతిని గుర్తించటానికే నిరాకరించారు. 'ఇదంతా కుకీ ఉగ్రవాదులకూ, భద్రతా దళాలకూ సాగుతున్న ఘర్షణ' అంటూ భాష్యం చెప్పారు. మొయితీకి చెందిన నేతగా కుకీల తీరుపై ఎలాంటి అభిప్రాయాలైనా, అభ్యంతరాలైనా ఆయనకు ఉండొచ్చు. కానీ సీఎం హోదాలో అలా మాట్లాడరాదన్న సంగతిని బీరేన్ గ్రహించలేకపోయారు. ఆ వెంటనే రక్షణ దళాల చీఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ ముఖ్యమంత్రి ప్రకటనను తోసిపుచ్చారు. అవి స్పష్టంగా తెగల ఘర్షణలేనని చెప్పారు. మణిపూర్ హింసకు ఇంతవరకూ 260 మంది బలి కాగా, 60,000 మంది ఇప్పటికీ రక్షణ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. రాష్ట్రం రెండు తెగలమధ్యా చీలిపోయింది. ఒకరి ప్రాంతాల్లోకి మరొకరు వెళ్లే పరిస్థితి లేదు.

రెండు రోజుల క్రితం కేంద్ర హోంశాఖ విడుదల చేసిన నివేదిక గమనిస్తే మణిపూర్ ఎంత అధ్వాన్నంగా ఉన్నదో తెలుస్తుంది. అక్కడ మొయితీ, కుకీ, జోమీ తెగల పరస్పర ఘర్షణలవల్ల హింసాకాండ రాజుకుందనీ, మిలిటెంట్ల ప్రాబల్యం పెరిగిందనీ నివేదిక సారాంశం. మొత్తంగా ఈశాన్య ప్రాంతంలో అశాంతికి 77 శాతం మణిపూర్ పరిణామాలే కారణమని తెలిపింది. మొయితీ తెగను కూడా ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ మణిపూర్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ సమస్యకు మూల కారణం. 2023 మే 3న ఆ తీర్పును వ్యతిరేకిస్తూ మణిపూర్‌లోని ఆల్ ట్రైబల్స్ స్టూడెంట్స్ యూనియన్ నిర్వహించిన ర్యాలీపై మొయితీల దాడి, దానికి ప్రతిగా కుకీలు రెచ్చిపోవటం పరిస్థితిని దిగజార్చింది. చివరకు మహిళలపై గుంపులు దాడిచేసి వారిని వివస్త్రలను చేయటం, నగ్నంగా ఊరేగించి అత్యాచారాలకు తెగబడటం యథేచ్ఛగా సాగాయి. ఇక గృహదహనాలు, ఇతర ఆస్తుల ధ్వంసం వంటివి సరేసరి. పోలీస్ స్టేషన్లపై, సాయుధ రిజర్వ్ బెటాలియన్ స్థావరాలపై దాడులకు దిగి వేలాది తుపాకులు, రాకెట్ లాంచర్లు, లక్షల తూటాలు అపహరించారు. వేలాదిమంది కొంపా గోడూ వదిలి చెట్టుకొకరు పుట్టకొకరయ్యారు. ఆఖరికి ఇవి మత ఘర్షణలుగా కూడా పరిణమించాయి. వాస్తవానికి ఒక తెగవారంతా ఒకే మతంవారని చెప్పటానికి వీల్లేదు. అయితే కుకీల్లో అత్యధికులు క్రైస్తవులుకాగా, హిందువులు కూడా ఉంటారు. మొయితీల్లో కూడా క్రైస్తవ మతాన్ని అనుసరించేవారున్నా వారి సంఖ్య తక్కువ. అత్యధికులు హిందువులు. ఈ పరస్పర వైషమ్యాల పర్యవసానంగా చర్చిలను ధ్వంసం చేసిన ఉదంతాలు చాలానే ఉన్నాయి. నూతన సంవత్సర వేళ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకూ, ప్రధాని నరేంద్ర మోదీకీ సమర్పించిన వినతిపత్రంలో 2023 నుంచి ఇంతవరకూ మణిపూర్‌లో 360 చర్చిలను ధ్వంసం చేశారని 400 మంది సీనియర్ క్రిస్టియన్ నాయకులు తెలియజేశారు. క్రైస్తవులపై దాడులు జరిగిన ఉదంతాలు 720 ఉన్నాయని వారంటున్నారు.

ఘర్షణలు అడపా దడపా ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. అపహరించిన ఆయుధాలు అప్పగించమని పోలీసులు చేసిన వినతి పెద్దగా పనిచేయలేదు. ఇప్పటికీ మొయితీ, కుకీ తెగలవద్ద కుప్పలుగా ఆయుధాలున్నాయి. ఇందులో అపహరించిన వాటితోపాటు పొరుగునున్న మయన్మార్‌నుంచి వచ్చిపడుతున్న ఆయుధాలున్నాయని పోలీసులు చెబుతున్నారు. మణిపూర్‌తో పాటు ఇతర ఈశాన్య రాష్ట్రాలు ఎంతో వైవిధ్యభరితమైనవి. అక్కడ 400కు పైగా తెగలున్నాయి. భిన్న సంస్కృతులు, విశ్వాసాలకు చెందిన వీరంతా కొన్ని మినహాయింపులతో శతాబ్దాలుగా కలిసిమెలిసి ఉంటున్నారు. అయితే పరిమిత వనరులను ఇంతమందితో పంచుకోవాల్సి రావటంవల్ల అందరిలోనూ భయాందోళనలున్నాయి. ఇది సాయుధ బృందాలకు ఊపిరిపోస్తోంది. తమకు స్వయం పాలిత ప్రాంతాలు కావాలన్న డిమాండ్ బయల్దేరుతోంది. ఈ నేపథ్యంలో అక్కడ ఎంతో జాగ్రత్తగా అడుగులేయాల్సి వుండగా ఇన్నాళ్లూ మణిపూర్ నిర్లక్ష్యానికి గురైంది.

ఇప్పుడు బీరేన్ సింగ్ ప్రకటన తర్వాతైనా వాస్తవాల ఆధారంగా నిర్దిష్ట చర్యలు ప్రారంభం కావాలి. సమస్య బయల్దేరినప్పుడు కిందిస్థాయిలో తగిన చర్యలు తీసుకోవటంలో విఫలమైనప్పుడే అవి పెరిగి పెద్దవై పరిష్కారానికి అసాధ్యంగా పరిణమిస్తాయని అమెరికా మాజీ రక్షణమంత్రి రాబర్ట్ గేట్స్ ఒక సందర్భంలో అంటారు. మొన్న జూన్‌లో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సమస్య ఉగ్రరూపం దాల్చిందని చెప్పిన సంగతి మరిచిపోరాదు. బాధిత పక్షాలకు భరోసా కల్పించే విధంగా అడుగులేస్తే, ఉపాధి కల్పనకు నడుం బిగిస్తే క్రమేపీ అంతా సర్దుకుంటుంది. ఏ తెగ హక్కులకూ భంగం కలగనీయబోమని, మారణకాండ కారకులను కఠినంగా శిక్షిస్తామని సంకేతాలు పంపితే ఉద్రిక్తతల ఉపశమనానికి ఆ వాగ్దానాలు తోడ్పడతాయి. రాజకీయ పక్షాలు సైతం ఈ సమయంలో బాధ్యతాయుతంగా మెలగాలి.

ఏఐ నామ సంవత్సరం

విశ్లేషణ



దినేశ్ సి.శర్మ

2024లో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కొన్ని ముందడుగులు వడివడిగా పడ్డాయి. కృత్రిమ మేధ, అంతరిక్ష పరిజ్ఞాన రంగాల్లో ప్రగతి మిగిలిన వాటి కంటే ప్రస్ఫుటంగా కనిపించింది. అత్యాధునిక జనరేటివ్ ఏఐ టెక్నాలజీలు స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లలోకి కూడా చేరిపోయాయి. అంతరిక్ష ప్రయాణ ఖర్చులను గణనీయంగా తగ్గించేలా స్పేస్‌ఎక్స్ సంస్థ నేల వాలుతున్న రాకెట్‌ను భారీ టవర్ సాయంతో ఒడిసిపట్టుకోవడం ఈ ఏడాది హైలైట్స్‌లో ఒకటి. ఇస్రో కూడా పునర్వినియోగ లాంచ్ వెహికల్ 'పుష్పక్'ను పరీక్షించింది. ఇక, నికోబార్ ద్వీపంలో నివసిస్తున్నవారు లావోస్‌లోని వారికి జన్యుపరంగా దగ్గరి బంధువులని తేలడం 2024లో మరో విశేషం.

గూగుల్ డీప్‌మైండ్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో డెమిస్ హసాబిస్‌కు 2024 రసాయన శాస్త్ర నోబెల్ అవార్డు దక్కడం చాలామందిని ఆశ్చర్యపరిచింది. కృత్రిమ మేధను వేర్వేరు శాస్త్ర రంగాల్లో సమర్థంగా ఉపయోగించే అవకాశం ఉందనేందుకు ఈ అవార్డు ఒక గుర్తింపు అనుకోవాలి. హసాబిస్ కృత్రిమ మేధ మోడల్ ద్వారా కొత్త ప్రొటీన్లను సృష్టించే ప్రయత్నం చేసిన విషయం తెలిసిందే. కొత్త మందులు, టీకాల తయారీకి ఈ ఆవిష్కరణ దారులు తెరిచింది.

స్మార్ట్ ఫోన్లే సూపర్ కంప్యూటర్లు

భారత దేశంలోనూ ఏఐ టెక్నాలజీలు వేగం అందుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఏఐ కేంద్రంగా ఒక పథకాన్ని ఆవిష్కరించింది కూడా. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్సీ)కి చెందిన సెంటర్ ఫర్ నానో సైన్స్ అండ్ ఇంజినీరింగ్ సెప్టెంబరులో ఏఐ, కంప్యూటింగ్ రంగాలను తీవ్రంగా ప్రభావితం చేయగల గొప్ప ఆవిష్కరణ ఒకదాని గురించి ప్రకటించింది. ప్రస్తుతం మనం వాడుతున్న కంప్యూటర్లలో కేవలం రెండే 'కండక్టన్స్ దశ'ల ద్వారా కంప్యూటింగ్, స్టోరేజీలు జరుగుతూంటే... ఐఐఎస్సీ శాస్త్రవేత్తలు 16,500 కండక్టన్స్ దశల్లో కంప్యూటింగ్, స్టోరేజీ చేయగల సరికొత్త ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేశారు. అంటే, అత్యంత సంక్లిష్టమైన లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ వంటి ఏఐ టెక్నాలజీలను కూడా సూపర్ కంప్యూటర్లు లేకుండానే వాడుకునే అవకాశం వస్తుంది. స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ల ద్వారానే భవిష్యత్తులో సూపర్ కంప్యూటర్ల స్థాయి లెక్కలు చేసేయవచ్చు. శ్రీతోష్ గోస్వామి నేతృత్వంలోని బృందం దీన్ని సుసాధ్యం చేసింది. న్యూరో మార్ఫిక్ కంప్యూటింగ్ అని పిలుస్తున్న ఈ ప్లాట్‌ఫామ్ మన మెదడు పనితీరును అనుకరిస్తుంది.

ఏఐ వినియోగం వివిధ రంగాలకు విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా నైతిక, వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన కొన్ని అంశాలు తలెత్తుతున్నాయి. భారత్ ఈ అంశాల విషయంలో చిన్న ముందడుగు వేసింది. కొన్ని ఏఐ టెక్నాలజీల వాడకానికి ముందు కంపెనీలు ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని సూచించింది. తద్వారా డీప్‌ఫేక్‌లు వ్యాప్తి చెందకుండా, అల్గారిథమ్ ద్వారా వివక్ష జరక్కుండా జాగ్రత్త పడవచ్చునన్నది ప్రభుత్వ ఉద్దేశం. అయితే ఈ చర్య సృజనాత్మకతను దెబ్బతీస్తుందన్న కంపెనీల అభ్యంతరంతో ప్రస్తుతానికి ఈ అంశాన్ని పక్కనపెట్టింది ప్రభుత్వం. ఇంకోవైపు యూరోపియన్ యూనియన్ ఏఐ విషయంలో ఆగస్టులోనే ఒక చట్టం చేసింది. ఏఐ సేవలందించే వారు హాని చేయకుండా కట్టడి చేయడం దీని ఉద్దేశం.

పునర్వినియోగ రాకెట్

అంతరిక్ష రంగం విషయానికి వస్తే భారత్ పునర్వినియోగ రాకెట్ విషయంలో కీలకమైన ప్రగతి సాధించింది. రెండు నెలల క్రితం స్పేస్‌ఎక్స్ సంస్థ 70 మీటర్ల పొడవైన రాకెట్ సాయంతో 'తన స్టార్‌షిప్' అంతరిక్ష నౌకను ప్రయోగించడం ఈ ఏడాది హైలైట్స్‌లో ఒకటి. సూపర్ వేగంతో నేల వాలుతున్న రాకెట్‌ను 'మెకాజిల్లా' పేరుతో నిర్మించిన భారీ టవర్ సాయంతో ఒడిసిపట్టుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. అంతరిక్ష నౌకలు, ఉపగ్రహాలను ప్రయోగించేందుకు రాకెట్లను మళ్లీ మళ్లీ వాడవచ్చు అన్నది స్టార్‌షిప్ ప్రయోగంతో రుజువైంది. భవిష్యత్తులో ఈ సూపర్‌హెవీ అంతరిక్ష రాకెట్... విమానం మాదిరి అరగంటలో పైకెగిరి ఇంధనం నింపి తిరిగి వచ్చేలా చేయాలని స్పేస్‌ఎక్స్ సీఈవో ఎలాన్ మస్క్ ప్రయత్నిస్తున్నారు. భారతీయ అంతరిక్ష సంస్థ ఇస్రో కూడా పునర్వినియోగ లాంచ్ వెహికల్ ఒకదాన్ని అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉంది. తన పుష్పక్ రెక్కల విమానం ద్వారా జూన్ నెలలో నిట్టనిలువుగా ల్యాండ్ అవడం పరీక్షించింది కూడా.



2024లో సైన్స్‌లో ఏం సాధించాం?

గత ఏడాది అమృత్ కాల్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2035 నాటికల్లా భారత్ సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుంటుందనీ, 2040 నాటికి జాబిల్లి పైకి వ్యోమగామిని పంపుతామనీ సంకల్పం చెప్పుకుంది. 2024లో ఆ దిశగా అధికారిక అనుమతులు జారీ అయ్యాయి. 2028 నాటికి అంతరిక్ష కేంద్రపు తొలి భాగాన్ని ప్రయో గించనున్నారు. 2035 నాటికి అంతరిక్ష కేంద్రం తుదిరూపు సంతరించుకుంటుంది. మానవ సహిత అంతరిక్ష యానం కూడా దీంతో సమాంతరంగా నడుస్తుంది. 2026 లోగా నాలుగు గగన్‌యాన్ ప్రయోగాలు జరగనున్నాయి.

చైనాతో పోలిస్తే ఇంకా వెనుకే...

శాస్త్ర రంగంలో భారత్ కొన్ని విజయాలు సాధించినప్పటికీ, చైనా కంటే వెనుకబడి ఉండటం కఠోర సత్యం. చంద్రుడిపై ప్రయోగాలను చైనా ఇప్పటికే ముమ్మరం చేసింది. జూన్‌లో చంద్రుడిపై రాతి నమూనాలను సేకరించే విషయంలో విజయం సాధించింది. జాబిల్లికి అటువైపున ల్యాండ్ అయిన ఛాంగ్–ఈ అంతరిక్ష నౌక రోబోటిక్ డ్రిల్ ద్వారా 1.9 కిలోల బరువైన రాతి నమూనాలు సేకరించింది. అసెండింగ్ మాడ్యూల్ ద్వారా పైకెగిరి ఆర్బిటర్‌తో అనుసంధానమైంది. భూమికి తిరిగి వచ్చింది. దాదాపు ఇలాంటి ప్రయోగాన్నే 2027లో నిర్వహించేందుకు ఇస్రో సన్నద్ధమవుతోంది.

ఏఐ, అంతరిక్ష రంగాల్లో మానవ ప్రగతి ఇలా ఉంటే... భారతీయ జన్యు వైవిధ్యతను అంచనా కట్టేందుకు జ్ఞానేశ్వర్ చౌబే (బనారస్ హిందూ యూనివర్సిటీ), హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ) సీనియర్ శాస్త్రవేత్త కె.తంగరాజ్ జరిపిన అధ్యయనం ప్రకారం... ప్రస్తుతం నికోబార్ ద్వీపంలో నివసిస్తున్నవారు లావోస్ దేశంలోని మోన్‌ఖ్మేర్ భాష మాట్లాడేవారికి జన్యుపరంగా దగ్గరి బంధువులని తేలింది. సుమారు ఐదు వేల ఏళ్ల క్రితం వీరు నికోబార్ ద్వీపానికి వచ్చినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. అండమాన్, ఓంగి జనాభా ఎప్పుడో 70 వేల ఏళ్ల క్రితం ఆఫ్రికా నుంచి వలసవచ్చిన వారని భారతీయ శాస్త్రవేత్తలు ఇప్పటికే రుజువు చేసిన సంగతి చెప్పుకోవాల్సిన అంశం. భారతీయుల మూలాలను నిర్ధారించేందుకు కేంద్ర ప్రభుత్వం హరప్పా, మొహెంజొదారోల్లో లభ్యమైన ఎముకల అవశేషాల నుంచి డీఎన్ఏ వెలికి తీయాలని ఆంత్రోపాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియాను కోరింది.

సైన్స్ పరిశోధనలను మానవ కల్యాణం కోసం ఎలా ఉపయోగించవచ్చు అనేందుకు ఒక ఉదాహరణ ప్రవీణ్ వేముల ప్రయోగాలు అని చెప్పాలి. బెంగళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్టెమ్‌సెల్ సైన్స్ అండ్ రీజనరేటివ్ మెడిసిన్‌కు చెందిన ఈ శాస్త్రవేత్త రైతులను హానికారక క్రిమి, కీటక నాశినుల నుంచి రక్షించేందుకు ఓ వినూత్నమైన పదార్థాన్ని సిద్ధం చేశారు. చర్మంపై పూసుకోగల ఈ పదార్థం కీటక నాశినుల్లోని ప్రమాదకరమైన రసాయనాల నుంచి రక్షణ కల్పిస్తుంది. రెయిన్ కోట్‌లా కుట్టుకోగల కీటకనాశిని నిరోధక వస్త్రాన్ని కూడా అభివృద్ధి చేశాడీ శాస్త్రవేత్త. ఈ వస్త్రానికి అంటుకుంటే చాలు, ఎలాంటి హానికారక రసాయనమైనా నిర్వీర్యమైపోతుంది. నవంబరు నెలలోనే ప్రవీణ్ వేముల ఈ 'కిసాన్ కవచ్' కోటును తన స్టార్టప్ ద్వారా మార్కెట్‌లోకి విడుదల చేశారు. వచ్చే ఏడాది ఇలాంటి ప్రజోపయోగ ఆవిష్కరణలు మరిన్ని జరుగుతాయని ఆశిద్దాం.

వ్యాసకర్త జర్నలిస్ట్, సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఏడాది ఎలా ఉంటుంది?



సర్ప నామ సంవత్సరం రష్యాకు తరచుగా కల్లోలంగానే ఉంటోంది. 1905, 1917లో విప్లవాలు, 1929లో సమష్టి వ్యవసాయీకరణ, 1941లో యుద్ధం, 1953లో స్టాలిన్ మరణం, 1989లో కమ్యూనిస్ట్ కూటమి పతనం. బహుశా క్రెమ్లిన్‌లోని పాము కూడా 2025లో నాటకీయంగా మారవచ్చు.

– గ్యారీ కాస్పరోవ్, చదరంగ మాజీ దిగ్గజం

నడకే ఔషధం



చిన్న అడుగులే పెద్ద మార్పునకు కారణమవుతాయి. కాబట్టి, ఈ సంవత్సరంలో రోజూ పది వేల అడుగులు (సుమారు 8 కిలోమీటర్లు) నడుద్దామని ప్రతినబూనుదాం. రోజూ నడవటం వల్ల స్థూలకాయం, మధుమేహం, బీపీ, గుండెపోటు, డిప్రెషన్, క్యాన్సర్‌ల ప్రమాదం తగ్గుతుంది.

– సుధీర్ కుమార్, న్యూరాలజిస్ట్

బాగుంటుంది!



మన పళ్లేల్లోకి ఏం వడ్డించుకుంటున్నామో ఎరిగి, మనం తింటున్నదాని పట్ల జాగరూకత చూపి, మన పాత దుస్తులను తిరిగి ధరించడమో లేదా స్నేహితుల దగ్గర తీసుకోవడమో చేస్తూ, పనికిరాని భౌతిక వస్తువులకు బదులుగా ప్రేమ, దయతో కూడిన అక్షరాలను బహుమతిగా ఇస్తూవుంటే... ఈ ప్రపంచం ఎంత భిన్నంగా ఉంటుందో ఊహించండి.

– నిదా కిర్‌మానీ, సోషియాలజిస్ట్

దేవుడి పరీక్ష



దేవుడు మంచివాళ్లను పరీక్షిస్తాడు. కానీ వాళ్లను వదిలేయడు. దేవుడు చెడ్డవాళ్లకు చాలా ఇవ్వొచ్చు. కానీ వాళ్లను వదిలేస్తాడు. హ్యాపీ న్యూ ఇయర్.

– రజనీకాంత్, నటుడు

రెండో వారం?



జనవరి మొదటివారం బాగుంటుంది. బార్లు ఖాళీగా, జిమ్ములు నిండుగా ఉంటాయి.

– రమేశ్ శ్రీవత్స్, వ్యంగ్య వ్యాఖ్యాత

దేశాన్ని వృద్ధి బాటలో ఉరికించినవాడు!

అభిప్రాయం



దుద్దిళ్ల శ్రీధర్ బాబు

భారతదేశ చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోయే పేర్లలో డాక్టర్ మన్మోహన్‌సింగ్‌ది ముందు వరుసలో ఉంటుంది. ఆర్థికంగా పతనం అంచుల్లో ఉన్న దేశాన్ని ఒంటిచేత్తో పైకి లేపడమే కాకుండా... అంతర్జాతీయ స్థాయిలో తిరుగులేని శక్తిగా మార్చగలగడం కేవలం మన్మోహన్ సింగ్ వంటి దార్శనిక ఆర్థికవేత్త, రాజకీయ నేతకే సాధ్యం. 1991లో డాక్టర్ సింగ్ దేశ ఆర్థిక శాఖ మంత్రిగా పగ్గాలు చేపట్టే సమయానికి ఆర్థిక వ్యవస్థ అధఃపాతాళంలో ఉంది. విదేశీ మారకద్రవ్య నిల్వలు రెండు వారాలకు సరిపడా (120 కోట్ల డాలర్లు) మాత్రమే మిగిలి ఉన్నాయి. తెచ్చుకున్న రుణాల తాలూకూ వాయిదాలు చెల్లించలేని స్థితి. ఇలాంటి సంక్షోభ సమయంలో డాక్టర్ మన్మోహన్ సింగ్‌ను ప్రధాని పీవీ నరసింహారావు ఆర్థిక శాఖమంత్రిగా నియమించారు. దేశం ఉజ్వల భవిష్యత్తుకు బీజం పడింది ఇక్కడే. ఆర్థిక శాఖ మంత్రిగా దేశ పారిశ్రామిక రంగం వృద్ధికి దశాబ్దాలుగా ముకుతాళ్లు వేస్తున్న పాతకాలపు 'లైసెన్స్ రాజ్' వ్యవస్థను ధ్వంసం చేశారు. దీంతో విదేశీ పెట్టుబడుల రాక మొదలైంది. 1995–96 నాటికి 530 కోట్ల డాలర్లకు ఈ నిల్వలు చేరుకున్నాయి. దేశ స్థూల జాతీయోత్పత్తి కూడా ఆందోళనకరమైన 1.1 శాతం నుంచి ఆరోగ్యకరమైన 7.3 శాతానికి చేరుకుంది.

మన్మోహన్ దేశానికి చేసిన సేవల్లో చిరకాలం గుర్తుండిపోయేది 2005లో మొదలైన 'మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ పథకం'. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచేందుకు చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమం ఒక్క 2023లోనే 370 కోట్ల పనిదినాలను సృష్టించింది. ఈ పథకం అమలు కారణంగా ఆ ఏడాది 14 లక్షల కోట్ల రూపాయలు గ్రామీణ కుటుంబాల్లోకి చేరాయి. పల్లెల్లో పనిచేసే సామర్థ్యమున్నవారిలో 55 శాతమున్న మహిళలకు ఈ పథకం ఒక వరప్రదాయినిగా మారింది. 2004–05లో 41.8 శాతం ఉన్న పేదరికం కాస్తా 2011–12 నాటికి 25.7 శాతానికి పడిపోవడం ఈ పథక విజయమే.

2008లో ఆయన నేతృత్వంలోని ప్రభుత్వం ఏకంగా రూ. 80 వేల కోట్ల పంట రుణాలను ఒక్కసారిగా రద్దు చేసింది. అలాగే దేశం పారిశ్రామికంగానూ అభివృద్ధి చెందడానికి 'స్పెషల్ ఎకనమిక్ జోన్'(ఎస్‌ఈజెడ్) పాలసీని తెచ్చారాయన. 2005లో కేవలం 19 ఎస్‌ఈజెడ్‌లు ఏర్పాటు కాగా... ఇప్పుడు వీటి సంఖ్య 270కు చేరుకుంది. ఎస్‌ఈజెడ్‌ల ద్వారా ప్రస్తుతం 10.8 లక్షల కోట్ల రూపాయల ఎగుమతులు జరుగుతూండగా 23 లక్షల మంది భారతీయులకు ప్రత్యక్షంగా ఉపాధి కూడా కల్పిస్తున్నాయి. పారిశ్రామిక రంగంలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పేందుకు, సృజనాత్మక ఆవిష్కరణలకు ఈ ఎస్‌ఈజెడ్‌లు కేంద్రంగా నిలవడమే కాకుండా 60 వేల కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి.

భారత దేశం నేడు ప్రపంచానికే ఫార్మసీగా మారిందంటే అందుకు ఆయన మార్గదర్శనమే కారణమంటే అతిశయోక్తి కాదు. ప్రపంచం మొత్తమ్మీద ఉత్పత్తి అవుతున్న ప్రతి ఐదు జెనెరిక్ మందుల్లో ఒకటి భారత్‌లో తయారవుతోంది. అలాగే 2006–07లో రూ. 623 కోట్ల డాలర్లు ఉన్న ఫార్మా ఎగుమతులు 2022–23 నాటికి రూ. 2460 కోట్ల డాలర్లకు చేరుకున్నాయన్నా... ఈ రంగం 50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తోందన్నా ఆయన దూరదృష్టి పుణ్యమే.

మన్మోహన్ సింగ్ పదవీ కాలంలో దేశంలో చదువుల విప్లవానికి తెరలేచింది. విద్యతోపాటు, డిజిటల్ కనెక్టివిటీ కూడా ఆర్థిక అభివృద్ధికి రెండు స్తంభాలని గుర్తించిన ఆయన తన హయాంలోనే ఏడు కొత్త ఐఐటీలు, ఆరు కొత్త ఐఐఎంలు, 30 సెంట్రల్ యూనివర్సిటీలను స్థాపించారు. ఒకప్పుడు లగ్జరీగా భావించిన ఇంటర్నెట్ కనెక్టివిటీ 2014 నాటికి 24.3 కోట్ల భారతీయులకు చేరిందంటే డిజిటల్ కనెక్టివిటీకి అందిన ప్రాధాన్యమేమిటన్నది తెలిసిపోతుంది.



మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్

సమర్థంగా సంకీర్ణ రాజకీయాలు...

యునైటెడ్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ నాయకుడిగా మన్మోహన్ సింగ్ సంకీర్ణ రాజకీయాలను కూడా సమర్థంగా నడిపారు. సైద్ధాంతిక విభేదాలు ఎన్ని ఉన్నప్పటికీ ఇరవైకి పైగా భాగస్వామ్య పక్షాలున్న కూటమిని చాకచక్యంగా తానొప్పక... నొప్పింపక అన్నట్టు నడపించారు. కమ్యూనిస్టు పార్టీలు ఒకవైపు, ప్రాంతీయ పార్టీలు ఇంకోవైపు ప్రతి అంశంపై భిన్నాభిప్రాయాలతో ఉన్నా... ఒక దౌత్యవేత్తలా అందరితో మాట్లాడి ఏకాభిప్రాయాన్ని సాధించడంలో విజయం సాధించారు. యూపీఏ సంకీర్ణం అధికారంలో ఉండగా పార్లమెంటులో ఏకంగా 855 బిల్లులు ఆమోదం పొందడమే మన్మోహన్ సింగ్ సమర్థతకు ప్రతీకగా చెప్పుకోవచ్చు.

ఆర్థికాంశాల విషయంలో దేశానికి ఒక దారి చూపిన వ్యక్తి ఈయన. సామాన్యుడిని తీవ్రంగా ప్రభావితం చేయగల ఆర్థిక సూచీలు స్థిరంగా ఉండేలా చూడగలిగారు. ముఖ్యంగా చెప్పుకోవాల్సిన అంశం... ఆయన హయాంలో ఇంధన ధరలు చౌకగా మాత్రమే కాదు, స్థిరంగా కొనసాగడం. 2004 –2014 మధ్య కాలంలో పెట్రోలు ధర రూ.45 – 50 మధ్య ఉన్న విషయం తెలిసిందే. 2008 నాటి సబ్‌ప్రైమ్ క్రైసిస్ తరువాత అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 147 డాలర్ల స్థాయికి చేరినా సబ్సిడీలను సమర్థంగా వాడుకోవడం ద్వారా దేశీ పెట్రోలు ధరలు ఆకాశాన్ని అంటకుండా చేయగలిగారు.

రూపాయి మారకం విలువను ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి సూచి అంటారు. మన్మోహన్ సింగ్ మొదటి హయాం (2004–2009)లో ఒక డాలరు విలువ కనిష్ఠంగా 43 రూపాయలు, గరిష్ఠంగా 45 రూపాయలు మాత్రమే. అంతర్జాతీయ ఆర్థిక మాంద్యం చోటు చేసుకున్న 2008–2009 కాలంలోనూ రూపాయి విలువ పెద్దగా పతనమైంది లేదు. అంతర్జాతీయ అంశాల ప్రభావమున్నప్పటికీ 2009–2014 మధ్యకాలంలో రూపాయి మారకం విలువ 2013 వరకూ రూ. 45 – రూ. 54 మధ్యనే కొనసాగింది. కరెన్సీ విలువ స్థిరంగా ఉన్న కారణంగా ద్రవ్యోల్బణాన్ని అరికట్టగలిగాము. అంతర్జాతీయ వాణిజ్యానికి ఊతమూ లభించింది. విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించడం సులువైంది.

మాటల మనిషి కాదు...

మన్మోహన్ సింగ్ సమర్థతకు ఆయన హయాంలో దేశం సాధించిన ఫలితాలే సాక్షి. 2004– 2014 మధ్య కాలంలో సగటు స్థూల జాతీయోత్పత్తి 7.5 శాతం. పేదరికం నుంచి బయటపడ్డ వారి సంఖ్య 27 కోట్లు. భారత్ నేడు ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందంటే... ఆ కీర్తి ఆర్థిక సంస్కరణలకు పునాదు లేసిన సింగ్‌దే. ఎక్కడో గాహ్ (ప్రస్తుత పాకిస్తాన్‌లోని ఓ గ్రామం)లో పుట్టి దేశ అత్యున్నత పదవిని సమర్థంగా చేపట్టిన ఈయన ప్రస్థానం మౌనంగానే ఎదగడం ఎలాగో చెబుతుంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఆయన తీసుకొచ్చిన మార్పు కోటానుకోట్ల భారతీయుల జీవితాలను బాగు చేసింది. మరెందరిలోనో భవిష్యత్తుపై ఆశలు నింపింది. ఎదిగేందుకు అవకాశాలూ కల్పించింది. ఒకే ఒక్క మనిషి ఆలోచన ఎలా వందకోట్ల మంది ఆశలు నెరవేరేలా చేసిందనేందుకు ఆయన పాలనే తార్కాణం!

వ్యాసకర్త తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి

మరణం–మోక్షం

మనలో చాలామంది 'మరణం' అంటే భయపడతారు. దాని తత్వాన్ని అర్థం చేసుకోక పోవడమే ఈ భయానికి కారణం. మరణం అంటే సాధారణ పరిస్థితిలో కలుగు మార్పు. ఇటువంటి మార్పు వలన శైశవాన్ని వదలి బాల్యం, బాల్యాన్ని వదలి యవ్వనానికి మారే అవకాశం వస్తుంది. అత్యంత ప్రియమైన యవ్వనం పోయి ముసలితనం వస్తుంది. చివరగా ముసలితనం కూడా పోయి శరీరం నేలకొరుగుతుంది.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

రాత్రి గడచిపోయి సూర్యోదయం వస్తుంది. ఉదయం గడచి మధ్యాహ్నానికి అవకాశమిస్తుంది. అదే విధంగా రాత్రి ప్రారంభమయ్యిందంటే పగలు పోయినట్లే కదా. ప్రకృతి యొక్క తిరుగులేని నియమాన్ని ఎవ్వరూ నిరోధించలేరు. ఆ నియమాన్ని అనుసరించి జన్మించిన ప్రతి జీవీ మరణించవలసినదే. అలాగే మరణించిన ప్రతి జీవీ తిరిగి జన్మించవలసినదే. ఈ విషయాన్ని సరిగా అవగాహన చేసుకుంటే, మరణం వలన భయమెందుకు కలుగుతుంది? ఈ భయాన్ని నివారించడానికి ఒకే ఒక మార్గం ఉంది. తిరిగి జన్మించకుండా ఉండడమే అది. మనకు జననమే లేనప్పుడు, మరణం ఉండే సమస్యే లేదుకదా! ఎంతకాలం 'ఈ దేహమే 'నేను' అనే దేహాత్మ భావన ఉంటుందో అంతవరకు మరణం తప్పదు. ఏ క్షణాన శారీరక స్పృహను దాటతామో, అప్పుడే మనం నాశ రహితులమవుతాము.

మానవుడంటే శరీరం, మనస్సు, బుద్ధి మాత్రమే కాదు. అతను ఒక ఆత్మ స్వరూపి అని వేదాలు చెబుతున్నాయి. జ్ఞానాన్ని సంపాదించే యోగ్యత, అనేక రకాల కార్యాలను నెరవేర్చు దక్షతలు అనే లక్షణాలు కేవలం మానవులు మాత్రమే కలిగి ఉన్నారు. అంతరాత్మను కనుకొనడమే మానవ జీవిత ముఖ్య ఉద్దేశ్యం, కారణం కూడా. మానవుని జీవితంలో ఇదే ఉన్నతమైన ముఖ్య లక్ష్యము. 'ముక్తి'ని పొందడమే ఈ లక్ష్యం అని వేదాలు తెలుపుతున్నాయి. సర్వదా దైవత్వమే మన జీవిత నిజతత్వం అనే వాస్తవాన్ని గ్రహించాలని సూచిస్తున్నాయి. ఇదే పరిపూర్ణమైన ఆనందస్థితి (సచ్చిదానందము).

దీనిలో చైతన్యం... పరిధి లేనట్టి స్థితికి చేరుతుంది. ఇది శరీరం చేత, మనస్సు చేత, లేక బుద్ధిచేత అవగాహన చేసుకోవడానికి వీలులేనిది. దీనిని వర్ణించ శక్యము కాదు కాని కేవలం అనుభవించదగినది. మనం ఇప్పుడే, ఇక్కడే మోక్షాన్ని సాధించాలి. ఇది అంత సులభమైనది కాదు కాని అసాధ్యమైనది కూడా కాదు. ఈ విషయంలో గురువు మార్గదర్శనం ఎంతైనా అవసరం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.తదియ రా.2.26 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** శ్రవణం రా.12.52 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** తె.4.45 నుండి 6.17 వరకు (తెల్లవారితే శుక్రవారం), **దుర్ముహూర్తం:** ఉ.10.16 నుండి 11.04 వరకు, తదుపరి ప.2.41 నుండి 3.29 వరకు, **అమృతఘడియలు:** ప.2.30 నుండి 4.05 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.35, **సూర్యాస్తమయం:** 5.33.

క్లుప్తంగా...

సీఎంను కలిసిన మాజీ ఖైదీ నాగయ్య



నల్లగొండ రూరల్: క్షమాభిక్షతో నల్లగొండ జైలు నుంచి విడుదలైన నల్లగొండ జిల్లా నిడమనూరుకు చెందిన తరి నాగయ్య బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిపక్ష నాయకుడిగా రేవంత్‌రెడ్డి చర్లపల్లి జైలులో ఉన్న సమయంలో నాగయ్య సపర్యలు చేశారు. అనేక సందర్భాల్లో నాగయ్య గురించి రేవంత్‌రెడ్డి బహిరంగంగా ప్రస్తావించారు.

బాలకృష్ణ వ్యక్తిగత జ్యోతిష్యుడు 'కొఠారు' మృతి

- నేడు స్వగ్రామం సింగరాజుపాలేనికి భౌతికకాయం



నల్లజర్ల: నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న సింగరాజుపాలెం సిద్ధాంతి కొఠారు సత్యనారాయణ చౌదరి (75) బుధవారం హైదరాబాదు అపోలో ఆసుపత్రిలో మృతి చెందారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో పాటు బీపీ తగ్గిపోవడంతో ఆయన కోలుకోలేకపోయారు. ఆయన భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి సింగరాజుపాలెం తీసుకువస్తున్నారు. గురువారం అంత్యక్రియలు జరుగుతాయని సమీప బంధువులు తెలిపారు. సినీనటుడు బాలకృష్ణకు వ్యక్తిగత జ్యోతిష్యుడిగా చాలాకాలం పనిచేశారు. 2004 జూన్ 3వ తేదీన నటుడు బాలకృష్ణ ఇంట్లో జరిగిన కాల్పుల ఘటనలో నిర్మాత బెల్లంకొండ సురేశ్‌తో పాటు సత్యనారాయణ చౌదరి కూడా గాయపడ్డారు. డాక్టర్లు రెండు బుల్లెట్లు తొలగించగా ఇప్పటికీ ఆయన శరీరంలో ఒక బుల్లెట్ ఉంది. అప్పట్లో ఈ ఉదంతం రాష్ట్రంలో సంచలనం కలిగించింది. రాజకీయ, ఆర్థిక, పారిశ్రామిక, క్రీడా, సినీనటులు తమ సమస్యలపై తరుచూ సత్యనారాయణ చౌదరిని సంప్రదిస్తూ ఉండేవారు. సత్యనారాయణ చౌదరికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సు'జలం'.. సు'ఫలం'!

నీటి సంరక్షణతో ఏడాదిలో మూడు పంటల సాగు

- మండుటెండల్లో సైతం తగ్గని భూగర్భజలం
- ప్రతి చినుకు ఒడిసి పట్టడమే లక్ష్యం.. చతుర్విధ పద్ధతిలో నీటి సంరక్షణ
- కరువును జయించిన సంగారెడ్డి జిల్లా గొట్టివారిపల్లిపై గ్రౌండ్ రిపోర్టు
- ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకున్న రాజస్తాన్



సాగులో ఉన్న ఆలుగడ్డ పంట

ఒక ఆలోచన, సమష్టి కృషి ఆ గ్రామ రూపురేఖలను మార్చేసింది. తాగునీటి కోసం తండ్లాట, బీడువారిన పొలాలు, కరువు కాటకాలు, వలసలతో సతమతమైన ప్రాంతం.. ఇప్పుడు ఎక్కడ చూసినా పచ్చని పంటలతో కళకళలాడుతోంది. భూగర్భ జల మట్టాలు పెరగడంతో రైతులు ఏటా మూడు పంటలు పండిస్తున్నారు. నాడు కూలి పనులకు వలస వెళ్లినవారే.. ఇప్పుడు ఇతర రాష్ట్రాల కూలీలకు పనులు కల్పిస్తున్నారు. ఇక్కడ అవలంబించిన నీటి సంరక్షణ పద్ధతులను రాజస్తాన్ రాష్ట్రంలోనూ అమలు చేస్తున్నారంటే.. ఈ పథకం ఎంత విజయవంతం అయిందో అర్థమవుతుంది. ఇలా కరువును జయించిన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గొట్టిగారిపల్లి గ్రామంపై గ్రౌండ్ రిపోర్టు ఇది.

గ్రౌండ్ రిపోర్ట్

సంగారెడ్డి జోన్: సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో రైతులు వర్షాధారంగానే పంటలు పండించేవారు. వానలు సరిగా కురవకపోయినా, క్రమం తప్పినా పంటలు దెబ్బతిని నష్టపోయేవారు. నీళ్లులేక, పంటలు వేయలేక కూలి పనులకు వెళ్లేవారు. అయితే 2001లో చేపట్టిన నీటి సంరక్షణ చర్యలు గ్రామ గతిని మార్చేశాయి. వాటర్ షెడ్ పథకం ఆరో దశ కింద గొట్టిగారిపల్లికి రూ.22 లక్షలను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. నీటి వనరుల నిపుణుడు టి.హనుమంతరావు తక్కువ వ్యయంతో చతుర్విధ జల ప్రక్రియ పద్ధతిపై గ్రామస్తులకు అనేక సార్లు అవగాహన కల్పించారు. చైనాలోని హుబై రాష్ట్రంలో ఆ విధానంతో మంచి ఫలితాలు వచ్చాయని రైతులకు వివరించారు. వాన నీళ్లు వృథా పోకుండా ఎక్కడికక్కడ ఇంకిపోయేలా చర్యలు చేపట్టారు. సమీపంలోని గుట్టలపై నుంచి దిగువకు వచ్చే నీటిని పొలాల వైపు వచ్చేలా మట్టి కట్టలు నిర్మించారు. కందకాలు తవ్వారు, నీటి చెక్‌డ్యాంలు కట్టారు. ఆ నీరు చెక్ వాల్వ్‌లోకి వెళ్లే విధంగా ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో కురిసిన వాన నీరు ఊరు దాటడం లేదంటే ఎంత పకడ్బందీగా నీటి సంరక్షణ చర్యలు చేపట్టారో అర్థమవుతుంది.

తక్కువ లోతులోనే భూగర్భ జలాలు

గతంలో ఇక్కడ 500 ఫీట్ల దాకా బోరు వేసినా చుక్క నీటి జాడ కనిపించకపోయేది. ఇప్పుడు 60 నుంచి 120 అడుగుల లోతులోనే సమృద్ధిగా నీరు లభిస్తోంది. గ్రామంలో 350కిపైగా బోరుబావులు, 50 వరకు బావులు ఉన్నాయి. వాటితో గ్రామంలోని సుమారు 1,600 ఎకరాల భూమిని సాగు చేస్తున్నారు. పొలం గట్లు, పంటల చుట్టూ వేసిన ఫెన్సింగ్‌పై సైతం తీగ జాతికి చెందిన పంటలు సాగు చేస్తున్నారు. ఒక ఎకరా విస్తీర్ణంలో చుట్టూ ఫెన్సింగ్ వేసి కంది, పసుపు, ఆవాలు, కర్బూజా, మిరప, ఉల్లి, బెండకాయ, పలు ఇతర రకాల పంటలను సాగు చేస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో మడులుగా ఏర్పాటు చేసి వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలను సాగు చేస్తున్నారు. చెరుకు, మొక్కజొన్న, ఆలుగడ్డ తదితర పంటలు కూడా సాగు చేస్తున్నారు. ఏటా మూడు పంటలు వేసి మంచి ఆదాయం పొందుతున్నారు.

జాతీయ స్థాయి అవార్డు: వాటర్ షెడ్‌తో పాటు 2010–11లో ఇందిరా జలప్రభ పథకంలో భాగంగా వ్యవసాయ బోర్లు తవ్వించి, విద్యుత్ కనెక్షన్ సౌకర్యం కల్పించారు. రూరల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో చేపట్టడంతో.. 2010 అక్టోబర్ 2న నిర్వహించిన ఉపాధి హామీ ఉత్సవాల్లో గ్రామానికి జాతీయస్థాయిలో అవార్డు దక్కింది. పంటలు సమృద్ధిగా పండుతుండటంతో జీవన ప్రమాణాలు మారాయి. తమ పిల్లల్ని ఉన్నత చదువులు చదివిస్తున్నారు.



గొట్టిగారిపల్లి గ్రామం వ్యూ

3,200	గ్రామ జనాభా
350	బోరుబావులు
1,600	సాగు భూమి (ఎకరాలు)
15	చెక్ డ్యాంలు
10	చెక్ వాల్వులు
50	పర్కులేషన్‌ట్యాంకులు

ఎంబీఏ చదివి వ్యవసాయం చేస్తున్నా..



నేను ఎంబీఏ చదివిన. మూడెకరాల్లో వ్యవసాయం చేస్తున్నాను. చెరుకుతోపాటు అన్నిరకాల కూరగాయలు సాగు చేస్తున్నా. వాటర్ షెడ్ పథకంతో పుష్కలంగా నీరు ఉండటంతో ఏడాదికి మూడు పంటలు పండిస్తూ.. ఎకరాకు రూ.లక్షన్నర వరకు సంపాదిస్తున్నా.

– కనకరాజు, యువ రైతు, గొట్టిగారిపల్లి

వలసలు ఆగిపోయాయి..



గతంలో గ్రామంలో పనులు లేకపోవటంతో ఉపాధి కోసం దుండిగల్, గోమారాం, మద్దికుంట తదితర ప్రాంతాలకు వలసలు వెళ్లేవాళ్లం. వాటర్ షెడ్ పథకం చేపట్టిన సమయంలో చేసిన పనులకు కూలీ ఇచ్చారు. ప్రస్తుతం పరిస్థితులు మారి పంటలను సాగు చేసుకుంటున్నాం. వలసలు ఆగిపోయాయి.

– బాలప్ప, రైతు, గొట్టిగారిపల్లి

రైతులకు అవగాహన కల్పించి పనులు చేపట్టాం



వాటర్ షెడ్ పథకం ప్రారంభంలో రైతులు అంతగా ఆసక్తి చూపలేదు. అప్పటి నీటి వనరుల నిపుణుడు హనుమంతరావు గ్రామానికి వచ్చి ఆ పనులు చేయటంతో కలిగే ప్రయోజనాలపై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. అందరి కృషితో పథకాన్ని పూర్తి చేశాం. రెండేళ్ల తర్వాతి నుంచి మంచి ఫలితాలు వచ్చాయి. ప్రస్తుతం నీటి సమస్య అనేది లేకుండా అన్ని సమయాల్లో అన్ని రకాల పంటలు సాగు చేయగలుగుతున్నాం.

– రాచయ్య, మాజీ సర్పంచ్, గొట్టిగారిపల్లి

శ్రీశైలం భూగర్భ విద్యుత్ కేంద్రంలో నీటి ఊట

- ఆందోళన అవసరంలేదన్న చీఫ్ ఇంజనీర్



యూనిట్-1కు సంబంధించిన డ్రాఫ్ట్ ట్యూబ్ వద్ద నీటి ఊట

దోమలపెంట: టీఎస్‌జెన్‌కో పరిధి లోని శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ విద్యుత్ కేంద్రంలో నీటి ఊట రావటంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విద్యుత్ కేంద్రం చీఫ్ ఇంజనీర్ రామసుబ్బారెడ్డి తెలిపారు. కేంద్రంలోని యూనిట్–1కు సంబంధించిన డ్రాఫ్ట్ ట్యూబ్ వద్ద నీటి ఊట వస్తోందని బుధవారం ఆయన వెల్లడించారు. శ్రీశైలం ఆనకట్ట కింద 140 మీటర్ల దిగువన భూగర్భ కేంద్రానికి చెందిన యూనిట్ల డ్రాఫ్ట్ ట్యూబ్‌లు ఉన్నాయని చెప్పారు. జలవిద్యుత్ కేంద్రాలు, థర్మల్ కేంద్రాల్లో అప్పుడప్పుడు నీటి ఊట రావటం సాధారణమేనని పేర్కొన్నారు. దీనిని జెన్‌కో యాజమాన్యం ప్రతి క్షణం సమీక్షిస్తోందని చెప్పారు. ఒకవైపు విద్యుత్ ఉత్పత్తి, మరోవైపు పంప్‌మోడ్ జరుగుతుండడం వల్ల నీటి ఊట ఏర్పడి ఉండవచ్చని తెలిపారు. ప్రస్తుతం పంప్‌మోడ్ పద్ధతిలో సాగర్ జలాశయం నుంచి శ్రీశైలం జలాశయంలోకి నీటిని తరలించడం నిలిపివేశామని చెప్పారు. గంటకు 2 నుంచి మూడు లీటర్ల వరకు నీటి ఊట వస్తోందని వెల్లడించారు. అయినా భూగర్భకేంద్రానికి ఎలాంటి ప్రమాదం లేదని స్పష్టంచేశారు. నీటి ఊట వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేసి ఇంజనీర్లు పర్యవేక్షిస్తున్నారని వివరించారు.

కలెక్టర్‌కు చెప్పకుండా దుబాయ్‌కి..

- రాజన్న జిల్లా డీపీఆర్‌ఈ భూమేశ్వర్ సస్పెన్షన్
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ (డీపీఆర్‌ఈ) భూమేశ్వర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మంగళవారం సాయంత్రం ఆదేశాలు జారీచేశారు. కలెక్టర్ అనుమతి లేకుండా భూమేశ్వర్ మూడు రోజుల కిందట దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. అంతకుముందే ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ఓ కాంట్రాక్టు బిల్లు చెల్లింపుల విషయం వివాదాస్పదమైనట్లు తెలుస్తోంది. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖాపరమైన విషయం సెల్‌ఫోన్‌లో ఫొటోగా రావడంతో అధికారపార్టీ నేత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని కలెక్టర్ సీరియస్‌గా పరిగణించారు. దీనికితోడు అనుమతిలేకుండా దుబాయ్ వెళ్లడంతో భూమేశ్వర్‌ను సస్పెండ్ చేశారు. పంచాయతీరాజ్ ఈఎన్‌సీ అనుమతితో భూమేశ్వర్ దుబాయ్ వెళ్లగా.. జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇవ్వలేదని సమాచారం. కాగా, భూమేశ్వర్ స్థానంలో ఇన్‌చార్జి డీపీఆర్‌ఈగా సుదర్శన్‌రెడ్డిని నియమించారు. అయితే ఆయన బాధ్యతలు స్వీకరించకుండా.. ఫోన్ స్విచ్ ఆఫ్ చేసినట్లు చెపుతున్నారు. దీంతో కలెక్టరేట్‌లోని డీపీఆర్‌ఈ చాంబర్‌కు కలెక్టరేట్ ఏవో తాళం వేసినట్లు తెలిసింది. డీపీఆర్‌ఈ, జిల్లా కలెక్టర్ మధ్య వివాదం రాజన్న సిరిసిల్ల జిల్లా పంచాయతీరాజ్ శాఖలో చర్చనీయాంశమైంది.

అన్నదాతలకు అండగా..

డీఏపీపై వన్-టైమ్ స్పెషల్ ప్యాకేజీ పొడిగింపు

- 50 కిలోల డీఏపీ ఎరువు రూ.1,350కి లభ్యం
- రెండు పంటల బీమా పథకాలు మరో ఏడాది పొడిగింపు
- పథకాల అమలుకు రూ.824.77 కోట్లతో 'ఫండ్ ఫర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ'
- నిధుల కేటాయింపులు రూ.69,515.71 కోట్లకు పెంపు
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీ: రైతన్నలకు మరింత చేయూతనిచ్చేలా కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. డై అమ్మోనియం ఫాస్ఫేట్(డీఏపీ)పై అదనపు రాయితీ గడువును పొడిగించింది. 50 కిలోల డీఏపీ ఎరువు రూ.1,350కి లభించనుంది. ఈ రాయితీ వల్ల ప్రభుత్వంపై రూ.3,850 కోట్ల భారం పడనుంది. వాస్తవానికి అదనపు రాయితీ గడువు గత ఏడాది డిసెంబర్ 31న ముగిసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర కేబినెట్ బుధవారం సమావేశమైంది. డీఏపీపై వన్-టైమ్ స్పెషల్ ప్యాకేజీని పొడిగించాలన్న ప్రతిపాదనకు ఆమోద ముద్ర వేసింది. జనవరి 1వ తేదీ నుంచి తదుపరి ఉత్తర్వులు ఇచ్చేదాకా ఈ ప్యాకేజీ కింద టన్ను డీఏపీ రాయితీని రూ.3,500గా నిర్ణయించారు. గత ఏడాది ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ 31 దాకా అమల్లో ఉంది. డీఏపీ ధరను నియంత్రించడానికి ప్రభుత్వం రూ.2,625 కోట్లు ఖర్చు చేసింది. ఎరువుల ధరల భారం రైతులపై పడకుండా అదనపు రాయితీ గడువును మరోసారి పొడిగించినట్లు కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో వెల్లడించింది. తక్కువ ధరలకే రైతులకు డీఏపీ అందించాలన్నదే లక్ష్యమని స్పష్టంచేసింది. అంతర్జాతీయంగా ప్రతికూలతలు ఉన్నప్పటికీ మన దేశంలో 2024-25 రబీ, ఖరీఫ్ సీజన్లలో తగినంత డీఏపీ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. కేంద్ర కేబినెట్ భేటీ వివరాలను సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు తెలియజేశారు. రైతన్నలు 50 కిలోల డీఏపీని ఇకపై కూడా రూ.1,350కే కొనుగోలు చేయవచ్చని చెప్పారు. అదనపు భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని అన్నారు. డీఏపీపై వన్-టైమ్ స్పెషల్ ప్యాకేజీ రూ.3,850 కోట్లు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదించినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ అనిశ్చితి, యుద్ధాల వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో డీఏపీ ధరలు పెరుగుతున్నాయని గుర్తుచేశారు. 2014 నుంచి 2024 దాకా ఎరువుల రాయితీ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.11.9 లక్షల కోట్లు ఖర్చు చేసింది. 2004 నుంచి 2014 దాకా ఇచ్చిన దానికంటే(రూ.5.5 లక్షల కోట్లు) ఇది రెండు రెట్లు అధికం కావడం గమనార్హం. 28 గ్రేడ్ల ఫాస్ఫేటిక్ అండ్ పొటాసిక్ ఎరువులను ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తోంది.

రెండు పథకాలకు కేటాయింపులు పెంపు

రెండు పంటల బీమా పథకాల గడువును కేంద్రం పొడిగించింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై), రీస్ట్రక్చర్డ్ వెదర్ బేస్డ్ క్రాప్ ఇన్సూరెన్స్ స్కీమ్(ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్)ను మరో ఏడాది పొడిగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆర్థిక వ్యవహారాలపై కేబినెట్ కమిటీ సమావేశంలో బుధవారం ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగింది. రెండు బీమా పథకాల గడువును పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. 15వ ప్లానింగ్ కమిషన్ గడువు ప్రకారం 2025-26 వరకు ఇవి అమల్లో ఉంటాయి. ఈ రెండు బీమా పథకాల అమలు కోసం ప్రత్యేకంగా ఫండ్ ఫర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ(ఎఫ్‌ఐఏటీ) పేరిట ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడం విశేషం. ఈ నిధికి ప్రభుత్వం రూ.824.77 కోట్లు కేటాయించింది. రెండు పథకాలకు రైతుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. అందుకే వీటికి నిధుల కేటాయింపులు పెంచుతున్నట్లు వివరించారు. పంటల బీమా పథకాల్లో పంటల నష్టం అంచనా, క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను వేగంగా పూర్తిచేయడానికి ఫండ్ ఫర్ ఇన్నోవేషన్, టెక్నాలజీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాలసీల సంఖ్యలో పీఎంఎఫ్‌బీవై అనేది దేశంలో అతిపెద్ద బీమా పథకం. ప్రీమియంల విషయంలో మూడో అతిపెద్ద పథకం. 23 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలవుతోంది. పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ అమలుకు 2020-21 నుంచి 2024-25 దాకా రూ.66,550 కోట్లు కేటాయించగా, 2021-22 నుంచి 20253-26 వరకు ఈ కేటాయింపులను రూ.69,515.71 కోట్లకు పెంచారు.

కొత్త సంవత్సరంలో తొలి నిర్ణయం రైతులకే అంకితం

నూతన సంవత్సరంలో కేబినెట్ మొదటి సమావేశంలో తీసుకున్న మొదటి నిర్ణయాన్ని రైతు సోదరులకు, సోదరీమణులకు అంకితం చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ''పంటల బీమా పథకాలకు నిధుల కేటాయింపులు పెంచాలన్న ప్రతిపాదనను కేబినెట్ సమావేశంలో ఆమోదించాం. దీనివల్ల పంటలకు మరింత భద్రత లభిస్తుంది. పంటలకు నష్టం వాటిల్లినా రైతులు దిగులు పడాల్సిన అవసరం ఉండదు. డీఏపీపై వన్-టైమ్ ప్రత్యేక ప్యాకేజీ గడువును పెంచడంతో తక్కువ ధరకే ఎరువు లభిస్తుంది'' అని ప్రధానమంత్రి వివరించారు.

స్మార్ట్ పీపుల్ కావాలి

అమెరికా హెచ్1బీ వీసాల జారీని మరోసారి సమర్థించిన ట్రంప్

వాషింగ్టన్: స్థానిక అమెరికన్లకే అధిక ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్న రిపబ్లికన్ల ఎన్నికల హామీకి విరుద్ధంగా విదేశీయులకు హెచ్-1బీ వీసాల జారీని ప్రపంచ కుబేరుడు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ సహ సారథి వివేక్ రామస్వామి సమర్థిస్తున్న వేళ కాబోయే అమెరికా అధ్యక్షుడు మరోసారి హెచ్-1బీ వీసాలను సమర్థించారు. అమెరికాకు ఎల్లప్పుడూ కేవలం సమర్థవంతులైన వ్యక్తులే అవసరమని ట్రంప్ నొక్కి చెప్పారు. ''అమెరికాకు ఎల్లప్పుడూ సమర్థవంతులైన వ్యక్తులే కావాలని నేను ఆశిస్తా. స్మార్ట్ జనం మాత్రమే అగ్రరాజ్యంలో అడుగుపెట్టాలి. గతంలో ఎన్నడూ లేనంతగా అమెరికాలో ఉద్యోగ కల్పన జరగ బోతోంది. దేశానికి నైపుణ్యవంతమైన కార్మికుల అవసరం చాలా ఉంది'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా బుధవారం అమెరికాలోని మార్-ఏ-లాగో రిసార్ట్‌లో ట్రంప్‌ను స్థానిక మీడియా పలకరించింది. ''హెచ్-1బీ వీసాలపై నా అభిప్రాయం ఎన్నటికీ మారదు. నిపుణులే అమెరికాకు కావాలి'' అని స్పష్టం చేశారు. అమెరికా ప్రభుత్వ వ్యవస్థలో సమూల సంస్కరణలే లక్ష్యంగా ఏర్పాటైన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీకి సంయుక్త సారథులుగా నియమితులైన ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి హెచ్-1బీ వీసాల జారీని సమర్థిస్తూ వ్యాఖ్యానించడం, వారికి ఇప్పటికే ట్రంప్ మద్దతు పలకడం తెల్సిందే. అయితే అమెరికన్లకే తొలి ప్రాధాన్యం అంటూ ఎన్నికల్లో మెజారిటీ సాధించిన ట్రంప్ ఇప్పుడు మాట మార్చారని అమెరికన్ మీడియా చేస్తున్న వాదనలను ట్రంప్ తోసిపుచ్చారు. మొదట్నుంచీ తాను హెచ్-1బీకి అనుకూలమేనని పునరుద్ఘాటించారు. కేవలం అత్యంత నైపుణ్యమున్న విదేశీ ఉద్యోగులకే ఉపాధి కల్పిస్తూ స్థానిక సాధారణ, తక్కువ నైపుణ్యమున్న అమెరికన్లకు సరైన ఉద్యోగాలు దక్కకపోతే ఆగ్రహావేశాలు భవిష్యత్తులో పెరిగే ప్రమాదముందని రాజకీయ పండితుడు క్రెగ్ ఆగ్రనోఫ్ ఆందోళన వ్యక్తంచేశారు. ''ఐటీ రంగంలో ముఖ్యమైన ఉద్యోగాలన్నీ హెచ్-1బీ వీసాదారులకే తన్నుకు పోతే స్థానిక ఐటీ ఉద్యోగార్థుల పరిస్థితి ఏంటి?' అనే ప్రశ్నకు ఇంతకాలం ఏ నేతా సరైన సమాధానం చెప్పలేకపోతున్నారని క్రెగ్ వ్యాఖ్యానించారు. స్థానిక అమెరికన్లతో పోలిస్తే తక్కువ వేతనాలకే ఎక్కువ నైపుణ్యాలున్న విదేశీయులు లభిస్తుండటంతో అమెరికన్ కంపెనీలు హెచ్-1బీ వీసా విధానం ద్వారా విదేశీయులకే అధిక ప్రాధాన్యతనిచ్చి అమెరికాకు రప్పిస్తుండటం తెల్సిందే.



ఐరాస భద్రతామండలిలో తాత్కాలిక సభ్యదేశంగా పాక్

నేటి నుంచి రెండేళ్లపాటు సేవలు

ఇస్లామాబాద్: ఉగ్రవాదానికి పుట్టినిల్లుగా దుష్కీర్తిని మూటగట్టుకున్న దాయాదిదేశం పాకిస్తాన్ కీలకమైన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యదేశంగా చేరింది. రొటేషన్ పద్ధతిలో పాకిస్తాన్‌కు ఈ అవకాశం దక్కింది. రెండేళ్లపాటు పాకిస్తాన్ మండలిలో తాత్కాలిక సభ్యదేశంగా కొనసాగనుందని ఐరాస భద్రతామండలి బుధవారం ప్రకటించింది. ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పాకిస్తాన్ తన వంతుగా క్రియాశీలక పాత్ర పోషిస్తుందని ఐరాసలో పాకిస్తాన్ దౌత్యవేత్త మునీర్ అక్రమ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. దశాబ్దాల చరిత్ర ఉన్న భద్రతామండలిలో పాక్‌కు స్థానం లభించడం ఇది ఎనిమిదోసారి కావడం గమనార్హం. 193 దేశాలకు సభ్యత్వం ఉన్న ఐరాస సర్వ ప్రతినిధి సభలో జూన్‌లో ఓటింగ్ చేపట్టగా 182 దేశాలు ఓటింగ్‌లో పాక్‌కు అనుకూలంగా ఓటేశాయి. మూడింట రెండొంతుల మెజారిటీ(124 ఓట్లు) అవసరం కాగా అంతకుమించి ఓట్లు పడటం విశేషం. ''అంతర్గత సమస్యలు, యూరప్, పశ్చిమాసియా, ఆఫ్రికాలో యుద్ధాల వేళ మండలిలో మాకు దక్కిన సభ్యత్వాన్ని సద్వినియోగం చేసుకుంటాం'' అని అక్రమ్ అన్నారు. ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా భద్రతా మండలి ఏర్పడి దశాబ్దాలు దాటింది. ప్రారంభంలో 53 దేశాలతో ఏర్పడిన ఐక్యరాజ్యసమితిలో ప్రస్తుతం ఏకంగా 193 సభ్యదేశాలు ఉండటం విశేషం. ఐరాస భద్రతా మండలి సభ్యదేశాల సంఖ్య ప్రస్తుతం 15కు పెరిగింది. వీటిల్లో వీటో అధికారం కేవలం శాశ్వత సభ్యదేశాలైన అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్‌లకు మాత్రమే ఉంది. మిగతా పది తాత్కాలిక సభ్య దేశాలు రొటేషన్ పద్ధతిపై మారుతుండటం ఆనవాయితీగా వస్తోంది. 2025-26 రెండేళ్లకాలానికిగాను పాకిస్తాన్‌తోపాటు డెన్మార్క్, గ్రీస్, పనామా, సోమాలియాలు కొత్త సభ్యదేశాలుగా చేరాయి.

'ఎక్స్'లో మస్క్ పేరు మారింది

వాషింగ్టన్: టెస్లా అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ 'ఎక్స్' ఖాతాలో తన పేరు, ప్రొఫైల్ ఫొటో మార్చేశారు. పేరును 'కెకీయస్ మాక్సిమస్'గా అప్‌డేట్ చేశారు. అలాగే ప్రొఫైల్ ఫొటోగా వీడియో గేమ్ జాయ్‌స్టిక్ పట్టుకున్న కప్ప కనిపిస్తోంది. ఇదొక మీమ్ క్యారెక్టర్. క్రిప్టో కరెన్సీ మార్కెట్‌లో ఇటీవల కెకీయస్ మాక్సిమస్ పేరు ప్రముఖంగా తెరపైకి వచ్చింది. అతడి గురించి జనం విస్తృతంగా చర్చించుకున్నారు. గత ఏడాది డిసెంబర్ 27న క్రిప్టోకరెన్సీ ట్రేడింగ్‌లో లాభాలు సంపాదించాడు. అతడి సంపద విపరీతంగా పెరిగిపోయింది.

అందరికీ ఆనందం పంచాలని ఆశిస్తున్నా

ప్రజలకు ప్రధాని నూతన సంవత్సర శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ''కొత్త ఆశలు, ఆశయాలకు నెలవైన నూతన సంవత్సరానికి అందరూ ఆనందంగా స్వాగతం పలికారు. కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో నూతన సంతోషాలు, అవకాశాలు, విజయాలు, అంతులేని ఆనందాలను తీసుకురావాలని ఆశిస్తున్నా. ఆయురారోగ్యాలతో ఉండేలా కొత్త సంవత్సరం అందర్నీ దీవించనుంది'' అని మోదీ అన్నారు. ''సమష్టిగా ప్రయత్నించి గత సంవత్సరం మనందరం అనేక అద్భుత విజయాలు అందుకున్నాం. 2025 సంవత్సరంలోనూ మరింతగా కష్టపడి పనిచేసి వికసిత్ భారత్ దిశగా వడివడిగా అడుగులు వేద్దాం'' అని అన్నారు. గత ఏడాది కాలంలో భారతదేశం సాధించిన పురోగతి, ఐక్యత, అభివృద్ధి ప్రస్థానం వైపు వేసిన అడుగులను వివరిస్తూ మోదీ ఈ సందర్భంగా ఓ వీడియోను 'ఎక్స్' ఖాతాలో పోస్ట్‌చేశారు.

గ్రీటింగ్స్ చెప్పిన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి

మరింత సమ్మిళితమైన, సుస్థిరమైన భారత్‌తో పాటు ప్రపంచ శాంతి కోసం దేశ ప్రజలంతా ఉమ్మడిగా కష్టపడి పనిచేయాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం తన నూతన ఏడాది సందేశంలో పిలుపునిచ్చారు. ''అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. 2025 ఏడాది మీ జీవితాల్లో కొత్త వెలుగులు తేవాలని, నూతనోత్సాహం, సామరస్యం, సంతోషం వెల్లివిరియాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నా'' అని ఆమె అన్నారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ సైతం ప్రజలకు న్యూ ఇయర్ గ్రీటింగ్స్ చెప్పారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సైతం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



'రక్షణ'లో సంస్కరణలు

- త్రివిధ దళాల సమీకృత అధునాతన యుద్ధ కమాండ్లు
- ఆయుధ కొనుగోళ్లు సరళతరం
- రక్షణ శాఖ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: 2025ను రక్షణ సంస్కరణల ఏడాదిగా కేంద్రం ప్రకటించింది. త్రివిధ దళాల ఆధునీకరణ, మెరుగైన సమన్వయం, నిరంతర యుద్ధ సన్నద్ధతతో పాటు ఆధునిక పరిజ్ఞానాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవడం తదితరాలే లక్ష్యంగా నూతన సంవత్సరంలో రక్షణ శాఖ అత్యంత కీలకమైన నిర్ణయాలు తీసుకుంది. ఇందుకోసం 9 సూత్రాలతో కూడిన సమగ్ర రక్షణ సంస్కరణల ప్రణాళికను రూపొందించింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సారథ్యంలో బుధవారం జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో ఇందుకు ఆమోదముద్ర పడింది. త్రివిధ దళాధిపతులు, రక్షణ శాఖ ఉన్నతాధికారులు తదితరులు భేటీలో పాల్గొన్నారు. 21వ శతాబ్దపు సవాళ్లను దీటుగా ఎదుర్కొంటూ దేశ భద్రతకు, సార్వ భౌమత్వ పరిరక్షణకు పెద్దపీట వేసేలా కనీవినీ ఎరగని రీతిలో త్రివిధ దళాలను సన్నద్ధం చేసేందుకు ఈ సంస్కరణలు బలమైన పునాదులు వేస్తాయని రాజ్‌నాథ్ వెల్లడించారు.

త్రివిధ దళాల సంయుక్త కమాండ్

ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ సామర్థ్యాలను మరింతగా ఏకీకృతం చేయడం ద్వారా యుద్ధ సమయాల్లో, ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో రక్షణ వనరులను గరిష్ట స్థాయిలో వినియోగించుకోవాలని రక్షణ శాఖ భేటీ అభిప్రాయపడింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా ఎక్కడికక్కడ సంయుక్త సైనిక కమాండ్లు ఏర్పాటు చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రతి కమాండ్‌లోనూ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌తో కూడిన యూనిట్లు ఉంటాయి. ఆయా ప్రాంతాల్లోని భద్రతాపరమైన సవాళ్లు తదితరాలను తిప్పికొట్టేందుకు పూర్తి సమన్వయంతో సాగుతాయి. ఈ త్రివిధ దళాలు ఇప్పటిదాకా విడివిడిగా కమాండ్ల కింద వేటికవే స్వతంత్రంగా పని చేస్తూ వస్తున్నాయి. అవి పరస్పరం మరింత సమన్వయంతో పని చేయాల్సిన అవసరం చాలా ఉందని భేటీ అభిప్రాయపడింది.

9 సూత్రాల రక్షణ సంస్కరణ ప్రణాళికలో ముఖ్యాంశాలు...

- → దేశీయ రక్షణ సామర్థ్యం ప్రపంచ స్థాయి ప్రమాణాలను అధిగమించే దిశగా నిరంతర కృషి. అందుకోసం బలగాల అవసరాలను ఎప్పటి కప్పుడు గుర్తించడం, వాటిని యుద్ధ ప్రాతిపదికన తీర్చడం.
- → ఇందుకోసం రక్షణ సంబంధిత కొనుగోళ్లు, ఆయుధ సేకరణ ప్రక్రియలను వీలైనంతగా సరళతరం చేయడం, వాటిలో అనవసర జాప్యాలను నివారించడం.
- → ప్రపంచవ్యాప్తంగా పలు ఆధునిక సైనిక శక్తుల్లోని అత్యుత్తమ విధానాలను అందిపుచ్చుకోవడం, వాటిని మన పరిస్థితులకు తగ్గట్టుగా తీర్చిదిద్దుకోవడం
- → భారతీయ సంస్కృతి, ఆలోచనా ధోరణులను గర్వకారణంగా చర్యలు చేపట్టడం
- → సైబర్, స్పేస్‌తో పాటు ఏఐ, మెషీన్ లెర్నింగ్, హైపర్‌సోనిక్, రోబోటిక్స్ వంటి నూతన టెక్నాలజీలకు పెద్దపీట
- → రక్షణ రంగంలో భావి సంస్కరణలకు మరింతగా ఊతం. తద్వారా భద్రతా దళాలను మరింత శక్తిమంతంగా, సాంకేతికంగా సాటి లేని శక్తిగా మార్చడం. భిన్నమైన డొమైన్లలో సమగ్ర కార్యకలాపాలను అత్యంత సమర్థంగా నిర్వహించగలిగేలా తీర్చిదిద్దడం.
- → రక్షణ, పౌర, ప్రైవేటు రంగాల మధ్య మరింతగా పరిజ్ఞాన బదిలీకి వీలు కల్పించడం. వ్యాపార సరళీకరణ కోసం ప్రభుత్వ- ప్రైవేట్ భాగస్వామ్యాలకు ప్రోత్సాహం.
- → రాబోయే కొన్నేళ్లలో రక్షణ ఎగుమతుల్లో భారత్‌ను ప్రపంచంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దడం. విదేశీ తయారీదారులతో భారత రక్షణ పరిశ్రమ సంయుక్తంగా పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టేందుకు చేయూత.
- → మాజీ సైనికుల సంక్షేమంపై మరింత దృష్టి. వారి అనుభవానికి పెద్దపీట.

భారత్, పాక్ మధ్య అణు స్థావరాల జాబితా మార్పిడి

న్యూఢిల్లీ: పొరుగుదేశంలోని అణుకేంద్రంపై మరో దేశం ఉద్దేశపూర్వకంగా దాడిచేయకూడదన్న ఒప్పందానికి కట్టుబడి భారత్, పాక్‌లు తమ అణుస్థావరాల చిరునామాల జాబితాను పరస్పరం ఇచ్చి పుచ్చుకున్నాయి. మూడు దశాబ్దాలకుపైబడిన ఒడంబడికను గౌరవిస్తూ ఇరు దేశాలు జాబితాను మార్చుకున్నాయని భారత విదేశాంగ శాఖ బుధవారం వెల్లడించింది. న్యూఢిల్లీ, ఇస్లామాబాద్‌లలోని దౌత్య మార్గాల ద్వారా ఏకకాలంలో బుధవారం ఈ జాబితా మార్పిడి కార్యక్రమం జరిగిందని పేర్కొంది. కశ్మీర్ సమస్య, సీమాంతర ఉగ్రవాదంతో పొరుగుదేశాల మధ్య వైరం ఉన్నాసరే మార్పిడి తంతు జరగడం విశేషం. ''అణు కేంద్రాలు, స్థావరాలపై దాడులు చేసుకోకూడదని 1988 డిసెంబర్ 31వ తేదీన ఇరుదేశాలు సంతకాలు చేసుకున్నాయి. ఈ ఒప్పందం 1991 జనవరి 27వ తేదీన అమల్లోకి వచ్చింది. అప్పట్నుంచి ప్రతి సంవత్సరం తాజా జాబితాను మార్చుకుంటున్నారు. 1992 జనవరి ఒకటో తేదీన తొలిసారిగా ఈ కార్యక్రమం జరిగింది. జాబితా మార్చుకోవడం ఇది 34వ సారి'' అని విదేశాంగ శాఖ తెలిపింది.

రష్యాకు ఉక్రెయిన్ గ్యాస్ షాక్

- తమ భూభాగం గుండా గ్యాస్ సరఫరా ఒప్పందం పొడిగింపునకు 'నో'
- యూరప్‌కు గ్యాస్ సరఫరా బంద్

మాస్కో/కీవ్: రష్యా నుంచి చౌకగా గ్యాస్‌ను సరఫరా చేసుకుంటూ లబ్ధి పొందుతున్న యూరప్ దేశాలకు కొత్త కష్టాలు వచ్చిపడే అవకాశం కనిపిస్తోంది. రష్యా నుంచి తమ భూభాగం నుంచి గ్యాస్ సరఫరాను ఉక్రెయిన్ నిలిపివేసింది. ఈ విషయంలో రష్యాతో కుదిరిన ఐదేళ్ల ఒప్పందం బుధవారం ముగిసింది. ఇకపై తమ భూభాగం నుంచి గ్యాస్ సరఫరాను అనుమతించే ప్రసక్తే లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తేల్చిచెప్పారు. ఒకవైపు ఉక్రెయిన్ ప్రజల రక్తాన్ని పీలుస్తూ మరోవైపు అదనపు బిలియన్ డాలర్లు రష్యా సంపాదిస్తామంటే అనుమతించబోమని అన్నారు. మూడేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో ఇదొక కీలక పరిణామం అని చెప్పొచ్చు. ఉక్రెయిన్ గుండా ఐరోపా ఖండానికి గ్యాస్ సరఫరా ఆగిపోవడాన్ని రష్యాపై మరో విజయంగా పోలాండ్ ప్రభుత్వం అభివర్ణించింది. రష్యా 1991 నుంచి ఉక్రెయిన్ భూభాగం ద్వారా యూరప్‌కు గ్యాస్ సరఫరా చేస్తోంది. ఈ మేరకు ఉక్రెయిన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. రష్యాతో యుద్ధం నేపథ్యంలో ఒప్పందం పొడిగింపునకు ఉక్రెయిన్ అంగీకరించలేదు. ఒప్పందం ముగిసిపోవడం, రష్యా నుంచి సహజవాయువు సరఫరా ఆగిపోవడం చరిత్రాత్మక ఘట్టమని ఉక్రెయిన్ ఇంధన శాఖ స్పష్టంచేసింది.

- → గ్యాస్ సరఫరా ఒప్పందాన్ని ఉక్రెయిన్ పొడిగించకపోవడం ఊహించిన పరిణామమే. దీనివల్ల యూరప్ దేశాలకు ఆర్థికంగా కొంత నష్టం వాటిల్లక తప్పదు. రష్యా నుంచి చౌకగా వచ్చే గ్యాస్ స్థానంలో ఇకపై ఖరీదైన గ్యాస్‌ను ఇతర దేశాల నుంచి కొనుక్కోవాల్సి ఉంటుంది.



- → యూరప్ దేశాలకు గ్యాస్ సరఫరా ఇప్పటికే తగ్గుముఖం పట్టింది. దీనివల్ల రష్యాకు నష్టం జరుగుతోంది. రష్యా గ్యాస్ దిగ్గజం గాజ్‌ప్రోమ్ గత ఏడాది 6.9 బిలియన్ డాలర్లు నష్టపోయింది. ఇలా జరగడం గత 20 ఏళ్లలో ఇదే మొదటిసారి.
- → రష్యా నుంచి ఉక్రెయిన్ మార్గం కాకుండా టర్క్ స్ట్రీమ్ లైన్ కూడా ఉంది. ఇది తుర్కియే, బల్గేరియా, సెర్బియా, హంగేరీ నుంచి యూరప్‌నకు చేరుతోంది.
- → యూరప్‌లో గ్యాస్ ధరలు పెరిగే అవకాశం ఉందని యూరేషియా గ్రూప్ ఎనర్జీ హెడ్ హెనింగ్ గ్లోస్టీన్ చెప్పారు. గ్యాస్ ధరల భారంతో విద్యుత్ చార్జీలు అమాంతం రిగిపోతాయని ఆందోళన వ్యక్తంచేశారు. రష్యా గ్యాస్‌తో యూరప్ దేశాలు విద్యుత్ ఉత్పత్తి చేసుకుంటున్నాయని పేర్కొన్నారు.
- → 2022లో ఉక్రెయిన్‌పై దండయాత్ర ప్రారంభం కాకముందు యూరోపియన్ యూనియన్ దేశాలకు అతిపెద్ద గ్యాస్ సరఫరాదారు రష్యా. 2021లో ఆయా దేశాలు తమ అవసరాల్లో 40 శాతం గ్యాస్‌ను రష్యా నుంచే పైప్‌లైన్ ద్వారా దిగుమతి చేసుకున్నాయి. యుద్ధం మొదలైన తర్వాత 2023 నాటికి అది 8 శాతానికి పడిపోయింది.
- → అయితే యూరప్‌కు ఇప్పటికిప్పుడు వచ్చిన నష్టమేమీ లేదని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు.

వేడుకల వేళ ఉన్మాదం

అమెరికాలో ఉగ్రదాడి?

- న్యూఇయర్ సంబరాల్లో జనంపైకి దూసుకొచ్చిన వాహనం
- విచక్షణారహితంగా కాల్పులు
- 10 మంది దుర్మరణం, 35 మందికి గాయాలు
- ఆగంతకుడిని హతమార్చిన పోలీసులు

న్యూ ఆర్లీన్స్: అమెరికాలో నూతన సంవత్సరం మొదలైన తొలి క్షణాలే కొందరికి ఆఖరి క్షణాలయ్యాయి. నడివీధిలో నూతన సంవత్సర సంబరాల్లో మునిగిపోయిన జనంపైకి ఓ ఆగంతకుడు ట్రక్కుతో ఢీకొట్టి, తర్వాత విచక్షణారహితంగా కాల్పులు జరిపి పది మంది ప్రాణాలు తీశాడు. ఈ కాల్పుల ఘటనలో మరో 35 మంది గాయపడ్డారు. వెంటనే మెరుపువేగంతో స్పందించిన పోలీసులు ఆ ఆగంతకుడిని హతమార్చారు. లూసియానా రాష్ట్రంలోని న్యూ ఆర్లీన్స్ సిటీలో మిసిసిప్పీ నదీతీరంలోని ఫ్రెంచ్ క్వార్టర్ ప్రాంత బార్బన్ వీధి ఈ దారుణానికి వేదికైంది. జనవరి ఒకటో తేదీ తెల్లవారుజామున 3.15 నిమిషాలకు ఈ ఘోరం జరిగింది. ఇది ఉగ్రదాడి అని, పేలుడు పదార్థాలు లభించాయని సిటీమేయర్ లాటోయా కాంట్రెల్ ప్రకటించారు. కాల్పులు జరిపింది 42 ఏళ్ల షంషుద్దీన్ జబ్బార్‌గా పోలీసులు భావిస్తున్నారు.ఘటనాస్థలిలో ఒక హ్యాండ్ గన్, ఏఆర్ రకం రైఫిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అసలేం జరిగింది?

ఘటన జరగడానికి ముందు బార్బన్ వీధిలో స్థానికులు గుమిగూడి కొత్త ఏడాదివేడుకలు చేసుకుంటున్నారు. సమీప సూపర్‌డోమ్ స్టేడియంలో జార్జియా, నోట్రే డామ్ జట్ల మధ్య షుగర్ బౌల్ కాలేజ్ ఫుట్‌బాల్ ప్లేఆఫ్ మ్యాచ్ జరిగింది. ఇందుకోసం వచ్చిన ప్రేక్షకులు వీళ్లకు జతకావడంతో ఆ ప్రాంతమంతా జనంతో కిక్కిరిసిపోయింది. అదే సమయంలో ఎక్కువ మందిని చంపేయాలన్న ప్రతీకారంతో ఆగంతకుడు పికప్ ట్రక్‌ను వేగంగా ఎక్కువ మందిపై పోనిచ్చాడు. జనం మధ్యలో ఇరుక్కుని ట్రక్కు పోయాక కిందకు దిగిన ఆగంతకుడు పాడవాటి రైఫిల్‌తో విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. దీంతో 10 మంది చనిపోగా, 35 మంది గాయాలపాలయ్యారు. వేడుకల్లో జనాన్ని అదుపుచేసేందుకు అక్కడే ఉన్న పోలీసులు ఈ దాడిని చూసి హతాశులయ్యారు. వెంటనే తేరుకుని ఆగంతకుడిపైకి కాల్పులు జరిపారు. పోలీసులపైకి అతను గురిపెట్టాడు. ఈ కాల్పుల్లో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. పోలీసు కాల్పుల్లో ఆగంతకుడు అక్కడిక్కడే మరణించాడు. వీలైనంత ఎక్కువ మందిని ట్రక్కుతో ఢీకొట్టి చంపేయాలన్న పక్కా ప్రణాళికతో ఆగంతకుడు దానిని నడుపుకుంటూ వచ్చాడని సిటీ పోలీస్ సూపరింటెండెంట్ అన్నారు.



సంఘటనా స్థలంలో పోలీసులు

జనం ఎగిరిపడ్డారు

అత్యంత వేగంగా ట్రక్కు ఢీకొనడంతో జనంలో కొందరు ఎగిరిపడ్డారని ప్రత్యక్ష సాక్షి 22 ఏళ్ల కెవిన్ గార్సియా చెప్పారు. ''జనం మీదకు ట్రక్కు దూసుకొచ్చి తొక్కుకుంటూ పోతోంది. కొందరు బలంగా ఢీకొనడంతో ఎగిరిపడ్డారు. ఒకరి మృతదేహం ఎగిరి నా మీద పడింది'' అని గార్సియా చెప్పారు. ''నైట్‌క్లబ్ నుంచి బయటికొచ్చా. అప్పటికే జనం పరుగెడుతున్నారు. ఇక్కడి నుంచి పారిపో అని ఒకాయన హెచ్చరించాడు. అప్పటికే అక్కడ కొన్ని మృతదేహాలు రక్తపుమడుగులో పడి ఉన్నాయి. గాయపడిన వారికి చుట్టుపక్కల వాళ్లు అక్కడే ప్రాథమిక చికిత్స చేశారు. క్షతగాత్రులను దగ్గర్లోని ఐదు ఆస్పత్రులకు తరలించారు'' అని విట్ డేవిస్ అనే మరో ప్రత్యక్ష సాక్షి చెప్పారు. ''వాహనాలను దాడులకు మారణాయుధాలుగా వాడుతున్న దారుణశైలి మొదలైంది. దీన్నుంచి ఎలా తప్పించుకోవాలో అర్థంకావట్లేదు'' అని మరొకరు వాపోయారు.

బీజేపీ కుట్రలను సమర్థిస్తున్నారా?

మోహన్ భగవత్‌కు కేజ్రీవాల్ లేఖ

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, బీజేపీ నేతల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. ఎన్నికల్లో నెగ్గడానికి బీజేపీ నాయకులు విచ్చలవిడిగా డబ్బులు పంచుతున్నారని, పూర్వాంచల్ ప్రజల ఓట్లను, దళితుల ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని కేజ్రీవాల్ ఆరోపిస్తుండగా, ఆయనలో ఓటమి భయం కనిపిస్తోందని, అందుకే అవాకులు చెవాకులు పేలుతున్నారని బీజేపీ శ్రేణులు మండిపడుతున్నాయి. అరవింద్ కేజ్రీవాల్ తాజాగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్ఎస్) అధినేత మోహన్ భగవత్‌కు లేఖ రాశారు. డిసెంబర్ 30వ తేదీతో రాసిన ఈ లేఖలో పలు ప్రశ్నలు సంధించారు. ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా బీజేపీ చేస్తున్న తప్పుడు పనులను మీరు సమర్థిస్తున్నారా? అని నిలదీశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ఆర్‌ఎస్ఎస్ ప్రచారం చేస్తుందా? అని భగవత్‌ను ప్రశ్నించారు. దీనిపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని అన్నారు. ఓటర్లకు బహిరంగంగా డబ్బులు పంచడం, కొందరు ఓటర్ల పేర్లను తొలగించడం మీకు సమ్మతమేనా? అని అడిగారు. దేశాన్ని బలహీనపర్చడానికి బీజేపీ కుట్రలు పన్నుతుంటే మీరెందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు.

సాక్షి హైదరాబాద్

గురువారం, 2, జనవరి, 2025



టెన్త్ @ 80 డేస్

పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు అధికారులు చేపట్టారు. వార్షిక పరీక్షలకు మరో 80 రోజుల గడువు ఉండటంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. -10లో



సంతోషం.. సంపూర్ణ బలం

సంపాదనకు కొదవ లేకున్నా, సరదాలెన్నో అందుబాటులో ఉన్నా సంతోషం మాత్రం అల్లంత దూరంలో అందీ అందనట్టు ఊరిస్తూనే ఉంది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0/17.0

నగరంలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు అలుముకుంటుంది. గరిష్టంగా 30, కనిష్టంగా 17 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద..

దేవాలయాలు కిటకిలాడాయి. పర్యాటక ప్రదేశాలు, పార్కులు కిక్కిరిసిపోయాయి. హుస్సేన్ సాగర్ తీరం జన ప్రవాహాన్ని తలపించింది. నూతన సంవత్సరం వేడుకలతో బుధవారం నగర వాసులు ఆహ్లాదకర వాతావరణంలో గడిపారు. ఆబాల గోపాలం ఆనందంగా సేదతీరారు. బిర్లా టెంపుల్, బల్కంపేట ఎల్లమ్మ, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి తదితర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఏడాదంతా శుభాలు కలగాలని ఇష్ట దైవాన్ని వేడుకున్నారు.



బిర్లా టెంపుల్‌కు పోటెత్తిన భక్తులు

వేడుకగా.. వేడుకుని..



లుంబినీ పార్కులో..



శిల్పారామంలో సందర్శకులు

ఆరంభం అదిరింది!

ప్రశాంతంగా ప్రారంభమైన కొత్త ఏడాది

- 'డిసెంబర్ 31' బందోబస్తు విజయవంతం
- తనిఖీల్లో చిక్కిన 2,646 మంది డ్రంక్ డ్రైవర్లు
- పంజగుట్ట పరిధిలో చిక్కిన వ్యక్తికి 550 కౌంట్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ... ఈ 'ముగ్గురు పోలీసులు' ఏర్పాటు చేసిన బందోబస్తు, విధించిన ఆంక్షలు ఫలితాలనిచ్చాయి. కొత్త సంవత్సర స్వాగత వేడుకలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా జరిగాయి. మొత్తమ్మీద ఒక్క ప్రమాదం కూడా నమోదు కాకుండా జీరో యాక్సిడెంట్ నైట్‌గా చేయడంలో అధికారులు సఫలీకృతమయ్యారు. స్థానిక పోలీసులతో పాటు అదనపు బలగాలూ మంగళవారం రాత్రంతా విధుల్లోనే ఉన్నాయి. నగరంలోని కీలక ప్రాంతాలతో పాటు ఇన్నర్/ఔటర్ రింగ్ రోడ్‌ల్లోనూ నిరంతరం ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించారు. వేడుకలు నిర్వహించే, జరుపుకొనేవారు సైతం ఇతరులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నారు. మద్యం తాగి వాహనాలు పడపడం, దురుసుగా డ్రైవింగ్ చేయడం, మితిమీరిన వేగం, పరిమితికి మంచి వాహనాలపై ప్రయాణించడం తదితర ఉల్లంఘనలపై ట్రాఫిక్ విభాగాల అధికారులు ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహించారు. మొత్తమ్మీద మూడు కమిషనరేట్లలోనూ కలిపి 2,646 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు.

కొన్నింటికి మినహాయింపు..

గతంలో జరిగిన ప్రమాదాలు, ఘటనల్ని దృష్టిలో పెట్టుకున్న పోలీసులు ముందు జాగ్రత్తగా దాదాపు అన్ని ఫ్లైఓవర్లను మూసేశారు. ప్రత్యామ్నాయ మార్గం లేని కారణంగా బేగంపేట, డబీర్‌పురా వంటి కొన్ని ఫ్లైఓవర్లకు మాత్రమే మినహాయింపు ఇచ్చారు. పీవీ నరసింహారావు మార్గ్, ఎన్టీఆర్ మార్గ్‌లతో పాటు హుస్సేన్‌సాగర్ చుట్టుపక్కల వాహనాలను అనుమతించలేదు. పీవీ ఎక్స్‌ప్రెస్ వేలోనూ కొన్ని ఆంక్షలు కొనసాగాయి. కమిషనరేట్లలోని ప్రధాన రహదారుల్లో బారికేడ్లు ఏర్పాటు చేసిన అధికారులు వాహన చోదకుల వేగాన్ని నియంత్రించారు. పోలీసులు, ట్రాఫిక్ విభాగం అధికారులు తీసుకున్న చర్యల ఫలితంగా డిసెంబర్ 31 ప్రశాంతంగా పూర్తయింది. బుధవారం తెల్లవారుజాము 2 గంటల తర్వాత ఫ్లైఓవర్లు, 3 గంటలకు ట్యాంక్‌బండ్, 5 గంటలకు నెక్లెస్‌రోడ్, ఓఆర్ఆర్‌ల్లోకి సాధారణ ట్రాఫిక్‌ను అనుమతించారు.

చుక్కేసి.. చిక్కేశారు!

పోలీసు విభాగం ఎన్ని సూచనలు చేసినా.. ఎంతగా హెచ్చరించినా.. మందుబాబులు మాత్రం మారలేదు. డిసెంబర్ 31 నేపథ్యంలో మంగళవారం రాత్రి మద్యం తాగి అనేక మంది వాహనాలు నడిపేశారు. ఈ నేపథ్యంలో మూడు కమిషనరేట్లలో నిర్వహించిన తనిఖీల్లో మొత్తం 2,646 కేసులు నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా హైదరాబాద్ కమిషరేట్ పరిధిలోనే 1,184 మంది చిక్కారు. సైబరాబాద్‌లో 839 మంది, రాచకొండలో 619 మంది పట్టుబడ్డారు. వీరిలో ద్విచక్ర వాహనచోదకులే ఎక్కువ మంది ఉన్నారు. మంగళవారం రాత్రి 9 నుంచి బుధవారం తెల్లవారుజాము 5 గంటల వరకు ఈ చెకింగ్స్ నడిచాయి. చిక్కిన మందుబాబుల నుంచి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీరికి కుటుంబం సభ్యుడు లేదా సంరక్షకుడి సమక్షంలో ట్రాఫిక్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్స్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆపై వీరిని న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు. 100 ఎంఎల్ రక్తంలో 30 ఎంజీ కంటే ఎక్కువ ఆల్కహాల్ ఉంటే దాన్ని డ్రంక్ డ్రైవింగ్‌గా పరిగణిస్తారు. ఈ పరిమాణాన్నే సాంకేతికంగా బ్లడ్ ఆల్కహాల్ కౌంట్ (బీఏసీ) అంటారు. పంజగుట్ట ట్రాఫిక్ ఠాణా పరిధిలోని వెంగళ్‌రావునగర్ పార్క్ దగ్గర మంగళవారం రాత్రి 10.53కు చిక్కిన ద్విచక్ర వాహన చోదకుడికి ఏకంగా ఈ కౌంట్ 550 వచ్చింది.



మంగళవారం అర్ధరాత్రి..

చిత్రమైన 'కొత్త' షరతు

- డ్రంకన్ డ్రైవ్ కేసులో యువకుడు, యువతికి విభిన్నమైన బెయిల్
- 15 రోజుల పాటు 2 గంటలు స్టేషన్ డ్యూటీ చేయాలని జడ్జి తీర్పు

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు నడిపి రోడ్డు ప్రమాదానికి కారకుడైన ఓ యువకుడితో పాటు ఆయన స్నేహితురాలికి న్యాయమూర్తి విభిన్నమైన షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. వెస్ట్‌మారేడుపల్లి సుమన్ హౌసింగ్ కాలనీలో నివసించే తీగుళ్ల దయాసాయిరాజ్ (27), ఆయన స్నేహితురాలు గత నెల 27న ఫిలింనగర్ సమీపంలోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగిన ఓ విందులో మద్యం తాగారు. అర్ధరాత్రి 2.30 గంటలకు దయాసాయిరాజ్ తన బెంజ్ కారు (టీఎస్ 10ఎఫ్ఎఫ్ 9666)లో స్నేహితురాలిని పక్కన కూర్చోబెట్టుకుని మితిమీరిన వేగంతో వస్తున్నాడు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-45 వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో డివైడర్‌తో పాటు విద్యుత్ స్తంభం ధ్వంసమయ్యాయి. కారులోని ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో వీరిద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని వీరిద్దరినీ గత నెల 28న న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. వీరికి న్యాయమూర్తి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ప్రతిరోజూ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి రిసెప్షన్‌లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఫిర్యాదుదారులకు, బాధితులకు నవ్వుతూ స్వాగతం పలకాలని తీర్పునిచ్చారు. రిసెప్షన్‌లో కూర్చొనే రెండు గంటల పాటు ముఖానికి మాస్క్ కూడా ధరించవద్దని షరతు విధించారు. బెయిల్ మంజూరైన నాటి నుంచి 15 రోజుల పాటు రోజూ ఠాణాకు రావాలని, రిసెప్షన్‌లో కూర్చోవాలని, ఆ తర్వాత పోలీసుల సమక్షంలో హాజరైనట్లుగా సంతకం చేయాలని తీర్పునిచ్చారు. దీంతో దయాసాయిరాజ్‌తో పాటు ఆయన స్నేహితురాలు రోజూ ఠాణాకు వచ్చి రిసెప్షన్‌లో కూర్చుంటున్నారు.

వాటర్.. బెటర్!

120 డేస్ 'మైక్రో వాటర్ మానిటరింగ్ డ్రైవ్'

ఈ నెలలో అడ్వాన్స్‌గా 20 రోజుల ప్రీ సమ్మర్ వాటర్ సర్వే

- మరో 20 రోజులు సమస్య పరిష్కారం దిశగా చర్యలు
- ప్రతి ఫిల్లింగ్ స్టేషన్‌కు నోడల్ అధికారి నియామకం
- రాత్రిపూట బల్క్, కమర్షియల్ ట్యాంకర్ల సరఫరా
- జలమండలి ముందస్తు వేసవి సూక్ష్మస్థాయి కార్యాచరణ ప్రణాళిక



సాక్షి, సిటీబ్యూరో: వచ్చే వేసవిని సమర్థంగా ఎదుర్కొనేందుకు 'అడ్వాన్స్ సమ్మర్ స్పెషల్ యాక్షన్ ప్లాన్- 2025' కు జలమండలి సిద్ధమైంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని సూక్ష్మస్థాయిలో తాగునీటి సమస్యపై పర్యవేక్షణ కోసం ఫిబ్రవరి 15 నుంచి జూన్ 15 వరకు '120 డేస్ మైక్రో వాటర్ మానిటరింగ్ డ్రైవ్' నిర్వహించాలని నిర్ణయించింది. అంతకు ముందు క్షేత్రస్థాయి పరిస్థితిపై సమగ్ర పరిశీలన కోసం ఈ నెల 5 నుంచి 20 రోజుల పాటు 'ప్రీ సమ్మర్ వాటర్ సర్వే'కు శ్రీకారం చుట్టనుంది. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఏ మేరకు ఉంటుంది? ఏయే ప్రాంతాల్లో సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని ముందస్తుగానే గుర్తించనుంది. సెక్షన్ మేనేజర్ పరిధిలో పరిస్థితులపై సమగ్రంగా పరిశీలించి వేసవిలో నీటి ఎద్దడిపై అంచనాపై నివేదికలు రూపొందించేలా చర్యలు చేపట్టనుంది. ఇందుకోసం ఈ నెల మొదటి వారంలో ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించి ప్రీ సమ్మర్ వాటర్ సర్వేపై దశాదిశ నిర్దేశించనుంది.

అవసరాలు పెరిగినా..

గత పదేళ్లలో దేశం నలు మూలల నుంచి వలసలు పెరగడంతో హైదరాబాద్ నగరంలో 30 శాతం జనాభా పెరిగింది. మరోవైపు జలమండలి పరిధి విస్తరించింది. నల్లా కనెక్షన్లు అదే స్థాయిలో పెరిగాయి. ప్రధాన జలాశయాల్లో తాగునీటి కేటాయింపు మాత్రం పెరగలేదు. ప్రస్తుతం పదేళ్ల నాటి కేటాయింపుల నీటి సరఫరా జరుగుతోంది. వేసవిలో అవసరమైతే ఎప్పటి మాదిరిగానే అదనంగా పది ఎంజీడీలు పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. అవసరాలు పెరిగినా.. కేటాయింపులు పెరగక పోవడంతో ఉన్న నీటిని సర్దుబాటు చేసుకునేందుకు జలమండలి వృథా నీటిపై దృష్టి సారించింది. ఈ ఏడాది అధిక వర్షపాతం నమోదైనా.. భూగర్భ జలాలు పలు ప్రాంతాల్లో ఆశాజనకంగా పెరగలేదు. ఈ నేపథ్యంలో నీటికి భారీగా డిమాండ్ ఎదురయ్యే అవకాశం ఉంటుందని జలమండలి అంచనా వేసింది. గత వేసవిలో ప్రధాన జలాశయాల్లో నీటి మట్టాలు డెడ్‌స్టోరేజీకి చేరడంతో అత్యవసర పంపింగ్ తప్ప లేదు. ఈసారి అలాంటి సమస్య పునరావృతం కాకుండా చర్యలకు ఉపక్రమించింది.

ట్యాంకర్ల బుకింగ్ సర్దుబాటు

వేసవిలో డిమాండ్‌కు తగ్గ ట్యాంకర్లను సకాలంలో సరఫరా చేసేలా జలమండలి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోంది. ఒక ఫిల్లింగ్ స్టేషన్‌లో డిమాండ్ అధికంగా ఉండి.. దగ్గరలోని మరో ఫిల్లింగ్ స్టేషన్‌లో డిమాండ్ తక్కువగా ఉంటే అక్కడికి క్యాన్ నంబర్ ట్రాన్స్‌ఫర్‌తో సర్దుబాటు చేసేలా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తోంది.

మరోవైపు ఫిల్లింగ్ స్టేషన్ నుంచి ట్యాంకర్ ట్రిప్ కూడా అక్రమంగా బయటకు వెళ్లకుండా కట్టడి చేసేందుకు బాధ్యులైన ఆపరేటర్‌పై భారీ జరిమానాలు విధించాలని నిర్ణయించింది. ప్రతి ఫిల్లింగ్ స్టేషన్ పనితీరుపై పర్యవేక్షణ కోసం డీజీఎం స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించనుంది. ప్రతి ట్యాంకర్ బుకింగ్ ఎంసీసీ ద్వారానే జరిగే విధంగా చర్యలు చేపట్టనుంది.

రాత్రి పూట ప్రత్యేక షిఫ్ట్

రాతి వేళల్లో కమర్షియల్, బల్క్ వినియోగదారుల కోసం ట్యాంకర్లను సరఫరా చేసేలా ప్రత్యేకంగా షిఫ్ట్ నడిపించాలని జలమండలి నిర్ణయించింది. పగటి వేళల్లో గృహావసరాలకు మాత్రమే ట్యాంకర్లు సరఫరా చేసి రాత్రి వేళల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు, ఆసుపత్రులు ఇతరత్రా వాణిజ్య అవసరాలకు సంబంధించి ట్యాంకర్లను సరఫరా చేసేలా చర్యలు చేపట్టనుంది. కాగా.. ఇప్పటికే ఐటీ సంస్కరణలతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో క్షేత్ర స్థాయి పనితీరు పర్యవేక్షిస్తున్న జలమండలి తాజాగా వేసవిలో తాగు నీటి సరఫరాపై కూడా డ్యాష్‌బోర్డు ద్వారా పర్యవేక్షణకు సిద్ధమైంది.



జలమండలి పరిధిలో..

నల్లా కనెక్షన్లు	13.71 లక్షలు
రోజువారీగా నీటి సరఫరా	555 ఎంజీడీ
వేసవిలో అదనంగా	10 ఎంజీడీ
ప్రస్తుతం అందుబాటులో ట్యాంకర్లు	800
వేసవిలో అదనంగా	100
ఫిల్లింగ్ స్టేషన్లు	77
అవసరమైతే అదనంగా	05

తాగునీటి సరఫరాపై సూక్ష్మ స్థాయి పర్యవేక్షణ



వేసవిలో సమర్థంగా తాగునీరు సరఫరా చేసేందుకు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తు సూక్ష్మ స్థాయి ప్రణాళికకు సిద్ధమయ్యాం. తాగు నీటిసమస్య ఉత్పన్నమయ్యే ప్రాంతాలు గుర్తించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నాం. సూక్ష్మ స్థాయి పర్యవేక్షణతో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– అశోక్ రెడ్డి, జలమండలి ఎండీ

'వరద' నిధులేవీ?

పనులు ఫుల్.. పైసలు నిల్

- ముంపు నివారణకు రూ.662 కోట్ల ప్రతిపాదనలు
- హై సిటీలో ఫ్లై ఓవర్లకే నిధులు మంజూరు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో వానొస్తే రోడ్లు చెరువులయ్యే పరిస్థితుల్ని మార్చడానికి ఈ సంవత్సరం వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం (ఎస్ఎన్‌డీపీ) కింద రూ.667.28 కోట్ల అంచనా వ్యయంతో 40 పనులు చేయనున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ప్రకటించారు. ఎస్ఎన్‌డీపీ కింద తొలి దశలో రూ.950 కోట్ల పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రెండో దశ కింద మరిన్ని పనులు చేపట్టేందుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. కొన్నింటికి టెండర్లు పిలిచారు. కొన్నింటికి అగ్రిమెంట్లు కూడా పూర్తి చేశారు. పనులు ప్రారంభం కావడమే తరువాయి. కానీ.. ఈ పనులకు ఇంతవరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. మంజూరే కాకపోవడంతో ఎలా విడుదల చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ప్రజాపాలన, విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏకంగా రూ.7,032 కోట్ల పనులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు చేశారు. వాటిలో చాలా పనులకు నిధుల మంజూరుకు సంబంధించి పరిపాలన అనుమతులు జారీ అయ్యాయి. అవన్నీ ఫ్లై ఓవర్లు, రహదారుల విస్తరణలకు సంబంధించిన పనులే. వరద కాల్వల (నాలాల) ఆధునికీకరణకు సంబంధించిన ఏ ఒక్క పనికీ సీఎం శంకుస్థాపన చేయలేదు. నిధులూ మంజూరు కాలేదు. ఈ నేపథ్యంలో ఈ పనులెలా చేయనున్నారో అంతుచిక్కని ప్రశ్నగా మారింది.

వర్షాకాలంలో పరిస్థితేంటి?

నాలాల ఆధునికీకరణ, మరమ్మతులకు ఇదే సరైన సమయం. వచ్చే వర్షాకాలానికి ముంపు సమస్యలు ఉండరాదన్నది ప్రభుత్వ సంకల్పం. అందులో భాగంగానే రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ నిర్మాణాలు సైతం చేపట్టారు. వర్షాకాలంలోగా నాలాల పనులు కూడా పూర్తి చేయాలనేది లక్ష్యం. వేసవి ముగిసేలోగానే పనులు వేగంగా చేసేందుకు వీలుంటుంది. లేని పక్షంలో ఈ సంవత్సరం పనులు పూర్తి కాని పరిస్థితి నెలకొంది.

హై సిటీలో భాగమే అయినా..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని అభివృద్ధి పనులనూ హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హై సిటీ) గొడుగు కిందే చేస్తున్నారు. ఆయా పనులను బట్టి పాత పేర్లయిన ఎస్సార్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ,సీఆర్ఎం పీగా సబ్ టైటిల్స్‌గా పేర్కొంటున్నారు. నాలాల (ఎస్ఎన్‌డీపీ) పనులు సైతం హై సిటీలోవే అయినా ఎస్సార్‌డీపీ (ఫ్లై ఓవర్లు, రహదారుల) పనులకు నిధులు మంజూరైనా, ఎస్ఎన్‌డీపీ పనులకు మంజూరు చేయకపోవడం వెనక ప్రభుత్వం ఏ ఆలోచనలో ఉందో తెలియడం లేదు.




ఎస్ఎన్‌డీపీ రెండో దశ పనుల్లో..

- తొమ్మిది పనులకు కాంట్రాక్టు ఏజెన్సీలతో అగ్రిమెంట్లు కూడా పూర్తయ్యాయి. వాటి అంచనా వ్యయం రూ.55.34 కోట్లు.
- కాంట్రాక్టు ఏజెన్సీలను ఎంపిక చేసే ప్రక్రియలో ఉన్న పనులు ఎనిమిది కాగా, వాటి అంచనా వ్యయయం రూ.131.43 కోట్లు.
- టెండరు దశలో ఉన్న పనులు తొమ్మిది ఉన్నాయి. వాటి అంచనా వ్యయం రూ.140.15 కోట్లు
- మిగతా పనులు డీపీఆర్, టెక్నికల్ మంజూరు తదితర దశల్లో ఉన్నాయి.

అగ్రిమెంట్లు పూర్తయిన పనుల్లో..

చార్మినార్‌జోన్‌లో అరోరా కాలేజీ వెనక మన్‌మాని కుంట వద్ద, బిస్మిల్లా కిరాణా దుకాణం- గౌసనగర్‌లోని అలీ హోటల్ వరకు, ఎల్‌బీనగర్ జోన్‌లో కేకే గార్డెన్స్- వందనాపురి కాలనీ వరకు. శేరిలింగంపల్లి జోన్‌లో.. జనార్దన్ హిల్స్- యూరో కిడ్స్‌స్కూల్ (ఖాజాగూడ పెద్దచెరువు) వరకు, అంబేద్కర్ కాలనీ-శిశుమందిర్ ఏరియా (తిమ్మక్క చెరువు) వరకు వరద కాల్వల నిర్మాణాలు. సికింద్రాబాద్ జోన్‌లో.. నారాయణగూడ బ్రిడ్జి వద్ద పైప్‌లైన్ ఏర్పాటుతో వరద కాల్వ ఆధునికీకరణ, బండచెరువు- ఆర్‌టీసీ కాలనీ. శేరిలింగంపల్లి జోన్‌లో.. గఫూర్‌నగర్ జంక్షన్- దుర్గంచెరువు ఎంట్రీప్లాజా, గురునాథ్ చెరువు-పటేల్ చెరువు వరకు ఆర్‌సీసీ బాక్స్ డ్రెయిన్ల నిర్మాణాలు తదితర పనులున్నాయి.



సంక్షేమ హాస్టళ్లలో కామన్ మెనూ తప్పనిసరి

మంత్రి పొన్నం

లాలాపేట: గత నవంబర్‌లో పెరిగిన డైట్ చార్జీలకు అనుగుణంగా అన్ని సంక్షేమ హాస్టళ్లలో కామన్ మెనూ కచ్చితంగా అమలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. బుధవారం లాలాపేటలోని ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినులకు మంత్రి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. హాస్టల్‌లోని వంట గది, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. అధికారుల సమక్షంలో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా పోటీ పరీక్షలకు కావాల్సిన బుక్స్, బెడ్స్, ఐరన్ ర్యాక్స్, తాగునీటి వసతి వంటి సమస్యలను విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి.. జనవరి 26లోగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పరీక్షలు దగ్గరపడుతున్నందున బాగా చదువుకోవాలని సూచించారు. నవంబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి వచ్చిన కామన్ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి వెంట కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వార్డెన్ స్వర్ణలత తదితరులున్నారు.



నేలపై కూర్చుని విద్యార్థినులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఉరేసుకుని కానిస్టేబుల్ ఆత్మహత్య

మలక్‌పేట: భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా ఓ పోలీస్ కానిస్టేబుల్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నవీన్ తెలిపిన వివరాల ప్రకారం..సైదాబాద్ డివిజన్ ఆస్మాన్‌ఘడ్ ఎస్టీ బస్తీకి చెందిన జాతావత్ కిరణ్ (36) ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య లలిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యం తాగే అలవాటు ఉన్న అతడు భార్యతో గొడవపడేవాడు. ఉద్యోగానికి సెలవు పెట్టి నాలుగైదు రోజులుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. మంగళవారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. బుధవారం సాయంత్రం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఇరుగు పొరుగు వారు, బంధువులు అతన్ని మలక్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగం రావడం లేదని గృహిణి ఆత్మహత్య

గచ్చిబౌలి: పోటీ పరీక్షలు రాసినా ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర ఒత్తిడికి లోనైన ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసకు చెందిన పప్పల సతీష్ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగిగా పని చేస్తూ జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని 32సీలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి భోజనం అనంతరం భార్య బాలమణి (31)తో కలిసి ఇద్దరు ఒకే గదిలో నిద్రపోయారు. బుధవారం ఉదయం 5.30 గంటలకు కుమారుడు చిద్విలాస్(7) తల్లి కనిపించకపోవడంతో ఏడుస్తూ హాల్‌లోకి వెళ్లాడు. పిల్లాడి ఏడుపు విన్న సతీష్ లేచి భార్యను పిలువగా పలకలేదు. మరో గది తలుపులు వెనక నుంచి గడియపెట్టి ఉండటాన్ని ఆయన గమనించాడు. ఎంత పిలిచినా స్పందించకపోవడంతో ఇరుగు పొరుగు వారి సహాయంతో తలుపులు విరగ్గొట్టి చూడగా..బాలమణి చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించింది. అప్పటికే మృతి చెందిందని నిర్ధారించుకొని గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. కొద్ది సంవత్సరాలుగా బాలమణి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న పోటీ పరీక్షలకు హాజరవుతూ ఉందని, ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర ఒత్తిడికి లోనైందని కుటుంబ సభ్యులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు. మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పంజగుట్టలో మిస్సింగ్.. ఎస్ఆర్ నగర్‌లో శవమై తేలాడు

- కుళ్లిపోయిన స్థితిలో వ్యాపారి మృతదేహం లభ్యం
- స్నేహితుడే హంతకుడా అనే కోణంలో దర్యాప్తు


విష్ణు రూపాని(ఫైల్)

పంజగుట్ట: పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో అదృశ్యమైన వ్యక్తి ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఎల్లారెడ్డిగూడలో నివాసం ఉండే విష్ణు రూపాని (45) కిరాణా అండ్ జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. గత నెల 29వ తేదీన రాత్రి సుమారు 10 గంటల ప్రాంతంలో షాపు మూసేసి కొద్దిసేపట్లో వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన విష్ణు రూపాని తిరిగి రాలేదు. దీంతో అతని కుటుంబ సభ్యులు 30వ తేదీన పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా బుధవారం సాయంత్రం ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుద్ధానగర్‌లో ఓ ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు వచ్చి చూడగా ఓ యువకుడు మృతి చెంది ఉన్నాడు. అతన్ని పరిశీలించగా గత నెల 29న మిస్సయిన విష్ణు రూపానిగా గుర్తించారు. మృతి చెందిన గదిలో మద్యం తాగిన ఆనవాళ్లు ఉన్నట్లు సమాచారం. సదరు గదిలో ఉండే విష్ణు స్నేహితుడు కనిపించకుండా పోయాడని, దీంతో అతనే హత్య చేశాడా అన్న కోణంలో పోలీసులు అనుమానం వ్యక్తం చేసున్నారు. 29వ తేదీన రాత్రి విష్ణు, అతని స్నేహితుడు యాక్టివా ద్విచక్రవాహనంపై వెళ్లిన సీసీ ఫుటేజీలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విష్ణు ఆదివారం రాత్రి లేదా సోమవారం ఉదయం హత్యకు గురయ్యాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో శరీరంపై గాయాలు సరిగ్గా కనిపించడంలేదని, పోస్టుమార్టం అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రామకృష్ణ మఠంలో ఘనంగా కల్పతరు పర్వదినం

ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ

కవాడిగూడ: నగరంలోని రామకృష్ణ మఠంలో బుధవారం కల్పతరు పర్వదినం వేడుకలు ఘనంగా జరిగాయి. గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా విశేష పూజలు, భజనలు, హోమం ఆలయ ప్రదక్షిణ, ఆరాత్రికంతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులను ఉద్దేశించి హైదరాబాద్ రామకృష్ణమఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద ప్రసంగించారు. కల్పతరు పర్వదినోత్సవ ప్రాధాన్యాన్ని వివరించారు. 1886 జనవరి 1న పశ్చిమబెంగాల్‌లోని కాశీపూర్ ఉద్యాన వనంలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో శ్రీరామకృష్ణ పరమహంస కల్పవృక్షంలా మారి భక్తుల కోరికలు తీర్చారని స్వామి బోధమయానంద తెలిపారు. కల్పతరు దినోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు యువకుల రిమాండ్


దొంగతనం చేసి పోలీసులకు చిక్కిన యువకులు

పహాడీషరీఫ్: మహిళ మెడలో బంగారు గొలుసును తస్కరించిన ఇద్దరు యువకులను పహాడీషరీఫ్ పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 30న రాత్రి 9.30 గంటలకు సరస్వతి(56) అనే మహిళ తుక్కుగూడలోని తన కిరాణా దుకాణాన్ని మూసేసి, నడుచుకుంటూ ఇంటికి వెళ్తోంది. వెనక నుంచి స్కూటీపై వచ్చిన యువకులు ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసును తెంచుకొని ఉడాయించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించారు. హన్మకొండకు చెందిన గజ్జెల్లి వషిష్ఠ, సిద్దిపేటకు చెందిన బొగ్గుల అభిలాష్ బతుకుదెరువు నిమిత్తం తుక్కుగూడకు వచ్చి ఫ్యాబ్‌సిటీలోని రీనోసిస్ కంపెనీలో పని చేస్తున్నారు. చెడు అలవాట్లకు బానిసైన వీరు, వేతనం సరిపోక దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే సరస్వతి మెడలోని గొలుసును తెంపుకొని పారిపోయారు. వీరినుంచి గొలుసు, యాక్టివా వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

డ్యూటీకి వెళ్తుండగా.. దూసుకొచ్చిన మృత్యువు

- ఎదురెదురుగా ఢీకొన్న రెండు ఆటోలు
- తీవ్రంగా గాయపడి మృతిచెందిన జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికురాలు


జమునాబాయి (ఫైల్)

చాంద్రాయణగుట్ట: రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికురాలు మృతిచెందగా..ఏడుగురు గాయపడిన సంఘటన శాలిబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జంగమ్మెట్ రవీంద్ర నాయక్‌నగర్ కాలనీకి చెందిన పి.జమునా బాయి(45) నాంపల్లిలో జీహెచ్ఎంసీ స్వీపర్‌గా పనిచేస్తుంది. రోజు మాదిరిగానే బుధవారం ఉదయం 5.40 గంటల సమయంలో ఆటోలో డ్యూటీకి బయల్దేరింది. షా గౌస్ హోటల్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన మరో ఆటో వేగంగా ఢీ కొట్టింది. దీంతో రెండు ఆటోలూ బోల్తా పడ్డాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జమునా బాయి అక్కడికక్కడే మృతి చెందగా, ఏడుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ర్యాష్‌గా వచ్చి ఢీకొట్టిన డ్రైవర్ అఫ్రోజ్ ఖాన్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

అనాథలైన పిల్లలు..

ఈ ఘటనలోమృతిచెందిన జమునా బాయి భర్త రవి కుమార్ అనారోగ్యంతో నాలుగు నెలల క్రితమే మృతి చెందాడు. దీంతో వీరి ఇద్దరు పిల్లలు మీనా (21), శ్రీకాంత్(19) అనాథలయ్యారు. తల్లి మరణ వార్త విని పిల్లలిద్దరూ గుండెలవిసేలా రోదించడం కాలనీ వాసులను కంటతడి పెట్టించింది.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్ట్

సంతోష్‌నగర్: గంజాయి తరలిస్తున్న నలుగురు నిందితులను కంచన్‌బాగ్ పోలీసులు బుధవారం రాత్రి అరెస్టు చేసి వారి వద్ద నుంచి 6 కేజీల గంజాయి, మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కంచన్ బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిబాబా దేవాలయం వద్ద బుధవారం సాయంత్రం తనిఖీలు నిర్వహిస్తుండగా ధూల్‌పేటకు చెందిన ఓ వ్యక్తితో పాటు ఒడిశాకు చెందిన ఇద్దరు వ్యక్తులు, మరో మహిళ మూడు వాహనాలలో 6 కేజీల గంజాయి తరలిస్తుండగా పట్టుకుని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



కొత్త జోష్.. రూ.కోట్లలో కిక్కు

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చివరి మూడు రోజుల్లో రూ.207.95 కోట్ల ఆదాయం
- 1,74,166 కేసుల మద్యం, 2,03,609 కేసుల బీర్ల అమ్మకాలు
- గతంతో పోలిస్తే తగ్గిన ఆదాయం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 2024 డిసెంబర్ చివరి మూడు (29, 30 ,31 తేదీల్లో) రోజుల్లో ప్రభుత్వానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మద్యం అమ్మకాలు కాసుల వర్షం కురిపించింది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఐదు ఎక్సైజ్ జిల్లాలు ఉండగా, వీటి పరిధిలో 20 ఎక్సైజ్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. 2023 డిసెంబర్ చివరి మూడు రోజులతో పోలిస్తే.. 2024 డిసెంబర్ చివరి మూడు రోజుల్లో ఆదాయం కొంత తగ్గినప్పటికీ (రూ.75 లక్షలు).. కేవలం మూడు రోజుల్లోనే రూ.207.95 కోట్ల ఆదాయం సమకూరడం విశేషం. జిల్లా వాసులంతా పాత(2024) సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ..కొత్త(2025) సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. యువతీ, యువకులు డిసెంబర్ 31 మధ్యాహ్నం నుంచే వేడుకల్లో మునిగి తేలారు. బార్లు, వైన్స్ మందుబాబులతో కిక్కిరిసిపోయాయి. మద్యంతో పాటు కూల్ డ్రింక్స్, కేకులు, చికెన్, మటన్, చేపల అమ్మకాలు భారీగా జరిగాయి. 2023 చివరి మూడు రోజులతో పోలిస్తే 2024లో మేడ్చల్, శంషాబాద్ ఎక్సైజ్ జిల్లాల పరిధిలో ఆదాయం కొంత తగ్గగా, మల్కాజ్‌గిరి, సరూర్‌నగర్, వికారాబాద్ ఎక్సైజ్ జిల్లాల పరిధిలో అమ్మకాలు కొంత పెరగడం విశేషం.

ఉమ్మడి జిల్లాలో గత మూడు రోజుల్లో మద్యం అమ్మకాలు

	2023			2024		
ఎక్సైజ్ జిల్లా	మద్యం కేసులు	బీర్లు	ఆదాయం రూ.కోట్లలో	మద్యం కేసులు	బీర్లు	ఆదాయం రూ.కోట్లలో
మేడ్చల్	42545	37618	46.67	40220	46914	45.93
మల్కాజ్‌గిరి	39835	36658	44.71	40221	38248	45.92
సరూర్‌నగర్	40236	44310	45.81	42563	49966	49.58
శంషాబాద్	47781	48494	62.36	41414	53337	56.77
వికారాబాద్	9799	10734	9.15	9748	15144	9.75
మొత్తం	180196	177814	208.70	174166	203609	207.95

వేధింపుల కేసులో నిందితుడి అరెస్టు


బత్తుల ఫణితేజ

బంజారాహిల్స్: టీవీ సీరియల్ నటిని ప్రేమ, పెళ్లి పేరుతో వేధించిన యువకుడిని జూబ్లీహిల్స్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..శ్రావణ సంధ్య అనే టీవీ సీరియల్‌లో నటిస్తున్న మహిళను అదే యూనిట్‌లో పనిచేస్తున్న బత్తుల ఫణితేజ కొంతకాలంగా మానసిక వేధింపులకు గురిచేస్తున్నాడు. ప్రేమించానని, పెళ్లి చేసుకోవాలని బలవంతం చేశాడు. ఆమె క్యారెక్టర్‌ను దిగజార్చేవిధంగా దుష్ప్రచారం చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బంజారాహిల్స్‌లో భారీగా కొకైన్ పట్టివేత

విక్రేతను అరెస్టు చేసిన మాసబ్‌ట్యాంక్ పోలీసులు


నిందితుడు జవార్ కిషన్ గోపాల్

బంజారాహిల్స్: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో డిమాండ్ మేరకు మంగళవారం రాత్రి అవసరమైన వారికి డ్రగ్స్ విక్రయిస్తున్న నిందితుడిని మాసబ్‌ట్యాంక్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..అమృతా వ్యాలీ అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్‌ను ప్లాస్టిక్ బిజినెస్ చేసే జవార్ కిషన్ గోపాల్ అలియాస్ గోపాల్ (27) అద్దెకు తీసుకుని కొంతకాలంగా డ్రగ్స్ విక్రయాలు చేస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. న్యూ ఇయర్ సందర్భంగా డ్రగ్స్ అమ్మకాలు, కొనుగోళ్లపై పాతనేరస్తుల కదలికలు గమనిస్తున్న పోలీసులకు మంగళవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో గోపాల్ అవసరమైన వారికి డ్రగ్స్ విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందడంతో దాడులు చేశారు. నిందితుడిని పట్టుకొని 30 గ్రాముల కొకైన్, ఆరు గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. నైజీరియాకు చెందిన డ్రగ్స్ సప్లయర్ నుంచి గోపాల్ ఈ కొకైన్‌ను ఇటీవల ముంబాయి నుంచి తెప్పించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. నైజీరియాకు చెందిన డ్రగ్స్ సప్లయర్, డ్రగ్స్ ట్రాన్స్‌పోర్టర్ సూరజ్, ప్రమోద్, డ్రగ్ వినియోగదారులు అనిల్ ఆళ్ల, వరుణ్ తదితర ఐదుగురు వ్యక్తులు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితుడు గోపాల్ కొంతకాలంగా బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లో ఉంటున్నట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సాయినగర్‌లో నివసించే గోపాల్ బంజారాహిల్స్‌లో మకాం వేసి పబ్‌లు, క్లబ్‌లలో పెద్ద ఎత్తున మాదక ద్రవ్యాలు విక్రయించేందుకు పక్కా ప్రణాళిక వేసుకున్నట్లుగా గుర్తించారు. అంతే కాకుండా పెద్ద ఎత్తున డ్రగ్స్‌ను కూడా ముంబై నుంచి తెప్పించినట్లు దర్యాప్తులో తేలింది. మాసబ్‌ట్యాంక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు–బైక్ ఢీ

- ప్రమాదంలో వలస కార్మికుడి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు


దీప్ చంద్రకుమార్ మృతదేహం

మహేశ్వరం: పొట్టకూటి కోసం వలసొచ్చిన ఓ కార్మికుడిని రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది. ఇదే ఘటనలో మరో శ్రమజీవి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఎదురెదురుగా వస్తున్న కారు– బైక్ ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషాద సంఘటన మండల పరిధిలోని తుమ్మలూరు గేటు శ్రీశైలం జాతీయ రహదారిపై మ్యాక్ ప్రాజెక్టు వద్ద చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దీప్ చంద్రకుమార్(22), మనోజ్ కుమార్(23) ఇద్దరు స్నేహితులు. వీరు మహేశ్వరం గేటు వద్దనున్న పరిశ్రమలలో కార్మికులుగా పని చేస్తున్నారు. బుధవారం సాయంత్రం ఇద్దరు బైక్‌పై వ్యక్తిగత పనుల నిమిత్తం కందుకూరు వెళ్లి మహేశ్వరం గేటు వైపు తిరిగి వస్తున్నారు. మార్గమధ్యలో తుమ్మలూరు గేటు సమీపం మ్యాక్ ప్రాజెక్టు వద్ద హైదరాబాద్ నుంచి అచ్చంపేట్ వైపు వెళ్తున్న కారు వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న దీప్‌చంద్రకుమార్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మనోజ్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో ఓ ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలికి మృతుడి బంధువులు, తోటి కార్మికులు చేరుకొని ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అరెస్టు చేసి బాధితులను ఆదుకోవాలని నిరసన చేపట్టారు. దీంతో రోడ్డుపై వాహనాలు నిలవడంతో సమాచారం అందుకున్న మహేశ్వరం పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు. మృతుడి బంధువులతో మాట్లాడి సద్దుమణిగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్ గోవింద నామాలు చెబుతుండగా దర్శనానికి వెళ్తున్న భక్తులు

చిలుకూరుకు పోటెత్తిన భక్తజనం

- బాలాజీ దర్శనానికి 60వేల మంది భక్తులు
- ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



మొయినాబాద్: కొత్త సంవత్సరం... కొంగొత్త ఆశలతో భక్తులంతా చిలుకూరు బాటపట్టారు. నూతన సంవత్సరం మొదటి రోజు తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన చిలుకూరు బాలాజీని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులకు దర్శనం కల్పించారు. భాగ్యం ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఉదయం 11 నుంచి భక్తుల రాక పెరిగింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని స్వామివారిని దర్శించుకోవడానికి నాలుగు లైన్లు ఏర్పాటు చేశారు. ఆలయంలోకి ప్రవేశించే ముందే మహిళలు, పురుషులను వేర్వేరు లైన్లలో పంపించారు. వాహనాల పార్కింగ్ నుంచి ఆలయానికి చేరుకోవడానికి మూడు వేర్వేరు దారులు ఏర్పాటు చేయడంతో ఎక్కడా ఇబ్బంది లేకుండా భక్తులు ఆలయానికి చేరుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాలకృష్ణ, అర్చకుడు రంగరాజన్ పర్యవేక్షించారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు. గతం కంటే ఈ ఏడాది భక్తులు తక్కువగా రావడంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. సుమారు 60 వేల మంది భక్తులు వచ్చినట్లు ఆలయ అర్చకులు, పోలీసులు తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.29 వేలు విత్‌డ్రా

చేవెళ్ల: ఏటీఎం నుంచి నగదు విత్‌డ్రా చేయాలని నమ్మించి కార్డు తారుమారు చేసి రూ.29 వేలు కాజేశాడో ప్రబుద్ధుడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. చేవెళ్ల మండలంలోని అంతారం గ్రామానికి చెందిన కావలి బందయ్య సోమవారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రంలో నగదు విత్‌డ్రా చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న గుర్తు తెలియని వ్యక్తి బందయ్యను గమనిస్తూ పిన్‌నంబర్‌ను పసిగట్టాడు. తనకు రూ.1000 కావాలని ఏటీఎం నుంచి డ్రా చేసి ఇవ్వాలని సదరు వ్యక్తి కోరాడు. ఈ క్రమంలో బందయ్యకు చెందిన కార్డును తీసుకున్నాడు. అక్కడి నుంచి వెళ్లిపోయిన గుర్తు తెలియని వ్యక్తి మొయినాబాద్‌లోని ఏటీఎం కేంద్రంలో రూ.29 వేలు డ్రా చేసుకున్నాడు. బందయ్య మంగళవారం తన ఖాతాను చెక్ చేసుకోవటంతో రూ. 29వేలు విత్‌డ్రా అయినట్లు తెలుసుకున్నాడు. దీంతో ఏటీఎం కేంద్రంలో కార్డు మారిందని గ్రహించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఫాంహౌస్‌లపై పోలీసుల దాడి

ఏడుగురు అరెస్టు

చేవెళ్ల: నూతన సంవత్సర వేడుకల్లో అనుమతి లేకుండా హుక్కా, మద్యం సేవిస్తున్న రెండు ఫాంహౌస్‌లపై పోలీసులు దాడులు చేశారు. ఈ ఘటన చేవెళ్ల ఠాణా పరిధిలోని ముడిమ్యాల సమీపంలోని జెడ్ఎస్, మ్యాంగో రిట్రీట్ ఫాంహౌస్‌లలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. జెడ్ఎస్, మ్యాంగో రిట్రీట్ ఫాంహౌస్‌లలో అనుమతి లేకుండా మద్యం, హుక్కా సేవిస్తూ పెద్ద ఎత్తున సౌండ్ సిస్టంలు ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. వెంటనే వాటిపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అనుమతి లేకుండా ఫాంహౌస్ అద్దెకు ఇచ్చిన యజమానితో పాటుగా తీసుకున్న వారిపై కేసు నమోదు చేశామని వివరించారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

అనంతగిరి: తమ సమస్యలను పరిష్కరించే దాకా ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్ అన్నారు. వికారాబాద్‌లోని ఆర్‌డీఓ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె బుధవారం నాటికి 27వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. ఎస్ఎస్ఏను విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రవికుమార్, శ్రీశైలం, రఘుసింగ్ ఠాకూర్, బ్రహ్మయ్య చారి, లక్ష్మయ్య, ప్రమోద్, శేఖర్, వసంత, శ్రీనివాస్, రవి, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు


పరిశీలిస్తున్న వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్

బంజారాహిల్స్: న్యూ ఇయర్ సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామున 4 గంటల వరకు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 12 బృందాలు 12 చోట్ల డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతూ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 32 మంది, పంజగుట్ట 49 మంది, జూబ్లీహిల్స్ 65 మంది, ఎస్సార్‌నగర్‌లో 64 మంది మొత్తం 216 మంది పట్టుబడగా వీరందరికీ జరిమానా విధించారు. వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా డ్రంకన్ డ్రైవ్‌ను పరిశీలించారు. ఇదిలా ఉండగా పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేపట్టిన డ్రంకన్ డ్రైవ్ టెస్ట్‌లో ఓ యువకుడికి 550 ఎంజీ నమోదైంది.


బంజారాహిల్స్ రోడ్డునంబర్-2లో బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న పోలీసులు

వైభవంగా అయ్యప్ప మహాపడి పూజ


పూజల్లో దీక్షాపరులు, భక్తులు

వెంగళరావునగర్ : ఈస్ట్ రహమత్‌నగర్‌లో చంద్రప్రకాశ్ గురుస్వామి సన్నిధానంలో బుధవారం అయ్యప్ప మహాపడిపూజను వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు చంద్రప్రకాశ్, శివప్రసాద్, రాజశేఖర్, జనార్దన్‌చారి, శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్‌చారి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన పబ్‌పై కేసు

బంజారాహిల్స్: న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి భారీ శబ్దంతో డీజే ఏర్పాటుచేసిన జూబ్లీహిల్స్ రోడ్డునంబర్-10లోని బాబీలాన్ పబ్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి పబ్‌లో అధికంగా సౌండ్ ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని సౌండ్ సిస్టం సీజ్ చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.

పబ్‌లు, క్లబ్‌లపై యాంటీ నార్కోటిక్ టీంల ప్రత్యేక దృష్టి


జూబ్లీహిల్స్‌లో యాంటీ నార్కోటిక్ టీం

బంజారాహిల్స్: నూతన సంవత్సరం సందర్భంగా గంజాయి, డ్రగ్స్ వినియోగించకుండా ఉండేందుకు యాంటీ నార్కోటిక్ టీమ్‌లు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లోని పబ్‌లు, క్లబ్‌లపై మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామువరకు ప్రత్యేక దృష్టి పెట్టారు. అనుమానితుల కదలికలను గమనిస్తూ మత్తు పదార్థాల వినియోగం జరగకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రేమ, అనురాగాలతో జీవించాలి

లిబర్టీ: మాతృ ప్రేమతో పరిపాలన సాగించాలని, అప్పుడే రాష్ట్రం, ప్రజలు సుభిక్షంగా ఉంటారని మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షుడు కేబీ.శ్రీధర్ అన్నారు. లిబర్టీ ప్లాజాలోని సంస్థ కార్యాలయంలో బుధవారం సత్‌సంగ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో పుష్పాంలి, నందికొండలరావు, బాలాజీ, వేణు పాల్గొన్నారు.

ఆలయాలు కిటకిట

న్యూ ఇయర్ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తుల రాక
- ఉదయం నుంచే దర్శనానికి క్యూ
- పెద్దమ్మ, జగన్నాథ, టీటీడీ శ్రీవారి టెంపుల్స్‌లో పూజలు




బంజారాహిల్స్‌లోని జగన్నాథ మందిరంలో భక్తుల రద్దీ

బంజారాహిల్స్: న్యూ ఇయర్ సందర్భంగా బుధవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి.. బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లోని జగన్నాథ మందిరం, జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీ వారి ఆలయాలకు వేకువజాము నుంచే నగర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలతో పాటు పరిసర ప్రాంతాలన్ని కిటకిటలాడాయి. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఆలయాలకు భక్తులు తరలిరావడంతో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రహదారులు వాహనాలతో కిక్కిరిసిపోయాయి.




జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి ఆలయంలో..


జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయంలో భక్తులు


బంజారాహిల్స్ రోడ్ నంబర్-10 తెలంగాణ భవన్‌రోడ్డులో వాహనాల రద్దీ

కమీషన్ల ప్రభుత్వంగా రేవంత్ రెడ్డి సర్కారు

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

కాచిగూడ: కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ..ఢిల్లీకి మూటలు పంపుతూ కమీషన్ల ప్రభుత్వంగా రేవంత్ రెడ్డి సర్కారు మారిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ అధ్యక్షతన బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ విద్యార్థుల రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీ విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, 16 లక్షల75వేల మంది విద్యార్థుల ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్స్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద రాష్ట్రస్థాయి సదస్సు, భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం తెచ్చిన అప్పులు రూ.80 వేల కోట్లయితే, లక్ష కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఇందులో కాంట్రాక్టర్లకు ఎంత చెల్లించారు..? ఇతర బిల్లులు ఎన్ని చెల్లించారో..? శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీల వెంకటేశ్, తంగెళ్లమూడి నందగోపాల్, నిమ్మల వీరన్న, రాందేవ్ మోదీ, ఉదయ్ నేత, రాజు పాల్గొన్నారు.

ఘనంగా మహర్ విజయ్ దివస్

లిబర్టీ: మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం మహర్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జీ ప్రకాశ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బి.శంకర్, వీరన్న, జి.కిషన్, జి.నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కళలపై కూడా దృష్టిసారించాలి


డ్యాన్స్ స్టూడియోను ప్రారంభిస్తున్న అనూహ్యారెడ్డి

శ్రీనగర్‌కాలనీ : విద్యార్థులు చిన్నప్పటి నుంచే చదువుతో పాటుగా డ్యాన్స్ లాంటి కళలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని టీవీ సీరియల్స్ నిర్మాత, కోవిద సర్వోదయ ఫౌండేషన్ చైర్‌పర్సన్ అనూహ్యారెడ్డి అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ హైమావతినగర్‌లో గూడూరు వన్‌రాజ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వింగ్స్ ఆఫ్ ఫైర్ డ్యాన్స్ స్టూడియోను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాస్టర్ డ్యాన్సర్ వన్‌రాజ్‌రెడ్డి చిన్నతనంలోనే డ్యాన్స్ క్లాస్ స్థాపించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గూడూరు చెన్నారెడ్డి, వన్‌రాజ్‌రెడ్డి తల్లిదండ్రులు జీ శ్రీధర్‌రెడ్డి, కల్యాణిరెడ్డితో పాటు డాక్టర్ జి.విజయలక్ష్మి, డి.మంజులారెడ్డి, సీహెచ్.శోభారెడ్డి, లిషా వంశీరెడ్డి, డి.ప్రత్యక్షనందరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ దిడ్డి సుధాకర్

లిబర్టీ: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఆప్ కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. లిబర్టీలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి నేతలు, కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ అన్సారీ, విజయ్ మల్లంగి, నర్సింగ్‌యమునాగౌడ్, డాక్టర్ లాక్ష్యనాయుడు, అప్పసలాం, జావీద్ షరీఫ్, సుధారాణి, వైశాలి, ఆజాంబేగ్, రామన్‌స్వామి, సురేశ్, ధర్మేందర్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

గోల్డెన్ టెంపుల్‌లో వైభవంగా శుభారంభం


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

బంజారాహిల్స్: నూతన సంవత్సరం సందర్భంగా రోడ్డునంబర్-12లోని ఎన్‌బీటీ నగర్ హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో బుధవారం శుభారంభం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీరాధాకృష్ణులు, భూదేవి శ్రీదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు.

కేలండర్ ఆవిష్కరణ


కేలండర్ ఆవిష్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్, కార్పొరేటర్

వెంగళరావునగర్ : మధురానగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కేలండర్‌ను కాలనీలోని సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీహాల్‌లో మధురానగర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ జీ శ్రీనివాస్‌వర్మ, స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మనోహర్‌రావుతో పాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ జోష్



న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న జేఐసీ సెక్రటరీ కిలారు రాజేశ్వరరావు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన న్యూ ఇయర్ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా కళాకారుల ఆటపాటలు ఉర్రూతలూగించాయి. అనంతరం జేఐసీ సెక్రటరీ కిలారు రాజేశ్వరరావు సిద్దార్థ ఫైన్ జ్యువెలర్స్ అధినేత వేమూరి కృష్ణప్రసాద్‌తో కలిసి న్యూ ఇయర్ కేక్ కట్ చేశారు. ఈ వేడుకలను జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-10లోని సిద్దార్థ ఫైన్ జ్యువెలర్స్ స్పాన్సర్ చేసింది. ఈ సందర్భంగా సెక్రటరీ కిలారు రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ఏడాది అంటే 365 రోజులు మాత్రమే కాదని, 365 అవకాశాలుగా స్వీకరించాలని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు.

ఎఫ్ఎన్‌సీసీలో ..

ఫిలింనగర్: ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ రామారావు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఆది శేషగిరిరావు, కాజా సూర్యనారాయణ, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షల వెల్లువ

నూతన సంవత్సరం సందర్భంగా ప్రజాప్రతినిధుల నివాసాల వద్ద బుధవారం సందడి కనిపించింది. ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలతో పాటు పలువురు అధికారులు వారికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

–జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ జోన్ల బృందం


బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు


కేటీఆర్‌తో బోరబండ బీఆర్ఎస్ నాయకులు


సీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి


ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు


ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ భారతీనాయక్

టెన్త్ @ 80 డేస్!



- ర్యాంకులు, గ్రేడింగ్ విధానానికి స్వస్తి
- సబ్జెక్టులవారీగా రివిజన్లు, ప్రాక్టీస్ టెస్టులు
- పదో తరగతి వార్షిక పరీక్షలకు ప్రిపరేషన్
- చూచిరాతలకు ఆస్కారం లేకుండా చర్యలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వ పాఠశాల్లో పదో తరగతి ఉత్తీర్ణతా శాతాన్ని పెంచడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. వార్షిక పరీక్షలకు మరో 80 రోజుల గడువు ఉండటంతో ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సంక్రాంతి లోపే పాఠ్యాంశాల బోధనను పూర్తి చేయించాలని నిర్ణయించింది. ర్యాంకులు, గ్రేడింగ్ విధానానికి ఇప్పటికే స్వస్తి పలికిన నేపథ్యంలో పాఠ్యాంశాల వారీగా పునశ్చరణ తరగతులుసహా ముందస్తు ప్రాక్టీస్ టెస్టులను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. తద్వారా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిని పరీక్షలకు సిద్ధం చేసే అవకాశం ఉంటుందని భావిస్తోంది. ఇప్పటికే ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వీరికి జనవరి చివరి వారంలో ఒక టెస్టు, ఫిబ్రవరిలో రెండు, మార్చిలో మరో టెస్టు.. ఇలా మొత్తం ఐదు టెస్టులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

చూచిరాతకు చెక్...

జిల్లాలో 1,163 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 51,806 మంది విద్యార్థులు ఈ వార్షిక పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో 28,039 మంది బాలురు, 23767 మంది బాలికలు ఉన్నారు. అత్యధికంగా 34,898 మంది ప్రైవేటు పాఠశాలల నుంచి హాజరు కానున్నారు. చూచిరాతలకు చెక్ పెట్టే చర్యలకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటివరకు జబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ ఉత్తీర్ణతాశాతం పెంపు పేరుతో పరీక్షలను, మూల్యాంకనాన్ని కొంత సులభతరం చేశారు. ఇకపై అత్యంత పకడ్బందీగా పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించాలని జిల్లా యంత్రాం గం భావిస్తోంది. కోవిడ్‌తో నిలిచిపోయిన సిట్టింగ్ స్క్వాడ్‌లను మళ్లీ రంగంలోకి దించనుంది. గతానికి భిన్నంగా ప్రతి సెంటర్‌కు ఒక సిట్టింగ్ స్క్వాడ్‌సహా 15 స్పెషల్ ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

కార్పొరేట్‌కు దీటుగా తీర్చి దిద్దుతున్నాం..

మార్చి 21 నుంచి ఏప్రిల్ నాలుగు వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు జరుగుతాయి. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ఇటీవల నిర్వహించిన ఒలింపియాడ్ మాథ్స్ సహా ఎస్ఏ-1లో సరూర్‌నగర్, మైలార్‌దేవ్‌పల్లి, గచ్చిబౌలి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల విద్యార్థుల కంటే అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ర్యాంకులు, గ్రేడింగ్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిన నేపథ్యంలో విద్యార్థులు మంచి మార్కులు సాధించే దిశగా వారిని సంసిద్ధులను చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ఆత్మస్థైర్యాన్ని నింపి, మానసికంగా పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం.

– సుశీందర్‌రావు, డీఈఓ, రంగారెడ్డి

వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇలా...

యాజమాన్యం	పాఠశాలలు	విద్యార్థులు
ఎయిడెడ్ స్కూల్స్	04	156
బీసీ రెసిడెన్షియల్	16	1030
ప్రభుత్వ స్కూల్స్	04	322
కేజీబీవీ స్కూల్స్	20	932
మైనార్టీ స్కూల్స్	09	492
టీఎస్ఎంఎస్	09	783
టీటీడబ్ల్యూఆర్ఎస్	03	173
టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్	15	1133
ఆశ్రమ పాఠశాలలు	01	47
జెడ్పీ స్కూల్స్	238	11,840
ప్రైవేటు స్కూల్స్	844	34,898

గడువు ఇచ్చాం.. కూల్చివేశాం..!

- భగీరథమ్మ కుంట, తౌతానికుంటల్లో కూల్చివేతలపై హైడ్రా కమిషనర్
- స్థానికుల ఫిర్యాదులతోనే క్షేత్రస్థాయిలోకి వెళ్లాం
- నోటీసులు ఇచ్చినప్పటికీ ఎవరూ స్పందించలేదు
- ఆ తర్వాతే కూల్చివేతలు మొదలుపెట్టాం



సాక్షి, సిటీబ్యూరో: ఖాజాగూడ-నానక్‌రామ్‌గూడ ప్రధాన రహదారిలోని భగీరథమ్మ కుంట, తౌతానికుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మంగళవారం చేపట్టిన కూల్చివేతలపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ వివరణ ఇచ్చారు. దీనికి సంబంధించి బుధవారం ప్రకటన విడుదల చేశారు. అందులోకి అంశాలివి... ఆ రెండు జలవనరుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు ఆక్రమణకు గురికావడంతో పరిసర ప్రాంతాల్లో తరచు నీరు నిలిచిపోతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా హైడ్రా అధికారులు, స్థానిక మున్సిపల్, రెవెన్యూ విభాగాలతో కలిసి రెండుసార్లు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఎనిమిదేళ్ల క్రితమే తౌతానికుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లకు సంబంధించిన తుది నోటిఫికేషన్, భగీరథమ్మ కుంటకు సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడ్డాయి. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు హైడ్రా ప్రధాన కార్యాలయంలో అక్కడి దుకాణాలు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు, శిఖం పట్టాదారులతో సమావేశం జరిగింది. ఆక్రమణల్ని గూగుల్ ఎర్త్ ద్వారా ప్రదర్శించారు. కార్పొరేట్ రియల్ ఎస్టేట్ డెవలపర్ ఏసీఈ కార్ప్ గ్రూప్ ఇటీవలే శిఖం పట్టాదారు మేకల అంజయ్య తదితరుల నుంచి ఏడు ఎకరాలకు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకుంది. హైడ్రా ఇక్కడ కూల్చివేతలను పూర్తి చేసిన తర్వాత, ఆ కంపెనీనే శిఖం పట్టాదారుల పేరుతో హైకోర్టులో లంచ్ మోషన్ దాఖలు చేసింది. శనివారం నాటి సమావేశానికి ఏసీఈ కార్ప్ గ్రూప్ యజమానులు కూడా హాజరయ్యారు'అని తెలిపారు.

నిర్మాణ సామగ్రిని డంప్ చేస్తున్న కంపెనీలు

'భగీరథమ్మ కుంట శిఖం పట్టాదారులు బఫర్ జోన్‌లో దుకాణాలు నడుపుతూ చెరువును నిర్మాణ శిథిలాలతో నింపుతున్నారు. గత ఏడాది నవంబర్‌లో అక్కడ నిర్మాణ సామగ్రిని డంప్ చేస్తున్న కొన్ని టిప్పర్లను హైడ్రా బృందాలు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నాయి. భగీరథమ్మ చెరువును ఆక్రమించినందుకు రాయదుర్గం పోలీసుస్టేషన్‌లో సంధ్యా కన్‌స్ట్రక్షన్స్‌తోపాటు దాని యజమాని శ్రీధర్ రావు, టిప్పర్ ఆపరేటర్లపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. హైడ్రా గత వారం ఆక్రమణదారులతో సమావేశాలు నిర్వహించి, ఖాళీ చేయాలని, ఆక్రమణలు కూల్చివేస్తామని స్పష్టం చేసి, మూడు నాలుగు రోజుల గడువు ఇచ్చింది. అయినా ఎవరూ స్థలాలను, ఆక్రమణలను ఖాళీ చేయకపోవడంతో సోమవారం 24 గంటల సమయం ఇస్తూ నోటీసులు జారీ చేసింది. అయినప్పటికీ ఖాళీ చేయకపోవడంతో మంగళవారం కూల్చివేతలు చేపట్టింది' అని రంగనాథ్ పేర్కొన్నారు.

వైన్‌షాప్ కూల్చకపోవడంపై వివరణ

ఖాజాగూడలోని చెరువు బఫర్ జోన్‌లో ఉన్న వైన్ షాప్‌ను కూల్చకపోవడంపైనా రంగనాథ్ వివరణ ఇచ్చారు. అది ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన ప్రాంగణమని, కొన్ని రోజుల్లో దాన్ని మరోచోటుకు మార్చేలా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖను కోరామని పేర్కొన్నారు. ఆ షాప్‌నకు అనుబంధంగా ఉన్న సిట్టింగ్, డైనింగ్ ఏరియా, రెస్టారెంట్, పాన్‌షాప్‌లను కూల్చేశామని తెలిపారు.

ఓయూ డిగ్రీ కాలేజీల సెక్రెటరీగా రాకేష్ భవాని



చింతల రాకేష్ భవాని

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల సెక్రెటరీగా డాక్టర్ చింతల రాకేష్ భవాని ఎన్నికయ్యారు. తెలంగాణ ప్రభుత్వ కాలేజీల టీచర్స్ అసోసియేషన్ ఎన్నికలు యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఫ్యాకల్టీ క్లబ్‌లో జరిగాయి. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాకేష్ భవాని వరుగా రెండోసారి గెలవడం అభినందనీయమని అసోసియేషన్ నేతలు పేర్కొన్నారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ తెలుగు శాఖ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.యాదయ్య కుమారుడైన రాకేష్ భవాని తండ్రి చూపిన మార్గంలో తెలుగులో పీహెచ్‌డీ పూర్తి అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించారు. డా.రాకేష్ భవాని గత ఏడాది ఉత్తమ అధ్యాపక పురస్కారాన్ని, ఎన్‌సీసీ ప్రోగ్రామ్ అవార్డును అందుకున్నారు. కవిగా, రచయితగా, గాయకుడిగా రాణిస్తున్న ఆయన జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధనాపత్రాలను సమర్పించారు. తన గెలుపునకు సహకరించిన అధ్యాపకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నార్మ్ మాజీ జేడీకి నాసా ఫెలోషిప్



జి వెంకటేశ్వర్లు

ఏజీవర్సిటీ: నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(నార్మ్) మాజీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి.వెంకటేశ్వర్లు ప్రతిష్ఠాత్మక నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్(నాసా) ఫెలోషిప్‌గా ఎంపికయ్యారు. వ్యవసాయ, మత్స్యరంగాల్లో ప్రతిభ కనబరిచినందుకుగాను ఈ ఫెలోషిప్‌నకు ఎంపికయ్యారు. నార్మ్‌లో చేరడానికి ముందు ఆయన ఢిల్లీలోని ఐసీఏఆర్ (ఎడ్యుకేషన్ క్వాలిటీ అస్యూరెన్స్ రిఫార్మ్స్), ముంబైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్‌లో సీనియర్ సైంటిస్ట్‌గా, బెంగళూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ రీసెర్చ్‌లో పనిచేశారు. నాసా ఫెలోషిప్‌నకు ఎంపికైన సందర్భంగా నార్మ్ అధ్యాపకులు, సిబ్బంది, ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు ఆయనను అభినందించారు.

విజేతలకు బహుమతుల అందజేత

లాలాపేట: సౌత్ లాలాగూడలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి వార్షిక క్రీడోత్సవాల సందర్భంగా ఇటీవల నిర్వహించిన వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బుధవారం చర్చిలో జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చర్చి కమిటీ నేతలు బి. ప్రవీణ్, బి. వరకుమార్, శామ్‌సన్, గౌతమ్‌కుమార్, కంతి జయకర్, బిషప్ మోజెస్, శాంసన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలో తొలి గంజాయి కేసు

సాక్షి, సిటీబ్యూరో: కొత్త సంవత్సరం వేళ నగరంలో తొలి గంజాయి కేసు నమోదైంది. గంజాయిని అరికట్టడానికి ఎక్సైజ్ అధికారులు ఎంత ప్రయత్నించినా విక్రయాలు సాగుతూనే ఉన్నాయి. 40 ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు మంగళవారం రాత్రి తొమ్మిది గంటల నుంచి బుధవారం ఉదయం తెల్లవారు జామున రెండు గంటల వరకు తనిఖీలు చేపట్టాయి. రెండుచోట్ల 3.370 కిలోల గంజాయి పట్టుకోవడంతోపాటు ఓ పబ్బు పరిసరాల్లో నిర్వహించిన డ్రగ్స్ పరీక్షల్లో ఇద్దరికి పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారించింది. ఎస్ఆర్‌నగర్‌లో అనుమానాస్పదంగా కన్పించిన నలుగురు వ్యక్తులను తనిఖీ చేసింది. గంజాయి రవాణాకు యత్నించిన కె.శివ, వి.భార్గవ్, ఎ.మాణిక్యం, ఆర్. ప్రవీణ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి 3.370 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుంది. గంజాయిని పట్టుకున్నవారిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనిల్ కుమార్‌రెడ్డిలు అభినందించారు.

సేంద్రియ ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించాలి



పుస్తక రచయిత రాంబాబును సన్మానించిన దృశ్యం

కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్

అమీర్‌పేట: సేంద్రియ విధానం ద్వారా రైతులు పండించే ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించాలని కేంద్ర సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ ప్రభుత్వానికి సూచించారు. ప్రకృతి వ్యవసాయ విధానాన్ని వివరిస్తూ సీనియర్ పాత్రికేయుడు పంతంగి రాంబాబు రచించిన 'ప్రకృతి సాగుబడి'మొదటి భాగం పుస్తక ఆవిష్కరణ సభ బుధవారం అమీర్‌పేట అపోలో స్పెక్ట్రా ఆసుపత్రి సమావేశమందిరంలో జరిగింది. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ అత్యంత పాఠకాదరణ పొందిన 'సాక్షి'సాగుబడిలో ప్రచురితమైన ప్రకృతి వ్యవసాయ స్ఫూర్తిదాయక కథనాలను పుస్తకంగా ప్రచురించడం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా 50 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి ఉన్నప్పటికీ, జీడీపీలో వాటా 20 శాతం మాత్రమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు, నిమ్స్ ఆసుపత్రి మాజీ డైరెక్టర్ ప్రసాదరావు రాజా, అమరయ్య, మమత, బీఎస్‌రెడ్డి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వక్రోక్తిలో శంకరనారాయణ దిట్ట

'ఫన్‌చామృతం'ఆవిష్కరణ సభలో ఆచార్య ఇనాక్



కార్యక్రమంలో ఇనాక్, రామారావు, విశ్వేశ్వరరావు, కళాజానార్దనమూర్తి, నిర్మల

చిక్కడపల్లి: ప్రపంచ సాహిత్యంలో అభివ్యక్తీకరణ ఎనిమిది రకాలుగా ఉంటుందని, వాటిలో వక్రోక్తి ఒకటి అని, అందులో శంకరనారాయణ దిట్ట అని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. బుధవారం శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదికపై గానసభ నిర్వహణలో ప్రముఖ హాస్య అవధాని శంకరనారాయణ రచించిన 'ఫన్‌చామృతం'సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథి కొలకలూరి ఇనాక్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తెలుగు పదాలను విరిచి పలు అర్థాలను తీసి హాస్యం, అధిక్షేపం, చమత్కారం వంటి వక్రోక్తులను సృష్టించగల నేర్పు శంకరనారాయణ సొంతమని కొనియాడారు. గతంలో జరుక్ శాస్త్రి ఇలాంటి ప్రయోగాలు చేసేవారని గుర్తుచేశారు. సంపుటిలోని 12 వేల పైచిలుకు ఉన్న పదాలన్నీ ఫన్ పుట్టిస్తాయని అన్నారు. పాటల రచయిత రామారావు విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాషపై పట్టు ఉంటేనే పదప్రయోగంతో ఫన్ పుట్టించడం సాధ్యమవుతుందని చెప్పారు. గానసభ అధ్యక్షుడు కళాజానార్దనమూర్తి మాట్లాడుతూ శంకరనారాయణ రచనా వ్యాసంగం ఆరంభించి ఏభై ఏళ్లు పూర్తి అయిందని చెప్పారు. శంకరనారాయణ మాట్లాడుతూ మొదటిసారిగా కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావంతో అగ్నిసంగీతం కావ్యం రాశానని, తర్వాత ప్రముఖ దినపత్రికల్లో పలు శీర్షికలతో రాసిన సెటైర్లు నాటి రాజకీయ, ఇతర ప్రముఖులను ఆకర్షించాయని చెప్పారు. ఎనిమిది దేశాల్లో హాస్యావధానం చేశానని తెలిపారు. ఈ సందర్భంగా శంకర నారాయణను రచయిత్రి లక్కరాజు నిర్మల అభినందించారు.

జనసంద్రం గోల్కొండ కోట



గోల్కొండ కోటలో పర్యాటకులు

గోల్కొండ: నూతన సంవత్సరం వేడుకల నేపథ్యంలో బుధవారం గోల్కొండ కోట కిటకిటలాడింది. ఉదయం 7 గంటల నుంచే పర్యాటకులు తరలిరావడంతో జనసంద్రంగా మారింది. కోట మెయిన్ గేటుకు ఆనుకొని ఉన్న మైదానంలో టికెట్ కోసం పర్యాటకులు భారీగా బారులు తీరారు. మధ్యాహ్నం వరకు కోటకు సుమారు 25 వేల మంది పర్యాటకులు వచ్చారని గోల్కొండ హిస్టరీ గైడ్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మహ్మద్ హర్షద్ అహ్మద్ తెలిపారు. భారీగా తరలివచ్చిన పర్యాటకుల కోసం కోట అధికారులు ప్రత్యేక అదనపు కౌంటర్లను కూడా తెరిచారు. పిల్లలు, పెద్దలు కోటలో తిరుగుతూ సందడి చేశారు. చారిత్రక ప్రదేశాల వద్ద సెల్ఫీలు దిగుతూ సంబరపడ్డారు. కోట చౌరస్తా ఎదురుగా గల రెస్టారెంట్లల్లో మధ్యాహ్నం వరకు హోటళ్లలో ఉంచిన తినుబండారాల్లన్ని అయిపోయాయి. మరోవైపు కోటకు వచ్చిన పర్యాటకులు వాహనాలను పార్కింగ్ చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం ట్రాఫిక్ జామ్ తీవ్రంగా ఉండటంతో రాందేవ్‌గూడ చౌరస్తా వద్ద గల మిలటరీ ఏరియా వద్దనే వాహనాలను పార్కు చేసి సుమారు రెండు కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వచ్చారు.



సెల్ఫీ దిగుతున్న పర్యాటకులు

హ్యాండ్‌లూమ్ బ్యాగ్ ఆవిష్కరణ



హ్యాండులూమ్ బ్యాగును ఆవిష్కరిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: డాక్టర్ చిక్కా దేవదాసు రూపొందించిన హ్యాండ్‌లూమ్ బ్యాగు(చేనేత బట్టసంచి)ను పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ కోసం చేనేత సంచులను ఉపయోగించాలన్నారు. ప్రపంచ పర్యావరణ ప్రకృతి ప్రేమికుడిగా చిక్కా దేవదాసు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ప్లాస్టిక్‌ను నిషేధించి హ్యాండ్‌లూమ్ సంచులను వాడుకొని చేనేతకు చేయూతనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సాంబయ్య, వంగాల బాలరాజు గౌడ్, నిర్మల, మంజుల, అంజన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో కనెక్టివిటీకి మోక్షం

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే మర్రి కృతజ్ఞతలు

సాక్షి,సిటీబ్యూరో: ఉత్తర హైదరాబాద్‌లోని ప్యారడైజ్ నుంచిమేడ్చల్, అల్వాల్ మీదుగా శామీర్‌పేట వరకు మెట్రోరైలు ప్రాజెక్టుకు మోక్షం లభించనుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాల్సిందిగా అధికారులను ఆదేశించారని చెప్పారు. శాసనసభ సమావేశాల్లో ఉత్తర హైదరాబాద్‌లో మెట్రో కనెక్టివిటీ గురించి ప్రస్తావించడంతోపాటు సీఎంను కలసి వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. ఈ మేరకు సీఎం సానుకూలంగా స్పందించి ఉత్తర హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టుకు మార్గం సుగుమం చేయడంపట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

త్రివేణి సంగమం ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్, రాహుల్‌దాస్ బాబా

లంగర్‌హౌస్: కుంభమేళాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో పవిత్రమైనవని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. బుధవారం ఆయన లంగర్‌హౌస్‌లో అయోధ్య ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమం కుంభమేళా ప్రత్యేక ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లంగర్‌హౌస్ సంగం పీఠాధిపతి 1008 రాహుల్‌దాస్ బాబా, బి.శ్రీకాంత్‌చారి, వినేష్‌సింగ్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పండుగకు 15 లక్షల మంది హాజరు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్, కార్యదర్శి ఆర్.వాసు తదితరులు

బుక్ ఫెయిర్‌ను 14 రోజులకు పెంచే యోచన

కాచిగూడ: వచ్చే ఏడాది పుస్తక ప్రదర్శనను 14 రోజులకు పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నామని హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు డాక్టర్ యాకూబ్, కార్యదర్శి ఆర్.వాసు తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన పుస్తక ప్రదర్శనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. బుక్ ఫెయిర్‌కు అండదండగా నిలిచిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు, విజయవంతానికి విలువైన సలహాలిచ్చిన రాష్ట్ర గ్రంథాలయాల పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, కె.రామచంద్రమూర్తి, జస్టిస్ రాధారాణికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పుస్తకాల వితరణ బాక్స్‌కు విశేష ఆదరణ లభించిందన్నారు. 11 రోజుల పుస్తక ప్రదర్శనలో 15 లక్షల మంది పుస్తక ప్రియులు హాజరయ్యారనీ, ప్రారంభ సభకు సీఎం రేవంత్‌రెడ్డి, ముగింపుసభకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారని తెలిపారు. ప్రతిఏటా మాదిరిగానే ఈసారి కూడా హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కూడా పుస్తక ప్రదర్శనను సందర్శించారన్నారు. పిల్లలను, యువతను పుస్తక ప్రదర్శనకు రప్పించడంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ విజయవంతమైందని వారు చెప్పారు. 354 స్టాళ్లలో పుస్తకాల విక్రయాలు బాగా సాగాయని తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో పుస్తకాల వితరణ కోసం ఏర్పాటు చేసిన బాక్స్‌కు మంచి ఆదరణ లభించిందనీ, 5 వేలకుపైగా పుస్తకాలను దాతలు ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మలుపు బాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, స్వరాజ్ కుమార్, సాంబశివరావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు: పొన్నం



ప్రయాణికులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

జేబీఎస్‌లో మంత్రి ఆకస్మిక పర్యటన

కంటోన్మెంట్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్‌లో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో ముచ్చటించారు. రోడ్డు భద్రతామాసంలో భాగంగా డ్రైవర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్గో సెంటర్‌ను పరిశీలించి కార్గో పార్సిల్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. బస్‌స్టేషన్ ప్రాంగణంలో దుకాణాలను పరిశీలించి కాలం చెల్లిన ఆహార వస్తువులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు.

బాబా ఆశీర్వాదంతోనే ఎదిగాను

సుప్రీంకోర్టు మాజీ సీజేఐ జస్టిస్ రమణ



హెచ్.జె.దొరకు జ్ఞాపిక అందజేస్తున్న జస్టిస్ రమణ

నల్లకుంట: పుట్టపర్తి సాయిబాబా ఆశీర్వాదంతోనే తాను ఎదిగానని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. శ్రీ సత్యసాయి ట్రస్ట్, శ్రీసత్యసాయి సేవా ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నల్లకుంటలోని శివం ప్రాంగణంలో న్యూ ఇయర్ మ్యూజిక్ కాన్సర్ట్-2025 పేరిట 'భజరే గురుదైవం'కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా జస్టిస్ ఎన్వీ రమణ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. తాను హైదరాబాద్‌లో అడ్వకేట్‌గా ఉన్నప్పుడు పుట్టపర్తికి వెళ్లి సాయిబాబాను దర్శించుకున్న సందర్భంగా బాబాను ఇంటర్వ్యూ చేసే భాగ్యం తనకు లభించిందని చెప్పారు. ఆ సందర్భంలో బాబా తన కుటుంబాన్ని ప్రత్యేకంగా ఆశీర్వదించారని తెలిపారు. అనంతరం తాను అంచెలంచెలుగా ఎదుగుతూ హైకోర్టు న్యాయమూర్తిగా, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా సేవందించే భాగ్యం కలిగిందని చెప్పారు. అనంతరం శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ ఏపీ, తెలంగాణ కన్వీనర్, మాజీ ఐపీఎస్ హెచ్.జె.దొర, శ్రీ సత్యసాయి సేవా ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట రావు మాట్లాడుతూ ఈ ఏడాది సత్య సాయిబాబా శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ బి.బాలకృష్ణ, రసిక కళా భారతి విద్వాన్ డి.రాఘవాచారి, సంగీత విద్యాలయం విద్వాన్ విద్యానాథన్ బాలసుబ్రహ్మణ్యన్, శివమాల, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీత విద్వాంసుడు డాక్టర్ శివప్రసాద్ కొమరవోలు నిర్వహించిన కర్ణాటక సంగీత కచేరి ఆహుతులను ఆకట్టుకుంది.







సంపాదనకు కొదవలేకున్నా, సరదాలెన్నో అందుబాటులో ఉన్నా సంతోషం మాత్రం అల్లంత దూరంలో అందీ అందనట్టు ఊరిస్తూనే ఉంది. మన దేశం హ్యాపీ'లెస్'లో ముందుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దేశంలోని అనేక రకాల అనారోగ్యాలకు అంతుపట్టని మనోవ్యాధులకు ఇదే ప్రధాన కారణమని కూడా స్పష్టం చేస్తున్నాయి. హ్యాపీనెస్‌కి రానురానూ ప్రాధాన్యత పెరుగుతోంది. అదే క్రమంలో కొత్త సంవత్సరపు తీర్మానాల జాబితాలో సైతం సంతోషంగా జీవించడం ముందు వరుసలో చోటు దక్కించుకుంటోంది. ఈ నేపథ్యంలో సంతోషం గురించిన కొన్ని సంగతులు..

- సాక్షి, సిటీబ్యూరో

సంతోషం.. సంపూర్ణ బలం

కొత్త ఆలోచనలతో హ్యాపీ న్యూ ఇయర్

సంతోషం వెతుకుతున్న నగరవాసులు
హ్యాపీనెస్ కోసం రకరకాల మార్గాలు

దేశాన్ని సంతోషభరిత దేశంగా మార్చడం కోసం ప్రపంచ సంతోష దినోత్సవం సందర్భంగా 2022లో మార్చి 20న హ్యాపీనెస్ ఇండియా ప్రాజెక్ట్ ప్రారంభించారు. అదేవిధంగా గుజరాత్ యూనివర్సిటీ 'హ్యాపీనెస్ కౌన్సెలింగ్' అనే కొత్త సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించింది. వారాంతాల్లో నిర్వహించే ఈ మూణ్నెళ్ల కోర్సులో వేదాలు, ఉపనిషత్తుల బోధనలు, నృత్యం, సంగీతం, లాఫింగ్, ఆహారం ప్రసంగ చికిత్స ద్వారా ఒత్తిడిని నియంత్రించడంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. మధ్యప్రదేశ్‌లోనూ 'సంతోష మంత్రిత్వ శాఖ'ను ప్రకటించారు. జీడీపీ ద్వారా కాకుండా ఆనందాన్ని అంచనా వేయడం ద్వారా రాష్ట్ర పురోగతిని అంచనా చేయడం కోసం ఈ శాఖ పనిచేస్తుంది. ఆ తర్వాత 'ఆధ్యాత్మిక శాఖ' ఏర్పాటు చేసి, దానితో ఈ శాఖను విలీనం చేశారు. ఆ రాష్ట్రం హ్యాపీనెస్ ఇండెక్స్ సర్వే సైతం నిర్వహిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 8వ తరగతి వరకు ఈ అంశంపై పాఠ్యాంశాలు ప్రవేశపెట్టారు. అలాగే ఢిల్లీ యూనివర్సిటీ రామానుజన్ కాలేజ్, సెంటర్ ఆఫ్ ఎథిక్స్ అండ్ వర్చ్యూస్ ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ హ్యాపీనెస్ ఆరు నెలల కోర్సు అందిస్తోంది. భారత ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ జుడీషియల్ అకాడమీలలో సంతోషకరమైన తరగతులను ప్రతిపాదించారు. 'ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలోని వెల్ బీయింగ్ రీసెర్చ్ సెంటర్, యుఎన్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్ సంయుక్తంగా విడుదల చేసిన 2024 వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్‌లో 143 దేశాలలో భారతదేశం 126వ స్థానంలో నిలిచింది.'

సంతోషం ఎందుకు కోల్పోతున్నాం?



సాంకేతిక జీవనశైలి మార్పుల ప్రభావం లేదా సామాజిక నిబంధనల ఒత్తిడితో సమస్యలను ఎదుర్కోవడం వల్ల దేశంలోని 1.3 బిలియన్ల మంది ఏదో ఒక రకంగా బాధపడుతున్నారు. హార్వర్డ్ యూనివర్సిటీ నిర్వహించిన ఒక అధ్యయనం ఫలితాలను విశ్లేషిస్తే అనుబంధలేమి.. ఆనందమేదీ? స్నేహితులు కుటుంబ సభ్యులతో సన్నిహిత సంబంధాలు ఆనందానికి బాటలు వేస్తాయి. అవే జీవితంలోని అసంతృప్తుల నుంచి మనల్ని రక్షిస్తాయి. వయసు రీత్యా వచ్చే మానసిక శారీరక క్షీణతను ఆలస్యం చేస్తాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ పరిసరాలకు మార్పులు, న్యూక్లియర్ ఫ్యామిలీల వెల్లువ అనుబంధాల విచ్ఛిన్నానికి కారణమయ్యాయి. చాలామంది కుటుంబ సభ్యులతో క్రమం తప్పకుండా టచ్‌లో ఉండటం లేదు. వీరిలో చాలా తక్కువ మందికి మాత్రమే నిజమైన స్నేహితులున్నారు. పనివేళలు ముగిశాక సోషలైజేషన్ తగ్గిపోయింది.

సామాజిక మాధ్యమాల వల్ల ఏకాంతం..

మన దేశంలోని వృద్ధులే యువత కంటే సంతోషంగా ఉన్నారని వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్ వెల్లడించడం గమనార్హం. యువత ఆనందం కోసం సాంకేతికతపై అధికంగా ఆధారపడటం దీనికో కారణం. మన మెదడులో పుట్టే డోపమైన్(ఆనందం, సంతృప్తికి ప్రేరణ అందించే రసాయనం)ని సోషల్ మీడియా అల్గారిథమ్‌లు తాత్కాలికంగా ప్రేరేపిస్తాయి. అందుకే ఆన్‌లైన్‌లో గడిపే సమయం చాలా బాగున్నట్టు అనిపిస్తుంది. ఇది ఆరోగ్యకరమైన భావోద్వేగ వికాసానికి బాటలు వేయదు. స్నేహితులతో ముఖాముఖి సంభాషణ ఇచ్చే సంతోషాన్ని, నిద్ర వల్ల కలిగే ఆనందాల్ని దూరం చేస్తుంది.

యువతలో ఆందోళన..

యువతలో విజయం కోసం ఆకలి కొన్ని ప్రతికూల అంశాలతోనూ ముడిపడింది. ఏ విధంగానైనా సరే విజయం సాధించాలనే ఆతృత యువతలో ఆందోళనకు ఒత్తిడికి కారణమవుతోంది. వ్యక్తిగత లక్ష్యాలతో సామూహిక శ్రేయస్సు పట్ల ఆసక్తి పోయి స్నేహితులు కుటుంబ సభ్యుల మధ్య లోతైన సంబంధాలను కోల్పోవడం జరుగుతోంది

ప్లస్.. మైండ్‌ఫుల్ నెస్..

ట్రాక్ యువర్ హ్యాపీనెస్ అనే ఐ ఫోన్ యాప్ ట్రాకర్‌ని ఉపయోగించి హార్వర్డ్ మనస్తత్వవేత్తలు మాథ్యూ కిల్లింగ్స్‌వర్త్ డేనియల్ గిల్బర్ట్ నిర్వహించిన పరిశోధన ప్రకారం, మనం పనిచేసే గంటల్లో 47% ఏం జరగడం లేదు? అనే దాని గురించే ఆలోచిస్తున్నాం. ప్రస్తుతం మన చుట్టూ ఉన్న పరిస్థితులు, పరిసరాలపై కాకుండా వేరే అంశాలపై ఆలోచిస్తున్నాం. ఈ తరహా పగటి డ్రీమింగ్ మనకు సంతోషాన్నివ్వదు. దీనికి మన సంప్రదాయ మార్గాలైన మైండ్ ఫుల్ నెస్ సాధన, మెడిటేషన్‌లలో పరిష్కారం లభిస్తుంది. కారణాలేవైనా.. సంతోషాన్వేషణ అయితే తప్పనిసరి అని తెలుస్తున్న నేపథ్యంలో కొత్త సంవత్సరారంభ వేళ.. సాక్షి పలువురు నిపుణులతో సంభాషించి.. సంతోషార్థుల కోసం పలు సూచనలను అందిస్తోంది.






కన్నీరు పెట్టుకో.. కష్టాల్ని మర్చిపో..

కష్టాలు, సమస్యలు లేకుండా మనిషి జీవితం ఉండదు. అవి మర్చిపోవడానికి దేవుడు ఇచ్చిన వరం కన్నీరు. ఏడ్చిన తర్వాత మనసు తేలిగ్గా ఉంటుంది. ఏడుపు.. ఆరోగ్యానికి మదుపు.. క్రైయింగ్ పలు ఆరోగ్యకర లాభాలను అందిస్తుందనేది శాస్త్రీయంగా రుజువైన విషయం. అయితే ఆధునిక సమాజంలో బాధ వచ్చినప్పుడు రకరకాల కారణాల వల్ల దుఃఖాన్ని దిగమింగుకోవడం జరుగుతోంది. ఇది మరింతగా ఆరోగ్యానికి హాని చేస్తోంది. దానికి బదులుగా కాసేపు మనసారా ఏడవనిస్తే మనసుకు చాలా నిశ్చింతగా తేలికగా అనిపిస్తుంది. అది మనల్ని బాధాకరమైన అనుభవం నుంచి దూరంగా తీసుకెళుతుంది. ఏడుపు వల్ల మనసు మాత్రమే కాదు కళ్లు, కన్నీటి వాహికలు సైతం శుభ్రపడతాయి. సాధారణ కంటి సమస్యలకు వాడే ఐడ్రాప్స్‌కి ఇది మేలైన ప్రత్యామ్నాయం అని చాలా మందికి తెలీదు. అందుకే మనకు బాధ కలిగించిన వాటిని గుర్తు చేసుకుంటూ కనీసం వారానికో కుదరకపోతే కనీసం నెలకు ఒకసారైన తనివిదీరా కళ్లమ్మట నీళ్లు పెట్టుకోవాలి. - కమలేష్, క్రైయింగ్ అండ్ లాఫర్స్ క్లబ్ నిర్వాహకులు



అంచనాలను మరచితేనే.. ఆనందం..




ఆనందం, దాని స్వచ్ఛమైన రూపంలో, బాహ్య పరిస్థితులపై ఆధారపడిన భావోద్వేగం కాదు. అంతర్గత సామరస్యం నుంచి ఉత్పన్నమయ్యే శాశ్వత స్థితి. నిజమైన ఆనందం కోరికల నుంచి విముక్తి పొందడం. దీని అర్థం ఆకాంక్షను కలిగి ఉండకూడదని లేదా అంకితభావంతో మన లక్ష్యాలను కొనసాగించక్కర్లేదని కాదు. మన కోరికలు, లక్ష్యాలు ఆకాంక్షలు ఉండటమే మనల్ని మనుషులుగా మారుస్తుంది. ఖచ్చితంగా లక్ష్యాల కోసం పని చేయండి. అయినప్పటికీ జరుగుతున్నది అంగీకరించి సంతోషంగా ఉండండి. ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ఆనందాన్ని కాపాడుకోగలిగేవారే అత్యంత సంతోషకరమైన వ్యక్తులు అని నా ఆధ్యాత్మిక గురువు షాజహాన్ పూర్‌కి చెందిన శ్రీరామ్ చంద్ర అంటారు. మన అంచనాలను తగ్గించుకోవడం ద్వారా, కోరికల చక్రం నుంచి మనల్ని మనం విడిపించుకుంటాం. అంతర్గతంగా నిజమైన ప్రశాంతత కనుగొంటాం. ఇది అంతర్గత శాంతికి అనంతమైన ఆనందానికి దారి తీస్తుంది. ఈ మార్గంలో జీవించడానికి అత్యుత్తమ సాధనం ధ్యానం.

- కమలేష్ పటేల్ (దాజి),
హార్ట్‌ఫుల్ నెస్ ఇన్‌స్టిట్యూట్





ఆహారం.. ఆనందం..



జపనీస్ కల్చర్‌లో టీ సెర్మనీ అని ఉంటుంది. ఇది ఓ రకంగా టీ పార్టీ లాంటిది. ఇందులో పాల్గొన్న వారికి కప్స్‌లో కాకుండా బౌల్‌లో తేనీటిని ఇస్తారు. ఆ బౌల్ మీద విభిన్న రకాల జపనీస్ చిత్రాలు ఉంటాయి. టీ తాగేవారు చప్పుడు చేస్తూ తాగాలి.. ఆ బౌల్ మీద ఉన్న బొమ్మల్ని గుర్తించాలి. టీ రుచి గురించి మాట్లాడాలి. తయారు చేసిన వారికి ధన్యవాదాలు తెలియజేయాలి. ..ఇదంతా ఎందుకంటే.. ఆ మూమెంట్‌లో బతకడం అనేది అలవాటు కావాలని ఇలా చేస్తారు. బరువు తగ్గడం, పెరగడం, ఆరోగ్యం, అనారోగ్యం.. వీటన్నింటి చుట్టే మనం ఆలోచిస్తాం. కానీ ఆహారం అనేది అత్యంత భావోద్వేగ భరిత అంశం. సంస్కృతి సంప్రదాయాలతో మొదలుకుని అనేక రకాల అనుభూతులతో ఆహారం ముడిపడి ఉంటుంది. సంక్రాంతి సమయంలో అరిసెలు తినడం ఒక ప్రత్యేకమైన భావోద్వేగాన్ని కలిగిస్తుంది. అలాగే వినోదమైనా, విషాదమైనా వాటిలో విందులను భాగం చేయడం కూడా అలాంటిదే. ఆహారం అనేది మన మూడ్‌ని ఎలివేట్ చేస్తుంది కాబట్టే. ఒక రుచికరమైన పదార్థాన్ని చూడగానే తినాలనిపించడం, నోట్లో నీళ్లూరడం, అవి నోటిలోకి వెళ్లగానే ఆ రుచికి మనలో కలిగే స్పందనలు.. ఇవన్నీ కూడా ఫుడ్ ఇంపాక్ట్‌కి నిదర్శనాలు. తినేటప్పుడు కరకరమని సౌండ్ వచ్చే పదార్థాలు మరింత ఎక్కువ సంతృప్తిని అందిస్తాయని, అందువల్లే చిప్స్ వంటివి ఎక్కువగా తింటామని ఒక అధ్యయనం చెబుతోంది. పాలు మరుగుతున్నప్పుడు వచ్చే వాసన కూడా బ్రెయిన్ కెమికల్‌ని యాక్టివేట్ చేస్తుంది. ఇక పండ్లలో యాంటిఆక్సిడెంట్స్ ఒత్తిడిని తొలగించి మనసు తేలికైన భావన అందిస్తాయి.

- డా.జానకి, న్యూట్రిషనిస్ట్

ఆరోగ్యమే.. ఆనందం..

నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్నాం. ఆరోగ్యాన్ని తీర్చిదిద్దుకోవడంపై దృష్టి పెట్టడానికి ఇంతకంటే మంచి సమయం లేదు. ఆరోగ్యాన్ని మించిన ఆనందం లేదు. చిన్నపాటి, స్థిరమైన మార్పులు దీర్ఘకాలం పాటు సంతృప్తికరమైన సంతోషకర జీవితాన్ని గడిపేందుకు సహాయపడతాయి. కాలుష్యం విజృంభిస్తోంది. పురుగు మందులు వాయు కాలుష్య కారకాల వల్ల హానికరమైన పదార్థాలు శరీరంలో పేరుకుపోయి దీర్ఘకాలిక వ్యాధులకు దారి తీస్తాయి. కాలుష్యానికి వీలున్నంత దూరంగా జీవించే ప్రయత్నం చేయాలి. దీర్ఘకాలిక ఒత్తిడి బలహీనమైన రోగనిరోధక వ్యవస్థకు దారితీస్తుంది. ధ్యానం, యోగా లేదా శ్వాస సంబంధ వ్యాయామాలు వంటి ఒత్తిడిని తగ్గించే కార్యకలాపాలను దినచర్యలో చేర్చాలి. నాణ్యమైన నిద్ర లేకపోవడం వల్ల అలసటకు అనారోగ్యాలకు ఎక్కువ అవకాశం ఉంది. కాబట్టి ప్రతి రాత్రి 7–9 గంటల నాణ్యమైన నిద్రను లక్ష్యంగా పెట్టుకోండి. స్క్రీన్ సమయాన్ని పరిమితం చేయండి. ప్రాసెస్ చేసిన ఆహారాలు, ప్లాస్టిక్‌లు కొన్ని సౌందర్య సాధనాల్లో కనిపించే రసాయనాలు శరీర సహజ సమతుల్యతను దెబ్బతీస్తాయి. ఊబకాయం, కేన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. ప్రాసెస్ చేయని ఆహారాలను గుర్తించి వదిలిపెట్టాలి. చక్కెర, అనారోగ్య కొవ్వులు అధికంగా ఉన్నవి తగ్గించాలి. పండ్లు, కూరగాయలు, లీన్ ప్రోటీన్లు ఆరోగ్యకరమైన కొవ్వులను భోజనంలో చేర్చాలి. రెగ్యులర్ వైద్య పరీక్షల ద్వారా వ్యాధి తీవ్రంగా మారకముందే గుర్తించవచ్చు. తద్వారా జీవనశైలి ఆరోగ్య విధానాలపై సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు.

- డా.సమత తుల్ల, జనరల్ ఫిజిషియన్

నవ్వు నలభై విధాల రైటు..




బాహ్యంగా మనం కోరుకున్నది దక్కినప్పుడు సంతోషం వస్తుంది. అయితే ఎప్పుడూ మనం కోరుకున్నది దక్కుతుందని గ్యారెంటీ లేదు కాబట్టి ఆ మార్గంలో దీర్ఘకాల సంతోషానికి గ్యారెంటీ లేదు. మరో మార్గం మన అంతర్గతంగా పొందేది. పాడటం, నృత్యం చేయడం, ఆడుకోవడం, నవ్వుకోవడం వంటి వాటి వల్ల మనకు అంతర్గత ఆనందం వస్తుంది. దీని ద్వారా సెరటోనిన్, ఆక్సిటోసిన్ వంటి కొన్ని రకాల హ్యాపీ కెమికల్స్ ఉత్పత్తి జరుగుతుంది. పరిస్థితులు సంతోషం కలిగించకపోయినా నవ్వడం ద్వారా మూడ్‌ని మార్చుకోవచ్చు. ఇక్కడ నవ్వును మనం ఒక వ్యాయామంలా భావించాలి. మరికొందరితో కలిసినప్పుడు సులభంగా నవ్వడం సాధ్యం. సహజంగా పుట్టే నవ్వు వల్ల కలిగే లాభాలకు, నవ్వాలని కోరుకుని నవ్వడం ద్వారా వచ్చే ఆరోగ్య ఫలితాలకు మధ్య ఎటువంటి వ్యత్యాసం లేదని శాస్త్రీయంగా నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలోనే మా లాఫ్టర్ యోగా.. ద్వారా వేల సంఖ్యలో సభ్యులు హాయిగా ఆనందంగా నవ్వుతున్నారు.



- డాక్టర్ మదన్ కటారియా,
లాఫ్టర్ యోగా విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు

సంతోషం సహజ లక్షణం..



సంతోషం అనేది మన సహజ లక్షణం స్వాభావికం. కానీ రకరకాల ప్రభావాలతో దాన్ని మనం పోగొట్టుకుంటున్నాం. పసిపిల్లాడు.. 400సార్లు నవ్వుతాడు. కాస్త పెద్దయి రెండేళ్ల వయసుచ్చేసరికి 200 సార్లు నవ్వుతాడు. 16ఏళ్లు వచ్చేసరికి 16 సార్లే నవ్వుతాడని అధ్యయనాలు చెబుతున్నాయి. సంతోషం ప్రాణశక్తితో లింక్ అయి ఉంది. పిల్లల్లో ప్రాణశక్తి హైలెవల్‌లో ఉంటుంది. మన శ్వాస, భావోద్వేగాలకు సంబంధం ఉంది. మనం సంతోషంగా ఉంటే ఒక రకంగా శ్వాసిస్తాం. ఆగ్రహంగా ఉన్నప్పుడు మరో రకంగా శ్వాసిస్తాం. వీటి మధ్య వ్యత్యాసం పసిగడితే కోపం వల్ల కలిగే నష్టం అర్థమవుతుంది. అలాగే రేపేం జరుగుతుందో అనే ఆందోళనతో కాదు. ప్రస్తుతంతో ముడిపడి ఉన్నప్పుడు మాత్రమే సంతోషంగా ఉండగలం. దీనికి సుదర్శన క్రియ బాగా దోహదం చేస్తుంది. విజయం కోసం మనం సంతోషాన్ని పణంగా పెడుతున్నాం. కానీ చెదరని చిరునవ్వుతో ఉండటమే నిజమైన విజయం. ఇలా జరిగితే హ్యాపీగా ఉంటాను, అలా జరిగితే హ్యాపీగా ఉంటాను అనే ఆలోచనలతో ఉండొద్దు. చిన్నారులు ఎందుకు సంతోషంగా ఉంటారు? వారికి సంతోషంగా ఉండడానికి కారణాలు అక్కర్లేదు కాబట్టి.. మన మనసు జరిగినదో, జరగబోయేదో.. దాని గురించే ఆలోచిస్తుంది. ప్రాణాయామ, సుదర్శన క్రియలతో సంతోషాన్ని పెంచుకోవడం వీలవుతుంది.

- పండిట్ రవిశంకర్,
ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు



ఆనందం.. ఆక్సిజన్..



ఆనందం అనేది పూర్తిగా వ్యక్తిగత విషయం. కాబట్టి ఎవరైనా సరే తమ సొంత జీవితాన్ని పరిశీలించి, 'నా ఆనందం ఏమిటి, నా ఉద్దేశ్యం ఏమిటి, సామాజిక సేవ పట్ల నా ఆలోచన ఏమిటి? విశ్లేషించుకుని తన సొంత ఆనందాన్ని నిర్వచించుకోవాలి. మనం పని, డబ్బు సంపాదించే విధానం శారీరక మానసిక ఆరోగ్యం వీటి గురించే ఆలోచిస్తాం. అయితే మనం సంతోషంగా ఉన్నప్పుడు, మనం పనిలో మరింత మెరుగవుతామని ఉత్పాదకత పెంచగలుగుతామని సృజనాత్మకంగా ఉంటామని అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి అన్నింటికన్నా ముందు సంతోషంగా ఉండాలని నిర్ణయించుకోవాలి. ఒత్తిడి అనేది మన మొదటి సైలెంట్ కిల్లర్, సంతోషంగా ఉన్నప్పుడు ఒత్తిడి తగ్గుతుంది. ఒత్తిడి తక్కువగా ఉంటే ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. మనం సంతోషంగా ఉన్నప్పుడు, మంచి మూడ్‌లో ఉంటాం. ఇతరుల మాటలను వింటూ వారిని గౌరవిస్తాం. మంచి సంబంధాలు పెంచుకుంటాం. సంతోషంగా ఉన్నప్పుడు, పని మెరుగ్గా ఉంటుంది. సంబంధాలు మెరుగ్గా ఉంటాయి. ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని అర్థం చేసుకోవాలి.

- రాజేష్.కె.పిల్లానియా, ఇండియాస్ హ్యాపీనెస్ ప్రొఫెసర్


మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు నేత తారక్క

మల్లోజుల భార్య తారక్క లొంగుబాటు

సాక్షి, పెద్దపల్లి: మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు భార్య తారక్క మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయారు. బుధవారం 11 మంది మావోయిస్టులు లొంగిపోగా అందులో పెద్దపల్లి జిల్లాకు చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్‌రావు ఉరఫ్ భూపతి భార్య తారక్క ఉరఫ్ విమల.. సీఎం ఎదుట ముంబైలో లొంగిపోయారు. ఈమె 1983లో నక్సలిజం వైపు ఆకర్షితురాలై ఉద్యమంలోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలిగా కొనసాగుతున్నారు. ఆమెపై నాలుగు రాష్ట్రాల్లో 170కి పైగా కేసులు నమోదై ఉన్నాయి. తారక్క తలపై రూ.25 లక్షల వరకు రివార్డు ఉంది. మల్లోజుల కోటేశ్వర్‌రావు, వేణుగోపాల్‌రావు అన్నదమ్ములు. కోటేశ్వర్‌రావు ఉరఫ్ కిషన్‌జీ మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్న సమయంలో 2011లో పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. ఆయన సోదరుడు వేణుగోపాల్‌రావు ఉరఫ్ భూపతి ప్రస్తుతం సెంట్రల్ కమిటీ సభ్యుడిగా, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు.

ఏదుల నుంచే 'డిండి'కి నీళ్లు!

- రూ.1,788.89 కోట్లతో ఏదుల–డిండి అలైన్‌మెంట్ అంచనాలు సిద్ధం
- 4న రాష్ట్ర మంత్రివర్గం భేటీ ముందుకు ప్రతిపాదనలు
- కేబినెట్ ఆమోదం తర్వాత పరిపాలనా అనుమతులు, టెండర్లు
- ఇప్పటివరకు 55 శాతం పూర్తయిన డిండి ఎత్తిపోతల పనులు
- భూసేకరణ, పర్యావరణ చిక్కులతో ముందుకు సాగని ప్రాజెక్టు



సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఏదుల (వీరాంజనేయ) రిజర్వాయర్ నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీళ్లను తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఏదుల రిజర్వాయర్ నుంచి పోతిరెడ్డిపల్లి చెక్‌డ్యామ్‌కు నీళ్లను తరలించే అలైన్‌మెంట్ పనులకు రూ.1,788.89 కోట్ల అంచనా వ్యయంతో నీటిపారుదల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ నెల 4న జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముందుకు ఈ ప్రతిపాదనలు రానున్నాయి. మంత్రివర్గం ఆమోదించిన వెంటనే పనులకు పరిపాలనా అనుమతులు జారీ చేసి, ఆ వెంటనే టెండర్లు పిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

27 కి.మీ.ల అనుసంధానం

ఏదుల రిజర్వాయర్ నుంచి పోతిరెడ్డిపల్లి చెక్‌డ్యామ్‌కు గ్రావిటీ ద్వారా నీళ్లను తరలించేందుకు 800 మీటర్ల అప్రోచ్ కాల్వను.. ఆ తర్వాత వరుసగా 2.525 కి.మీ.ల ఓపెన్ కెనాల్, 16 కి.మీ.ల సొరంగం, 3.05 కి.మీల ఓపెన్ కెనాల్, 6.325 కి.మీల వాగు నిర్మాణం కలిపి మొత్తం 27.9 కి.మీ.ల పొడవున కాల్వలు, సొరంగం పనులు చేపడతారు. వనపర్తి జిల్లాలోని ఏదుల రిజర్వాయర్ నుంచి పోతిరెడ్డిపల్లి చెక్‌డ్యామ్‌కు.. అక్కడి నుంచి ఉల్పర బరాజ్, డిండి, సింగరాజుపల్లి, ఎర్రపల్లి–గోకవరం, ఇర్వేన్, గొట్టిముక్కల, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్లకు నీళ్లను తరలిస్తారు.

55 శాతం పనులు పూర్తి

శ్రీశైలం జలాశయం ఫోర్‌షోర్ నుంచి రోజుకు 0.5 టీఎంసీ చొప్పున 60 రోజులపాటు మొత్తం 30 టీఎంసీల నీటిని తరలించి ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని దేవరకొండ, మునుగోడు, నాగార్జునసాగర్, నకిరేకల్, నల్లగొండ, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల్లో 3.61 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు డిండి ఎత్తిపోతల పథకాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టింది. రూ.6,190 కోట్ల అంచనాలతో 2015 జూన్ 11న ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతులు జారీ అయ్యాయి. ప్రాజెక్టు మొత్తంలో ఇప్పటివరకు రూ.3,441.89 కోట్ల విలువైన పనులు పూర్తి కాగా, మరో రూ.2,748.11 కోట్ల విలువైన పనులు చేపట్టాల్సి ఉంది. ఈ లెక్కన ఇప్పటివరకు 55 శాతం పనులు పూర్తయినట్టే. గతంలో రూ.3,929.66 కోట్లతో 7 ప్యాకేజీల పనులకు టెండర్లు ఆహ్వానించి కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకున్నారు. మిగిలినపనులకు ఇంకా టెండర్లు నిర్వహించలేదు. ఇప్పటివరకు 12,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుబాటులోకి రాగా, ఇంకా 3,49,000 ఎకరాల ఆయకట్టుకు రావాల్సి ఉంది. మిగిలిన 45 శాతం పనులు పూర్తయితే మొత్తం ఆయకట్టుకు సాగునీరు అందుతుంది.

రిజర్వాయర్లకు భూసేకరణ సమస్య

ఈ ప్రాజెక్టులో భూసేకరణ సమస్యలతో రిజర్వాయర్ల పనులు ముందుకు సాగడం లేదు. సింగరాజుపల్లి (85 శాతం), గొట్టిముక్కల (98 శాతం) రిజర్వాయర్ల పనులు దాదాపుగా చివరి దశలో ఉన్నాయి. కిష్టరాంపల్లి (70 శాతం), శివన్నగూడెం (70 శాతం) రిజర్వాయర్ల పనులు పురోగతిలో ఉన్నాయి. భూసే కరణ సమస్యలతో చింతపల్లి (0 శాతం), ఎర్రపల్లి–గోకవరం (26 శాతం) రిజర్వాయర్ల పనులు ప్రారంభ దశలోనే నిలిచిపోయాయి. ఇదే సమస్యతో ఇర్వేన్ రిజర్వాయర్ పనులు మొదలే కాలేదు. ప్రాజెక్టు అవసరాలకు 16,030 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించారు. ఇప్పటివరకు 12,052 ఎకరాలు సేకరించగా, మిగిలిన 3,977 ఎకరాలు సేకరించాల్సి ఉంది.

వీడని పర్యావరణ చిక్కులు

పర్యావరణ అనుమతులు లేకుండానే డిండి ప్రాజెక్టు పనులను చేపట్టినందుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) 2022 డిసెంబర్ 12న రాష్ట్ర ప్రభుత్వానికి రూ.92.85 కోట్ల జరిమానా విధించడంతో పాటు పనులపై స్టే విధించింది. ఎన్జీటీ స్టే ఎత్తేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉంది. మరోవైపు పర్యావరణ అనుమతులు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. పర్యావరణ అనుమతులు సాధించే పనులను రూ.87.75 లక్షలతో ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ)కు 2022 ఫిబ్రవరిలో ప్రభుత్వం అప్పగించినా, ఆశించిన ఫలితం కనిపించలేదు.

మద్యం మత్తుకు ఇద్దరి బలి

- మత్తులో చెరువులో స్నానానికి దిగి ఒక యువకుడు.. పర్మిట్ రూమ్‌లో విపరీతంగా తాగి మరో యువకుడు


పర్మిట్ రూమ్‌లో విగత జీవిగా పడి ఉన్న ధనుంజయ్

రామారెడ్డి /నస్రుల్లాబాద్ (బాన్సువాడ): నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో అతిగా మద్యం తాగిన ఇద్దరు వేర్వేరు ఘటనలలో మృతి చెందారు. మద్యం మత్తులో ఒక యువకుడు చెరువులో దిగి మరణించగా, మరో యువకుడు పర్మిట్ రూమ్‌లోనే కన్నుమూశాడు. కామారెడ్డి జిల్లాలో జరిగిన ఈ రెండు ఘటనల వివరాలివి.

రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన పొట్టిగారి శివప్రసాద్ (28) డిసెంబర్ 31న స్నేహితులతో కలిసి పార్టీలో పాల్గొన్నాడు. అధికంగా మద్యం తాగి మత్తులో ఉన్న శివప్రసాద్.. స్నానం చేయడానికి రాత్రి పూట గ్రామ శివారులోని పటేల్ చెరువులోకి దిగాడు. చెరువులోకి దిగిన అన్న ఎంతకూ రాకపోవడంతో అతని తమ్ముడు జగదీశ్వర్.. శివప్రసాద్‌ను ఒడ్డుకు తీసుకువచ్చాడు. అపస్మారక స్థితిలో ఉన్న శివప్రసాద్‌ను కామారెడ్డిలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు.

నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలోని బాలాజీ వైన్స్ పర్మిట్ రూంలో మంగళవారం అర్ధరాత్రి వరకు మద్యం తాగిన పురం ధనుంజయ్ (28) అనంతరం ఇంటికి వెళ్లాడు. ఫోన్ మరిచిపోవడంతో పర్మిట్ రూమ్ వద్ద వెతకడానికి వెళ్తున్నట్లు తండ్రి నాగనాథ్‌కు చెప్పాడు. రెండోసారి పర్మిట్ రూమ్‌కు వెళ్లిన ధనుంజయ్ మళ్లీ మద్యం తాగాడు. కాగా అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో పర్మిట్‌రూమ్‌లో పనిచేసే వ్యక్తి వచ్చి.. ధనుంజయ్ తాగి పడిపోయాడని చెప్పినట్లు తండ్రి నాగనాథ్ పేర్కొన్నారు. ఆటోలో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లావణ్య తెలిపారు.


శివప్రసాద్ (ఫైల్)

సాగర్‌లో ఇద్దరు యువ ఇంజనీర్ల గల్లంతు

- ఈత కొడుతుండగా ప్రమాదం

మిర్యాలగూడ టౌన్: నాగార్జునసాగర్ ఎడమకాల్వలో ఇద్దరు యువ ఇంజనీర్లు గల్లంతయ్యారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఐలాపురం వద్ద బుధవారం జరిగిన ఈ సంఘటనపై మిర్యాలగూడ రూరల్–2 ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలివి. దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఒక కాంట్రాక్టర్ వద్ద 8 మంది ఇంజనీర్లు పని చేస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం సెలవు కావడంతో.. వారంతా మిర్యాలగూడ మండలం ఐలాపురం వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాల్వలో ఈత కొట్టేందుకు వచ్చారు. వారు కాల్వలో ఈత కొడుతుండగా.. ప్రమాదవశాత్తు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యువ ఇంజనీర్లు కార్తీక్ మిశ్ర (24), విజయ్ గోస్వామి (25) కొట్టుకుపోయారు. వెంటనే మరో ఇంజనీర్ 100 నంబర్‌కు కాల్ చేశాడు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ–2 సీహెచ్ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన ఇంజనీర్ల ఆచూకీ లభ్యం కాలేదని ఎస్ఐ తెలిపారు.

సీఎంఆర్ కాలేజీలో వీడియోల కలకలం

వాష్‌రూంలో విద్యార్థినుల వీడియోలు తీశారని ఆరోపణ

- విద్యార్థి సంఘాల ఆందోళన... పరిస్థితి ఉద్రిక్తం

మేడ్చల్ రూరల్: హైదరాబాద్ శివార్లలోని సీఎంఆర్ గ్రూప్స్ విద్యా సంస్థల్లో ఉన్న విద్యార్థినుల హాస్టల్ గది వాష్‌రూంలో మొబైల్ ఉంచి వీడియోలు తీయటానికి ప్రయత్నించటం కలకలం రేపింది. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ క్యాంపస్‌లోని విద్యార్థినుల హాస్టల్–2లో బుధవారం మధ్యాహ్నం ఒక బాత్‌రూం పై భాగంలో సెల్‌ఫోన్‌ను గుర్తించిన ఒక విద్యార్థిని.. తోటి విద్యార్థులకు, హాస్టల్ వార్డెన్‌కు సమాచారం ఇచ్చింది. కళాశాల యాజమాన్యం ఫిర్యాదుతో అక్కడికి చేరుకున్న మేడ్చల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కళాశాల క్యాంటీన్‌లో పనిచేసే బీహార్‌కు చెందిన నలుగురు యువకులు విద్యార్థినుల వీడియోలు చిత్రీకరించేందుకు యత్నించినట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారితోపాటు కార్మికులందరి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని పరిశీలించగా.. విద్యార్థినులకు సంబంధించిన ఎలాంటి వీడియోలు లభించలేదు. వీడియోల విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ విద్యార్థి సంఘాలు.. కళాశాల వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. పలు భవనాల పద్దాలు ధ్వంసం చేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. ఘటనపై పూర్తి దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


సీఎంఆర్ హాస్టల్ ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు

గుండెపోటుతో యువకుడి మృతి


రాకేశ్ (ఫైల్)

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లికి చెందిన ఆకునూరి రాకేశ్ (25) గుండెపోటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారుల వేధింపులతోనే రాకేశ్ చనిపోయాడని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వంగపల్లికి చెందిన రాకేశ్ గతేడాది జనవరిలో ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో రూ.75 వేల రుణం తీసుకున్నాడు. ఇందుకు ప్రతి నెలా రూ.4,350 చొప్పున 24 నెలలు చెల్లించాలి. కానీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా నాలుగు నెలలుగా కిస్తీలు కట్టడం లేదు. దీంతో ఫైనాన్స్ వాళ్లు రాకేశ్ ఇంటికి వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని, అంతటితో ఆగకుండా రాకేశ్ కుటుంబం గూడూరులోని బంధువుల ఇంట్లో ఉండగా అక్కడికి కూడా వెళ్లి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఫైనాన్స్ వేధింపులు తట్టుకోలేక రాకేశ్ గుండెపోటుకు గురయ్యాడని, చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య, ఏడు నెలల పాప ఉన్నారు. రాకేశ్ మృతికి కారణమైన ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్తులు కోరుతున్నారు.

● టీన్స్ కోసం ఆన్‌లైన్ కోర్సులు

డ్రగ్స్, డిజిటల్ డిస్ట్రాక్షన్స్ నుంచి టీనేజర్స్‌ని బయటపడేసే ప్రయత్నానికి పయనీర్‌గా నిలిచింది హైదరాబాద్‌కి చెందిన పద్నాలుగేళ్ల అమ్మాయి.. డిజిటల్ సేఫ్టీ వెల్‌నెస్, డ్రగ్స్ ఫ్రీ- వెల్‌నెస్ ఆన్‌లైన్ కోర్స్‌లను డిజైన్ చేసి! వాటికి తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సర్టిఫికెట్స్‌నీ అందిస్తోంది! ఆమె పేరు సంస్కృతి. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ఎనిమిదవ తరగతి చదువుతోంది.


సంస్కృతి

● డిజిటల్ సేఫ్టీ వెల్‌నెస్, డ్రగ్స్ ఫ్రీ వెల్‌నెస్

ఇదీ మన సంస్కృతి

డిజిటల్ డిస్ట్రాక్షన్, డ్రగ్ అడిక్షన్.. అందరినీ కలవరపరుస్తున్నా వాటికి వల్నరబుల్‌గా ఉంటోంది మాత్రం టీనేజర్సే అని గ్రహించింది సంస్కృతి.. తన వాలంటీరింగ్ అనుభవాల ద్వారా, తోటి పిల్లల ద్వారా. వాటి బారిన వాళ్లెందుకు, ఎలా పడుతున్నారు? ఆ ప్రభావానికిలోనై ఎలా ప్రవర్తిస్తున్నారు? అసలా ఊబిలో పడకుండా ఉండేందుకు ఏం చేయాలి? అని ఆలోచించి, ఓ ప్రశ్నావళిని తయారుచేసి మానసిక వైద్యులు, మానసిక విశ్లేషకులు, సామాజిక వేత్తల ముందుంచింది. వాళ్ల చర్చల సారాన్ని టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ సహాయంతో 'డిజిటల్ సేఫ్టీ వెల్‌నెస్', 'డ్రగ్స్ ఫ్రీ వెల్‌నెస్' అనే రెండు ఆన్‌లైన్ కోర్స్‌లను డిజైన్ చేసింది. ఫీడ్‌బ్యాక్ కోసం వంద మంది టీనేజ్ స్టూడెంట్స్‌కి ఆ కోర్స్ మాడ్యూల్స్‌ని చూపించింది. కంటెంట్ బాగుంది, కానీ చెప్పే విధానం ఆసక్తికరంగా లేదన్న అభిప్రాయాలు వచ్చాయి. సమీక్షించుకుంటే తనకూ అదొక కౌన్సెలింగ్‌లా అనిపించింది. టీనేజర్స్‌కెప్పుడూ ఎదుటివాళ్లు జడ్జ్ చేస్తారేమోనన్న భయం ఉంటుంది. ఆ జంకుతో మనసువిప్పి మాట్లాడరు. అంతే కాదు వద్దన్నదే చేయాలన్న కుతూహలమూ జాస్తే! ఈ కోణంలోనూ ఆలోచించి, మొత్తం కోర్స్ మాడ్యూల్స్‌ని నిజ జీవిత సంఘటనలకు అన్వయించి చాట్ ఫార్మాట్‌లో రీడిజైన్ చేసింది. వాటికి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ కావాలి కాబట్టి అక్క ప్రకృతి సహాయంతో 'క్రియేట్ ఎడ్యుటెక్' అనే వెబ్‌సైట్‌ను స్టార్ట్‌చేసింది. ఈ మొత్తం ప్రక్రియకు ఎనిమిది నెలలు పట్టింది. ఆఫ్‌లైన్‌లోనూ సేవలందించడానికి 'ఎడిస్టిస్ ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థతో పని చేస్తోంది సంస్కృతి. యాప్స్ అవసరం లేని ఈ కోర్సులకు మొబైల్ డేటా ఉంటే చాలు. వీటిని పూర్తి చేసినవారికి సర్టిఫికెట్స్ ఇవ్వడానికి తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ముందుకు వచ్చింది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోని పలు స్కూల్స్, కాలేజీల్లో ఈ కోర్సులు లాంచ్ అయ్యాయి. ఇప్పటివరకు పదివేల మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నారు. ఈ కోర్స్‌లను సర్కారు బడుల్లోని విద్యార్థులకు ఉచితంగా అందిచాలనేది సంస్కృతి లక్ష్యం. కార్పొరేట్ స్కూల్స్‌కి మాత్రం నామమాత్రపు రుసుముంటుందని చెబుతోంది. టీనేజర్స్‌కి 'రెసిస్టెన్స్, రెజిలియెన్స్' కల్పించడమే ఈ కోర్సుల ముఖ్య లక్ష్యం. డిజిటల్ డిస్ట్రాక్షన్, డ్రగ్స్ అడిక్షన్.. దేన్నయినా అవగాహనతో తిరస్కరించడం మొదటిదైతే, ఆ అడిక్షన్ నుంచి విజయవంతంగా బయటకు వచ్చి, ఆరోగ్యకర జీవితాన్ని గడపడం రెండవది. ఆ వలలో పడకుండా ఉండటమే కాదు, అలాంటి వాతావరణాన్ని వ్యాపించకుండా చూసే బాధ్యతనూ ఎలా తీసుకోవాలో కూడా చేతన కల్పిస్తాయీ కోర్సులు అని చెబుతుంది సంస్కృతి.

> వై, వై నాట్, వాట్, హౌ, వేర్, వెన్ లాంటి ఇంగ్లిష్ డబ్ల్యూసే నా బెస్ట్ ఫ్రెండ్స్. వాటితోనే నా లెర్నింగ్, గ్రోత్, అచీవ్‌మెంట్! ఏజీసీడీఈ.. అంటే అంబిషస్, బోల్డ్, క్రియేటివ్ అండ్ క్యూరియస్, డిటర్మైండ్, ఎంపథిటిక్‌గా నన్ను నేను డిస్క్రైబ్ చేసుకుంటాను. శరీర నిర్మాణంలో తేడాలుండొచ్చు కానీ, చేసే పనికి, ప్రయత్నానికి బాయ్స్, గర్ల్స్ అనే తేడా ఉండదని, పది మందికి మేలు చేయగలగడమే నిజమైన అచీవ్‌మెంట్ అని చెప్తారు మా పెద్దవాళ్లు. ఆ స్ఫూర్తితోనే నేనీ కోర్స్‌లను డిజైన్ చేశాను!'



నేపథ్యం..

అంత చిన్న వయసులో ఆమె చేసిన ఇంత పెద్ద ప్రయత్నానికి ఆమె నేపథ్యం చాలా తోడ్పడింది. అందులో తల్లిదండ్రులు సుమతి(ఐజీ, ఇంటెలిజెన్స్, తెలంగాణ), శ్రీనాథ్ (బిజినెస్‌మన్), తాతయ్య తిరుపతి రెడ్డి, అక్క ప్రకృతిల పాత్ర ఎంతో ఉంది.

ఎలాగంటే..

సుమతి సైబర్ సెక్యూరిటీలో పనిచేస్తున్నప్పుడు సైబర్ వరల్డ్‌లో జరుగుతున్న వాటి గురించి ఇంట్లో చర్చించేవారు. వాటికి చెవొగ్గేది సంస్కృతి. అవి అర్థమయ్యీ.. కాక ఆ చిన్నబుర్రలో కలవరం రేపేవి. సైబర్ సెక్యూరిటీ కోసం పోలీస్ డిపార్ట్‌మెంట్ కాస్తున్న పహారా, దానిమీద పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల గురించి అమ్మ ద్వారా తెలుసుకుంది. ఆ ఎన్‌జీవోల్లో వాలంటీరింగ్ మొదలుపెట్టింది. ఆ క్రమంలో ఎంతోమందిని కలిసింది, మాట్లాడింది. పెద్దవాళ్లు సమస్యల్ని ఎలా చూస్తున్నారు, ఎలా పరిష్కరిస్తున్నారో పరిశీలించింది. అలా కూతురికి సామాజిక స్పృహను కలిగించి, సామాజిక బాధ్యతనూ తెలియజేసింది సుమతి.

నాన్న..

శ్రీనాథ్.. ఐఐఎమ్ అహ్మదాబాద్ గ్రాడ్యుయేట్. బిజినెస్‌లో వినూత్న ఆలోచనలను ఆయన ప్రోత్సహిస్తున్న తీరు, అందిస్తున్న సపోర్ట్‌ను గమనించేది సంస్కృతి. కొత్త విషయాలు, సరికొత్త స్కిల్స్ గురించి ఆయన ఆన్‌లైన్‌లో టీచ్ చేస్తుంటే, కరెంట్ అఫైర్స్‌ను 'వాట్-వై-హౌ' పద్ధతిలో వివరిస్తుంటే శ్రద్ధగా వినేది. వాటన్నిటినీ తన వాలంటీరింగ్‌లో అమలుచేసేది. అలా తండ్రి ఆంట్రప్రెన్యూర్‌షిప్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను కూడా ఒంటబట్టించుకుంది సంస్కృతి.

తాతయ్య.. ఆంజనేయుడిని పరిచయం చేసి!

తిరుపతిరెడ్డి ప్రతిరోజూ మనవరాలికి పురాణేతిహాసాల్లోని ఒక్కో పాత్రను పరిచయం చేసేవారు. ప్రతి పాత్రకు సహానుభూతి, సహాయం చేసే గుణం, జడ్జ్ చేయని తత్వాలను అద్దుతూ ఆ పాత్ర వ్యక్తిత్వాన్ని వర్ణించేవారు. అవన్నీ ఆ అమ్మాయి మనసులో ముద్రపడిపోయాయి. ఆ లక్షణాలతో పాటు, తెగువ, అచీవ్‌మెంట్, డెడికేషన్ కూడా ఉన్న ఆంజనేయుడు ఆమెకు ఫేవరిట్ అయ్యాడు. ఆ పాత్రలో తనను చూసుకోవడం మొదలుపెట్టింది. చదువుతో పాటు ఆర్ట్, మ్యూజిక్ వంటి కళల్లోనూ సంస్కృతి ప్రతిభ మెచ్చుకోదగ్గది. పోటీల్లో మనవరాలు ప్రైజ్ తెచ్చుకున్న ప్రతిసారి చాకోబార్‌తో ఆమెను ప్రోత్సహిస్తునే 'గెలుపు కన్నా కూడా మన పనితో ఎంతమందిని ప్రభావితం చేయగలుగుతున్నామనే దాని మీద దృష్టి పెట్టాల'ని చెప్పేవారు. ఆ విలువనే తన ఫిలాసఫీగా మలచుకుంది సంస్కృతి.

లాస్ట్ బట్ నాట్ లీస్ట్.. అక్క ప్రకృతి, సైకాలజీ స్టూడెంట్. చెల్లికి మంచి ఫ్రెండ్, గైడ్! సంస్కృతి ఈ కోర్స్‌లను డిజైన్ చేయడంలో ఆమె సహాయం ఎంతో ఉంది.

టెన్త్ బర్త్‌డేకి అమ్మ, నాన్న ఇచ్చిన గిఫ్ట్‌నూ సంస్కృతి ఓ టర్నింగ్ పాయింట్‌గా చెబుతుంది. అదేంటంటే..

ఒక నోట్ బుక్‌లో అమ్మ, నాన్న 'నీ జీవితం ఈ ఎమ్టీ-బుక్ లాంటిది. నీ గురించి ఎవరూ ఏదీ రాయరు. నువ్వేం నేర్చుకుంటున్నావ్, నీకోసమే కాకుండా, ఇతరుల కోసమూ నువ్వేం చేయగలుగుతున్నావ్ అన్న క్వశ్చన్స్‌కి ఆన్సర్స్ దొరికినప్పుడల్లా ఒక్కో పేజీ ఫిల్ చేయాలి. అలా ఈ పుస్తకం నీ విశిష్ట వ్యక్తిత్వంతో నిండిపోవాలని ఆశిస్తూ అమ్మ.. నాన్న!' అని రాసిన నోట్. ఈ ఆన్‌లైన్ కోర్స్‌ల డిజైన్ ఆ పుస్తకంలోని మొదటి పుటకు శుభారంభమని చెప్పొచ్చు. ఇలాంటి ఇంకెన్నో ప్రయత్నాలతో ముందుకు సాగాలనుకుంటున్న ఆ చిరంజీవికి ఆల్ ద వెరీ బెస్ట్!

– సరస్వతి రమ,
ఫొటోలు : నోముల రాజేష్‌రెడ్డి

● మన(సు)లో మాట

మా వారి ప్రవర్తనతో విసిగిపోయాను..

మా ఆయన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా తన పనిలో నిత్యం బిజీగా ఉంటారు. తన ఉద్యోగం చాలా ఒత్తిడితో కూడుకుని ఉండటం, ఇంటి దగ్గర ఉన్నప్పుడు కూడా ఏదో ఒక మీటింగ్‌కు అటెండ్ అవాల్సి రావడం, వర్క్ ఫ్రమ్ హోం, రాత్రుళ్లు లేటుగా పడుకోవడం వంటివి కోవిడ్ సమయం నుంచి ఎక్కువయ్యాయి. పడుకున్న కొన్ని గంటలు సరిగా నిద్ర పోకపోవడం, పొద్దున్నే చిరాకుగా ఉండటం చీటికీ మాటికీ కోపం తెచ్చుకోవడం ఈ మధ్య ఎక్కువయ్యాయి. పిల్లల మీద ఉట్టిపుణ్యానికి అరుస్తున్నారు. నా భర్త వేరే ఏ దురలవాట్లు లేని మంచి వ్యక్తి అని ఎంతో ఆనందించే నేను ఈ మధ్య ఆయన ప్రవర్తనతో విసిగిపోయాను. మీ సలహా కోసం ఎదురు చూస్తూ...

– ఓ సోదరి, హైదరాబాద్

ప్రియమైన చెల్లెమ్మా! మీ భర్త దీర్ఘకాలిక వత్తిడి వలన కొన్ని మానసిక లక్షణాలకు లోనవుతున్నట్లు కనిపిస్తుంది. కోవిడ్ తర్వాత పని సంస్కృతిలోని మార్పుల వలన ఈ రోజులలో చాలామంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో ఇంటికి, ఆఫీస్‌కి తేడా కనుమరుగవుతోంది. మీ వారి లక్షణాలను 'బర్న్ అవుట్' అని అంటాము. మీ ఆయనకు ఎలాంటి వ్యసనాలు లేవన్నారు. కాని వారు తన ఉద్యోగాన్ని, ఫ్యామిలీ లైఫ్ ని సరిగ్గా బ్యాలెన్స్ చేయలేకపోతున్నారు. నిద్ర సరిగా లేకపోవడం, అతి కోపం, చిరాకు ఇవి తన పనిలో సామర్థ్యాన్ని తగ్గించడమే గాక, తన మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. వీటిని ఇలాగే వదిలేస్తే ముందు శారీరక సమస్యలు కూడా రావచ్చు. పనివేళలపై ముఖ్యంగా ఇంటి వద్ద పని వేళలపై సరిహద్దులు పెట్టడం, సరైన సమయపాలన చేయడం ద్వారా వృత్తి, జీవిత సమతుల్యం మెరుగుపరుచుకోవాలి. పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు కొంతపని ఇతరులకు అప్పగించడం లేదా నిరాకరించడం చేయగలగాలి. మీ కుటుంబ సమయం, విశ్రాంతి సమయాన్ని కూడా మీ మీటింగుల లాగే, అనివార్యమైనవిగా మీ కేలండర్‌లో రాసుకోవాలి. సరైన నిద్ర, వ్యాయామం, సమయానికి ఆహారం తీసుకోవడం వల్ల ఒత్తిడిని చాలా వరకు నియంత్రించవచ్చు. మీ వారి ప్రవర్తన ఎలా కుటుంబాన్ని ప్రభావితం చేస్తుందో వారితో సానుభూతితో చర్చించండి. ఒక జీవిత భాగస్వామిగా మీ మద్దతు తనకు ఉందని తెలిసినప్పుడు వారు కూడా మార్పునకు గట్టిగా కృషి చేస్తారు. మీరు కూడా ఈ పరిస్థితుల వలన ఒత్తిడికి లోనవకుండా మీ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోండి. అప్పటికీ మార్పు రాకపోతే ఒక సైకియాట్రిస్ట్‌ను కలిసి థెరపీ ద్వారా, మందుల ద్వారా వారి ఒత్తిడిని తగ్గించి మీ కుటుంబ జీవన నాణ్యతను ఖచ్చితంగా మెరుగు పరుచుకోవచ్చును.



డా॥ ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన
మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

● న్యూస్‌మేకర్

జల్లికట్టు చిన్నారి పట్టు

'జల్లికట్టు' అంటే ఎద్దును లొంగదీసుకుని దాని కొమ్ములకున్న అలంకరణలను సొంతం చేసుకోవడం. జల్లికట్టు ఎద్దులకు పౌరుషం ఎక్కువ. కొమ్ములకు వాడి ఎక్కువ. తమ మూపురాలను తాకనివ్వవు. అందుకే ఈ మనిషి-పశువు క్రీడ తరాలుగా తమిళనాడులో ఉంది. జల్లికట్టులో దించబోయే ఎద్దుకు తర్ఫీదు ఇస్తూ పదేళ్ల యజిని వార్తల్లోకి ఎక్కింది. రాబోయే సంక్రాంతికి యజిని.. ఎద్దు'నన్బన్' చాలా పెద్ద వార్తలనే సృష్టించనున్నాయి.


యజిని

రాబోయే 'పొంగల్'కి తమిళనాడులో జల్లికట్టు ధూమ్‌ధామ్‌గా జరగనుంది. మదురై, తంజావూరు, తిరుచిరాపల్లి తదితర ప్రాంతాల్లో పొంగల్ నుంచి మొదలై వేసవి వరకు జల్లికట్టు పోటీలు జరుగుతూనే ఉంటాయి. అక్కడి పల్లెవాసులు కూడా వేలాదిగా వీటిలో పాల్గొంటారు. తమ ఎడ్లను తెచ్చి పాల్గొనేలా చేస్తారు. మన కోళ్ల పందేలకు కోడిపుంజులను తీర్చిదిద్దినట్టే ఇందుకై ఎడ్లనూ తీర్చిదిద్దుతారు. రైతు కుటుంబాల్లో తండ్రులు వారికి తోడు పిల్లలు ఈ పనిలో నిమగ్నమవుతారు. అలాంటి రైతు కూతురే పదేళ్ల వయసున్న యజిని.


జల్లికట్టు

ఎద్దు- మనిషి

మదురైలోని మంగులం అనే గ్రామంలో శ్రీనివాసన్ అనే రైతుకు రెండు ఎడ్లు ఉన్నాయి. వాటిలో ఒకదాన్ని జల్లికట్టులో పాల్గొనేలా చేస్తున్నాడు. 'జల్లికట్టు'లో 'జల్లి' అంటే రెండు కొమ్ములకు అలంకరణ వస్త్రాలు 'కట్టు' అంటే కట్టడం. రెండు కొమ్ముల మధ్య వెండి లేదా బంగారు నాణేలు కూడా కడతారు. ఆటగాళ్లు పరిగెడుతున్న ఎద్దును తాకి, మూపురం పట్టి నెమ్మదించేలా చేసి ఆ అలంకరణలను, నాణేలను సొంతం చేసుకుంటారు. ఎన్ని సొంతం చేసుకుంటే అంత వీరుడిగా గుర్తింపు. అలాగే ఈ వీరులకు చిక్కకుండా వారి మీద కొమ్ము విసిరి తరిమికొడితే ఆ ఎద్దుకు అంతటి ఘనత. 'మా ఎద్దు కూడా అంతటి గొప్పదే. చాలా మెడల్స్ సాధించింది' అంటుంది యజిని.

పాపకు స్నేహితుడు

యజినికి ఐదేళ్లుండగా తండ్రి ఎద్దులను కొన్నాడు. వాటిలో ఒకదానికి యజిని 'నన్బన్' (స్నేహితుడు) అనే పేరు పెట్టింది. రోజూ దానికి మేత వేయడం, నీళ్లు పెట్టడం, కబుర్లు చెప్పడం ఇదే పని. 'నేను దగ్గరికి వెళితే ఏమీ చేయదు. పిలవగానే వచ్చేస్తుంది' అంటుంది యజిని. గత మూడేళ్లుగా జల్లికట్టులో తండ్రితో పాటు నన్బన్‌ను తీసుకొని వెళుతోంది యజిని. 'వాడివాసల్ (స్టార్టింగ్ పాయింట్) నుంచి మా నన్బన్ పరుగు అందుకోగానే చాలామంది ఆటగాళ్లు దాని మూపురం పట్టుకోవాలని, కొమ్ములు అందుకోవాలని ట్రై చేస్తారు. కాని మా నన్బన్ అందరి మీదా బుస కొట్టి దూరం పోయేలా చేస్తుంది. ఆట గెలిచాక బుద్ధిగా నా వెంట ఇంటికి వస్తుంది. ఆ ఎద్దు – ఈ ఎద్దు ఒకటేనా అన్నంత డౌట్ వస్తుంది' అంటుంది యజిని.




యజిని

ట్రైనింగ్

జల్లికట్టు కోసం ట్రైనింగ్ యజిని ఇస్తోంది తండ్రితో పాటు. జల్లికట్టులో పాల్గొనే ఎద్దును రోజూ వాకింగ్‌కి, స్విమ్మింగ్‌కి తీసుకెళ్లాలి. తడి నేలలో, మెత్తటి నేలలో కొమ్ములు గుచ్చి కొమ్ములు బలపడేలా చేయాలి. దీనిని 'మన్ కుథల్' అంటారు. ఇక మంచి తిండి పెట్టాలి. ఇవన్నీ యజిని చేస్తోంది. 'నేను ఇంగ్లిష్ మీడియంలో చదువుకుంటున్నా. గవర్నమెంట్ జల్లికట్టు కోసం చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఎద్దుకు ఎటువంటి అపాయం కలక్కుండా రూల్స్ పెట్టింది. అందుకే నన్బన్‌ను నేను ధైర్యంగా పోటీకి తీసుకెళ్తా' అంటోంది యజిని.

బ్యూటిప్స్

మేనికాంతికి..

- ఓట్స్, తేనె, అలొవెరా జెల్ సమపాళ్లలో తీసుకొని బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసుకొని, వేళ్లతో వలయకారంగా రుద్దుతూ సున్నితంగా మసాజ్ చేయాలి. పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల ముఖ చర్మం మృదువుగా మారుతుంది.
- గంధం పొడి, శనగపిండి, బాదంపప్పు పేస్ట్ టీ స్పూన్ చొప్పున తీసుకోవాలి. అందులో ఐదు రేకల కుంకుమపువ్వు, గుడ్డులోని తెల్లసొన, కొన్ని పచ్చిపాలను చేర్చి జారుగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు, చేతులకు పట్టించి ఆరనివ్వాలి. తర్వాత శుభ్రపరుచుకోవాలి. వారానికి మూడుసార్లు ఈ విధంగా చేస్తుంటే చర్మానికి మెరుపు వస్తుంది.
- మూడు స్ట్రాబెర్రీలలో గింజలు తీసేసి, గుజ్జు చేయాలి. దీంట్లో ఐదు చుక్కల తేనె వేసి కలపాలి. ఈ మిశ్రమంతో ముఖానికి, మెడకు ప్యాక్ వేసి 20 నిమిషాలు ఆరనివ్వాలి. నీళ్లు ముఖం మీద చిలకరించుకొని, తడి క్లాత్‌తో తుడిచి, మాయిశ్చరైజర్ రాసుకోవాలి. దీనివల్ల చర్మకాంతి పెరుగుతుంది.



బరువు పెరగండి

ఒంటి పైన బంగారం ఉన్న మహిళ వరలక్ష్మిలా ఉంటుంది. అదేంటి! ధన లక్ష్మిలా కదా ఉండాలి? అవుననుకోండి. బంగారం.. ధనానికి (సంపదకు) ఒక రూపం మాత్రమే. బంగారానికి పూర్తి స్వరూపం మాత్రం స్త్రీమూర్తే.

భారతీయ స్త్రీ బంగారానికి ప్రాణం ఇస్తుంది అంటారు కానీ, నిజానికి అనవలసింది.. బంగారానికే ఆమె ప్రాణం పోస్తుందని.



గనుల్లో ఉండే బంగారానికి ఏం 'వెయిట్' ఉంటుందని! ఇంతులు ధరిస్తేనే కదా తులాలకు విలువ!

బంగారం ప్రతి దేశంలోనూ ఉంటుంది. బంగారాన్ని ఇష్టంగా, అదొక నిష్ఠగా, వేడుకగా, అందంగా, ఆచారంగా.. వాటన్నిటినీ కలిపి నిండుగా ధరించే మహిళలు మాత్రం మన దేశంలోనే ఉంటారు. ఎంత నిండుగానో తెలుసా? 'వరల్డ్ గోల్డ్ కౌన్సిల్' తాజా సర్వే ప్రకారం భారతీయ మహిళల దగ్గరున్న బంగారం 24 వేల టన్నులు!

అత్యధికంగా బంగారం ఉన్న మొదటి ఐదు దేశాల కంటే కూడా మన మహిళల దగ్గర ఉన్న బంగారమే ఎక్కువ. అమెరికా ఎంత తవ్వి తలకెత్తుకున్నా ఆ దేశంలో ఉన్నది 8,000 టన్నుల బంగారం మాత్రమే. ఆ తర్వాతి స్థానం జర్మనీది. అక్కడున్నది 3,300 టన్నులు. ఇటలీ 2,450 టన్నుల బంగారంతో మూడో స్థానంలో ఉంది. నాలుగు, ఐదు స్థానాల్లో ఫ్రాన్స్ (2,400 టన్నులు), రష్యా (1,900) ఉన్నాయి. మొత్తం కలిపినా భారతీయ మహిళల దగ్గర ఉన్న బంగారం కంటే తక్కువే. మన దగ్గర కూడా దక్షిణాది మహిళల దగ్గరే ఎక్కువ (40 శాతం వరకు) బంగారం ఉంది. ఆ నలభైలో 28 శాతం తమిళనాడు మహిళలదే.

బంగారం ధరించిన మహిళల్ని వరలక్ష్ములు అనటం ఎందుకంటే ప్రభుత్వం దగ్గర్నుంచి కూడా వారు 'వరాలు' పొందారు. వివాహిత స్త్రీలు ఎలాంటి పన్నూ చెల్లించకుండానే అరకిలో వరకు బంగారాన్ని కొనుక్కోవచ్చు. అవివాహిత మహిళలకు పావు కిలో వరకు పన్నులుండవు. మరి పురుషులకు? వంద గ్రాములు దాటితే వారిపై కన్ను, పన్ను రెండూ పడతాయి.

కనుక, ఈ కొత్త సంవత్సరంలో బంగారం వెయిట్ పెంచే బాధ్యత మహిళలదే. ఒంటిపైన బంగారం ఉన్న మహిళ మాత్రమే కాదు, మహిళ ఒంటిపై ఉన్న బంగారం కూడా వరలక్ష్మీ అమ్మవారే!

ముగ్గు ముచ్చట


జి. అంజలీ దేవి
మహబూబ్‌నగర్



21 చుక్క మూడుసార్లు పెట్టి 3 వచ్చేవరకు – సరిచుక్క


అక్షధ,
6వ తరగతి
సియాటిల్,
అమెరికా


13 చుక్కలు,
1 వచ్చేవరకు
ఎదురు చుక్క




జి. శ్రీగౌరి,
పుంగనూరు
చిత్తూరు జిల్లా
15 చుక్కలు,
1వచ్చేవరకు
సరిచుక్కలు




జె.శివాని
హైదరాబాద్
19 చుక్కలు,
10 వచ్చేవరకు,
మధ్యచుక్క


ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్... అత్యధిక రేటింగ్ సాధించిన భారత బౌలర్‌గా బుమ్రా

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన భారత బౌలర్‌గా జస్‌ప్రీత్ బుమ్రా రికార్డు నెలకొల్పాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో బుమ్రా 907 రేటింగ్ పాయింట్లతో 'టాప్' ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. గతంలో ఈ రికార్డు ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ పేరిట ఉంది. 2016లో అశ్విన్ భారత్ తరఫున అత్యధికంగా 904 రేటింగ్ పాయింట్లు సాధించాడు. అత్యధిక రేటింగ్ సంపాదించిన 'ఆల్‌టైమ్' బౌలర్ల జాబితాలో బుమ్రా సంయుక్తంగా 17వ స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో సిడ్నీ బార్నెస్ (ఇంగ్లండ్-932 పాయింట్లు; 1914లో), జార్జి లోమన్ (ఇంగ్లండ్-931 పాయింట్లు; 1896లో), ఇమ్రాన్ ఖాన్ (పాకిస్తాన్-922 పాయింట్లు; 1983లో) వరుసగా తొలి మూడు స్థానాల్లో ఉన్నారు. ఆస్ట్రేలియాతో నాలుగో టెస్టుకు ముందు బుమ్రా 904 రేటింగ్ పాయింట్లతో అశ్విన్ రికార్డును సమం చేశాడు. నాలుగో టెస్టులో బుమ్రా మొత్తం తొమ్మిది వికెట్లు పడగొట్టి అశ్విన్ రేటింగ్‌ను దాటేశాడు.





మహిళల ర్యాపిడ్ ఫార్మాట్ విన్నర్స్ ట్రోఫీ, స్వర్ణ పతకంతో భారత స్టార్ కోనేరు హంపి



కాంస్య పతకంతో వైశాలి

వెల్‌డన్ వైశాలి

ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం నెగ్గిన భారత గ్రాండ్‌మాస్టర్

3 ప్రపంచ బ్లిట్జ్ చాంపియన్‌షిప్ చరిత్రలో పతకం నెగ్గిన మూడో భారతీయ ప్లేయర్‌గా వైశాలి గుర్తింపు పొందింది. 2017లో విశ్వనాథన్ ఆనంద్ కాంస్య పతకం... 2022లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి రజత పతకం గెలిచారు.

న్యూయార్క్: అంచనాలకు మించి రాణించిన భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేశ్‌బాబు తన కెరీర్‌లో గొప్ప ఘనత సాధించింది. ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో 23 ఏళ్ల వైశాలి కాంస్య పతకాన్ని గెల్చుకుంది. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున ముగిసిన ఈ మెగా ఈవెంట్‌లో వైశాలి పోరాటం సెమీఫైనల్లో ముగిసింది. చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెన్‌జున్‌తో జరిగిన సెమీఫైనల్లో తమిళనాడుకు చెందిన వైశాలి 0.5–2.5తో ఓడిపోయింది. మరో సెమీఫైనల్లో లె టింగ్‌జీ (చైనా) 3.5–2.5తో కాటరీనా లాగ్నో (రష్యా)పై గెలిచింది. జు వెన్‌జున్‌తో జరిగిన సెమీఫైనల్ తొలి గేమ్‌ను వైశాలి 85 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. రెండో గేమ్‌లో జు వెన్‌జున్ 86 ఎత్తుల్లో... మూడో గేమ్‌లో 36 ఎత్తుల్లో వైశాలిని ఓడించి 2.5–0.5తో విజయాన్ని ఖరారు చేసుకుంది. ఫలితం తేలిపోవడంతో వీరిద్దరి మధ్య నాలుగో గేమ్‌ను నిర్వహించలేదు. సెమీఫైనల్లో ఓడిన వైశాలి, కాటరీనా లాగ్నోలకు కాంస్య పతకాలు లభించాయి. ఫైనల్లో వెన్‌జున్ 3.5–.2.5తో లె టింగ్‌జీపై గెలిచి తొలిసారి ప్రపంచ బ్లిట్జ్ చాంపియన్‌గా అవతరించింది.

సంయుక్త విజేతలు కార్ల్‌సన్, నిపోమ్‌నిషి



ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ పురుషుల విభాగంలో తొలిసారి సంయుక్త విజేతలు అవతరించారు. ఈ ఫార్మాట్‌లో ఇప్పటికే ఈ ఫార్మాట్‌లో ఆరుసార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ ఈసారి రష్యా గ్రాండ్‌మాస్టర్ నిపోమ్‌నిషితో కలిసి టైటిల్ పంచుకున్నాడు. వీరిద్దరి మధ్య ఫైనల్లో ఏడు గేమ్‌లు ముగిశాక 3.5–3.5తో సమంగా నిలిచారు. అప్పటికే రెండు గంటలకుపైగా గేమ్‌లు ఆడుతూ ఇద్దరూ అలసిపోయారు. దాంతో టైటిల్ పంచుకుందామని నిపోమ్‌నిషికి కార్ల్‌సన్ ప్రతిపాదించాడు. మరోవైపు ఫలితం వచ్చే వరకు గేమ్‌లు ఆడాలని ఈ టోర్నీ నిబంధనల చెబుతున్నా... కార్ల్‌సన్, నిపోమ్‌నిషి ఆటను కొనసాగించేందుకు అనాసక్తిగా ఉండటంతో... నిర్వాహకులు నిబంధనను పట్టించుకోకుండా ఆటగాళ్ల సమ్మతితో ఇద్దరినీ సంయుక్త విజేతలుగా ప్రకటించారు. ఫైనల్ అనంతరం ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. మహిళల ర్యాపిడ్ ఫార్మాట్‌లో విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి స్వర్ణ పతకంతోపాటు విన్నర్స్ ట్రోఫీని, బ్లిట్జ్ విభాగంలో వైశాలి కాంస్య పతకాన్ని అందుకున్నారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ఫ్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

'ఇప్పటికే ఎక్కువైంది'

భారత ప్లేయర్లకు హెడ్ కోచ్ గంభీర్ చురకలు ● జట్టులో అంతా సవ్యంగా లేదనే వాదనలకు ఊతం

ఆస్ట్రేలియా పర్యటనలో స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చలేకపోతున్న భారత క్రికెట్ జట్టుపై విమర్శలు ఎక్కువవుతున్నాయి. గౌతమ్ గంభీర్ టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టి ఆరు నెలలైనా ఆశించిన ఫలితాలు రావడంలేదు. దాంతో ఇక కఠిన నిర్ణయాలు తప్పవనే సంకేతాలు వెలువడుతున్నాయి. శ్రీలంక చేతిలో వన్డే సిరీస్ కోల్పోవడం, స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో 'వైట్‌వాష్'కు గురవడం... తాజాగా 'బోర్డర్-గావస్కర్' ట్రోఫీలో 1-2తో వెనుకంజలో ఉండటంపై గంభీర్ కోచింగ్ తీరుపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఇన్నాళ్లు జట్టు కోచ్‌గా ఆటగాళ్లు సహజ శైలిలో ఆడేందుకు స్వేచ్ఛనిచ్చిన కోచ్ గౌతమ్ గంభీర్ 'ఇప్పటికే ఎక్కువైంది... ఇక చాలు' అని ఆటగాళ్లకు ఘాటుగా హెచ్చరించినట్లు సమాచారం.



రిషభ్ పంత్, చీఫ్ సెలెక్టర్ అగార్కర్, విరాట్ కోహ్లి, హెడ్ కోచ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మ (ఫైల్)

సిడ్నీ: ప్రతిష్టాత్మక 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'లో భాగంగా మెల్‌బోర్న్‌లో జరిగిన నాలుగో టెస్టును 'డ్రా' చేసుకోగలిగే స్థితిలో నిలిచిన టీమిండియా... చివర్లో చేతులెత్తేసి ఓడిపోవడంపై హెడ్ కోచ్ గంభీర్ ఆటగాళ్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రత్యేకంగా ఆటగాళ్ల పేర్లు తీసుకోకపోయినా... ఇకపై జట్టు అవసరాలకు తగ్గట్లు ఆడకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయనే ధోరణిలో గంభీర్ ప్లేయర్లకు క్లాస్ తీసుకున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. డ్రెస్సింగ్ రూమ్ చర్చలు బయటకు రాకపోవడమే జట్టుకు శ్రేయస్కరమని మాజీ ఆటగాళ్లు హితబోధ చేస్తుండగా... ధోనీ, విరాట్ కోహ్లి సారథిగా ఉన్నప్పుడు ఇలాంటి విషయాలు బయటకు వచ్చేవి కావని పలువురు గుర్తు చేస్తున్నారు. వరుస వైఫల్యాలతో ఇప్పటికే ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు చేరే అవకాశాలను దాదాపు కోల్పోయిన భారత జట్టు... ఇక చివరిదైన సిడ్నీ టెస్టులోనైనా విజయం సాధించి సిరీస్ కైవసం చేసుకుంటుందా చూడాలి. ఆఖరి టెస్టులో టీమిండియా విజయం సాధిస్తే సిరీస్ 2–2తో 'డ్రా' అయినా... గత సిరీస్‌లో విజేతగా నిలిచినందుకు 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' భారత్ వద్దే ఉంటుంది.

వేడెక్కిన డ్రెస్సింగ్ రూమ్...

ప్రధాన ఆటగాళ్లు అందుబాటులో లేని సమయంలో జరిగిన తొలి టెస్టు (పెర్త్)లో చక్కటి ప్రదర్శన కనబర్చిన టీమిండియా... ఆ తర్వాత అదే జోరు కొనసాగించడంలో విఫలమైంది. రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు, యువ ఆటగాడు శుబ్‌మన్ గిల్ జట్టులో లేకపోయినా... తాత్కాలిక సారథి జస్‌ప్రీత్ బుమ్రా జట్టును ముందుండి నడిపించాడు. రెండో టెస్టు నుంచి రోహిత్, గిల్ తుది జట్టులోకి రావడంతో టీమిండియా ప్రదర్శన మరింత మెరుగవుతుందనుకుంటే... నానాటికి దిగజారింది. ఆ తర్వాత ఆడిన మూడు టెస్టుల్లో భారత జట్టు రెండింట ఓడి ఒక దానిని 'డ్రా' చేసుకుంది. మెల్‌బోర్న్ టెస్టులో ఒకదశలో మెరుగైన స్థితిలో నిలిచి ఆ తర్వాత పేలవ ఆటతీరుతో ఓటమిని కోరి కొని తెచ్చుకుంది. స్టార్ బ్యాటర్ కోహ్లి మరోసారి తన బలహీనత కొనసాగిస్తూ ఆఫ్‌స్టంప్ అవతలి బంతిని వెంటాడి అవుట్ కాగా... రిషభ్ పంత్ రెండు ఇన్నింగ్స్‌లలో అనవసర షాట్‌లు ఆడి వికెట్ సమర్పించుకున్నాడు. ఇక నిలకడగా ఆడిన యశస్వి జైస్వాల్ కూడా షాట్ సెలెక్షన్ లోపంతోనే వెనుదిరగగా... ఈ సిరీస్‌లో ఇటు సారథిగా, అటు బ్యాటర్‌గా విఫలమవుతున్న రోహిత్ శర్మ ఎలాంటి ప్రభావం చూపలేకపోయాడు. దీంతో మ్యాచ్ అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లపై గంభీర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇప్పటి వరకు సహజశైలిలో ఆడమని ప్రోత్సహించిన గంభీర్... జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఇష్టారీతిన షాట్లు ఆడి అవుట్ కావడంపై పలువురు ఆటగాళ్లపై సీరియస్ అయినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. డ్రెస్సింగ్‌రూమ్‌లో పరిస్థితి అంతా సవ్యంగా లేదని... ఆటగాళ్లలో అనిశ్చితి నెలకొందనే వార్తలు బయటకు వస్తున్నాయి.

పుజారా కోసం పట్టుబట్టినా...

గత రెండు పర్యాయాలు ఆస్ట్రేలియా పర్యటనలో భారత జట్టు టెస్టు సిరీస్‌లు గెలవడంలో కీలక పాత్ర పోషించిన వన్‌డౌన్ బ్యాటర్ చతేశ్వర్ పుజారాను ఈసారి కూడా జట్టులోకి తీసుకోవాలని గంభీర్ పట్టుబట్టినా... సెలెక్షన్ కమిటీ మాత్రం అందుకు అంగీకరించలేదు. జట్టులో స్థిరత్వం తీసుకురాగల పుజారా వంటి ప్లేయర్ అవసరమని గంభీర్ చెప్పినా... సెలెక్షన్ కమిటీ పెడచెవిన పెట్టింది. తాజా సిరీస్‌లో తొలి టెస్టు అనంతరం కూడా గంభీర్ పుజారాను జట్టులోకి తీసుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఇక జట్టును ముందుండి నడిపించాల్సిన సారథి రోహిత్ శర్మనే టీమ్‌కు భారంగా పరిణమించాడనేది కాదనలేని సత్యం. ఏ స్థానంలో బ్యాటింగ్‌కు దిగినా... 'హిట్‌మ్యాన్' తన సహజసిద్ధ ఆటతీరు కనబర్చలేకపోతున్నాడు. ఈ నేపథ్యంలో అతడి కెరీర్‌పై నీలినీడలు కమ్ముకోగా... ఆస్ట్రేలియాతో సిరీస్ అనంతరం కఠినమైన నిర్ణయాలు తప్పకపోవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే యువ ఆటగాళ్లు నాయకత్వ బాధ్యతలు తీసుకునేందుకు ఇది తగిన సమయం కాదని... ఇలాంటి సంధి దశలో పరిస్థితులను చక్కదిద్దాలంటే అనుభవమే ముఖ్యమని ఓ సీనియర్ ఆటగాడు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. పింక్ బాల్ టెస్టులో ఆకాశ్‌దీప్‌ను కాదని హర్షిత్ రాణాను తుదిజట్టుకు ఎంపిక చేయడంపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

సినిమా

మళ్లీ పాడారు




● పవన్ కల్యాణ్

'తమ్ముడు, జానీ, అత్తారింటికి దారేది, అజ్ఞాతవాసి' వంటి సినిమాల తర్వాత హీరో పవన్ కల్యాణ్ మరోసారి పాట పాడారు. ఆయన టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చారిత్రాత్మక చిత్రం 'హరి హర వీరమల్లు'. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ సినిమాకు జ్యోతికృష్ణ దర్శకత్వం వహిస్తుండగా, ఏఎం రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఈ సినిమా తొలి భాగం 'హరి హర వీరమల్లు పార్ట్–1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' చిత్రంలోని 'మాట వినాలి...' అనే పాట లిరికల్ వీడియోను ఈ నెల 6న విడుదల చేయనున్నట్లుగా వెల్లడించారు మేకర్స్. పెంచల్‌దాస్ సాహిత్యం అందించిన ఈ పాటను పవన్ కల్యాణ్ పాడారు. నిధీ అగర్వాల్ హీరోయిన్‌గా, బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న 'హరి హర వీరమల్లు పార్ట్–1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' మార్చి 28న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: కీరవాణి.

ఇడ్లీ కొట్టులో ఏం జరిగింది?

ధనుష్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న తాజా తమిళ చిత్రం 'ఇడ్లీ కడై' (తెలుగులో 'ఇడ్లీ కొట్టు' అని అర్థం). ఈ చిత్రంలో నిత్యా మీనన్, షాలినీ పాండే హీరోయిన్లుగా నటిస్తున్నారు. బుధవారం (జనవరి 1) న్యూ ఇయర్ సందర్భంగా 'ఇడ్లీ కడై' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్స్‌ను విడుదల చేశారు. 'మా సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశాం. మీ మూలాలకు కట్టుబడి ఉండండి' అంటూ ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్స్‌ను 'ఎక్స్'లో షేర్ చేశారు ధనుష్. ఇక ఈ సినిమాలో ధనుష్ యంగ్ లుక్‌లో కనిపిస్తుండటం ఆయన ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తోంది. మరి... ధనుష్ 'ఇడ్లీ కొట్టు'లో ఏం జరిగింది? అనేది చూడాలంటే ఈ వేసవి వరకు వెయిట్ చేయాల్సిందే. ధనుష్, ఆకాశ్ భాస్కరన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఆల్రెడీ ఏప్రిల్ 10న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.



● ధనుష్

సాగర్ లవ్స్ మహాలక్ష్మి



● భాగ్యశ్రీ బోర్సే, రామ్

మహాలక్ష్మి అంటే ఎవరనుకున్నారు... సాగర్‌గాడి లవ్వు... మరి సాగర్, మహాలక్ష్మిల లవ్‌స్టోరీ ఎలా ఉంటుంది? అంటే మాత్రం కొన్ని రోజులు ఎదురు చూడక తప్పదు. సాగర్‌గా రామ్, మహాలక్ష్మిగా భాగ్యశ్రీ బోర్సే హీరోహీరోయిన్లుగా ఓ రొమాంటిక్ లవ్ ఎంటర్‌టైనర్ మూవీ తెరకెక్కుతోంది. పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. బుధవారం 'మన సాగర్‌గాడి లవ్వు... మహాలక్ష్మి' అంటూ ఈ సినిమాలోని సాగర్–మహాలక్ష్మిల ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ''ఇటీవల హైదరాబాద్‌లో మొదలైన ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయింది. సాగర్ పాత్రలో రామ్ ఒదిగిన తీరు ఆడియన్స్‌ను అలరిస్తుంది. ఈ మూవీలో రామ్–భాగ్యశ్రీల కెమిస్ట్రీ, వీరి కాంబినేషన్‌లోని సన్నివేశాలు ఆడియన్స్‌ను అలరిస్తాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. తమిళ సంగీత దర్శకులు వివేక్ – మెర్విన్ ఈ సినిమాతో తెలుగు చిత్రపరిశ్రమకు వస్తున్న సంగతి తెలిసిందే.

ఏ జన్మలోదో ఈ పరిచయం



● కీరవాణి, ఇళయరాజా

రాజేంద్ర ప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో, రూపేష్, ఆకాంక్షా సింగ్ జంటగా నటించిన చిత్రం 'షష్టిపూర్తి'. పవన్ ప్రభ దర్శకత్వం వహించారు. మా ఆయి ప్రొడక్షన్స్ ఎల్‌ఎల్‌పీపై రూపేష్ కుమార్ చౌదరి నిర్మించారు. ఈ చిత్రానికి మ్యూజిక్ మేస్ట్రో ఇళయరాజా సంగీతం అందించగా, మరో ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి ఓ పాటకి సాహిత్యం అందించడం విశేషం. 'ఏదో... ఏ జన్మలోదో ఈ పరిచయం' అంటూ సాగే ఈ పాటని త్వరలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పవన్ ప్రభ మాట్లాడుతూ– ''మా సినిమాలో మొత్తం ఐదు పాటలున్నాయి. చైతన్య ప్రసాద్ కొన్ని పాటలకు సాహిత్యం అందించారు. ప్రత్యేకమైన సందర్భంలో వచ్చే 'ఏదో... ఏ జన్మలోదో ఈ పరిచయం' పాటకు కీరవాణిగారు సాహిత్యం అందించారు. ఇళయరాజాగారి బాణీకి కీరవాణిగారు సాహిత్యం అందించడం ఇదే తొలిసారి'' అన్నారు. ''కుటుంబ బంధాలు, విలువల నేపథ్యంలో రూపొందిన చిత్రం 'షష్టిపూర్తి'. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలో సినిమా విడుదల తేదీ వెల్లడిస్తాం'' అని రూపేష్ కుమార్ చౌదరి తెలిపారు. ఈ చిత్రానికి కెమేరా: రామ్.

కొంచెం క్రాక్



● సిద్ధు జొన్నలగడ్డ

'డీజే టిల్లు, టిల్లు స్క్వేర్' వంటి హిట్ చిత్రాల తర్వాత సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తోన్న తాజా చిత్రం 'జాక్ – కొంచెం క్రాక్'. 'బొమ్మరిల్లు' మూవీ ఫేమ్ భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో 'బేబి' మూవీ ఫేమ్ వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బీవీఎస్‌ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా ఏప్రిల్ 10న విడుదల కానుంది. కాగా నూతన సంవత్సరం సందర్భంగా ఈ చిత్రం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ''సరికొత్త జోనర్‌లో 'జాక్– కొంచెం క్రాక్' మూవీ రూపొందుతోంది. ఫన్ రైడర్‌లా అందర్నీ మెప్పించే కథాంశంతో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. క్రాక్‌గాడిగా కనిపించే జాక్ పాత్రలో సిద్ధు జొన్నలగడ్డ ప్రేక్షకులను మెప్పించటం ఖాయం. ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అచ్చు రాజమణి.


పాంచ్ మినార్



● రాజ్ తరుణ్

రాజ్ తరుణ్ హీరోగా రూపొందుతోన్న చిత్రానికి 'పాంచ్ మినార్' అనే టైటిల్ ఖరారు చేశారు. రామ్ కడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రాశీ సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. గోవింద రాజు సమర్పణలో కనెక్ట్ మూవీస్ ఎల్‌ఎల్‌పీపై మాధవి, ఎంఎస్‌ఎం రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ మూవీకి 'పాంచ్ మినార్' అనే టైటిల్‌ని ఖరారు చేసి, ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ''క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'పాంచ్ మినార్' రూపొందుతోంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర, కెమేరా: ఆదిత్య జవ్వాది.

అసిస్టెంట్ సినిమాటోగ్రాఫర్ కృష్ణ మృతి



నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'హిట్: ది థర్డ్ కేస్'. ఈ సినిమా షూటింగ్‌లో విషాదం చోటు చేసుకుంది. ఈ చిత్రానికి అసిస్టెంట్ సినిమాటోగ్రాఫర్‌గా చేస్తున్న కేఆర్ కృష్ణ (30) గుండెపోటుతో మృతి చెందారు. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరుగుతోంది. ఈ చిత్రీకరణ సమయంలో కేఆర్ కృష్ణకి గుండెపోటు రావడంతో మృతి చెందారు. కేరళకు చెందిన ఆమెకి సినిమాలపై ఉన్న మక్కువతో సినిమాటోగ్రాఫర్ పని చేస్తున్నారు. కేఆర్ కృష్ణ మరణం పట్ల 'హిట్: ది థర్డ్ కేస్' యూనిట్ నివాళులు అర్పించింది. ఈ సినిమా మే 1న విడుదల కానుంది. 'హిట్' సినిమా సిరీస్‌లో వస్తోన్న మూడో భాగం 'హిట్: ది థర్డ్ కేస్'. శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీనిధీ శెట్టి కథానాయికగా నటిస్తున్నారు. యునానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి వాల్ పోస్టర్ సినిమాపై ప్రశాంతి త్రిపిర్నేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

మహాత్మా గాంధీ బాటలో...



● సుకృతి వేణి

ప్రముఖ దర్శకుడు సుకుమార్ బండ్రెడ్డి కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించారు. తబితా సుకుమార్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, గోపీ టాకీస్ బ్యానర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధురావు నిర్మించారు. ఈ చిత్రాన్ని జనవరి 24న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. పద్మావతి మల్లాది మాట్లాడుతూ– ''ప్రస్తుతం ప్రపంచంలో ద్వేషాలు, అసూయ... ఇలా నెగటివ్ వైబ్రేషన్స్ ఎక్కువగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఒకరి మీద ఒకరు నిందలు వేసుకోవడం, గొడవలు.. ఇలా ఎన్నో ఘర్షణలు కనిపిస్తున్నాయి. అహింస అనగానే మనకు మహాత్మా గాంధీ గుర్తొస్తారు. ఆయన సిద్ధాంతాలని అభిమానిస్తూ, ఆయన బాటను అనుసరించే ఓ పదమూడేళ్ల అమ్మాయి తను పుట్టిన ఊరిని కాపాడుకోవడం కోసం ఏం చేసింది? అనేది 'గాంధీ తాత చెట్టు'లో ఆసక్తికరంగా ఉంటుంది. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు చూపించాల్సిన సినిమా ఇది. అందరి హృదయాలను హత్తుకునే భావోద్వేగాలు ఈ చిత్రంలో ఉంటాయి'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రీ, కెమెరా: శ్రీజిత్ చెర్వుపల్లి.

సాక్షి బిజినెస్
గురువారం
2-1-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	368	78,507
నిఫ్టీ ▲	98	23,743

విదేశీ సూచీలు (తొలి ఐదు మంగళవారం ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	19,311	▲ 176
డోజోన్స్	42,544	▽ 29
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,173	▲ 52
షాంఘై	3,352	▲ 56
డాక్స్ (సోమవారం ముగింపు)	19,909	▲ 75
నికాయ్ (సోమవారం ముగింపు)	39,895	▲ 387

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

	ధర	మార్పు
బంగారం (99.9 స్వచ్ఛత)	76,583	▲ 421
బంగారం (99.5 స్వచ్ఛత)	76,276	▲ 419
వెండి (కేజీ)	86,055	▲ 38

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	85.22	86.24
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.90	108.71
€	యూరో	ఒకటి	87.43	90.03
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	43.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.94	54.12
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.93	65.00
SAR	సౌదీ రియాల్	పదిమందికి	21.93	23.44
UAE D	యూఏఈ దిర్హామ్	పదిమందికి	22.43	24.15
¥	చైనా యువాన్	పదిమందికి	10.97	12.56

కంపెనీల విడదీత.. లాభాల మోత!



- డీమెర్జర్ల తర్వాత దూసుకెళ్తున్న మార్కెట్ విలువ
- 14% నుంచి 487% మేర జంప్
- ఇన్వెస్టర్లకు కాసుల పంట
- జాబితాలో రిలయన్స్ సహా పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు
- ఇదే బాటలో ఐటీసీ, టాటా మోటార్స్

వ్యాపారాలను విభజించిన కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసిన వారి పంట పండుతోంది. ప్రత్యేక సంస్థలతో పాటు మాతృ సంస్థ ఉమ్మడి మార్కెట్ విలువలు రాకెట్లా దూసుకెళ్తూ దలాల్ స్ట్రీట్‌లో లాభాల మోత మోగిస్తున్నాయి. గత ఏడాది కాలంలో దాదాపు డజను కార్పొరేట్ సంస్థలు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి. తాజాగా ఐటీసీ కూడా హోటళ్ల బిజినెస్‌ను విడదీసి ప్రత్యేక అనుబంధ సంస్థగా లిస్టింగ్ చేస్తోంది. అదేవిధంగా టాటా మోటార్స్ సైతం వాణిజ్య వాహన విభాగాన్ని విడదీసే పనిలో ఉంది. - సాక్షి, బిజినెస్ డెస్క్

> విభిన్న వ్యాపారాలను ఒకే గొడుగు కింద నిర్వహించడం చాలా క్లిష్టతరమైన వ్యవహారం. దీనివల్ల నిర్దిష్టంగా ఫోకస్ చేయడానికి వీలుండదు. వేరు చేయడం వల్ల నిర్వహణ పనితీరు మెరుగవుతుంది.
> – రవి సర్దానా, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్

లాభాల 'విభజన' ఇలా....			
పేరెంట్ కంపెనీ	విడదీసిన కంపెనీ (ఏడాది)	ప్రస్తుత ఉమ్మడి మార్కెట్‌క్యాప్ (కోట్లలో)	వృద్ధి(%)
ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్	నువామా వెల్త్ (జూన్ 2023)	36,900	487
షిప్పింగ్ కార్ప్	ఎస్‌సీఐ ల్యాండ్–అసెట్ (మార్చి 2023)	12,829	192
టీవీఎస్ హోల్డింగ్స్	సుందరం క్లేటాన్ (ఆగస్ట్ 2023)	24,357	136
ఎన్‌ఐఐటీ	ఎన్‌ఐఐటీ లెర్నింగ్ సిస్టమ్స్ (జూన్ 2023)	8,811	61
జీహెచ్‌సీఎల్	జీహెచ్‌సీఎల్ టెక్స్‌టైల్స్ (ఏప్రిల్ 2024)	8,030	63
ఫోర్బ్స్ & కంపెనీ	ఫోర్బ్స్ ప్రెసిషన్ టూల్స్ (మార్చి 2024)	2,119	30
బోరోసిల్	బోరోసిల్ సైంటిఫిక్ (డిసెంబర్ 2023)	6,498	27
రేమండ్	రేమండ్ లైఫ్‌స్టైల్ (జూలై 2024)	23844	14

వ్యాపారాల పునర్వ్యవస్థీకరణ, ఇన్వెస్టర్లకు మరింత విలువ చేకూర్చడం ఇలా కారణం ఏదైనా కానీ.. దేశీ కార్పొరేట్ కంపెనీలు విభజనతో కాసులు కురిపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఇలా విడదీసిన కంపెనీల షేర్లు దండిగానే లాభాలు పంచాయి. గత ఏడాది వ్యవధిలో విభజన తర్వాత మాతృ సంస్థ, కొత్తగా ఏర్పాటు చేసిన కంపెనీల ఉమ్మడి మార్కెట్ విలువ 14–487% స్థాయిలో ఎగబాకడం విశేషం. ఎడెల్‌వీజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 2023 జూన్‌లో తన వెల్త్ బిజినెస్‌ను వేరు చేసి నువామా వెల్త్ మేనేజ్‌మెంట్ పేరుతో కొత్త కంపెనీని నెలకొల్పింది. అప్పటి నుంచి ఈ రెండు సంస్థలూ బుల్లెట్‌లా దూసుకెళ్లాయి. ఉమ్మడి మార్కెట్ విలువ రూ.6,281 కోట్ల నుంచి తాజాగా రూ.36,900 కోట్లకు ఎగసింది. ఏకంగా 487 శాతం వృద్ధి చెందింది. నువామా గతేడాది సెప్టెంబర్‌లో లిస్టయింది. దీంతోపాటు షిప్పింగ్ కార్పొరేషన్, టీవీఎస్ హోల్డింగ్స్, ఎన్‌ఐఐటీ, జీహెచ్‌సీఎల్, ఫోర్బ్స్–కంపెనీ... ఈ సంస్థలు విభజన తర్వాత మార్కెట్ విలువను 50 శాతం పైగానే పెంచుకున్నాయి. రిలయన్స్ నుంచి జియో ఫైనాన్షియల్ విభజన తర్వాత ఇరు కంపెనీల మార్కెట్ విలువ ఒక దశలో 25 శాతం పైగా ఎగసింది.

మెరుగైన నిర్వహణ...

అధిక వృద్ధికి అవకాశం గల వ్యాపారాలను మాతృ సంస్థల నుంచి విడదీయడం వల్ల ఇన్వెస్టర్లకు కూడా మరింత విలువ చేకూరుతోంది. 'విడదీసిన సంస్థల వ్యాపారాలు పుంజుకోవడం, స్వతంత్ర నిర్వహణ వల్ల ఆయా బిజినెస్‌లపై మరింత ఫోకస్ పెట్టేందుకు వీలవుతుంది. తగినంత నిధుల కేటాయింపు, పరిశ్రమ ట్రెండ్స్‌తో మెరుగ్గా అనుసంధానం కావడంతో భారీగా వృద్ధి చెందే అవకాశం ఉంటుంది' అని అవెండస్ క్యాపిటల్‌లో ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్స్ హెడ్ గౌరవ్ సూద్ పేర్కొన్నారు. దీనికి ప్రభుత్వ రంగ షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చక్కని ఉదాహరణ. ఈ కంపెనీకి చెందిన నాన్–కోర్ బిజినెస్‌లు, రియల్ ఎస్టేట్ ఆస్తులను విడదీసి ఎస్‌సీఐ ల్యాండ్ అండ్ అసెట్స్ అనే సంస్థను ఏర్పాటు చేసింది. గతేడాది మార్చిలో ఇది లిస్టయింది. ఈ రెండు కంపెనీల ఉమ్మడి మార్కెట్ విలువ రూ.4,379 కోట్ల నుంచి రూ. 12,829 కోట్లకు దూసుకెళ్లింది. అంటే 192% జంప్ చేసింది. ఇక టీవీఎస్ హోల్డింగ్స్ నుంచి సుందరమ్ క్లేటాన్ విభజన, దీన్ని ప్రత్యేక కంపెనీగా లిస్ట్ చేయడం వల్ల ఈ రెండింటి మార్కెట్ విలువ ప్రస్తుతం 136 శాతం ఎగబాకింది.

క్యూలో మరిన్ని కంపెనీలు...

ఐటీసీ, వేదాంత, హెచ్‌ఈజీ, అరవింద్, క్వెస్ కార్ప్ వంటి డజనకు పైగా కంపెనీలు ఇప్పటికే డీమెర్జర్లను ప్రకటించాయి. మరో 12–18 నెలల్లో ఈ ప్రక్రియ పూర్తయ్యి.. వేరు చేసిన కంపెనీలు లిస్టవుతాయి. దీంతో అటు ఇన్వెస్టర్లతో పాటు ఇటు ఆయా కంపెనీలకూ మరింత విలువ దక్కనుంది. ఐటీసీ హోటల్ వ్యాపారాన్ని విడదీస్తున్నట్లు గతేడాది ఆగస్ట్‌లో ప్రకటించడం తెలిసిందే. వాటాదారులకు ప్రతి 10 ఐటీసీ షేర్లకు 1 ఐటీసీ హోటల్స్ షేర్లు దక్కుతాయి. దీనికి రికార్డ్ తేదీ జనవరి 6 కాగా త్వరలో లిస్టింగ్ జరగనుంది. వేదాంత సైతం 5 కీలక వ్యాపారాలను (అల్యూమినియం, ఆయిల్–గ్యాస్ విద్యుత్, స్టీల్, ఫెర్రస్ మెటీరియల్స్) వేర్వేరు కంపెనీలుగా విడదీయనున్నట్లు 2023 సెప్టెంబర్‌లో తెలిపింది. కొత్తగా ఏర్పాటు చేసిన వ్యాపారాలు, జింక్ మాత్రం వేదాంత కింద ఉంటాయి. ఇక టాటా మోటార్స్ కూడా తన వాణిజ్య వాహన విభాగాన్ని విడదీసి ప్రత్యేక కంపెనీగా లిస్ట్ చేయనుంది. ప్యాసింజర్ వాహన విభాగం ఇప్పుడున్న లిస్టెడ్ కంపెనీ పేరుతోనే కొనసాగనుంది.

కార్ల విక్రయాలు అదుర్స్



- 2024లో 43 లక్షల ప్యాసింజర్ వాహన అమ్మకాలు
- ఎస్‌యూవీ విభాగంలో బలమైన వృద్ధి

న్యూఢిల్లీ: 2024 సంవత్సరంలో దేశీయంగా ప్యాసింజర్ వాహన విక్రయాలు రికార్డు స్థాయిలో 43 లక్షల యూనిట్లు అమ్ముడయ్యాయి. అంతకు ముందు 2023 ఏడాదిలో విక్రయించిన 41.09 లక్షల వాహనాలతో పోలిస్తే ఈ సంఖ్య 4.64% అధికంగా ఉంది. ఎస్‌యూవీ (స్పోర్ట్ యుటిలిటీ వెహికల్స్)లకు అధిక గిరాకీ, గ్రామీణ మార్కెట్ల నుంచి డిమాండ్ బలంగా ఉండడం కలిసొచ్చింది. దిగ్గజ ఆటో కంపెనీలైన మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటార్స్, టయోటా కిర్లోస్కర్ మోటార్, కియా ఇండియాలు గతంలో ఎన్నడూ చేయని అధిక స్థాయిలో వార్షిక విక్రయాలు నమోదు చేశాయి.

- మారుతీ సుజుకీ 2024లో 17,90,977 వాహనాలు విక్రయించింది. అంతకు ముందు 2018లో అమ్ముడైన 17,51,919 యూనిట్ల అమ్మకాల రికార్డు బద్దలైంది. కాగా 2023లో కంపెనీ మొత్తం 17,26,661 వాహనాలను విక్రయించింది.
- గత క్యాలెండర్ ఏడాదిలో హ్యుందాయ్ మోటార్ రికార్డు స్థాయిలో 6,05,433 యూనిట్లు విక్రయించింది. వీటిలో ఎస్‌యూవీ విభాగపు వాటా 60.6 శాతంగా ఉంది. కాగా 2023లో 6,02,111 విక్రయాలు నమోదయ్యాయి.

డిసెంబర్‌లో వాహన విక్రయాలు			
కంపెనీ	2024	2023	వృద్ధి/క్షీణత(%)
మారుతీ	1,78,248	1,37,551	30
హ్యుందాయ్	55,078	56,450	(-)2
టాటా మోటార్స్	44,289	43,675	1
ఎంఅండ్ఎం	41,424	35,174	18
టయోటా కిర్లోస్కర్	29,529	22,867	29
కియా ఇండియా	18,995	12,536	52
ఎంజీ మోటార్	7516	4400	70
నిస్సాన్ మోటార్	11,676	7,711	51
ఆడి ఇండియా	5,816	7,931	(-)27
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,23,125	3,26,806	(-)1
సుజుకీ మోటార్ సైకిల్	96,804	79,483	22

ఎయిరిండియా విమానాల్లో వైఫై సర్వీసులు



ముంబై: విమానయాన సంస్థ ఎయిరిండియా దేశీ, విదేశీ రూట్లలో నడిపే ఫ్లయిట్స్‌లో వైఫై ఇంటర్నెట్ కనెక్టివిటీ సర్వీసులను ప్రవేశపెట్టినట్లు ప్రకటించింది. ఎయిర్‌బస్ ఏ350, బోయింగ్ 787–9 రకం విమానాలతో పాటు నిర్దిష్ట ఎయిర్‌బస్ ఏ321నియో ఎయిర్‌క్రాఫ్ట్‌లలో ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. దేశీయంగా ఫ్లయిట్స్‌లో వైఫై సర్వీసులను ప్రవేశపెట్టిన తొలి విమానయాన సంస్థ తమదేనని ఈ సందర్భంగా కంపెనీ తెలిపింది. దేశీ రూట్లలో ప్రస్తుతానికి వీటిని కాంప్లిమెంటరీగా అందిస్తున్నట్లు వివరించింది. క్రమంగా అన్ని విమానాల్లోనూ ఈ సేవలు ప్రవేశపెడతామని పేర్కొంది.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.77 లక్షల కోట్లు

డిసెంబర్‌లో 7.3 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 2024 డిసెంబర్‌లో స్థూలంగా (2023 ఇదే నెలతో పోల్చి) 7.3 శాతం పెరిగి రూ.1.77 లక్షల కోట్లకు చేరాయి. సమీక్షా నెల్లో దేశీయ లావాదేవీల నుంచి జీఎస్‌టీ వసూళ్లు 8.4 శాతం పెరిగి రూ1.32 లక్షల కోట్లకు చేరగా, దిగుమతుల పైన వచ్చే పన్నుల వసూళ్లు దాదాపు 4 శాతం పెరిగి రూ.44,268 కోట్లకు చేరాయి. డిసెంబర్‌లో రిఫండ్స్ భారీగా నమోదుకావడం గమనార్హం. రిఫండ్స్ 31 శాతం పెరిగి రూ.22,490 కోట్లుగా నమోదయ్యాయి. రిఫండ్లను సవరించిన తర్వాత నికర జీఎస్‌టీ వసూళ్లు 3.3 శాతం పెరిగి రూ. 1.54 లక్షల కోట్లకు చేరాయి. తాజా ప్రభుత్వ గణాంకాల ప్రకారం .. సెంట్రల్ జీఎస్‌టీ వసూళ్లు రూ. 32,836 కోట్లు. స్టేట్ జీఎస్‌టీ రూ. 40,499 కోట్లు. ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.47,783 కోట్లు. సెస్సు రూ.11,471 కోట్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో రూ.2.10 లక్షల కోట్లు నమోదయ్యాయి. ఈ వసూళ్ల ఇప్పటి వరకూ ఒక రికార్డు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఈ-కామర్స్‌కు పోటీగా క్విక్ కామర్స్ | గూగుల్ పే, ఫోన్‌పేకి ఊరట

బోణీ బాగుంది!

- 2025 తొలిరోజే మార్కెట్ జోరు
- సెన్సెక్స్ 368 పాయింట్లు ర్యాలీ



ముంబై: కొత్త సంవత్సరానికి స్టాక్ మార్కెట్ లాభాలతో స్వాగతం పలికింది. మెటల్, రియల్టీ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బుధవారం ఇండెక్సులు అరశాతం మేర లాభపడ్డాయి. సెన్సెక్స్ 368 పాయింట్లు పెరిగి 78,507 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98 పాయింట్లు బలపడి 23,743 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 617 పాయింట్లు పెరిగి 78,756 వద్ద, నిఫ్టీ 178 పాయింట్లు బలపడి 23,823 వద్ద గరిష్టాన్ని తాకాయి. కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1%, మిడ్ క్యాప్ సూచీ అరశాతం రాణించాయి. కొత్త సంవత్సరం రోజున ఆసియా, యూరప్ మార్కెట్లు పనిచేయలేదు.

- డిసెంబర్‌లో వాహన విక్రయాల జోరుతో మారుతీ సుజుకీ 3%, ఎంఅండ్ఎం 2.50%, టాటా మోటార్స్ ఒకశాతం ర్యాలీ చేశాయి.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..

» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ
» టెట్/డీఎస్సీ ప్రత్యేకం–టీచింగ్ అప్టిట్యూడ్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–తెలంగాణ హిస్టరీ
» బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– మార్కెటింగ్ అవేర్‌నెస్

విద్య, ఉద్యోగ సమాచారం

యూకో బ్యాంక్, కోల్‌కతాలో 68 స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులు

కోల్‌కతాలోని యూకో బ్యాంక్.. రెగ్యులర్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 68.
» **పోస్టుల వివరాలు:** ఎకనామిస్ట్(జేఎంజీఎస్–1)–02, ఫైర్ సేఫ్టీ ఆఫీసర్(జేఎంజీఎస్–1)–02, సెక్యూరిటీ ఆఫీసర్(జేఎంజీఎస్–1)–08, రిస్క్ ఆఫీసర్(ఎంఎంజీఎస్–2)–10, ఐటీ ఆఫీసర్(ఎంఎంజీఎస్–2)–21, చార్టర్డ్ అకౌంటెంట్(ఎంఎంజీఎస్–2)–25.
» **అర్హత:** పోస్టును అనుసరించి సీఏ/ఎఫ్ఆర్ఎం/సీఎఫ్ఏ, ఐసీఏఐ సర్టిఫికేషన్, డిగ్రీ, పీజీ, బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.11.2024 నాటికి ఎకనామిస్ట్ పోస్టులకు 21 నుంచి 30 ఏళ్లు, ఫైర్ సేఫ్టీ ఆఫీసర్ పోస్టులకు 22 నుంచి 35 ఏళ్లు, మిగిలిన పోస్టులకు 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు జేఎంజీఎస్–1 పోస్టులకు రూ.48,170 నుంచి రూ. 85,920. ఎంఎంజీఎస్–2 పోస్టులకు రూ.64,820 నుంచి రూ.93,960.
» **ఎంపిక విధానం:** అప్లికేషన్ స్క్రీనింగ్, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.01.2025.
» **వెబ్‌సైట్:** https://ucobank.com

ఏపీ డీఎంఈలో 1289 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రుల్లోని వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్, సూపర్ స్పెషాలిటీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1,289.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ రెసిడెంట్(క్లినికల్)–603, సీనియర్ రెసిడెంట్(నాన్ క్లినికల్)–590, సీనియర్ రెసిడెంట్(సూపర్ స్పెషాలిటీ)–96.
» **స్పెషాలిటీలు:** జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, అనెస్తీషియా, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, ఆప్తాల్మాలజీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, రెస్పిరేటరీ మెడిసిన్, సైకియాట్రి, రేడియో డయాగ్నోసిస్/రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, రేడియోథెరపీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, న్యూక్లియర్ మెడిసిన్, అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రో బయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, కార్డియాలజీ,ఎండోక్రైనాలజీ, మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరాలజీ, కార్డియో థొరాసిక్ సర్జరీ/సీవీటీ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, యూరాలజీ, న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, సర్జికల్ అంకాలజీ, మెడికల్ అంకాలజీ, నియోనాటాలజీ.
» **అర్హత:** మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ(ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ/ఎండీఎస్) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 44 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు బ్రాడ్ స్పెషాలిటీలకు రూ.80,500, సూపర్ స్పెషాలిటీకి రూ.97,750.
» **ఎంపిక విధానం:** పోస్టు గ్రాడ్యుయేషన్ ఎగ్జామ్ మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.01.2025.
» **వెబ్‌సైట్:** http://https//dme.ap.nic.in

మంచి మార్కులకు మార్గమిదే!!

పదో తరగతి.. భవిష్యత్తు కెరీర్ అవకాశాల దిశగా కీలకమైన దశ! పదోతరగతిలో సాధించిన మార్కులు భవిష్యత్ కెరీర్ ఎంపికలో కీలకంగా మారుతాయి. అంతేకాకుండా టెన్త్ సబ్జెక్ట్ బేసిక్స్‌పై మంచి పట్టుంటే.. ఎలాంటి కోర్సుల్లోనైనా తేలిగ్గానే రాణించొచ్చు!! తెలంగాణలో 2025, మార్చి 21 నుంచి పదో తరగతి పరీక్షలు మొదలు కానున్నాయి! ఈ ఏడాది గ్రేడ్స్ బదులు మార్కులు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో.. తెలంగాణలో పదో తరగతి పరీక్ష విధానంలో మార్పులు.. బెస్ట్ స్కోర్‌కు మార్గాలు.. సబ్జెక్ట్ వారీగా దృష్టి సారించాల్సిన అంశాలు, విశ్లేషణ..

» తెలంగాణలో మార్చి 21 నుంచి టెన్త్ పరీక్షలు
» ఈ ఏడాదికి ప్రస్తుత విధానంలోనే పరీక్షలు
» ప్రతి సబ్జెక్ట్‌లో 80 మార్కులకు వార్షిక పరీక్షలు
» గ్రేడ్స్ బదులు మళ్లీ మార్కుల విధానం



పదో తరగతి ప్రత్యేకం

గ్రేడ్ బదులు మార్కులు

తెలంగాణ రాష్ట్రంలో 2024–25 పదో తరగతి వార్షిక పరీక్షల విషయంలో కీలకమైన మార్పులను విద్యాశాఖ ప్రకటించింది. ప్రస్తుతం ఇస్తున్న గ్రేడింగ్ విధానానికి స్వస్తి పలికి.. మళ్లీ పాత పద్ధతిలోనే మార్కులు ఇవ్వనున్నారు. గ్రేడింగ్ విధానం వల్ల ఉన్నత విద్య ప్రవేశ పరీక్షల సమయంలో వాటిని క్రోడీకరించే విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఆన్సర్ షీట్.. ఇకపై ఒకటే

పరీక్ష హాల్లో విద్యార్థులకు ఇచ్చే ఆన్సర్ షీట్‌కు సంబంధించి కూడా మార్పులు చేశారు. నూతన విధానంలో విద్యార్థులకు 24 పేజీల ఆన్సర్ బుక్‌లెట్‌ను ఇస్తారు. ఇందులోనే మొత్తం అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. అడిషనల్ షీట్ విధానాన్ని తొలగిస్తున్నారు. గత వార్షిక పరీక్షల వరకు ముందుగా నాలుగు పేజీల ఆన్సర్ షీట్‌ను, తర్వాత మరో నాలుగు పేజీల వరకు అడిషనల్ షీట్స్‌ను ఇచ్చే వారు. అడిషనల్ షీట్స్‌ను జత చేయడం (ట్యాగ్ చేయడం)లో ఇబ్బందులు.. కొన్ని సందర్భాల్లో అవి గల్లంతవుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో.. 24 పేజీల ఆన్సర్ బుక్‌లెట్ విధానానికి శ్రీకారం చుట్టారు.

పాత విధానంలోనే పరీక్షలు

వాస్తవానికి తెలంగాణలో పదో తరగతి వార్షిక పరీక్షలను 100 మార్కులకు నిర్వహించాలని, ఇంటర్నల్స్‌కు 20 మార్కుల విధానానికి స్వస్తి పలకాలని ప్రభుత్వం భావించింది. కానీ.. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో ఇంటర్నల్స్ తుది దశకు చేరుకున్నాయి. దీంతో ఈ ఏడాది పరీక్షలను పాత విధానంలోనే 80 మార్కులకు నిర్వహించాలని నిర్ణయించారు. వచ్చే ఏడాది నుంచి ఇంటర్నల్స్ ఉండవని.. అన్ని సబ్జెక్టులలో 100 మార్కులకు వార్షిక పరీక్షలే ఉంటాయని స్పష్టం చేశారు.

ఆ మూడు ప్రధానం

పదో తరగతి విద్యార్థులు మంచి మార్కుల సాధనకు మూడు అంశాలపై నైపుణ్యం సాధించాలి. అవి..అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ. వార్షిక పరీక్షల్లో ఈ తరహా ప్రశ్నలే ఎదురవుతున్నాయి. కాబట్టి విద్యార్థులు ఒక పాఠాన్ని చదువుతున్నప్పుడే.. సదరు పాఠంలో పేర్కొన్న సందర్భం, సంఘటనపై సొంత వాక్యాల్లో అభిప్రాయాలు రాయగలిగేలా చదవాలి. పదో తరగతిలో అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణకు ప్రాధాన్యం ఉంది, కాబట్టి టెన్త్‌క్లాస్ సబ్జెక్టులపై పట్టు సాధించాలంటే.. పాఠ్యాంశాలు చదువుతూనే.. సొంత వాక్యాలు, అభిప్రాయాలు రాసే విధంగా నైపుణ్యాలు పెంచుకోవాలి. మాతృభాష 'తెలుగు' సబ్జెక్ట్ నుంచి సోషల్ స్టడీస్ వరకూ.. అన్నింటిలోనూ ఈ దృక్పథం అవసరం. అప్పుడే సబ్జెక్టుపై పట్టుతోపాటు మంచి మార్కులు సాధించేందుకు వీలవుతుంది.

ప్రశ్నల సరళి ఇలా

తెలంగాణ పదో తరగతి ప్రశ్నల సరళిని పరిశీలిస్తే.. ప్రతి సబ్జెక్ట్‌లో 20 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు–20 మార్కులు; ప్రతి సబ్జెక్ట్‌లో 60 మార్కులకు స్వల్ప, అతి స్వల్ప, వ్యాసరూప సమాధాన ప్రశ్నలు ఉంటాయి. వ్యాసరూప ప్రశ్నలు 6(24 మార్కులు); లఘు ప్రశ్నలు 6 (24 మార్కులు); అతి లఘు ప్రశ్నలు 6 (12 మార్కులు) అడుగుతారు.

సబ్జెక్ట్ వారీగా ప్రిపరేషన్

తెలుగు

ఈ పేపర్‌లో మంచి మార్కులు సాధించేందుకు విద్యార్థులు..ముందుగా పద్యభాగం, గద్యభాగంలోని అన్ని అంశాలను చదవాలి. వాటిని పునశ్చరణ చేసుకోవాలి. పాఠాన్ని చదవడంతోనే సరి పెట్టకుండా.. సారాంశాన్ని, ఉద్దేశాన్ని తెలుసుకోవాలి. ప్యాసేజ్ పేరిట ఉండే అపరిచిత గద్యం ఎంతో ముఖ్యం. ఉపవాచకానికి సంబంధించి ఇతివృత్తం, ప్రాముఖ్యత, పాత్రలు, వాటి ప్రాధాన్యత, వ్యక్తుల ప్రవర్తన శైలి తదితర అంశాల ద్వారా ఇచ్చే సందేశాన్ని తెలుసుకోవాలి. వ్యాకరణంలో ప్రతిభ చూపాలంటే.. సంధులు, సమాసాలు, సంయుక్తార్థాలు, ఉత్పత్త్యర్థాలు, జాతీయాలు బాగా చదవాలి.

ఇంగ్లిష్

ఇంగ్లిష్ సబ్జెక్టులో కొద్దిపాటి చిట్కాలతో మంచి మార్కులు పొందొచ్చు. ఇందులో వెర్బల్, నాన్–వెర్బల్ అంశాలు బాగా చదవాలి. పొయెట్రీ ప్రశ్నల్లో మంచి మార్కుల సాధన కోసం సదరు పద్యంలో ముఖ్య పదాలు, యాంటానిమ్స్, సినానిమ్స్‌పై దృష్టి సారించాలి. వీటితో పాటు పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్, యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్, ఫ్రేజల్ వెర్బ్స్‌పైనా అవగాహన పెంచుకోవాలి. వీటిని అధ్యయనం చేయడంతోపాటు ప్రాక్టీస్ కూడా చేస్తే మెరుగైన మార్కులు పొందేందుకు ఆస్కారం లభిస్తుంది. అదే విధంగా అపరిచిత గద్యం (అన్‌నోన్ ప్యాసేజెస్) సారాంశాన్ని గ్రహించేలా చదవాలి. లెటర్ రైటింగ్‌కు సంబంధించి పంక్చుయేషన్స్, బాడీ ఆఫ్ ది లెటర్ వంటి అంశాలపైనా పట్టు పెంచుకోవాలి.

మ్యాథమెటిక్స్

ప్రతి చాప్టర్‌ను సిలబస్‌కు అనుగుణంగా పూర్తిగా అధ్యయనం చేయాలి. ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. పేపర్–2లో రేఖా గణితం, క్షేత్రమితి, త్రికోణమితి, సంభావ్యత, సాంఖ్యకశాస్త్రంపై పట్టు సాధించడం ఎంతో మేలు చేస్తుంది. సాధన చేయడంతోపాటు కారణాల నిరూపణ, వ్యక్తీకరణ, సమస్యను ఇతర అంశాలతో అనుసంధానం చేయడం వంటి నైపుణ్యాలు పెంచుకోవాలి. ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే.. రివిజన్ సమయంలో ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. పాఠ్యపుస్తకంలో ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, నిర్మాణాత్మక సమస్యలకు సమాధానాలు కనుగొనేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవ సంఖ్యలు, సమితులు, బహుపదులు, రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యాయాలలోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు, సంభావ్యత, సాంఖ్యక శాస్త్రం, త్రికోణమితి, క్షేత్రమితిలోని ముఖ్యమైన సమస్యలను సాధన చేయాలి.

ఫిజికల్ సైన్స్

ఫిజికల్ సైన్స్‌లో మంచి మార్కులు సాధించాలంటే.. అప్లికేషన్ అప్రోచ్‌ను అనుసరించాలి. ఆయా చాప్టర్లకు సంబంధించిన అంశాలను నిజ జీవిత సంఘటనలతో అన్వయించుకుంటూ ప్రిపరేషన్ సాగించాలి. విషయ అవగాహనతోపాటు, ప్రశ్నించడం–పరికల్పన చేయడం, ప్రయోగాలు–క్షేత్ర పర్యటనలు, సమాచార నైపుణ్యాలు–ప్రాజెక్ట్ పనులు, పటాలు–వాటి ద్వారా భావ ప్రసారం వంటి వాటిపైనా దృష్టిపెట్టాలి. కాంతి పరావర్తనం, కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కార్బన్ సమ్మేళనాలపై పట్టు సాధించాలి. మూలకాల ధర్మాలు–వర్గీకరణ, రసాయన సమీకరణాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేయడం వల్ల లఘు, అతి స్వల్ప, బహుళైచ్ఛిక ప్రశ్నలకు సులువుగా సమాధానాలిచ్చే పట్టు లభిస్తుంది.

నేచురల్ సైన్సెస్

జీవశాస్త్రం సబ్జెక్ట్‌లో అవగాహన, సొంత విశ్లేషణ నైపుణ్యాలు కీలకంగా మారుతున్నాయి. ఇందుకోసం ఫ్లో చార్ట్‌లు, బ్లాక్ డయాగ్రమ్స్‌లను సొంతంగా రూపొందించుకోవాలి. విశ్లేషణాత్మక, తులనాత్మక అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. నేర్చుకున్న అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయించే విధంగా చదవాలి. ప్రయోగాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన పొందడం ఎంతో మేలు చేస్తుంది. విశ్లేషణ, కారణాలు, పోలికలు, బేధాలు తెలుసుకుంటూ చదవాలి. డయాగ్రమ్స్ విషయంలో భాగాలను గుర్తించడమే కాకుండా.. వాటి ప్రాముఖ్యతను వర్ణించగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

సోషల్ స్టడీస్

సోషల్ స్టడీస్‌లో మంచి మార్కులు సాధించడానికి విద్యార్థులు సమకాలీన అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి. సమకాలీన అంశాల విషయంలో ప్రతిస్పందన, ప్రశ్నించడం, ప్రశంస/అభినందనలపై సాధన చేయాలి.

అవగాహనకు సంబంధించి ఒక నిర్దిష్ట అంశాన్ని చదివి, సొంత పరిజ్ఞానంతో రాసే విధంగా నైపుణ్యం పెంచుకోవాలి. జాగ్రఫీ, ఎకనామిక్స్‌లో భారతదేశం –భౌగోళిక స్వరూపం, శీతోష్ణస్థితి, భారతదేశ నీటి వనరులు, వలసలు, ఆహార భద్రత, ఉత్పత్తి–ఆదాయం, సుస్థిరాభివృద్ధి పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. హిస్టరీలో రెండు ప్రపంచ యుద్ధ కాలాల సమయంలో ప్రపంచం, సమకాలీన సామాజిక ఉద్యమాలపై దృష్టి పెట్టాలి. భారత జాతీయోద్యమ చరిత్రపై ప్రత్యేక దృష్టితో చదవాలి. సివిక్స్‌కు సంబంధించి రాజ్యాంగం మూల సూత్రాలు, రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలను ఏఏ దేశాల రాజ్యాంగాల నుంచి గ్రహించారు వంటి కోణాల్లో చదవాలి.

పదో తరగతి.. ప్రిపరేషన్ టిప్స్

- సిలబస్‌లో ఆయా సబ్జెక్టులు, చాప్టర్లలో సిలబస్‌ను పరిశీలించాలి.
- ముఖ్యమైన చాప్టర్లను వెయిటేజీ ఆధారంగా వర్గీకరించుకోవాలి.
- ముందుగా అత్యధిక వెయిటేజీ ఉండే అంశాలపై దృష్టి పెట్టాలి.
- ఇప్పటి నుంచే ప్రాక్టీస్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- అవగాహన,ప్రతిస్పందన,స్వీయ విశ్లేషణ నైపుణ్యాలు సాధించేలా కృషి చేయాలి.
- అనువర్తిత నైపుణ్యం పెంపొందించుకునేలా చదవాలి.
- మ్యాథమెటిక్స్, సైన్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించి బేసిక్ కాన్సెప్ట్స్, థీరమ్స్‌ను బాగా అధ్యయనం చేయాలి.
- ప్రతి అంశాన్ని సొంతగా విశ్లేషించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.



కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ యాదవనగర్ శివారులోని పొలంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటున్న మహిళా కూలీలు - సుల్తానాబాద్



బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా యాదగిరిగుట్ట, స్వర్ణగిరి ఆలయాలకు భక్తులు తరలిరావడంతో గూడూరు టోల్‌ప్లాజా వద్ద భారీగా బారులు తీరిన వాహనాలు.



బుధవారం న్యూ ఇయర్ సందర్భంగా యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ మాడవీధుల్లో భక్తజనసంద్రం



కూర్మావతారంలో

రామయ్య

భద్రాచలం: ముక్కోటి ఏకాదశి ప్రయుక్త అధ్యయ నోత్సవాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు కూర్మావతారంలో దర్శనమి చ్చారు. ఈ రూపంలో అలంకరించిన స్వామి వారిని తొలుత బేడా మండపంలో ఆళ్వార్లతో సహా కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వేదపండితులు ప్రబంధాలను పఠిం చారు. అనంతరం స్వామివారిని భక్తుల సం దర్శన కోసం మిథిలా స్టేడియానికి తీసుకెళ్లి వేదికపై ఆసీనుల్ని చేశారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నాక.. తిరువీధి సేవ అనంతరం తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు.



యాదగిరీశుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసిం హస్వామి వారిని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ రాధారాణి నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భం గా ఆలయ అర్చకులు ఆమెకు సంప్రదాయం గా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

నాడు జానీ.. నేడు జీనత్

ప్రేమ కోసమే వలలో పడెనే...

మగ తోడును వెతుక్కుంటూ ఓ ఆడపులి యాత్ర



ఒడిశా టైగర్ రిజర్వు నుంచి తప్పించుకున్న ఆడ పులి జీనత్.. 21 రోజుల్లో 3 రాష్ట్రాల్లోని 300 కిలోమీటర్ల పయనం

రేడియో కాలర్ ఉన్నా ఎక్కడా ఉచ్చులో పడకుండా ముప్పతిప్పలు పెట్టిన పులి.. దొరికినట్టే దొరికి జారిపోవడంతో పరుగులు పెట్టిన అటవీ శాఖ

ఎట్టకేలకు బెంగాల్‌లోని బంకురా జిల్లాలో బంధించిన అధికారులు

మొన్నటికి మొన్న జానీ అనే మగ పులి.. తోడు కోసం మహారాష్ట్ర ఆడవుల నుంచి వచ్చి.. తెలంగాణలో వందల కిలోమీటర్లు చక్కర్లు కొట్టింది. ఇప్పుడేమో జీనత్ అనే ఈ ఆడపులి మగతోడు కోసం ఒడిశాలోని టైగర్ రిజర్వు నుంచి తప్పించుకొని 3 రాష్ట్రాల్లో 300 కిలోమీటర్లు పయనించింది. లవ్.. ఇష్క్.. కాదల్.. పేరేదైనా ఓసారి ప్రేమలో పడితే.. ఇదిగో ఇలా లవర్ కోసం పడరాని పాట్లు పడాల్సిందే. జానీ ప్రేమ కథ మనకు తెలిసిందే.. జీనత్ లవ్ స్టోరీని ఇప్పుడు తెలుసుకుందాం.

సాక్షి, అమరావతి

మగ తోడును వెతుక్కుంటూ దట్టమైన అటవీ ప్రాంతం నుంచి తప్పించుకున్న ఒక ఆడ పులి మూడు రాష్ట్రాల అధికారులను ముప్పతిప్పలు పెట్టింది. దాని శరీరానికి అమర్చిన రేడియో కాలర్ ద్వారా అది ఎక్కడెక్కడికి వెళుతుందో తెలుసుకుంటూ అనేకచోట్ల ఉచ్చులు వేసినా ఎక్కడా చిక్కకుండా తప్పించుకుని తిరిగింది. 21 రోజులపాటు ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ అటవీ ప్రాంతాల్లోని 300 కిలోమీటర్ల మేర అది ప్రయాణించింది. మధ్యలో కొన్నిసార్లు జనావాసాలకు దగ్గరగా రావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు వణికిపోయారు. మూడు రాష్ట్రాల అటవీ శాఖల అధికారులు దాని పాదముద్రలు, ఇతర గుర్తులు, రేడియో కాలర్ ద్వారా ఎప్పటికప్పుడు జాడ తెలుసుకుని వెళ్లినా అది వారి కళ్లుగప్పి తప్పించుకుని వెళ్లిపోయేది. చివరికి 21 రోజుల తర్వాత పశ్చిమ బెంగాల్‌లోని బంకురా జిల్లాల్లో దానికి మత్తు మందు ఇచ్చి బంధించడంతో ఆయా రాష్ట్రాలు ఊపిరి పీల్చుకున్నాయి.



జీనత్‌ను బంధించిన అధికారులు

ఒడిశాలోని సిమ్లిపాల్ టైగర్ రిజర్వు ప్రాంతంలో పులుల సంతతిని పెంచేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా నవంబర్ 14న మహారాష్ట్రలోని తడోబా-అంధారి టైగర్ రిజర్వ్ నుంచి జీనత్, యమున అనే ఆడ పులులను ఒడిశాలోని సిమ్లిపాల్ టైగర్ రిజర్వుకు తీసుకొచ్చారు. కొత్త ప్రాంతం కావడంతో జీనత్‌ను 10 రోజులపాటు అలవాటు పడేందుకు సాఫ్ట్ ఎన్‌క్లోజర్‌లో ఉంచి నవంబర్ 24న సిమ్లిపాల్ కోర్ ఏరియాలో వదిలారు. మొదట్లో రెండు పులులు సిమ్లిపాల్ పరిధిలోనే తిరిగాయి. డిసెంబర్ 8న మూడేళ్ల జీనత్ టైగర్ రిజర్వు పరిధి దాటేసి తప్పించుకోవడంతో అధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. దాని శరీరానికి రేడియో కాలర్ అమర్చి అది తిరిగే ప్రాంతాలను అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకునేవారు. కొన్నిసార్లు రేడియో కాలర్ సిగ్నల్ బలహీనంగా ఉండటంతో దాన్ని ట్రాక్ చేయడం సాధ్యమయ్యేది కాదు. అందుకే పలుచోట్ల నైలాన్ ఉచ్చులు వేసి, మత్తు బాణాలు వదిలినా అది దొరకలేదు.

మహారాష్ట్ర నుంచి తెచ్చి..



ట్రాన్స్‌లొకేషన్ షాక్‌తోనే..

అలా వెళుతూ అది ఒడిశా నుంచి జార్ఖండ్‌లోని అటవీ ప్రాంతంలోకి ప్రవేశించడంతో అక్కడి అటవీ గ్రామాల ప్రజలు వణికిపోయారు. పులి పాదముద్రలు గుర్తించేలోపే మరో చోటుకు వెళ్లిపోయేది. ఆ తర్వాత జార్ఖండ్ దాటి మరో వంద కిలోమీటర్లు ప్రయాణించి పశ్చిమ బెంగాల్‌లోకి ప్రవేశించింది. మొదట ఝార్‌గ్రామ్‌లో స్థానికుల్ని హడలెత్తించింది. చివరకు ఆడపాడపా వచ్చిన సిగ్నల్స్ ఆధారంగా 21 రోజుల తర్వాత బంకురా జిల్లాలోని గోసైందిహి ప్రాంతంలో జీనత్ జాడ కనిపెట్టి మత్తు మందు ఇచ్చి బంధించారు. మూడు వారాల్లో మూడు రాష్ట్రాల్లో కలకలం రేపిన పులిని బంధించారన్న సమాచారంతో ఆయా రాష్ట్రాలు ఊపిరి పీల్చుకున్నాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పులిని బంధించడంపై సంతోషం వ్యక్తం చేశారు. పట్టుకున్న తర్వాత పరీక్షించగా అది ఆరోగ్యంగా, చురుగ్గా ఉన్నట్టు గుర్తించారు. అయితే.. తన భూభాగం కాకపోవడంతో అది ట్రాన్స్‌లొకేషన్ షాక్‌కు గురైనట్టు భావిస్తున్నారు. పులులు సాధారణంగా తమ భూభాగం దాటి తిరగవు. బయట ప్రాంతం కావడం, ఆ ప్రాంతంలో ఇతర పులులు కూడా ఉండటంతో అది సర్దుకోలేక, దిక్కు తెలియక ఎటు పడితే అటు వెళ్లినట్టు అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా మగ తోడు కోసం వెతుకులాట కూడా ఒక కారణం కావచ్చని అంటున్నారు.

ఆలయాలకు 'నూతన' శోభ

కొత్త ఏడాది మొదటి రోజు పోటెత్తిన భక్తులు

యాదగిరీశుడి ధర్మ దర్శనానికి నాలుగున్నర గంటల సమయం

యాదగిరిగుట్ట/ హనుమకొండ కల్చరల్: నూతన సంవత్సరం మొదటి రోజు సందర్భంగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. కొత్త సంవత్సరం తొలిరోజున ఇష్టదైవాలను దర్శించుకుంటే శుభాలు కలుగుతాయన్న నమ్మకంతో ప్రజలు పెద్ద ఎత్తున దేవాలయాల బాట పట్టారు. రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వేకువజాము నుంచే పెద్దఎత్తున భక్తులు శ్రీస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. రాష్ట్రం నలుమూలలనుంచే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా శ్రీనృసింహుడిని దర్శించుకొని, కొత్త సంవత్సరం మొదటి రోజు ఆశీస్సులు తీసుకున్నారు. భక్తులు అధికంగా రావడంతో ఆలయ మాడ వీధులు, క్యూకాంప్లెక్స్ మూడు అంతస్తులు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట, శ్రీసత్యనారాయణ స్వామి వ్రత మండపం, మెట్ల దారి, ఘాట్ దారులన్నీ భక్తులతో నిండిపోయాయి. దీంతో శ్రీస్వామి ధర్మ దర్శనానికి నాలుగున్నర గంటల సమయం పట్టగా.. వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. ఇక బ్రేక్ దర్శనానికి 30 నిమిషాల సమయం పట్టింది. స్వామివారిని సుమారు 50 వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి రూ.83,26,642 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. వరంగల్‌లో కూడా శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయం, శ్రీభద్రకాళి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. వేయిస్తంభాల ఆలయంలో ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వ ర్యంలో ఉత్తిష్ఠగణపతికి ఆరాధన, శ్రీరుద్రేశ్వరస్వామివారికి 51 కిలోల పెరు గుతో అభిషేకం చేశారు. భద్రకాళి అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ సమర్పించారు.

గూడూరు టోల్‌ప్లాజా వద్ద రద్దీ

బీబీనగర్: నూతన సంవత్సరం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల పరిధిలో హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై గూడూరు టోల్‌ప్లాజా వద్ద బుధవారం వాహనాలు బారులు తీరాయి. హైదరాబాద్ - సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం, భువనగిరిలోని స్వర్ణగిరి క్షేత్రానికి భారీగా తరలి రావడంతో వాహనాలు కిటకిటలాడాయి. గూడూరు టోల్‌ప్లాజా వద్ద ఉదయం భువనగిరి వైపు 2 కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు హైదరాబాద్ వైపు స్వర్ణగిరి క్షేత్రం నుంచి టోల్ ప్లాజా వరకు ట్రాఫిక్ స్తంభించింది.

పాలు.. కోలా.. ఐస్ క్యూబ్స్..

స్విగ్గీలో హైదరాబాదీల అధిక ఆర్డర్లు ఇవే..

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు

67 ఆర్డర్లు 3 నిమిషాల్లోపే డెలివరీ

డెలివరీ బాయ్‌కి రూ.వెయ్యి టిప్ ఇచ్చిన ఓ యూజర్

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరవాసులు న్యూఇయర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా స్విగ్గీలో అత్యధి కంగా పాలు, కోకాకోలా, ఐస్ క్యూబ్స్, మసాలా చిప్స్, సోడా ఆర్డర్ చేశారు. 67 ఆర్డర్లు మూడు నిమిషాలలోపే డెలివరీ చేసినట్లు స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ట్రెండ్స్‌ను విడుదల చేసింది. ఓ స్విగ్గీ యూజర్ న్యూ ఇయర్ పార్టీ కోసం ఏకంగా రూ.18 వేలు వెచ్చించాడు. జ్యూవెలరీ, క్రాకరీ, బహుమతులు, దీపాలు ఆర్డర్ చేశాడు. మరో యూజర్ డెలివరీ బాయ్‌కి న్యూ ఇయర్ కానుకగా రూ.1,000 టిప్‌గా అందించాడు.

5 లక్షల చిప్స్ ప్యాకెట్లు..

స్విగ్గీకి గోవాలో నిమిషానికి ఒక ఐస్ క్యూబ్ ఆర్డర్ రాగా.. 4 నిమిషాల వ్యవధిలో టానిక్ వాటర్ డెలివరీ అయింది. న్యూ ఇయర్ సందర్భంగా అత్యధికంగా పాలు, చిప్స్, చాక్లెట్లు, ద్రాక్షపళ్లు, పనీర్ ఆర్డర్లు వచ్చాయి. దేశవ్యాప్తంగా 5 లక్షల చిప్స్ ప్యాకెట్ల ఆర్డర్లు వచ్చాయి. ఇక ప్రతి 8 ఆర్డర్లలో ఒకటి కూల్ డ్రింకే ఉంది. అలాగే 'యూనో'కార్డ్ గేమ్ అండ్ పజిల్ ఆర్డర్లు 600 శాతం మేర పెరిగాయి.

700 కేజీల భారీ కేక్

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆధ్వర్యంలో 700 కేజీల భారీ కేక్ కట్ చేశారు. ప్రకాశం జిల్లా, మార్కాపురం పట్టణం, జవహర్‌నగర్ కాలనీలోని అన్నా రాంబాబు నివాసం వద్ద టర్బో లారీపై ఏర్పాటు చేసిన కేక్‌ను పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, నాయకులతో కలిసి కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అన్నా రాంబాబు, జంకె వెంకటరెడ్డిలను క్రేన్ సాయంతో భారీ గజమాలతో ఘనంగా సన్మానించారు.



ఈవెంట్స్‌తో రూ.56,00,000

న్యూ ఇయర్ వేడుకలకు ఎక్సైజ్ శాఖకు వచ్చిన ఆదాయం



సాక్షి, హైదరా బాద్: కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈవెంట్లకు అనుమతులివ్వడం ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ. 56.46 లక్షల ఆదాయం సమ కూరింది. డిసెంబర్ 31న సంబురాలు నిర్వ హించుకునేందుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 287 ఈవెంట్లకు ఎక్సైజ్ శాఖ అను మతినిచ్చింది. ఇందులో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోనే అత్యధికంగా 243 ఈవెంట్లు జరగ్గా, మిగిలిన జిల్లాల్లో 44 జరిగాయి. గత ఏడాది కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా 224 ఈవెంట్లకు అనుమతి ఇవ్వగా రూ.44.76 లక్షల మేర ఆదాయం వచ్చిందని, ఈ ఏడాది ఈవెంట్ల నిర్వహణ పెరగడంతో ఆదాయం కూడా పెరిగిందని ఎక్సైజ్ శాఖ వర్గాలు వెల్లడించాయి.

'కొత్త' కొత్తగా కొన్నదీ..

నూతన సంవత్సరం వేడుకల్లో వెరైటీ కొనుగోళ్లు

వివరాలు సాక్షి ప్లస్(ఈ-పేపర్)లో



1700 జీసీసీల్లో 19 లక్షల ఉద్యోగులు

ఇతర దేశాల్లోని నిపుణులైన ఉద్యోగుల సేవలను తక్కువ ఖర్చుతో వినియోగించుకుంటూ వ్యాపారాభివృద్ధికి దోహదం చేస్తాయి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ). 2010 వరకు చాలాకొద్ది సేవలకే పరిమితమైన జీసీసీలు ఇప్పుడు తమ సేవలను ఎంతో విస్తరించాయి. అందుకే ఇప్పుడివి లక్షలాదిమందికి ఉపాధి కల్పించడమే కాదు.. లక్షల కోట్ల వ్యాపారం కూడా చేస్తున్నాయి.

రూ.1.66 లక్షల కోట్లు
2014-15లో దేశంలో జీసీసీల ఆదాయం

సుమారు రూ.5.48 లక్షల కోట్లు
2023-24లో జీసీసీల రెవెన్యూ

సంవత్సరం	జీసీసీల సంఖ్య	ఉద్యోగులు (లక్షల్లో)
2009-10	750	4
2014-15	1,000	7
2018-19	1,285	14
2022-23	1,580	17
2023-24	1,700	19

ఆధారం: కన్సల్టింగ్ సంస్థ జిన్నోవ్, ప్రైస్ వాటర్‌హౌస్ కూపర్స్, నాస్‌కామ్

స్వదేశానికి గుడ్ బై

13 ఏళ్లలో భారత పౌరసత్వం వదులుకున్న 18 లక్షల మంది ప్రవాసులు


- రికార్డు స్థాయిలో 2022లో 2.25 లక్షల మంది విదేశీ పౌరసత్వం స్వీకరణ
- యూఎస్, కెనడా, యూకే, సింగపూర్‌లలో స్థిరపడేందుకు మొగ్గు



సాక్షి, అమరావతి: గడచిన రెండు దశాబ్దాల్లో విద్య, ఉద్యోగం, ఉపాధి కోసం సంపన్న దేశాలకు భారతీయుల వలసలు పెరిగాయి. ఇలా వెళ్లిన వారిలో వ్యక్తిగత సౌకర్యం కోసం విదేశాల్లోనే స్థిరపడుతున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ముఖ్యంగా కరోనా అనంతరం భారత పౌరసత్వం వదులుకుని స్వదేశానికి గుడ్‌బై చెబుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. 2011-2023 మధ్య పదమూడేళ్లలో ఏకంగా 18,79,659 మంది ఎన్నారైలు భారత పౌరసత్వాన్ని వదులుకుని.. విదేశాల్లో పౌరసత్వం స్వీకరించారు. అత్యధికంగా 2022లో 2.25 లక్షల మంది భారత పౌరసత్వాన్ని వదులుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 135 దేశాల్లో ఎన్నారైలు పౌరసత్వం స్వీకరించినట్టు విదేశీ వ్యవహారాల శాఖ ఇటీవల వెల్లడించింది. వ్యక్తిగత కారణాలతోనే వీరందరూ పౌరసత్వం వదులుకున్నట్టు పేర్కొంది.

అమెరికాలో రెండో స్థానం

వివిధ దేశాల నుంచి అమెరికాకు వెళ్లి అక్కడి పౌరసత్వం స్వీకరిస్తున్న వారిలో భారతీయులు రెండో స్థానంలో ఉంటున్నారు. 2022లో 9.69 లక్షల మంది విదేశీయులు అమెరికా పౌరసత్వం స్వీకరించారు. వీరిలో మెక్సికన్లు 1.28 లక్షలు ఉండగా.. 65,960 మందితో భారత్ రెండో స్థానంలో నిలిచింది. అమెరికాతో పాటు, కెనడా, రష్యా, సింగపూర్, న్యూజిలాండ్, యూకే వంటి దేశాల్లో స్థిరపడటానికి ఎక్కువ మంది ఎన్నారైలు మొగ్గుచూపుతున్నారు. అత్యున్నత జీవన ప్రమాణాలతో పాటు పెట్టుబడులకు అనుకూల వాతావరణం, ప్రశాంత జీవనం, పిల్లల భవిష్యత్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎక్కువ మంది విదేశాల్లోనే శాశ్వతంగా స్థిరపడటానికి ఇష్టపడుతున్నారు.



ప్రపంచ వ్యాప్తంగా 4.5 మిలియన్ల మందికి ఓసీఐ

రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం విదేశీ పౌరసత్వం తీసుకున్న భారతీయులు ఇక్కడి పౌరసత్వం కోల్పోతారు. ఇలా పౌరసత్వం కోల్పోయిన వారు బంధువులు, స్నేహితుల కోసం భారత్‌కు రావాలంటే పాస్‌పోర్ట్ పొందాల్సి ఉంటుంది. పాస్‌పోర్ట్‌తో పనిలేకుండా భారత్‌కు వచ్చి వెళ్లే వారి కోసం 2006లో ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా కార్డు(ఓసీఐ)ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ కార్డు పొందిన వారు వీసా లేకుండానే భారత్‌కు రాకపోకలు సాగించవచ్చు. ప్రపంచవ్యాప్తంగా 4.5 మిలియన్లకు పైగా ఓసీఐ కలిగి ఉన్నారు. వీరిలో యూఎస్‌లో 16.8, యూకేలో 9.34, ఆస్ట్రేలియాలో 4.94 లక్షల మంది చొప్పున ఉన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

కొత్త ఏడాదిలో

కొత్త ఆశలు

కమలదళం కార్యాచరణ ప్రణాళిక
- రాష్ట్రంలో మరింత పట్టు పెంచుకునే దిశలో బీజేపీ ప్రయత్నాలు
- మూడు ఎమ్మెల్సీ సీట్లలో గెలిచి బలం చాటడమే లక్ష్యం



సాక్షి, హైదరాబాద్: కొత్త ఏడాదిలో ప్రజల మద్దతును కూడగట్టి, అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా మారాలనే లక్ష్యసాధన దిశగా కమలదళం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లలో, అంతకు ముందు అసెంబ్లీ ఎన్నికల్లో 8 సీట్లలో గెలిచి రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీగా ఎదిగిన బీజేపీ, నూతన సంవత్సరంలో అదే ఒరవడిని కొనసాగించాలని ఉవ్విళ్లూరుతోంది. ఏడాది ప్రథమార్ధంలో సంస్థాగతంగా బలోపేతం కావడంతో పాటు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి చేరికలుండేలా చూడటం, త్వరలో జరగనున్న గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో గణనీయ సంఖ్యలో సీట్లు సాధించడం, మూడు ఎమ్మెల్సీ సీట్లలో (రెండు టీచర్, ఒక గ్రాడ్యుయేట్) గెలిచి రాజకీయంగా బలాన్ని చాటడం అనే లక్ష్యాన్ని రాష్ట్ర నాయకత్వం నిర్దేశించుకుంది.

ఎంపీ ఎన్నికల్లో పడిన ఓట్లే ఆలంబనగా..

లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లలో బీజేపీ అభ్యర్థులు 77,43,947 ఓట్లు (36 శాతం) సాధించిన నేపథ్యంలో.. ప్రజా సమస్యలపై గొంతెత్తడం ద్వారా వచ్చే నాలుగేళ్లలో (2028 అసెంబ్లీ ఎన్నికల కల్లా) రాష్ట్రంలో అధికార సాధన దిశగా అడుగులు వేయాలని ఆ పార్టీ నిర్ణయించింది. నిరంతరం ప్రజల్లోనే ఉంటూ సమస్యలపై పోరాడాలని భావిస్తోంది. జాతీయ పార్టీ అండదండలు పూర్తిస్థాయిలో ఉండడంతో పాటు కేంద్ర హోంశాఖ మంత్రి, పార్టీ అగ్రనేత అమిత్‌షా ప్రత్యక్ష పర్యవేక్షణ కూడా ఉన్నందున.. పార్టీ దీర్ఘ, స్వల్పకాలిక లక్ష్యాల సాధన దిశగా రాష్ట్రంలోని యావత్ పార్టీ యంత్రాంగం పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయం నాయకుల్లో వ్యక్తమౌతోంది. స్థానిక ఎన్నికల సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో వివిధ వర్గాల ప్రజల మద్దతును కూడగట్టడంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి పట్టభద్రులు, ఉపాధ్యాయుల్లోనూ తమ బలం చాటాలని బీజేపీ భావిస్తోంది. పోలింగ్ బూత్ కమిటీల ఏర్పాటు ఇప్పటికే పూర్తికాగా.. జనవరి నెలంతా సంస్థాగతంగా మండల, జిల్లా అధ్యక్షుల ఎన్నిక పూర్తిచేసుకుని, వచ్చేనెల మొదటివారం కల్లా రాష్ట్ర పార్టీకి కొత్త అధ్యక్షుడిని ఎంపిక చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది.

సర్కారు వైఫల్యంపై ఆందోళన కార్యక్రమాలు

కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలన వైఫల్యాలు, ఎన్నికలకు ముందు ఆ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు, ఇతర హామీల అమల్లో వెనకడుగును ఎండగట్టేలా వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలను చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. ఇప్పటికే రైతు భరోసా, మహిళలు, యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమల్లో వైఫల్యాన్ని ఎండగట్టడంతో పాటు మూసీ ప్రక్షాళన, హైడ్రా పేరిట చేపట్టిన కూల్చివేతలకు వ్యతిరేకంగా నిరసనలు, ర్యాలీలు, దీక్షలు, కలెక్టరేట్ల ముట్టడి వంటి ఆందోళన కార్యక్రమాలను చేపట్టింది. 2025లోనూ వీటిని మరింత విస్తృతంగా క్షేత్రస్థాయి నుంచి చేపట్టడం ద్వారా ప్రజలకు చేరువ కావాలని భావిస్తోంది. అదే సమయంలో బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలు, వివిధ వర్గాల ప్రజలకు ఎదురైన చేదు అనుభవాలు, ఆ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడం ద్వారా ఆ పార్టీకి మళ్లీ ప్రజల్లో ఆదరణ పెరగకుండా జాగ్రత్త వహించాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి బీజేపీయే ప్రత్యామ్నాయం అనే భావన ప్రజల్లో కలిగేలా వివిధ రూపాల్లో ప్రచార, ఆందోళనా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది.



క్యాంప్ వద్ద సీఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది

ఛత్తీస్‌గఢ్‌లో సీఆర్పీఎఫ్ మరో క్యాంపు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా మెట్టగూడెంలో భద్రతా బలగాలు మరో కొత్త క్యాంప్‌ను బుధవారం ప్రారంభించాయి. మావోయిస్టు అగ్రనేత మడివి హిడ్మా లక్ష్యంగా.. ఆ రాష్ట్ర దండకారణ్యంలో బలగాలు ముందుకెళ్తున్న విషయం తెలిసిందే. హిడ్మా కొంత కాలంగా ఈ ప్రాంతంలోనే ఉన్నాడనే ఇంటెలిజెన్స్ అధికారుల సమాచారంతో మెట్టగూడెంలో సీఆర్పీఎఫ్ 131 బెటాలియన్ క్యాంప్ ఏర్పాటు చేసినట్టు సమాచారం. కాగా, ఎస్పీ కిరణ్‌చవాన్, సీఆర్పీఎఫ్ డీఐజీ క్యాంప్‌ను ప్రారంభించారు.



నూతన సంవత్సరం సందర్భంగా హైదరాబాద్‌లోని ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు జనంతో కిటకిటలాడాయి. బిర్లా టెంపుల్ వద్ద భక్తుల రద్దీ

మట్టి బట్టీలకు గట్టి గిరాకీ

దేశ విదేశాలకు ఎగుమతి • తందూరీ మట్టి బట్టీల చిరునామా నర్సాపూర్

పరిమాణం బట్టి రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు ధర • ముంబై పోర్టు నుంచి గల్ఫ్ దేశాలకు ఎగుమతి

నోరూరించే తందూరీ వంటకాల తయారీ అనగానే గుర్తొచ్చేది మట్టి బట్టీలు.. ఈ వంటకాల్లో కీలకమైన మట్టి బట్టీల తయారీకి చిరునామాగా నిలిచింది నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం నర్సాపూర్ గ్రామం. ఈ కుగ్రామంలో తయారుచేసిన తందూరీ మట్టి బట్టీలకు దేశ విదేశాల్లో మంచి డిమాండ్ ఉండటంతో, వ్యాపారం ఖండాలు దాటుతోంది. నర్సాపూర్‌కు చెందిన కుమ్మరి గోపాల్ తరతరాల నుంచి వస్తున్న కులవృత్తిని కొనసాగిస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో రుచికరమైన వంటలకు ఉపయోగపడే తందూరీ మట్టి బట్టీలకు మంచి డిమాండ్ ఏర్పడటంతో.. బట్టీల తయారీనే కుటుంబం ఉపాధిగా ఎంచుకుంది.

- దామరగిద్ద



స్టీల్ పెట్టెలో వాడేందుకు సిద్ధంగా ఉన్న మట్టి బట్టీ

17 ఏళ్లుగా ఇదేవృత్తి

నర్సాపూర్ గ్రామవాసి కుమ్మరి గోపాల్, అతడి కుటుంబ సభ్యులు 17 ఏళ్లుగా తమ కులవృత్తిలో భాగంగా బట్టీల తయారీలో నైపుణ్యం సాధించారు. మొదట రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో పెద్ద పెద్ద హోటళ్లలో మట్టి బట్టీల వినియోగాన్ని గుర్తించిన గోపాల్.. వాటికి డిమాండ్ ఉందని తెలుసుకొని నాణ్యమైన మట్టి బట్టీల తయారీని మొదలుపెట్టారు. ఈ బట్టీలను హైదరాబాద్, ముంబై, లాతూర్, నాందేడ్, గుల్బర్గా, చెన్నై, మైసూర్ తదితర నగరాలకు సరఫరా చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని తెలుసుకొని.. ముంబై పోర్టు నుంచి మస్కట్, ఖతార్, దుబాయ్‌తో పాటు ఆస్ట్రేలియా సింగపూర్, మలేసియా, అమెరికా తదితర దేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. కర్ర పెట్టెలో ప్రత్యేకంగా ప్యాక్ చేసి, కంటెయినర్లలో ముంబై పోర్టుకు తరలించి.. అక్కడి నుంచి రవాణా సంస్థల సహాయంతో విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు గోపాల్ తెలిపారు.





తయారీలో ఉన్న బట్టీలు

కావలసిన పరిమాణాల్లో..

స్థానికంగా లభించే మట్టితో గృహావసరాలకు ఉపయోగపడే పాత్రలతో పాటు తందూరీ బట్టీలను డ్రమ్ ఆకారంలో చిన్న, పెద్ద, మధ్యస్థంగా తయారు చేస్తున్నారు. మట్టిని బట్టీల తయారీ ప్రక్రియకు స్టీల్ బాక్స్‌లు లేదా మట్టి కవచాలను ఉపయోగిస్తారు. దీంతో వేడి బయటికి వెళ్లకుండా ఉంటుంది. మట్టి బట్టీల పరిమాణం మేరకు ధర రూ.500 నుంచి రూ.2వేలు పలుకుతోంది. స్టీల్, రాగి, సిమెంట్ బట్టీలు రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు లభిస్తున్నాయి. వర్షాకాలంలో బట్టీల తయారీ తక్కువగా ఉంటుంది. నవంబర్ నుంచి వేసవికాలం వరకు ఏటా 500 నుంచి 800 వరకు బట్టీలను తయారు చేస్తున్నారు. మట్టి బట్టీల తయారీతో గోపాల్ మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నారు.

ఆధునిక పరికరాలివ్వాలి

“కులవృత్తిలో ఉన్న నైపుణ్యంతో ఆధునిక కాలం అవసరాలను గుర్తించా. ఏళ్ల తరబడి మట్టి బట్టీలు తయారు చేస్తున్నాం. వీటికి మంచి గిరాకీ ఉంది. దేశంలోని ప్రధాన పట్టణాలతో పాటు వివిధ దేశాలకు ఎగుమతి చేస్తున్నాం. వీటి తయారీ ఎంతో శ్రమతో కూడుకున్నది. ఆధునిక పరికరాలు అందించి ప్రోత్సహిస్తే మరింత మందికి ఉపాధి కల్పించవచ్చు.



- గోపాల్, మట్టి బట్టీల తయారీదారు, నర్సాపూర్

‘కొత్త’ కొత్తగా కొన్నదీ..

నూతన సంవత్సరం వేడుకల్లో వెరైటీ కొనుగోళ్లు
- మారుతున్న అభిరుచులకు తగ్గట్టు కొత్త పోకడలు
- చిప్స్, ఫ్రూట్ బీర్, కోకాకోలా ఇతర శీతలపానీయాలు, ఆలూబుజియా, వివిధ రకాల ఖారా ఐటమ్స్ (నమ్‌కీన్) కొనుగోలు
- ఐస్‌క్యూబ్స్, కండోమ్స్, చేతికి వేసే సంకెళ్లు, బ్లైండ్ ఫోల్డ్స్‌కు ఆర్డర్లు
- అత్యధికంగా ద్రాక్ష పండ్ల విక్రయం
- బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో, బిగ్ బాస్కెట్ ఇతర ప్లాట్‌ఫామ్స్ సోషల్ మీడియా ఖాతాల్లో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: భారత్‌లో నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ జరుపుకొన్న వేడుకలు కొత్త పంథాలో సాగాయి. హైదరాబాద్‌తో ఇతర మెట్రో నగరాలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో సైతం.. డిసెంబర్ 31న అర్ధరాత్రి 12 గంటలకు.. ఆ తర్వాత కూడా ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పై వివిధ రకాల వస్తువుల ఆర్డర్లు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. చిప్స్, ఫ్రూట్ బీర్, కోకాకోలా ఇతర శీతలపానీయాలు, ఆలూబుజియా వివిధ రకాల ఖారా ఐటమ్స్ (నమ్‌కీన్), ఐస్‌క్యూబ్స్, కండోమ్స్, చేతికి వేసే సంకెళ్లు, బ్లైండ్ ఫోల్డ్స్‌తో పాటు ద్రాక్ష పండ్లు.. అత్యధికంగా అమ్ముడైనట్టు వివిధ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. వీటితో పాటు కొత్త ఏడాది ఇచ్చే వివిధ రకాల కానుకలకు కూడా గిరాకీ పెరిగినట్టు తెలుస్తోంది. అర్ధరాత్రి వరకు.. ఆ తర్వాత చేసిన ఈ ఆర్డర్ల తీరు చూస్తుంటే.. ఏ స్థాయిలో కొత్త సంవత్సరం వేడుకలను జరుపుకొన్నారో, ఎలాంటి నూతన పోకడలకు ఆసక్తి చూపారో స్పష్టమవుతోంది. ప్రస్తుతం భారత్‌లో క్విక్‌కామర్స్ ప్లాట్‌ఫామ్స్ నిమిషాల్లోనే వివిధ రకాల వస్తువులను వినియోగదారుల ఇళ్లకు చేరవేస్తున్నాయి. కొత్త సంవత్సరం సందర్భంగా.. విభిన్నంగా వేడుకలను జరుపుకొనే తీరు, స్నేహితులు, సన్నిహితులతో తుళ్లుతూ, ఆడుతూ, పాడుతూ గడిపేందుకు వినియోగదారులు ఇచ్చిన ప్రాధాన్యం ఏ స్థాయిలో ఉందో.. వారు చేసిన ఆర్డర్లే నిదర్శనం. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం వివిధ రకాల వస్తువుల ఆర్డర్లు ఇవ్వడం.. వాటిలో కొత్త తరహావి ఉండటం గమనార్హం. దీనిపై జొమాటోకు చెందిన బ్లింకిట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జెప్టో, బిగ్ బాస్కెట్ ఇతర ప్లాట్‌ఫామ్స్ తమ సోషల్ మీడియా ఖాతాల్లో వెల్లడించిన అంశాలు స్పష్టత ఇస్తున్నాయి. కరోనా కాలంలో ఈ ప్లాట్‌ఫామ్స్‌కు ఆదరణ లభించింది. మహానగరాలు, ప్రథమ శ్రేణి నగరాలు, ప్రధాన పట్టణాలే కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు కూడా వీటి సేవలు వేగంగా అందుబాటులోకి రావడం తెలిసిందే.

12 ద్రాక్ష పండ్ల సెంటిమెంట్

డిసెంబర్ 31న ఒక్కసారిగా ద్రాక్ష పండ్ల కోసం ఉప్పెనలా ఆర్డర్లు వచ్చి పడుతుండడంతో ఆశ్చర్యపోవడం బ్లింకిట్ సీఈవో అల్బింద్ ధిండ్సా వంతైంది. ఇంతమందికి ఒక్కసారే ద్రాక్ష తినాలనే కోరిక ఎందుకు కలిగిందా? అని ఆయన ఆశ్చర్యపోయారు. తమ ప్లాట్‌ఫామ్‌పై అత్యధికంగా ఆర్డర్ చేసిన వస్తువుల్లో ద్రాక్ష పండ్లు ముందువరసలో నిలవడంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఎందుకీ హఠాత్ పరిణామమని ఆరా తీస్తే ఆసక్తికరమైన విషయాలు తెలిశాయి. కొత్త ఏడాది అడుగిడేందుకు ముందు.. అర్ధరాత్రి 12 గంటలకు 12 ద్రాక్ష పండ్లను తిని.. కోరిన కోరిక లేదా ఆకాంక్షను వెలిబుచ్చితే అది వాస్తవరూపం దాల్చుతుందనేది పురాతన ఆచారమట. అమెరికన్ టీవీ సీరియల్ ‘మాడ్రన్ ఫ్యామిలీ’లో సోఫియా వెర్గార పాత్ర ద్వారా దీనికి ప్రాచుర్యం కల్పించడమే ద్రాక్ష ఆర్డర్లు పెరగడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది.

స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ కూడా..

మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో నిమిషానికి 853 చిప్స్ ఆర్డర్లు వచ్చినట్టు, ఒక కస్టమర్ కళ్లకు కట్టే గంతలు (బ్లైండ్ ఫోల్డ్), చేతి సంకెళ్లు (హాండ్‌కఫ్స్) ఆర్డర్ చేసినట్టు, మంగళవారం రాత్రి 7.41 గంటలకు ఐస్ డెలివరీ తారస్థాయికి చేరుకుందని, నిమిషంలో 119 కేజీల ఐస్ దిమ్మెను డెలివరీ చేసినట్టు సంస్థ కో-ఫౌండర్ ఫణికిషన్ తెలియజేశారు. బిగ్‌బాస్కెట్ కూడా నాన్-అల్కాహాలిక్ బేవరేజెస్ అమ్మకాల్లో భారీ పెరుగుదల నమోదైనట్టు తెలిపింది. ఇవి 552 శాతం అధికంగా కాగా.. డిస్పోజబుల్ కప్స్, ప్లేట్స్ వంటి విక్రయాల్లో 325 శాతం పెరుగుదల, సోడా, మాక్‌టెయిల్స్ విక్రయాలు 200 శాతం పెరిగినట్టుగా తెలియజేసింది. అంతకు ముందుతో పోల్చితే ఐస్‌క్యూబ్‌ల ఆర్డర్లు చెన్నైలో రెండింతలు నమోదైనా, చల్లనైన శీతలపానీయాల స్టాక్ పెట్టుకోవడంలో ఇంకా ముంబై, బెంగళూరు, హైదరాబాద్ కంటే చెన్నై వెనుకబడి ఉందని ఫణికిషన్ ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.

2.3 లక్షల ఆలూబుజియా ప్యాకెట్లు



మొత్తంగా చూస్తే.. 2.3 లక్షలకు పైగా ఆలూబుజియా ప్యాకెట్లు, మంగళవారం రాత్రి 8 గంటల సమయానికే 6,834 ఐస్‌క్యూబ్ ప్యాకెట్లను వినియోగదారులకు డెలివరీ చేసినట్టు బ్లింకిట్ సీఈవో అల్బింద్ ధిండ్సా ఎక్స్ వేదికగా వెల్లడించారు. నూతన సంవత్సరం వేడుకలను ఫుల్‌గా ఎంజాయ్ చేసేందుకు సిద్ధమైనవారిలో.. ముఖ్యంగా మందుబాబులు హ్యాంగోవర్‌ను అధిగమించేందుకు 22,322 పార్టీ స్మార్ట్ టాబ్లెట్స్ (హ్యాంగోవర్ లక్షణాలను తగ్గించేందుకు ఉపయోగపడే హెర్బల్ గోళీలు), 2,434 ఈనో ప్యాకెట్లను ఇళ్లకు తెప్పించుకున్నట్లు బ్లింకిట్ వివరించింది. స్నాక్స్, అల్కహాల్‌తో పాటు 45 వేల మినరల్ వాటర్ బాటిళ్లను బ్లింకిట్ ద్వారా సరఫరా చేశారు. కండోమ్స్‌కు సంబంధించి చాక్లెట్ ఫ్లేవర్లలో అత్యధికంగా 39.1 శాతం, స్ట్రాబెర్రీ 31 శాతం, బబుల్‌గమ్ 19.8 శాతం, ఇతర రకాలు 10.1 శాతం ఆర్డర్ చేసినట్టు చెప్పారు. నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకుని తమ సంస్థ అనేక మైలురాళ్లను దాటిందని అల్బింద్ ధిండ్సా పేర్కొన్నారు. ఒకరోజులో అత్యధిక ఆర్డర్ల రికార్డ్, ఒక్కొక్క నిమిషానికి, ఒక్కొక్క గంటకు అత్యధికంగా ఆర్డర్లు పొందడం, డెలివరీ పార్ట్‌నర్లకు అత్యధికంగా టిప్స్ ఇచ్చిన రోజుగా నమోదు కావడం, అత్యధికంగా చిప్స్, ద్రాక్ష పండ్లను విక్రయించిన రికార్డ్‌ను సొంతం చేసుకున్నట్టు ఆయన వెల్లడించారు.





నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ నేతలు పలువురు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో మంత్రులు దామోదర రాజనర్సింహ, సీతక్క, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు ఉన్నారు

చిన్న మిల్లులకు పెద్ద కష్టం



సుమారుగా లెవీ సేకరణ లక్ష్యం ఇలా..

జిల్లా	గత ఏడాది	ఈ ఏడాది
	(మెట్రిక్ టన్నుల్లో)	
పశ్చిమ గోదావరి	4.56 లక్షలు	4.10 లక్షలు
అంబేడ్కర్ కోనసీమ	3.81 లక్షలు	2.37 లక్షలు
ఏలూరు	4.10 లక్షలు	3.50 లక్షలు
తూర్పు గోదావరి	3.70 లక్షలు	3.10 లక్షలు
కాకినాడ	3.60 లక్షలు	3 లక్షలు

తగ్గిన ధాన్యం సేకరణ.. 5 టన్నులలోపు సామర్థ్యం గల మిల్లులకు తగ్గిన కేటాయింపులు

సాక్షి, భీమవరం: చిన్న మిల్లుకు పెద్ద కష్టమొచ్చింది. ధాన్యం సేకరణ లక్ష్యం తగ్గిపోగా.. మిల్లింగ్ సామర్థ్యం మేరకు కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కేటాయింపులు చేస్తుండటం చిన్నమిల్లుల మనుగడపై ప్రభావం చూపనుంది. 5 టన్నులలోపు సామర్థ్యం గల చిన్న మిల్లులకు కొద్దిరోజులకు సరిపడా ధాన్యం మాత్రమే వస్తుండటంతో వాటిని మర ఆడిన తర్వాత మిల్లులు మూసుకోవాల్సిందేనన్న ఆందోళనలో చిన్న మిల్లర్లు ఉన్నారు. ఉదాహరణకు అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్వారపూడి సమీపంలోని చిన్న రైస్‌మిల్లుకు పాత అచీవ్‌మెంట్ ఆధారంగా గతంలో 45 నుంచి 50 ఏసీకే (ఎక్నాలెడ్జ్‌మెంట్)ల ధాన్యం వచ్చేది. ఇది దాదాపు మూడు నెలల పాటు మిల్లు తిరిగేందుకు సరిపోయేది. ఇప్పుడు ధాన్యం సేకరణ లక్ష్యం తగ్గడంతో సుమారు 35 ఏసీకేల వరకు రావాలి. కానీ.. సామర్థ్యం ఆధారంగా ఇవ్వడంతో కేవలం 12 ఏసీకే ధాన్యం మాత్రమే వచ్చింది. ఇది నెల రోజుల మిల్లింగ్‌కు మాత్రమే సరిపోతుంది. తర్వాత రబీ ధాన్యం వచ్చే వరకు మిల్లును మూసుకోవాల్సిందే. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఒక రైస్‌మిల్లుకు గత ర్యాండమైజ్ పద్ధతిలో 40 ఏసీకే (ఒక ఏసీకే దాదాపు 290 క్వింటాళ్లకు సమానం)లకు పైగా ధాన్యం వచ్చేది. ఈసారి ప్రైవేట్ వ్యాపారం చేసే మిల్లులకు సీఎంఆర్ ఇవ్వడం, ప్రస్తుత ధాన్యం సేకరణలో దళారుల జోక్యానికి అవకాశం కలగడంతో తమకు నచ్చిన మిల్లులకు వారు ధాన్యాన్ని చేరవేస్తున్నారు. ఈ జిల్లాలో 10 ఏసీకేల ధాన్యం సేకరణ కష్టంగా మారి మిల్లు ఎంతకాలం నడుస్తుందో చెప్పలేని పరిస్థితి.

గోదావరి జిల్లాల్లో 780 వరకు రైస్‌మిల్లులు

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో రైస్‌మిల్లింగ్ పరిశ్రమ విస్తరించి ఉంది. ఈ రెండు జిల్లాల్లో 780 వరకు రైస్‌మిల్లులు ఉండగా.. పశ్చిమ గోదావరి జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, ఆకివీడు తదితర చోట్ల 360 వరకు రైస్‌మిల్లులు ఉన్నాయి. రెండు జిల్లాల్లో గంటకు 5 టన్నుల నుంచి 10 టన్నులకు పైగా మిల్లింగ్ సామర్థ్యం కలిగిన పెద్ద మిల్లులు 40 శాతం ఉండగా, మిగిలినవన్నీ 5 టన్నులలోపు సామర్థ్యం గల చిన్న మిల్లులే. సాధారణంగా పెద్ద మిల్లులు ప్రైవేట్ మార్కెట్‌కి, ఎగుమతులకు ప్రాధాన్యమిస్తే.. చిన్న మిల్లులు ఎక్కువగా కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)పై ఆధారపడతాయి. రైతుల నుంచి సివిల్ సప్లైస్ శాఖ సేకరించిన ధాన్యాన్ని సీఎంఆర్ కోసం మిల్లులకు అప్పగిస్తుంది. క్వింటాల్ ధాన్యానికి 67 కేజీల బియ్యాన్ని తిరిగి అప్పగించాలి. అందుకోసం కమీషన్ రూపంలో వారికి వచ్చేది కేవలం రూ.10 మాత్రమే. మిల్లింగ్ చేసేటప్పుడు వచ్చే తవుడు, నూకలు, చిట్టు తదితర ఉప ఉత్పత్తులకు రైస్ బ్రాన్ ఆయిల్, ఆల్కహాల్, ఇథనాల్ తయారీలో డిమాండ్ ఉండటంతో సీఎంఆర్ చేస్తుంటాయి.

గతంలో పాత అచీవ్‌మెంట్ల ఆధారంగా...

తూర్పుగోదావరిలో మిల్లింగ్ కెపాసిటీ ఎక్కువగా ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ఎక్స్‌పోర్ట్, ప్రైవేట్ మార్కెట్ చేస్తుంటారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని మిల్లులు ప్రైవేట్ వ్యాపారం తక్కువగా చేస్తుంటాయి. సీఎంఆర్ చేయడంలో ఈ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. ప్రైవేట్ వ్యాపారం చేసే, డ్రయర్లు, లేటెస్ట్ టెక్నాలజీ లేని మిల్లులకు సీఎంఆర్ కేటాయింపులు చేయకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ వాటి మనుగడ దృష్ట్యా గతంలో కొన్ని సడలింపులు ఇచ్చేవారు. సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని బట్టి పాత అచీవ్‌మెంట్ల మేరకు సీఎంఆర్ కేటాయింపులు జరిగేవి. దీనివల్ల సక్రమంగా సీఎంఆర్ చేసే చిన్న మిల్లులకు కేటాయింపులకు ఇబ్బంది ఉండేది కాదు.

సేకరణ లక్ష్యాన్ని తగ్గించడంతో చిన్న మిల్లులకు చిక్కులు

గత ఖరీఫ్‌తో పోలిస్తే ఈ సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యాన్ని తగ్గించేశారు. దీనికితోడు మిల్లింగ్ కెపాసిటీ మేరకు సీఎంఆర్ కేటాయింపులు చేయడం చిన్న మిల్లులకు చిక్కులు తెచ్చిపెట్టింది. ప్రైవేట్ వ్యాపారం చేసే మిల్లులకు సీఎంఆర్‌కు అవకాశం ఇవ్వడంతో చిన్న మిల్లులకు కేటాయింపులు గణనీయంగా తగ్గాయి. ప్రస్తుతం ధాన్యం సేకరణలో దళారుల జోక్యం మరింత సమస్యగా తయారైంది. గత ప్రభుత్వం ధాన్యం సేకరణలో ఏ దశలోనూ దళారుల జోక్యానికి ఆస్కారం లేకుండా రైతుకు పూర్తి మద్దతు ధర అందేలా కట్టుదిట్టం చేసింది. రైతు ఆర్‌బీకే/సొసైటీకి ధాన్యం శాంపిల్ తీసుకువెళితే.. మిగిలిన పనంతా అక్కడి సిబ్బంది చూసుకునేవారు. ధాన్యం ఆన్‌లైన్ చేయగానే ఏ మిల్లుకు వెళ్లాలో కంప్యూటర్ సూచించేది. నూతన విధానంలో అడుగడుగునా దళారుల జోక్యం పెచ్చుమీరింది. కమీషన్ ఏజెంట్లు తమకు నచ్చిన పెద్ద మిల్లర్లతో మాట్లాడుకుని ధాన్యాన్ని అక్కడికే తరలిస్తున్నారు. దీంతో చిన్న మిల్లులకు ధాన్యం సేకరణ కష్టంగా తయారైంది.

నెల రోజులు తిరిగితే గొప్ప

ఏటా సీజన్‌లో చిన్న మిల్లులకు 40 నుంచి 50 ఏసీకేల వరకు ధాన్యం సేకరణ జరిగితే ఇప్పుడు అధిక శాతం 10 నుంచి 15 ఏసీకేలలోపే ఉన్నాయి. దీంతో వాటి సామర్థ్యం మేరకు నెల నుంచి నెలన్నర రోజులు మాత్రమే మర ఆడేందుకు వస్తాయని, తర్వాత రబీ ధాన్యం మార్కెట్‌లోకి వచ్చే వరకు మిల్లులు మూసేయాల్సిందేనని చిన్న మిల్లర్లు అంటున్నారు. మిల్లు తిరిగినా తిరగకపోయినా వాటి చిన్న, పెద్ద మిల్లుల కెపాసిటీని బట్టి సిబ్బంది జీతభత్యాలు, విద్యుత్ బిల్లులు, అద్దెలు, నిర్వహణ రూపంలో నెలకు రూ.2.50 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చవుతుంది. ఈ మేరకు నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ఒక్కో చిన్నమిల్లులో గుమాస్తా, డ్రైవర్, జట్టు కార్మికులు 10 నుంచి 12 మంది వరకు పనిచేస్తుంటారు. మిల్లు మూతపడితే వారంతా ఉపాధి కోల్పోవాల్సి వస్తుంది.

క్లుప్తంగా...

అడుగడుగునా శ్రీవారికి నీరాజనాలు



ద్వారకాతిరుమల: నూతన సంవత్సరం తొలి రోజున తమ ఇంటి ముంగిటకు వచ్చిన శ్రీవారికి భక్తులు పూజాదికాలు జరిపి, నీరాజనాలు సమర్పించారు. ద్వారకాతిరుమల దివ్య క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం నిర్వహించిన గ్రామోత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. తొలుత ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, గజ, అశ్వ సేవల నడుమ స్వామివారి వాహనం ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. తిరువీధుల్లో స్వామివారికి అడుగడుగునా భక్తులు నీరాజనాలు సమర్పించారు. ఆ తరువాత ఆలయ ప్రధాన కూడలిలోని ధనుర్మాస మండపంలో శ్రీవారు, అమ్మవార్లు, గోదాదేవికి అర్చకులు విశేష పూజలు జరిపి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణకు కృషి

సాక్షి, అమరావతి: వైద్య సేవల్లో నాణ్యత పెంపు, ఏపీ 2047 విజన్‌లో నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు ఆరోగ్య, సంపన్న ఏపీ ఆవిష్కరణకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యసేవల్లో లోపాలను తొలగించాలని వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. రోగులకు సత్వరమే వైద్యసేవలు అందేలా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, నర్సింగ్, ఇతర సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కుశస్థలి నదిలో విద్యార్థి గల్లంతు



నదిలో గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నగరి: చిత్తూరు జిల్లా నగరి సమీపంలోని కుశస్థలి నదిలో మజీద్(15) అనే విద్యార్థి గల్లంతైన ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగరి పట్టణం ఇందిరా నగర్‌కు చెందిన చాంద్ బాషా కుమారుడు మజీద్ నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా తన మిత్రులు అబ్దుల్, ఇర్ఫాన్, ఇజ్యాస్‌తో కలిసి రాంనగర్ సమీపంలో ఉన్న కుశస్థలి నది ప్రాంతంలో సరదాగా గడపడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు మజీద్ కాలు జారి నదిలో పడిపోయాడు. మిత్రులు ముగ్గురు కాపాడడానికి ప్రయత్నించినప్పటికీ మునిగిపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు మజీద్ ఆచూకీ లభించలేదు. మజీద్ నగరిలోని ఓ ప్రయివేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు.

నేటి నుంచి వైఎస్సార్ జిల్లాలో కేంద్రమంత్రి పర్యటన

కడప సెవెన్‌రోడ్స్: కేంద్ర ప్రభుత్వం ఆకాంక్షిత జిల్లాగా గుర్తించిన కడపలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతికశాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ గురువారం నుంచి మూడు రోజులపాటు వైఎస్సార్ జిల్లాలో పర్యటించనున్నారు. బుధవారం రాత్రి ఆయన కడపకు చేరుకున్నారు. 2018లో నాటి ప్రభుత్వం దేశంలో 112 జిల్లాలను ఆకాంక్షిత జిల్లాలుగా గుర్తించింది. అందులో వైఎస్సార్ జిల్లా కూడా ఉంది. సామాజిక, ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేయాలన్నది ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. ఇందులో భాగంగా ఆయన గురువారం చింతకొమ్మదిన్నెమండలం నాగిరెడ్డిపల్లె గ్రామాన్ని సందర్శిస్తారు. అక్కడి విలేజ్ హెల్త్ క్లినిక్, అంగన్వాడీ కేంద్రం, వాటర్ కన్జర్వేషన్ ప్లాంటు వంటివి పరిశీలిస్తారు. అనంతరం మోరగుడి గ్రామానికి వెళ్లి స్వయం సహాయక సంఘాలతో సమావేశమవుతారు.

‘స్లో’గా పర్యటిద్దాం!



ప్రపంచవ్యాప్తంగా పర్యాటక ట్రెండ్ మారుతోంది. ఉరుకుల పరుగుల ప్రయాణాలకు బదులు స్థిర అన్వేషణల వైపు గమ్యం సాగుతోంది. స్థానిక సంస్కృతి, ఆచార వ్యవహారాలను సంపూర్ణంగా అర్థం చేసుకునేలా ‘స్లో ట్రావెల్’ పేరుతో పర్యాటక ఉద్యమం ఊపందుకుంటోంది. స్లో ట్రావెల్‌లో పర్యాటక ప్రదేశాల పరిమాణం కంటే.. అందులోని నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. గజిబిజి జీవితాలను పూర్తిగా స్విచ్ ఆఫ్ చేసుకుని ప్రకృతి ఒడిలో మునిగిపోయేలా ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే 2025 సంవత్సరం ‘స్లో ట్రావెల్’ ఇయర్‌గా మారుతుందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

- సాక్షి, అమరావతి

నిత్యం పని జీవితంలో ఒత్తిళ్లు తారస్థాయికి చేరుకోవడంతో సెలవులు తీసుకోవడం గతంతో పోలిస్తే విలువైనదిగా మారింది. ఆఫ్‌బీట్ వెకేషన్లు, కొత్త అన్వేషణల గమ్యస్థానాలకు ప్రయాణించడం మానసిక చికిత్సగా భావిస్తున్నారు. 2025లో అత్యధికులు ‘స్లో ట్రావెల్’కు జైకొడుతున్నారు. ఇది 2025లో 10 శాతం వార్షిక వృద్ధి రేటుతో అభివృద్ధి చెందుతుందని ట్రావెల్ కంపెనీలు అంచనా వేస్తున్నాయి. చాలామంది పర్యాటకులు గమ్యస్థానాలను పూర్తిగా ఆస్వాదించలేకపోతున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఎక్కువ ప్రదేశాలను చుట్టిరావడం కంటే స్థానిక సంస్కృతిలో లీనమవ్వడం, మరింత అర్థవంతంగా ప్రయాణాన్ని మార్చుకోవడమే ప్రధాన ఉద్దేశంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రస్తుతం ప్రజలు నిత్యం పిల్లలను పెంచడం, ఆఫీస్ సమావేశాలు, కుటుంబ కార్యక్రమాలంటూ బిజీ షెడ్యూల్‌లో మునిగిపోతున్నారు. ఇలాంటి తరుణంలో మానసిక విశ్రాంతి, ఆహ్లాదాన్ని పొందేందుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. కొత్త ఆహారాన్ని రుచి చూడటం, కొత్త దృశ్యాలను కళ్లతో బంధిస్తూ విశ్రాంతిని పొందే ప్రదేశాలను కోరుకుంటున్నట్టు ట్రావెల్ సంస్థలు చెబుతున్నాయి.

భారత్‌లో 10 శాతం వృద్ధి అంచనా

అహ్మదాబాద్ అగ్రస్థానం

భారతదేశంలో అహ్మదాబాద్ నగరం సుదీర్ఘ సందర్శనలలో పాల్గొనే వారికి అగ్ర ఎంపికగా ఉద్భవించింది. గోవా, అయోధ్య తరువాత ఈ ప్రాంతం ఎక్కువగా గడిపేందుకు ప్రసిద్ధి చెందింది. విదేశాలకు వెళ్లే భారతీయ ప్రయాణికులు ముఖ్యంగా ఆసియాలో థాయ్‌లాండ్‌లోని ఖావో లాక్, జపాన్‌లోని టోక్యో, దక్షిణ కొరియాలోని సియోల్, మలేషియాలోని పెర్హెన్షియన్ దీవులు, ఫిలిప్పీన్స్‌లోని సియార్గో, ఇండోనేషియాలోని పెకాన్‌బారు, వియత్నాంలోని హో చి మిన్ సిటీకి ఎక్కువగా ఆకర్షితులవుతున్నట్టు డిజిటల్ ట్రావెల్ ప్లాట్‌ఫామ్ అగోడా ప్రకటించింది. స్లో ట్రావెల్ ట్రెండ్‌లో పట్టణ, గ్రామీణ లొకేషన్లు రెండూ జనాదరణ పొందుతుండటం విశేషం.

రైళ్లకు జై కొడుతున్నారు



2024లో 81శాతం మంది విశ్రాంతి కోసం, రోజువారీ ఒత్తిళ్ల నుంచి బయట పడేందుకు స్లో వెకేషన్లకు వెళ్లినట్టు ‘ట్రావెల్ అండ్ టూర్ వరల్డ్’ పేర్కొంది. ఇందులో మూడొంతుల మంది సాంస్కృతిక, చారిత్రక అన్వేషణ, వారసత్వ ప్రదేశాల సందర్శనలకు విలువ ఇస్తున్నట్టు గుర్తించింది. స్లో ట్రావెల్‌లో భాగంగా అధిక శాతం మంది రైలు ప్రయాణాలకు జైకొడుతున్నట్టు తేలింది. సుదూర గమ్యస్థానాలకు విమాన, కారు ప్రయాణాలకు ఖర్చుతో కూడుకోవడం, ఒక్కోసారి రిమోట్ గమ్యస్థానాలను చేరుకోలేకపోవడంతో రైలు మార్గాలను ఎంచుకుంటున్నారు. ముఖ్యంగా యువత సైక్లింగ్, బైక్ రైడ్‌లలో సోలోగా స్లో ట్రావెల్‌కు వెళ్తున్నారు. ఇటీవల కాలం నదీ అందాలను ఆస్వాదించేందుకు క్రూయిజ్‌ల ప్రయాణాలను ఎంపికలు పెరిగాయి.

బోయకొండలో విధ్వంసం

- మద్యం తాగి తీర్థం కాంట్రాక్టర్ వీర విహారం
- ఈఓ కారు, సూపరింటెండెంట్ బైక్ ధ్వంసం చేసిన వైనం



పార్కింగ్ ప్రదేశంలో ఉన్న కారు అద్దాలను ధ్వంసం చేస్తున్న కాంట్రాక్టర్ (సీసీ ఫుటేజీ)

చౌడేపల్లె: చిత్తూరు జిల్లా బోయకొండలో తీర్థం పంపిణీ చేసే కాంట్రాక్టర్ మద్యం తాగి భక్తులతో దురుసుగా ప్రవర్తిస్తుండటంతో ఆలయ సూపరింటెండెంట్ అలా చేయొద్దని మందలించాడు. దీంతో ఆగ్రహించిన కాంట్రాక్టర్ ఈవో కారును, సూపరింటెండెంట్ బైక్‌ను ధ్వంసం చేశాడు. వివరాలు.. బోయకొండ గంగమ్మ దర్శనం కోసం బుధవారం వివిధ ప్రాంతాలనుంచి భారీగా భక్తులు వచ్చారు. ఇక్కడ అత్యంత పవిత్రంగా భావించే తీర్థాన్ని బాటిళ్లలో నింపి రూ. 20 చొప్పున విక్రయిస్తుంటారు. పుంగనూరుకు చెందిన గౌతమ్ బాటిళ్లలో తీర్థం నీటిని నింపడానికి టెండరు ద్వారా లీజు పొందాడు. రద్దీ పెరగడంతో తీర్థం బాటిళ్లకు గిరాకీ ఏర్పడింది. తీర్థం పంపిణీ ఆలస్యం అవుతుండటంతో క్యూలో ఉన్న భక్తులు అధికారులపై మండిపడ్డారు. గమనించిన సూపరింటెండెంట్ రామనాథం తీర్థం నీటిని నింపే ప్రదేశానికి వెళ్లారు. అక్కడ ఉన్న గౌతమ్‌కు భక్తులు పడుతున్న ఇబ్బందులు చెప్పి తీర్థం బాటిళ్లు త్వరగా ఇవ్వాలని చెప్పారు. అప్పటికే మద్యం తాగి ఉన్న గౌతమ్ సూపరింటెండెంట్‌తో దురుసుగా మాట్లాడాడు. వ్యక్తిగత దూషణలకు దిగడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. భక్తులు తీర్థం బాటిళ్లు తీసుకోకుండా వెనుదిరుగుతున్న విషయం ఈవో ఏకాంబరం దృష్టికి వెళ్లడంతో ఆయన అక్కడికి చేరుకుని ప్రశ్నించారు. గౌతమ్ ఈవోతోనూ దురుసుగా మాట్లాడుతూ.. నీ అంతు చూస్తానని బెదిరించాడు. అంతటితో ఆగకుండా పార్కింగ్ చేసి ఉన్న ఈవో కారు అద్దాలు, సూపరింటెండెంట్ బైక్ ధ్వంసం చేసి పెట్రోల్ పోసి తగలబెట్టడానికి ప్రయత్నించగా అక్కడే ఉన్న సిబ్బంది అడ్డుకున్నారు. జరిగిన ఘటనపై ఈవో, సూపరింటెండెంట్ వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు.

పొగాకు గిట్టుబాటు ధర కల్పనలో బోర్డు ప్రధాన పాత్ర

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్



కొరిటిపాడు(గుంటూరు): వ్యవసాయం సజావుగా సాగేలా చూడటం, పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, ఎగుమతులను ప్రోత్సహించడంలో పొగాకు బోర్డు ప్రధాన పాత్ర పోషిస్తోందని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గుంటూరు చుట్టుగుంటలోని రైతు భవన్‌లో పొగాకు బోర్డు వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. భారత ప్రభుత్వ నియంత్రణలో పొగాకు పరిశ్రమ సమగ్ర అభివృద్ధి కోసం 1976 జనవరి 1వ తేదీన పొగాకు బోర్డు చట్టం 1975 ద్వారా పొగాకు బోర్డు స్థాపించడం జరిగిందన్నారు. ప్రపంచంలోనే పొగాకు ఉత్పత్తిలో చైనా తర్వాత భారతదేశం రెండో స్థానంలో, వర్జీనియా పొగాకు ఉత్పత్తిలో 4వ స్థానంలో ఉందని వెల్లడించారు. బ్రెజిల్ తర్వాత ముడి పొగాకు ఎగుమతి చేసే దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉందని, పొగాకు ఎగుమతుల ద్వారా భారత ఖజానాకు గణనీయమైన విదేశీ మారకద్రవ్యం లభిస్తోందని పేర్కొన్నారు. 2023–24లో భారత పొగాకు ఎగుమతుల విలువ రూ.12,005.89 కోట్లుగా నమోదైందని చెప్పారు. దేశంలో పొగాకు పరిశ్రమ సుస్థిరత కోసం పొగాకు బోర్డు అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. బ్యాంకుల ద్వారా రైతులకు అవసరమైన ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. పొగాకు బేళ్లను ఎలక్ట్రానిక్ వేలం ద్వారా నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా కృషి చేస్తున్నామన్నారు. 2023–24లో కిలో పొగాకుకు సగటు ధర రూ.288.65లు లభించిందని తెలిపారు. 2023–24లో పొగాకు రైతులు ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొన్నప్పటికీ, రైతుల సంకల్పం కృషి ఫలితంగా రికార్డు స్థాయిలో 215.35 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అయిందన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రాంతీయ సదస్సులు నిర్వహించి, రైతులు, అధికారులు, వ్యాపారుల సలహాలు, సూచనలు స్వీకరించి, అందుకు అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసి ముందుకు వెళ్తామని వారు పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 62,495 మంది స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.80 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గజ వాహనంపై సిరులతల్లి



చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతీదేవి గజవాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అమ్మవారి జన్మనక్షత్రమైన ఉత్తరాషాడ సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ ఊంజల్ సేవ చేశారు. అనంతరం సిరులతల్లిని గజవాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు.

కాణిపాకం భక్తజన సంద్రం



కాణిపాకం: ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని కాణిపాకం భక్తజన సంద్రమైంది. వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో బుధవారం ఆంగ్ల నూతన సంవత్సరాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేకువజామున మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. 4 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి 10 గంటలకు ఈ దర్శనం కొనసాగింది. భక్తులు తాకిడి అధికంగా ఉన్న నేపథ్యంలో అంతరాలయ దర్శనాన్ని రద్దు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో వీఐపీ, శ్రీఘ్ర, అతిశీఘ్ర, ఉచిత దర్శన లైన్లు కిటకిటలాడాయి. సుమారు 60 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

విద్యా సమాచారం

సంస్కృత వర్సిటీలో పదవులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా వేదాంతం విష్ణుభట్టాచార్యులను నియమిస్తూ వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దూర విద్యాకేంద్రం డైరెక్టర్‌గా ప్రొఫెసర్ చక్రవర్తి రంగనాథన్‌ను, సాహిత్య, సంస్కృతి విభాగం డీన్‌గా ప్రొఫెసర్ సత్యనారాయనాచార్యులు నియమించారు.

పురాతన శాస్త్రాలతో జ్ఞానం

తిరుపతి సిటీ: పురాతన శాస్త్రాలు జ్ఞానానికి మూలాధారమని సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. వర్సిటీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి శాస్త్రీయ వక్తృత్వ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బుధవారం ఆయన ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. వీసీ మాట్లాడుతూ అధ్యాపకుల నైపుణ్యాన్ని వినియోగించుకుని చక్కగా విద్యను అభ్యసించాలని సూచించారు. జ్ఞాన సముపార్జనతో విజయం దాసోహమవుతుందని తెలిపారు. పోటీలలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు మార్చిలో ఢిల్లీ కేంద్రీయ సంస్కృత వర్సిటీ వారు హరిద్వార్‌లో నిర్వహించే అఖిల భారత శాస్త్రీయ వక్తృత్వ పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు.

పరిశోధన పత్రికల ఆవిష్కరణ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానవి, గమనం పేరిట రెండు పరిశోధన పత్రికలను వీసీ ఉమ ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో నూతన ఏడాదిలో వర్సిటీని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. ప్రధాన మంత్రి ఉషా పథకంలో భాగంగా సామాజిక శాస్త్రాలకు సంబంధించిన పరిశోధన పత్రాలను ముద్రించేందుకు ప్రొఫెసర్ బీవీన్ సంపాదకురాలిగా జ్ఞానవి పత్రికను ప్రారంభిస్తున్నామని వివరించారు. అలాగే ప్రొఫెసర్ వెంకటకృష్ణ ఎడిటర్‌గా సైన్స్ జర్నల్స్‌ను ప్రచురించేదుకు గమనం పత్రికను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.

సన్నిధి

సాక్షి ప్లస్

గురువారం ॥ 2-1-2025

● ఉండవల్లి గుహలు



శిల్పకళాశోభితం



అనంతపద్మనాభాలయం

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి అతి ప్రాచీనమైన, చరిత్ర ప్రసిద్ధి చెందిన గ్రామం. విజయవాడ ప్రకాశం బ్యారేజి దాటి మంగళగిరి రహదారి పై కొద్దిగా ముందుకు వెళితే .... ఉండవల్లి సెంటరు వస్తుంది. కుడివైపుకు తిరిగి అమరావతి రోడ్డులో 5 కి.మీ ప్రయాణం చేస్తే మనం ఈ గుహాలయాలను చేరుకుంటాము. వీటిని ఉండవల్లి గుహలు అని పిలుస్తున్నారు. ఈ గుహాలయాలు క్రీ.శ 420 -620 ప్రాంతంలో ఆంధ్రదేశాన్ని పాలించిన విష్ణుకుండినుల కాలం నాటి నిర్మాణాలుగా చరిత్ర పరిశోధకులు భావిస్తున్నారు. .

మొదటి అంతస్తు: కింద భాగం మొదటి అంతస్తులో గుప్తుల,చాళుక్యుల కాలపు శిల్పనిర్మాణం కనిపిస్తుంది. ఇవి అసంపూర్తి గానే ఉన్నాయి. బౌద్ధ సన్యాసుల విహారాలుగా ఉండేటట్లు వీటి నిర్మాణం ప్రారంభమైంది. వీనిలో ఒకదానిలోనుండి మరొక దాని లోనికి మార్గం, విశాలమైన తిన్నెల నిర్మాణం ఉంది.

రెండవ అంతస్తు: రెండవ అంతస్తు లోనికి మెట్లమార్గం ఉంది. దీనిలో త్రిమూర్తుల మందిరాలున్నట్టుగా చెప్పుతున్నారుగాని ఇప్పుడు అవశేషాలు మాత్రమే మిగిలున్నాయి. గదులుగా . మందిరాలుగా ఉన్న వానికి సన్నని తీగలున్న తలుపులను బిగించారు. అక్కడక్కడా ఏవో ఉన్నట్లు గా భ్రాంతిగా కన్పిస్తున్నాయి కాక ఎక్కడా స్పష్టత లేదు. వేసిన తలుపుల వెనుక చీకట్లో ఏవేవో దేవతామూర్తులను పెకలించిన గుర్తులు స్పష్టాస్పష్టంగా కన్పిస్తాయి.

మూడవ అంతస్తులోకి మెట్లమార్గం...

చారిత్రక నేపథ్యం – ఈ గుహాలయాలు నాలుగు అంతస్తులు కూడ రాయిను తొలిచి చేసిన నిర్మాణాలే కాని, పెట్టినవి, ప్రతిష్ఠించినవి లేవు. మూడవ అంతస్తు పూర్తిగా విష్ణు బంధమైన గుహాలయం. సాధారణంగా బౌద్ధ, జైన గుహాలయాలు ఉంటాయి కాని వైష్ణవ గుహాలయం ఉండటం ఇక్కడొక ప్రత్యేకతగా చెప్పవచ్చు. కొండ వీడు రెడ్డి రాజులకు రాజ్యాధికారిగా పని చేసిన మాధవరెడ్డి ఈ అనంత పద్మనాభుని గుహాలయాన్ని నిర్మింపజేసినట్లుగా చరిత్ర చెబుతోంది.

ఇక్కడ నుండి 9 కి.మీ దూరం సొరంగమార్గం మంగళగిరి నరసింహస్వామి కొండపైకి ఉందని, ఆరోజుల్లో సాధువులు, మునులు కృష్ణానదిలో స్నానానికి, పానకాల నరసింహుని దర్శనానికి రాకపోకలు సాగించే వారని నానుడి. ప్రస్తుతం ఈ సొరంగ మార్గాన్ని మూసి వేశారు.

ఎడమవైపుకు తిరిగితే వరుసగా కొండను తొలిచి తీర్చిదిద్దిన శిల్పాలు కను విందు చేస్తాయి. వాటిలో ముందుగా మనల్ని ఆకర్షించేది గణనాయకుడైన వినాయకుని రమణీయ శిల్పం.

మహా గణపతి...

లంబోదరుని సహస్ర రూపాలను దర్శించిన సందర్శకునికైనా ఈ వినాయకుని దర్శనం అపరిమితానందాన్ని ఇస్తుంది. ఎందుకంటే గజాననుని ముఖం మీద తొండం మీద కన్పించే ఆ విధమైన గజచర్మపు ముడతలను శిల్పంలో దర్శింపజేయడం అనన్య సామాన్యం.

ఉగ్రనరసింహుడు: ఈ రూపం ఈమండపంలోనే మూడు ప్రదేశాల్లో మనకు కన్పిస్తుంది. రెండు ఒకే పోలికతో ఉన్నాయి. ఇవి కుడ్యచిత్రాలు. వీనిలో శంకరునితో పాటు వివిధ దేవతల శిల్పాలు కూడ ఉన్నాయి.

శ్రీ లక్ష్మీదేవితో ఆదివరాహస్వామి...

స్థంభాలపై కన్పించే వాటిలో మొదటిది చాల అరుదుగా కన్పించే ఆదివరాహస్వామి. లక్ష్మీ సమేతుడైన ఈ స్వామి కడు రమణీయంగా దర్శనమిస్తాడు.

ఆకాశంలో విహరిస్తున్నట్లున్న గరుత్మంతుడు...

నాగబంధం: మూడవ అంతస్థులో మండపానికి వెలుపల నాగబంధమున్నదని, దానివలన ఈ పరిసరాల్లో ఎక్కడో విలువైన సంపద కాని, విలువైన గ్రంథ సముదాయం కాని ఉండవచ్చని కూడ ప్రచారం జరిగింది.

నారద తుంబురులా ? ఈ మూడవ అంతస్థులో వెలుపల భాగాన నాలుగు విగ్రహాలు, సింహం బొమ్మలు కన్పిస్తున్నాయి. వీటిని నారద, తుంబురులు అని వ్రాస్తున్నారు. నారద తుంబురులయితే ఇద్దరే ఉండాలి కదా! కాని ఎందుకో ఆ నలుగురు వేద పురుషులకు ప్రతీకలనే భావన కలుగుతుంది. వాటిని కొంచెం క్షుణ్ణంగా పరిశీలిస్తే మొదటి పురుషుని కుడి చేతిలోజపమాల, రెండవ చేతిలో తాళపత్రాలు కన్పిస్తున్నాయి. ఋగ్వేదానికి ప్రతీక ఏమో? అలాగే నాల్గవ పురుషుని చేతిలో తంత్రీ వాద్య విశేషం ఉంది. ఇది సామవేదానికి ప్రతీక కావచ్చు. కాబట్టి పండితులు, మేధావులు, చరిత్ర పరిశోధకులు మరొక్కసారి ఈ విగ్రహాలను పరిశీలిస్తే విశేషం వెలుగు చూడవచ్చు?

రవాణాసౌకర్యాలు...

విజయవాడకు దేశంలోని అన్ని ప్రాంతాల నుండి బస్సు, రైలు, విమాన సౌకర్యాలు వున్నాయి.

విజయవాడనుండి ప్రకాశం బ్యారేజి మీద బస్సులు వెళ్లవు కాబట్టి ఆటో చేసుకొని వెళ్లవచ్చు. లేదా మంగళగిరి నుండి ఉండవల్లి సెంటరుకు బస్సులో వచ్చి అక్కడ నుండి ఆటోలో వెళ్లవచ్చు.


రోడ్డు మార్గం... ఉండవల్లి గుహలకు చేరుకునే మార్గాలు ఆలయానికి మంచి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. గుంటూరు నుండి ఉండవల్లి గుహలకు 31 కిలోమీటర్ దూరంలో ఉంది. మంగళగిరి నుండి ఉండవల్లి గుహలకు 7 దూరంలో ఉంది. గుంటూరు నుండి ఉండవల్లి గుహలకు 10 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ గుహలను సందర్శించడానికి రోడ్డు సౌకర్యం అందుబాటులో ఉంది. అదేవిధంగా గుంటూరులో రైల్వే జంక్షన్, విజయవాడలో రైల్వే జంక్షన్ ఉంది. గుంటూరు నుంచి ఆలయానికి 30 కిలోమీటర్లు, విజయవాడ నుంచి ఉండవల్లి గుహలకు 10 కిలోమీటర్లు ఉంది. రైలు సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. మంగళగిరిలో రైలు జంక్షన్ కూడా ఉంది. అక్కడ నుంచి కూడా ఉండవల్లి గుహకు వెళ్లడానికి సదుపాయాలు ఉన్నాయి.

ఒకే కొండను నాలుగంతస్తుల గుహాలయాలుగా, విశాలమైన విహారాలుగా మందిరాలుగా, అందమైన స్తంభాలుగా, బౌద్ధ, శైవ, వైష్ణవ దేవతామూర్తులుగా వివిధ ఆకృతులలో మలచిన ఆనాటి శిల్పుల అనన్య శిల్పనైపుణ్యానికి, అనల్పశిల్ప కళా ప్రావీణ్యానికి శిరసువంచి వందనాలు సమర్పించాల్సిందే. శ్రీ అనంతపద్మ నాభుని 20 అడుగుల ఏకశిలా విగ్రహాన్ని చూడగానే ప్రతి ఒక్కరు ఆశ్చర్యంతో అవాక్కయి నిలబడి పోవలసిందే!

నాభి కమలం నుంచి బ్రహ్మ...

శ్రీ పద్మనాభుని మందిరంలోని సమస్త దృశ్యాన్ని ఒకేసారి మనం చూడగలిగితే, స్వామితో పాటు పద్మోద్భవుడైన బ్రహ్మ, ఆనందంలో సురేశుని కీర్తిస్తున్న దేవతలు, ధ్యానంలో ఉన్న ఋషులు, ఆయుధ పాణులైన అంగరక్షకులు, గగనంలో నర్తిస్తున్న గరుత్మంతుడు ఇదీ దృశ్యం.









కుడ్యశిల్పం...

మరొక స్తంభం మీద కన్పించే శిల్పం ఉగ్రనరసింహుడు. ఇందాక చూసిన రెండు శిల్పాల కంటే పూర్తి వైవిధ్యం కల్గిన మనోహర శిల్పం ఇది. హిరణ్యకశిపుని సంహరిస్తున్న నరసింహునిలో మహోగ్ర రూపాన్ని చూస్తాం. కాని ఈ నారసింహుని వదనంలో ఒక మహోన్నతమైన ఆనందాన్ని ఎంత స్పష్టంగా ఆ శిల్పి చెక్కాడో మనం గమనించ వచ్చు. ఉగ్ర నరసింహుని ముఖంలో ఆనందాన్ని చూపించడానికి కారణం ఆ శిల్పి గొప్ప దైవభక్తుడు, ఉపాసనాపరుడై ఉండాలి.

శ్రీ అనంతపద్మనాభస్వామి... మూడవ అంతస్తు చివరి మందిరంలో కొలువుతీరి ఉన్నాడు శ్రీ అనంతపద్మనాభుడు. చూడటానికి రెండు కళ్లు చాలవనేది మనలో మాట. నల్లని గ్రానైటులో ఏకశిలా నిర్మితమై, పద్మపత్ర విశాలాక్షుడై, అనంతశయనుడై, పద్మనాభుడై, గగనచరులైన దేవతలందరూ ఆనందంనాట్యం చేస్తుంటే, జయ-విజయులు పాదాల చెంత కర్తవ్య పాలనలో ఉండగా, మహర్షులు తపోమగ్నులై యుండగా, ఆకాశంలో గరుడుడు నాట్యం చేస్తుంటే, దర్శనమిస్తున్నాడు శ్రీ అనంతపద్మనాభస్వామి. ఆ దివ్యమంగళ రూపాన్ని దర్శించి తరించవలసిందే కాని వర్ణింపవలవికాదు.

● కథానీతి

నిజాయితీ ఫలితం

'నాన్నా! నోటు పుస్తకాలు కొనాలి. అరవై రూపాయలు కావాలి' మారాం చేశాడు శ్రీకాంత్.

'వారం రోజులు ఆగు. అప్పటిదాకా ఏదో ఒక పాత బుక్కులో రాసుకో' సముదాయించబోయాడు శ్రీకాంత్ తండ్రి రాజన్న.

'అలాగైతే మాస్టారు తిడతారు. నీకేం. నేనేగా తిట్లు తినేది' అన్నాడు బుంగమూతి పెట్టి శ్రీకాంత్..

'తిడితే నాలుగు రోజులు ఓర్చుకో. ఏం చేయగలను. డబ్బు లేందే'

'నీకు వారం రోజుల క్రితమే చెప్పాను. వారం నుండి చిత్తు పేపర్ల మీదే రాసుకుంటున్నా. మరలా మార్కులు రాకపోతే నువ్వే తిడతావు' అన్నాడు శ్రీకాంత్.

వారి మాటలు వింటున్నాడు ఆ పక్కనే ఉన్న రామారావు. అతను మిల్లు డ్రైవర్. అది ఆ పట్టణంలో ఉన్న పెద్ద రైస్ మిల్లు. అందులో రాజన్న ఒక ముఠా కూలీ. అక్కడికి దగ్గరలో ఉన్న ఒక పల్లెటూరు వారిది. ఆ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు శ్రీకాంత్. ఆ రోజు తండ్రి దగ్గరకు వచ్చాడు పని ఉండి.

'మీ నాన్న జేబులో డబ్బులు ఉన్నాయిగా. తీసుకుపోయి పుస్తకాలు కొనుకో' అంటూ నవ్వుతూ అక్కడినుంచి వెళ్లిపోయాడు డ్రైవర్ రామారావు.

అతనటు వెళ్ళగానే 'నువ్వు వెళ్లి పడుకో. నా పని పూర్తయ్యేసరికి తెల్లవారుతుంది' అంటూ పనిలోకి వెళ్ళిపోయాడు శ్రీకాంత్ తండ్రి రాజన్న.

మిల్లు ఆడడం మొదలు పెట్టింది. మరల వేగం పెంచాడు రామారావు. చక్రాలకు బెల్టులు కొట్టుకునే వేగం పెరిగింది. పనివాళ్ళ అరుపులు. కొంచెం సేపు చూసి చూసి చేసేది లేక మిల్లు డాబా పైకి వెళ్లి పడుకున్నాడు శ్రీకాంత్. ఆకాశం లో నక్షత్రాలను చూస్తూ మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు

శ్రీకాంత్ నిద్రలేచేసరికి తెల్లారింది. ఆ పక్కనే డ్రైవర్ రామారావు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. చాప చుట్టి, దుప్పటి మడచి శ్రీకాంత్ పక్కన పెట్టాడు. ఇంతలో గాలి తెర వచ్చింది. ఓ వంద రూపాయల నోటు ఎగురుకుంటూ శ్రీకాంత్ ముందుకు వచ్చి ఆగింది. శ్రీకాంత్ కళ్ళు ఒక్కసారి ఆనందంతో విచ్చుకున్నాయి. వంగి తీసుకొని అటు ఇటు చూశాడు. ఆశ్చర్యం! డాబా మీద నోట్లు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కొన్ని నోట్లు రామారావు పక్కనే ఉన్నాయి. కొన్ని రామారావు జేబులోంచి పడటానికి సిద్ధంగా ఉన్నాయి. వాటిని గబగబా ఏరాడు. పదిహేను వచ్చాయి. శ్రీకాంత్ క్షణం ఆలోచించి... 'మావయ్య... డ్రైవర్ మామయ్య' అంటూ పెద్దగా పిలిచాడు. రామారావు తుళ్ళిపడి లేచాడు.

'ఈ డబ్బు నీదేనా' అని అడిగాడు శ్రీకాంత్. రామారావు కంగారుగా జేబులో చూసుకున్నాడు 'నావేరా' అంటూ శ్రీకాంత్ అందించిన నోట్లు తీసుకొని ఒకటికి రెండు సార్లు లెక్క వేశాడు. పంతొమ్మిది ఉన్నాయి. ఇంకొకటి ఉండాలి.

'అన్నీ ఉన్నాయా మామయ్య' అని అడిగాడు శ్రీకాంత్.

'ఆ ఒక్కటీ వీడు తీసుకునే ఉంటాడు. పోనీలే పుస్తకాలు కొనుక్కుంటాడు' అనుకుని 'ఉన్నాయి రా. నీవు కాబట్టి ఇచ్చావు. ఇంకొకరు అయితే ఒక్క నోటు కూడా ఇచ్చేవారు కాదు. ఇక అంతే సంగతులు' అంటూ పైకి లేవబోయాడు. 'అదిగో మావయ్యా! నీ దుప్పటి కింద ఉంది' అంటూ చూపించాడు శ్రీకాంత్. రామారావు ఆ నోటుని కూడా తీసుకొని క్షణకాలం సిగ్గుపడ్డాడు. శ్రీకాంత్ నిజాయితీని కొద్దిగా శంకించినందుకు బాధపడ్డాడు. ఆ తర్వాత విషయం చెప్పి అందరి ముందు ఎంతో మెచ్చుకున్నాడు.' 'రాజన్నా! నీవు రత్నాన్ని కన్నావు. వాడికి కావలసిన పుస్తకాలు నేనే కొనిస్తా ' అంటూ వంద రూపాయలు శ్రీకాంత్ కి ఇవ్వబోయాడు.

'మామయ్య వద్దు' అంటూ తండ్రి చాటుకి వెళ్ళాడు శ్రీకాంత్.

'ఇది నీ నిజాయితీకి కానుక రా' అంటూ శ్రీకాంత్ ని దగ్గరికి తీసుకుని బలవంతంగా వంద రూపాయల నోటు జేబులో పెట్టాడు రామారావు.

'అరవై రూపాయలు చాలు మామయ్యా'అన్నాడు శ్రీకాంత్.

ఆ మాట విని రామారావు పెద్దగా నవ్వి 'వెళ్దాం పద' అంటూ బజారుకు తీసుకుపోయాడు. శ్రీకాంత్ కి కొత్త బట్టలు తీసుకున్నాడు. ఎంతో సంతోషంతో శ్రీకాంత్ ఇంటికి వెళ్లిపోయాడు.

– డా. బొర్రా గోవర్ధన్



● ఇస్లాం వెలుగు

దైవమార్గం...రుజుమార్గం

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడని దైవ ప్రవక్త ముహమ్మద్ స ఇలా ప్రవచించారు:

నా దాసులారా! దౌర్జన్యం చేయడాన్ని నేను నాపై నిషేధించుకున్నాను. అలాగే మీపై కూడా దౌర్జన్యం నిషేధించాను. కాబట్టి మీరు ఒకరి మీద మరొకరు దౌర్జన్యం చేయకండి. ఒకరి హక్కుల్ని మరొకరు కొల్లగొట్టకండి.

నా దాసులారా! మీరందరూ దారి తప్పిన వాళ్లే. నేను సన్మార్గం కలిగే భాగ్యం కలిగించిన వారు తప్ప. మార్గదర్శకత్వం కోసం నన్ను వేడుకోండి నేను మిమ్మల్ని రుజుమార్గం పై నడిపిస్తాను.

నా దాసులారా! మీరంతా ఆకలిగా ఉన్నవారే. నేను అన్నం పెట్టిన వారు తప్ప. మీరు నన్నే వేడుకోండి నేను మీకు తినిపిస్తాను.

నా దాసులారా! మీరందరూ వస్త్రవిహీనులే. నేను తొడిగించిన వారు తప్ప. మీరు కట్టుకోవడానికి వస్త్రాలు నన్నే అడగండి. మీకు తొడిగిస్తాను.

నా దాసులారా! మీరు రేయింబవళ్ళు పాపాలు చేస్తుంటారు. నేను అందరి పాపాల్ని మన్నిస్తాను. కాబట్టి పాపహరణం కోసం నన్నే వేడుకోండి నేను మిమ్మల్ని మన్నిస్తాను. నా దాసులారా! మీరు నన్ను ఏమి నష్టపరచలేరు (అదేవిధంగా) నాకు మీరు ఎలాంటి లాభాన్నీ చేకూర్చి పెట్టలేరు.

నా దాసులారా! ఆది అంతం వరకు మీ జిన్నులు, మానవసంతతులు అందరూ ఓ మైదానంలో నిలబడిన ప్రతివాడు నన్ను యాచిస్తే వారందరికీ కాదనకుండా వారి కోరిక మేరకు ప్రసాదిస్తాను. వారు ఏది అడిగినా ఎంత అడిగినా నేను వారికి ఇస్తాను. ఇలా వారందరికీ నేను ఇచ్చినప్పటికీ నా ఖజానాలో ఎలాంటి తరుగుదల కనిపించదు. సముద్రంలో ఓ సూది తన వెంట ఎంత నీరు అయితే తెస్తుందో అంత తప్ప.

నా దాసులారా! మీ జీవిత రికార్డును సురక్షితంగా ఉంచాను (ప్రళయం రోజున) నేను దానికి ఖచ్చితమైన ప్రతిఫలం ఇస్తాను. ఎవరైతే మేలు పొందాడో అతను దేవుడికి కృతజ్ఞత చూపాలి. ఎవరైతే అనర్థంలో చిక్కుకున్నాడో అతడు తనను తాను నిందించుకోవాలి.



వివరణ: అల్లాహ్ ఒకరిని పీడించడు. తన దాసులు కూడా దానికి దూరంగా ఉండాలంటాడు ఆయన. పరస్పరం మీ హక్కుల్ని కొల్లగొట్టుకోకండి, దైవ సృష్టితాలలో దేనిపైనా దౌర్జన్యం చేయవద్దు.

సృష్టి ప్రారంభం నుండి ప్రళయం వరకు ఈ లోకంలో సృష్టించబడ్డవారు సృష్టించబడేవారు –జిన్నులు, మనుషులు –అంతా కలిసి ఆయన పట్ల తిరస్కార భావాన్ని ఏమాత్రం రానీయకుండా ఆయన ఆదేశాలను శిరసావహించినప్పటికీ దోమ రెక్క విలువ అంత కూడా ఆయన పరిపాలనలో పెంపుదలకు దోహద పడలేరు. దీనికి భిన్నంగా మీరంతా ఒక్కొక్కరుగా లేక సామూహికంగా కలిసి అల్లాహ్ ను ధిక్కరించినా ఆయన రాచరికంలో గోరంత తరుగుదలను కూడా సృష్టించలేరు. దైవాదేశ ఫలితాలు, దైవధిక్కారపు దుష్ఫలితాలు అన్నీ మనిషి జీవితంతోనే ముడిపడి ఉన్నాయి. ఆరాధనలతో ఆయనను తనవాడిగా చేసుకున్నానని గర్వించేవాడు నిజంగా మోసానికి గురైపోతున్నాడు.

(హదీసుప్రబోధిని: 138-140)

- మొహమ్మద్ అబ్దుల్ రషీద్

● సువార్త

క్రీస్తు ప్రేమ పరిమళం

'**యే**సు అసాధారణ బోధలు మరియు కార్యములు' గూర్చిన సవివర సమాచారం యావత్తూ కొత్త నిబంధన మొదటి నాలుగు గ్రంధాలలో లిఖితమై ఉండుటను మనం చూస్తాము. ఇవే ఆయన జీవిత చరిత్రను తెలిపే గ్రంధాలు. ఆయన చేసిన ఆశ్చర్య కార్యములకు, అద్భుతాలకు అంతే లేదు.

'క్రీస్తు మిమ్మును ప్రేమించి, పరిమళ వాసనగా ఉండుటకు మన కొరకు తన్ను తాను దేవునికి అర్పణముగాను బలిగాను అప్పగించుకొనెను; అలాగుననే మీరును ప్రేమ కలిగి నడుచుకొనుడి 'అన్న ఈ వాక్యాంశం మనం ఎప్పుడూ గుర్తుంచుకోదగినది (ఎఫెసీ 5 : 2).

క్రీస్తు తనను గూర్చి తాను చెప్పుకోన్న ఒక గొప్ప మాట ఏమంటే, 'పరిచారము చేయుటకే వచ్చాను గాని పరిచారము చేయించుకొనుటకు నేను రాలేదు' (మత్తయి 20 : 28). పరలోక దేవుని అపొస్తలుడుగా ఈ భూమి మీది మానవాళికి గొప్ప పరిచర్య చేయుటకు వచ్చినవాడు క్రీస్తు.

ఇలాంటి క్రీస్తుకు, ఈ క్రీస్తు యేసుకే ఒక స్త్రీ అత్యున్నతమైన రీతిలో పరిచర్య చేసి ఇలా ఆయనను ఘనంగా సత్కరించి మెప్పించిన విధానం అనేది చరిత్రకెక్కడం ఒక విశేషమే మరి.

ఒక యువతి క్రీస్తు పట్ల ఉన్న తన విస్తార ప్రేమను చాలా వైవిధ్యంగా వినూత్నంగా ప్రదర్శించడం అది మన కళ్ళకు ఎప్పుడూ కనువిందే. కంటికింపుగా చేతలలో వ్యక్తం చేసిన ఆమె ప్రేమను గూర్చి ఎప్పుడూ చదివినా, దాన్ని దృశ్య ప్రధాన కావ్యంగా ఎప్పుడూ ఊహించుకొన్ననూ అది మన అంతరంగాన్ని నాట్యం చేయించేదే.

ఆమె ప్రభువుకు చేసిన సత్కార్యమందు మనం మనస్సు పెడితే చాలా లోతైన విషయాలు బయటపడతాయి. యేసు క్రీస్తు ప్రభువుల వారిని తన ఇంటికి అతిధ్యమునకు పిలిచిన సీమోను అను ఒక పెద్ద మనిషి ఇంట ఈ ప్రేమ సంబంధిత సత్కార్య సంఘటన జరగడం అనేది చెప్పుకోదగ్గది.

గ్రంథరాజ సమాచారం మేరకు ఆ ఊరిలో ఉన్న పాపాత్మురాలైన ఒక స్త్రీ క్రీస్తు వద్దకు ఒక బుడ్డిలో అత్తరు తీసికొని వచ్చింది. వెనుక తట్టు ఆయన పాదముల వద్ద నిలువబడింది. తన పాపముల విషయమై పశ్చాత్తాపపడుతూ యేడ్చింది. కన్నీళ్ళతో ఆయన పాదములు తడిపింది. తన కన్నీళ్ళతో కడిగిన ఆయన పాదములను ఒత్తయిన తన నిడుపాటి కురులతో తుడిచింది. ఆయన పాదములను ముద్దు పెట్టుకొంది. ఆమె తెచ్చిన విలువైన అత్తరును ఆయన పాదములకు పూసింది.

దీంతో ఆ ఇంటి పరిసరాలు సువాసనతో ఒక్కసారిగా గుప్పుమన్నాయి. క్రీస్తు పట్ల ఆమెకు ఉన్న ప్రేమ పరిమళమయం. అది అక్కడ ఉన్న వారందరూ ఆస్వాదించారు (లూకా 7 : 36 – 50).

అప్పు ఇచ్చు ఒకనికి ఇద్దరు ఋణస్థులు ఉన్నారు అంటూ క్రీస్తు ప్రభువు ఉపమానం ఒకటి చెప్పి పరిసయ్యుని కళ్ళు తెరిపించాడు. తన ఇంట భోజనానికి ప్రభువును పిలిచిన అతడు ఆయనకు సరైన మర్యాదలు, అందుకు తగిన ఏర్పాట్లు చేయలేదు. ఆమె విస్తారముగా నన్ను ప్రేమించింది గనుక ఆమె విస్తార పాపములు క్షమించాను అని ఆమెతో అనడంతో అది చూసిన ఆ పరిసయ్యుడు సిగ్గుతో తలదించుకున్నాడు. క్రీస్తును సేవించుటకు ఈ స్త్రీ మార్పు మనకు ఎంతో ఆదర్శంగా ఉంది. సువార్తికులను, బోధకులను, సంఘ పెద్దలను గౌరవిస్తూ సత్కరిస్తూ పరిచర్య చేయవచ్చును గాని వారికి సాగిలపడనవసరం లేదు. క్రీస్తు సంఘ యువత సామాజిక బాధ్యతతో ఈ సమాజానికి ఉన్నతంగా తమ సేవా పరిచర్యలు విరివిగా అందించుటకు ఈ పరిశుద్ధురాలిని స్ఫూర్తిగా తీసుకోవలసిందే.

– జేతమ్



బిజినెస్ రీల్

సోలార్ రంగంలోకి పెన్నార్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీరింగ్ రంగంలో ఉన్న పెన్నార్ ఇండస్ట్రీస్ సోలార్ విభాగంలోకి ప్రవేశిస్తోంది. సోలార్ మాడ్యూల్స్ తయారీ, విక్రయాలకై జెట్‌వర్క్ మాన్యుఫ్యాక్చరింగ్ బిజినెస్‌తో సంయుక్త భాగస్వామ్య కంపెనీ ఏర్పాటుకు ఒప్పందం చేసుకుంది. ప్రతిపాదిత జేవీలో జెట్‌వర్క్‌కు 50.1 శాతం, పెన్నార్ ఇండస్ట్రీస్‌కు 45, ఇతరులకు 4.9 శాతం వాటా ఉంటుంది. రూ.41.67 కోట్ల మూలధనంతో జేవీ ఏర్పాటు చేస్తారు. సంయుక్త భాగస్వామ్య కంపెనీ సోలార్ మాడ్యూల్స్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పనుంది. ఇక్కడ తయారైన ఉత్పత్తులను భారత్‌తోపాటు విదేశాల్లోనూ విక్రయిస్తారు.

ఆర్‌టీజీఎస్ లావాదేవీలకు త్వరలో కొత్త సదుపాయం

ముంబై: ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ వంటి ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా నగదు బదలాయించేవారికి త్వరలో కొత్త సదుపాయం అందుబాటులోకి రానుంది. అవతలి పార్టీకి నగదు బదిలీ చేసేటప్పుడు, వారి అకౌంటు నంబరుకు సంబంధించి ఖాతాదారు పేరు కూడా కనిపించేలా ఈ ఫీచరు ఉంటుంది. దీనితో కస్టమర్లు సరైన వ్యక్తికే నిధులు పంపిస్తున్నామని ధృవీకరించుకునేందుకు వీలవుతుంది. పొరపాటున మరొకరికి బదిలీ చేయకుండా జాగ్రత్తపడొచ్చు. ఇలాంటి ఫీచరును వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నాటికి అభివృద్ధి చేయాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాని (ఎన్‌పీసీఐ) రిజర్వ్ బ్యాంక్ ఆదేశించింది. ఒకవేళ ఏదైనా కారణం వల్ల లబ్ధిదారు పేరు డిస్‌ప్లే కాకపోతే, రెమిటర్ (నగదు పంపేవారు) తమ విచక్షణ మేరకు నిర్ణయం తీసుకోవచ్చు. ప్రస్తుతం ఏకీకృత చెల్లింపుల విధానం (యూపీఐ), ఇమ్మీడియట్ పేమెంట్స్ సర్వీస్ (ఐఎంపీఎస్)లో ఈ సదుపాయం ఉంది.

భారత్ విదేశీ రుణ భారం 711.8 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ: భారత్ విదేశీ రుణ భారం సెప్టెంబర్ 2024 త్రైమాసికానికి 711.8 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరుకుంది. ఇది జూన్ 2024 త్రైమాసికంలో పోల్చితే 4.3 శాతం (29.6 బిలియన్ డాలర్లు) పెరిగిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. 2023 సెప్టెంబర్ చివరికి భారత్ ప్రపంచ రుణ భారం 637.1 బిలియన్ డాలర్లు. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) విలువలో భారత్ రుణ భారం సెప్టెంబర్ 2024 నాటికి 19.4 శాతం. జూన్ ముగింపునకు ఈ రేటు 18.8 శాతంగా ఉంది. డాలర్ ఆధారిత రుణం మొత్తం రుణంలో 53.4 శాతంగా ఉంది. దీని తర్వాత భారత్ రూపాయి (31.2 శాతం), జపనీస్ యెన్ (6.6 శాతం), ఎస్‌డీఆర్ (5.0 శాతం), యూరో (3.0 శాతం)లు ఉన్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-1-2025

విశాఖ	570-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
MARUTI	11,185.00	3.01
M&M	3,078.00	2.36
LT	3,670.10	1.73
BAJFINANCE	6,940.00	1.71
TATAMOTORS	749.85	1.31

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDALCO	594	-1.4
DRREDDY	1,372.95	-1.12
ADANIPORTS	1,218.30	-1.04
ONGC	236.91	-0.98
TATASTEEL	136.87	-0.85

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	4,519
ఎన్ఎస్ఈ	66,507
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,20,524
ఎఫ్ఐఐ	- 1,783
డీఐఐ	+ 1,690

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	71.72 (రాత్రి 11.30కి)	$ 70.99 (క్రితం ముగింపు)
బ్రెంట్	74.42 (రాత్రి 11.30కి)	$ 73.99 (క్రితం ముగింపు)

గూగుల్ పే, ఫోన్‌పేకి ఎన్‌పీసీఐ ఊరట


మార్కెట్ వాటా పరిమితి డెడ్‌లైన్ రెండేళ్లు పొడిగింపు



న్యూఢిల్లీ: ఫోన్‌పే, గూగుల్ పేలాంటి యూపీఐ యాప్‌లకు ఊరటనిచ్చే దిశగా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నిర్ణయం తీసుకుంది. థర్డ్ పార్టీ ఏకీకృత చెల్లింపుల విధానం (యూపీఐ) యాప్‌ల ద్వారా జరిగే లావాదేవీల పరిమాణంలో నిర్దిష్ట యాప్‌ల వాటా 30 శాతానికి మించరాదన్న ప్రతిపాదనను మరో రెండేళ్లు పెంచింది. 2026 డిసెంబర్ 31 వరకు పొడిగించినట్లు వెల్లడించింది. ప్రస్తుతం యూపీఐ లావాదేవీల్లో గూగుల్ పే, ఫోన్‌పేలాంటి థర్డ్ పార్టీ యాప్ ప్రొవైడర్ల (టీపీఏపీ) వాటా 80 శాతం స్థాయిలో ఉంటోంది. ఈ పరిమితిని క్రితం మూడు నెలల్లో నమోదైన మొత్తం యూపీఐ లావాదేవీల ప్రాతిపదికన లెక్కిస్తారు. మరోవైపు, వాట్సాప్ పే యాప్ మరింత మంది యూజర్లను చేర్చుకునేందుకు వీలు కల్పిస్తూ ఎన్‌పీసీఐ పరిమితిని తొలగించింది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. దీంతో వాట్సాప్ పే ఇకపై దేశవ్యాప్తంగా తమకున్న యూజర్లందరికీ యూపీఐ సర్వీసులను అందించేందుకు వీలవుతుంది. గతంలో వాట్సాప్ పే దశలవారీగా యూపీఐ యూజర్లను పెంచుకునే విధంగా పరిమితి విధించింది. ఇది 10 కోట్ల యూజర్లుగా ఉండేది.

డిసెంబర్‌లోనూ విద్యుత్ వినియోగం పైపైకి

6 % పెరిగి 130 బిలియన్ యూనిట్లు



న్యూఢిల్లీ: డిసెంబర్ నెలకు విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. 6 శాతం పెరిగి 130.40 బిలియన్ యూనిట్లుగా నమోదైంది. 2023 డిసెంబర్ నెలలో వినియోగం 123.17 బిలియన్ యూనిట్లుగా ఉంది. రోజువారీ గరిష్ట సరఫరా (గరిష్ట డిమాండ్) 224.16 గిగావాట్లుగా నమోదైంది. 2024 మే నెలలో 250 గిగావాట్లు ఇప్పటి వరకు గరిష్ట రోజువారీ రికార్డుగా ఉంది. 2024 వేసవి సీజన్‌కు గరిష్ట రోజువారీ డిమాండ్ 260 గిగావాట్లకు చేరుకోవచ్చని కేంద్ర విద్యుత్ శాఖ అంచనా వేయడం గమనార్హం. ఇక 2025 వేసవి సీజన్‌కు గరిష్ట డిమాండ్ 270 గిగావాట్లకు చేరుకోవచ్చని భావిస్తోంది. రూమ్ హీటర్లు, వాటర్ హీటర్లు, గీజర్ల వాడకం డిసెంబర్‌లో విద్యుత్ వినియోగం పెరగడానికి కారణమై ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉత్తరాదిన ఉష్ణోగ్రతలు మరింత కనిష్టానికి చేరుకునే అవకాశాలతో విద్యుత్ వినియోగం జనవరిలోనూ అధికంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

అనుబంధ సంస్థగా వయాకామ్18

రిలయన్స్ ఇండస్ట్రీస్ వెల్లడి



న్యూఢిల్లీ: మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ వయాకామ్18 మీడియా అనుబంధ కంపెనీగా అవతరించినట్లు డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా పేర్కొంది. తప్పనిసరిగా మార్పిడికిలోనయ్యే 24.61 కోట్ల ప్రిఫరెన్స్ షేర్ల(సీసీపీఎస్)ను అదే సంఖ్యలో ఈక్విటీ షేర్లుగా మార్పు చేసినట్లు వెల్లడించింది. దీంతో ప్రత్యక్ష సబ్సిడియరీగా మారినట్లు తెలియజేసింది. ఇప్పటివరకూ రిలయన్స్ అనుబంధ కంపెనీ నెట్‌వర్క్18 మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు వయాకామ్18 మీడియా మెటీరియల్ సబ్సిడియరీగా వ్యవహరించేది. కాగా.. తాజా మార్పు కారణంగా వయకామ్18లో రిలయన్స్ వాటా 70.49 శాతం నుంచి 83.88 శాతానికి ఎగసింది. అంతకుముందు 2024 మార్చిలో పారామౌంట్ గ్లోబల్ నుంచి వయాకామ్18లో 13.01 శాతం వాటాను రిలయన్స్ చేజిక్కించుకుంది. ఇందుకు రూ. 4,286 కోట్లు వెచ్చించింది. ఈ ఏడాది నవంబర్ 14న వాల్ట్ డిస్నీ దేశీ మీడియా బిజినెస్‌తో రిలయన్స్ మీడియా విభాగాలను విలీనం చేయడంతో రూ. 70,000 కోట్ల విలువైన దేశీ మీడియా దిగ్గజం ఆవిర్భవించిన విషయం విదితమే.

ప్రజల వద్ద ఇప్పటికీ రూ.2,000 నోట్లు

- వీటి విలువ రూ.6,691 కోట్లు
- 98.12 శాతం నోట్లు వెనక్కి



ముంబై: ప్రజల వద్ద ఇప్పటికీ రూ.6,691 కోట్ల విలువ చేసే రూ.2,000 నోట్లు ఉన్నట్టు ఆర్‌బీఐ గణాంకాల ఆధారంగా తెలుస్తోంది. చలామణి నుంచి రూ.2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్టు 2023 మే 19న ఆర్‌బీఐ ప్రకటించడం గుర్తుండే ఉంటుంది. "అప్పటికి వ్యవస్థలో రూ.3.56 లక్షల కోట్ల విలువ చేసే రూ.2,000 నోట్లు చలామణిలో ఉన్నాయి. 2024 డిసెంబర్ 31 నాటికి రూ.6,691 కోట్లకు ఇవి తగ్గాయి. అంటే చలామణిలోని 98.12 శాతం నోట్లు వెనక్కి వచ్చాయి"అని ఆర్‌బీఐ వెల్లడించింది. 2023 అక్టోబర్ 7 వరకు అన్ని బ్యాంక్ శాఖల్లోనూ రూ.2,000 నోట్ల డిపాజిట్/మార్పిడికి ఆర్‌బీఐ అవకాశం కల్పించడం తెలిసిందే. ఆ తర్వాత బ్యాంక్ శాఖలు వీటిని తీసుకోవడం లేదు. కానీ, హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ఆర్‌బీఐకి చెందిన 19 ఇష్యూ కార్యాలయాల్లో రూ.2,000 నోట్లను డిపాజిట్ చేసుకునేందుకు అవకాశం ఉంది. డిపాజిట్ చేసిన మొత్తం బ్యాంక్ ఖాతాలకు జమ అవుతుంది.

అగ్రిటెక్ రంగంలో భారీగా కొలువులు

వచ్చే 5 ఏళ్లలో 80 వేల వరకు కొత్త ఉద్యోగాలు • టీమ్‌లీజ్ సర్వీసెస్ సీఎస్‌వో సుబ్బురత్నం వెల్లడి



ముంబై: అగ్రిటెక్ రంగంలో వచ్చే ఐదేళ్లలో కొత్తగా 60-80 వేల పైచిలుకు కొలువులు రాగలవని టీమ్‌లీజ్ సర్వీసెస్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ (సీఎస్‌వో) సుబ్బురత్నం తెలిపారు. ఏఐ డెవలప్‌మెంట్, టెక్నాలజీ, పర్యావరణహిత వ్యవసాయ సొల్యూషన్స్, సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్ తదితర విభాగాల్లో ఉద్యోగావకాశాలు ఉండగలవని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయంగా అగ్రిటెక్ రంగంలో సాంకేతిక నిపుణులు, ఆపరేషన్స్ సిబ్బంది, మేనేజర్లు మొదలైన హోదాల్లో 1 లక్ష పైగా ఉద్యోగులు ఉన్నట్లు సుబ్బురత్నం వివరించారు. వ్యవసాయం ఎక్కువగా ఉండే ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఉద్యోగావకాశాలు అత్యధికంగా ఉండగలవన్నారు. ఇక హైదరాబాద్, బెంగళూరు, పుణె, గురుగ్రామ్ లాంటి నగరాలు అగ్రిటెక్ స్టార్టప్‌లకు కీలక కేంద్రాలుగా మారగలవని సుబ్బురత్నం చెప్పారు.

హైబ్రిడ్ ఉద్యోగాలు..

అగ్రిటెక్ రంగం ప్రధానంగా సాంకేతిక ఆవిష్కరణలు, అనలిటిక్స్ వంటి అంశాలపై దృష్టి పెడుతుంది కాబట్టి ఈ ఉద్యోగాలు సీజనల్‌గా ఉండవని పేర్కొన్నారు. సీజన్‌లో నాట్లు వేయడం నుంచి కోతల వరకు వివిధ రకాల పర్యవేక్షణ కార్యకలాపాల్లో పాలుపంచుకునే సిబ్బంది .. ఆఫ్-సీజన్‌లో డేటా విశ్లేషణ, పరికరాల నిర్వహణ మొదలైన వాటిపై పని చేస్తారని చెప్పారు. సాధారణంగా అగ్రిటెక్ ఉద్యోగాలు హైబ్రిడ్ విధానంలో ఉంటాయన్నారు. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, డేటా అనలిటిక్స్, పర్యవేక్షణ బాధ్యతలను ఎక్కడి నుంచైనా నిర్వర్తించవచ్చని .. కానీ మెషిన్ ఆపరేటర్లు, ఫీల్డ్ టెక్నీషియన్లు మొదలైన వారు క్షేత్ర స్థాయిలో పని చేయాల్సి ఉంటుందని సుబ్బురత్నం చెప్పారు. కన్సల్టెన్సీ సంస్థ ఈవై నివేదిక ప్రకారం.. ప్రస్తుతం దేశీయంగా వ్యవసాయంలో కేవలం 1.5 శాతమే టెక్నాలజీ వినియోగం ఉంటోందని, ఈ నేపథ్యంలో అగ్రిటెక్ కంపెనీలకు 24 బిలియన్ డాలర్ల వ్యాపార అవకాశాలు అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు. ఐటీ సంస్థల సమాఖ్య నాస్కామ్ ప్రకారం 2022 నాటికి భారత్‌లో సుమారు 450 అగ్రిటెక్ స్టార్టప్‌లు ఉన్నట్లు వివరించారు.

ప్యాసివ్ ఫండ్స్‌కు బూస్ట్

ఎంఎఫ్ లైట్ కార్యాచరణ ప్రకటించిన సెబీ

న్యూఢిల్లీ: ప్యాసివ్ ఫండ్స్‌ను ప్రోత్సహించే విధంగా సెబీ మ్యూచువల్ ఫండ్స్ లైట్ (ఎంఎఫ్ లైట్) నిబంధనల కార్యాచరణను ప్రకటించింది. ప్యాసివ్ ఫండ్స్ విభాగంలో కొత్త సంస్థల ప్రవేశాన్ని, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, పెట్టుబడుల వైవిధ్యాన్ని విస్తృతం చేయడమనే లక్ష్యాలు ఇందులో ఉన్నాయి. ఇండెక్స్ ఫండ్స్, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్‌లు), ఫండ్స్ ఆఫ్ ఫండ్స్ (ఎఫ్‌వోఎఫ్) సహా ప్యాసివ్ పథకాలకు ఈ కార్యాచరణ అమలవుతుందని సెబీ తెలిపింది. కేవలం ప్యాసివ్ ఫండ్స్ నిర్వహణతోనే ముందుకు వచ్చే సంస్థలకు అవరోధాలను తొలగించడం, మార్కెట్లో లిక్విడిటీని పెంచడం, కొత్త సంస్థల ప్రవేశాన్ని సులభతరం చేయడం ఇందులో లక్ష్యాలని పేర్కొంది. ఎంఎఫ్ లైట్ నిబంధనలు 2025 మార్చి 16 నుంచి అమల్లోకి రానున్నట్టు తెలిపింది. ప్రైవేటు ఈక్విటీ ఫండ్స్ సైతం ఎంఎఫ్ లైట్ సంస్థలకు మద్దతుగా (స్పాన్సర్) నిలవొచ్చని ప్రకటించింది. కాకపోతే కీలక స్థానాల్లోని ఉద్యోగులకు 20 ఏళ్ల అనుభవాన్ని అర్హతగా ఖరారు చేసింది. స్పాన్సర్లకు సంబంధించి భిన్నమైన అర్హత ప్రమాణాలను నిర్ణయించింది. ఎంఎఫ్ లైట్ కార్యాచరణ తొలుత దేశీ ఈక్విటీ సూచీల ఆధారిత ప్యాసివ్ ఫండ్స్‌కు వర్తిస్తుందని తెలిపింది. యాక్టివ్ ఫండ్స్, ప్యాసివ్ ఫండ్స్ అందించే ప్రస్తుత సంస్థలు సైతం నూతన కార్యాచరణ కింద తమ ప్యాసివ్ ఫండ్స్ పోర్ట్‌ఫోలియోను వేరొక సంస్థ కిందకు వేరు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

ఈ-కామర్స్‌కు పోటీగా క్విక్ కామర్స్

జెప్టో సీఈవో ఆదిత్ పాలీచా



న్యూఢిల్లీ: అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి సంప్రదాయ ఈ-కామర్స్ దిగ్గజాలకు క్విక్ కామర్స్ పోటీనిస్తుందని జెప్టో కో-ఫౌండర్, సీఈవో ఆదిత్ పాలీచా అన్నారు. భారత్‌లో అమెజాన్/ఫ్లిప్‌కార్ట్ స్థాయి ఫలితాన్ని సృష్టించగల సామర్థ్యాన్ని క్విక్ కామర్స్ కలిగి ఉందని 2024లో ప్రజలు గ్రహిస్తారని జెప్టో గతేడాది ప్రకటించిందని నూతన సంవత్సరం సందర్భంగా లింక్డ్‌ఇన్‌లో చేసిన పోస్టులో ఆయన గుర్తు చేశారు. 2025లో క్విక్ కామర్స్ కూడా ఈ-కామర్స్‌తో పోల్చదగిన స్థాయిని చేరుకుంటుందని తెలిపారు. ఐపీవో బాటలో ఉన్న జెప్టో 2023-24లో నిర్వహణ ఆదాయం 120 శాతం పెరిగి రూ.4,454 కోట్లకు చేరుకుంది. స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, జోమాటో బ్లింకిట్ వంటి పోటీ కంపెనీలను అధిగమించింది.

ప్రతి కంపెనీకి సవాలు..

కార్యకలాపాలను అసాధారణంగా అమలు చేయడంపై క్విక్ కామర్స్ విజయం ఆధారపడి ఉంటుందని ఆదిత్ నొక్కిచెప్పారు. ఆ స్థాయిలో అమలు చేయడం ప్రతి కంపెనీకి ఒక సవాలుగా ఉంటుందని అన్నారు. '2025లో క్విక్ కామర్స్ యొక్క ప్రాథమిక అంశాలు నాటకీయంగా అభివృద్ధి చెందుతాయి. కస్టమర్ చేసే చెల్లింపులకు తగ్గ విలువ మరింత వేగంగా పెరుగుతుంది. నిర్వహణ ఆదాయాన్ని పెంచుకోవడానికి ఆర్థికాంశాలు, కార్యక్రమాలు మారతాయి. 2023, 2024తో పోలిస్తే ఈ పరిశ్రమకు క్యాపిటల్ మార్కెట్ వాతావరణం కూడా భిన్నంగా కనిపిస్తుంది' అని అన్నారు. నమ్మశక్యం కాని రీతిలో 2025 ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జెప్టో వేదికగా నూతన సంవత్సర అమ్మకాల్లో 200 శాతం వృద్ధి నమోదైందని వెల్లడించారు.

రికార్డుల న్యూ ఇయర్..

డిసెంబర్ 31న అత్యధిక విక్రయాలను సాధించామని బ్లింకిట్ ప్రకటించింది. ఒక నిమిషంలో, ఒక గంటలో అత్యధిక ఆర్డర్లతోపాటు.. ఒక రోజులో డెలివరీ భాగస్వాములు అందుకున్న టిప్స్ సైతం అత్యధికమని బ్లింకిట్ సీఈవో అల్బిందర్ ధిండ్సా మైక్రో-బ్లాగింగ్ సైట్ ఎక్స్ వేదికగా తెలిపారు. అర్ధరాత్రి 12 ద్రాక్ష పండ్లను తినే సంప్రదాయాన్ని భారతీయులు స్వీకరించినందున నూతన సంవత్సర వేడుక రోజున ఒక రోజులో అత్యధికంగా ద్రాక్షలను విక్రయించినట్లు బ్లింకిట్ పేర్కొంది. స్పానిష్ సంస్కృతిలో పాతుకుపోయిన ఈ ట్రెండ్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ టాపిక్‌గా మారిందని వివరించింది.

సంగమం చేతికి కార్వీ కంపెనీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రుణ పరిష్కార ప్రణాళికలో భాగంగా కార్వీ డేటా మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (కేడీఎంఎస్ఎల్), అనుబంధ కంపెనీలను కొనుగోలు చేసేందుకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ హైదరాబాద్ బెంచ్ ఆమోదం తెలిపిందని సంగమం పవర్ ప్రాజెక్ట్స్ వెల్లడించింది. కార్వీ ఇన్నోటెక్, కార్వీ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్స్ వీటిలో ఉన్నాయి. కేడీఎంఎస్ఎల్ 2008 నుంచి ఈ-గవర్నెన్స్ సేవలు అందిస్తోంది.

మొబైల్ టారిఫ్‌లు పెంచాల్సిందే

పన్నులను హేతుబద్ధీకరించాలి • టెలికం నిపుణుల అభిప్రాయం



న్యూఢిల్లీ: దేశంలోని టెలికం ఆపరేటర్లు డిజిటల్ మౌలిక వసతుల్లో చేసిన భారీ పెట్టుబడుల ప్రయోజనాన్ని పొందాలంటే పన్నుల తగ్గింపు, టారిఫ్‌ల పెంపుదల అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తదుపరి తరం 5జీ సేవల కవరేజీని విస్తరించేందుకు ప్రైవేట్ ఆపరేటర్లు టెలికం మౌలిక సదుపాయాలు, రేడియోవేవ్స్ కోసం 2024లో సుమారు రూ.70,000 కోట్లు పెట్టుబడి పెట్టారు. అయితే 18 కోట్ల 2జీ కస్టమర్లను కనెక్ట్ చేయడం, సమ్మిళిత వృద్ధి కోసం 4జీకి మళ్లేలా వారిని ప్రోత్సహించడం సవాలుగా మారింది. 'టెలికం రంగంలో పన్నులను హేతుబద్ధీకరించాలి. భారత్‌లోనే పన్నులు ఎక్కువగా ఉన్నాయి. అలాగే టారిఫ్‌లు అత్యల్పంగా ఉన్నాయి. అధిక వినియోగ కస్టమర్‌లు ఎక్కువ చెల్లించడం, ఎంట్రీ లెవల్ డేటా వినియోగదారులు తక్కువ చెల్లించేలా మార్పులు రావొచ్చు. టెలికం సంస్థలు చేసిన పెట్టుబడులు డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్నాయి. దీని ద్వారా స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ మొత్తం లాభపడింది. పన్నుల హేతుబద్ధీకరణ, టారిఫ్‌ల పెంపు ద్వారా పెట్టుబడులపై రాబడిని పొందే సమయం ఆసన్నమైంది' అని ఈవై ఇండియా మార్కెట్స్, టెలికం లీడర్ ప్రశాంత్ సింఘాల్ అన్నారు.


ఏఆర్‌పీయూ రూ.300 స్థాయికి..

భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు ఒక్కో వినియోగదారు నుంచి సగటు ఆదాయాన్ని (ఏఆర్‌పీయూ) రూ.300 స్థాయికి పెంచాల్సిన అవసరాన్ని పదే పదే నొక్కిచెప్పాయి. జూలైలో మొబైల్ చార్జీల పెంపు తర్వాత వొడాఫోన్ ఐడియా ఏఆర్‌పీయూ ఏప్రిల్-జూన్‌లో రూ.154 నుండి సెప్టెంబర్ త్రైమాసికంలో 7.8 శాతం పెరిగి రూ.166కి చేరుకుంది. భారతీ ఎయిర్‌టెల్ రూ.211 నుండి 10.4 శాతం వృద్ధితో రూ.233కి, రిలయన్స్ జియో రూ.181.7 నుండి రూ.195.1కి దూసుకెళ్లింది. అయితే టారిఫ్‌ల పెంపు ఈ సంస్థలకు షాక్ తగిలింది. దాదాపు 2 కోట్ల మంది సబ్‌స్క్రైబర్‌లు తమ కనెక్షన్‌లను వదులుకున్నారు. 10-26 శాతం ధరల పెంపు కారణంగా రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా సంయుక్తంగా 2.6 కోట్ల మంది వినియోగదారులను కోల్పోయాయి.

మౌలికంలో పెట్టుబడులు..

మోర్గాన్ స్టాన్లీ నివేదిక ప్రకారం భారతీ ఎయిర్‌టెల్ అక్టోబర్‌లో పట్టణ ప్రాంతాలలో సబ్‌స్క్రైబర్స్‌ను కోల్పోగా, గ్రామీణ ప్రాంతాల్లో నికరంగా భారీ స్థాయిలో జోడించింది. రిలయన్స్ జియో మెట్రోలు, ప్రధాన సర్కిల్స్‌లో చందాదారులను పొందింది. చిన్న సర్కిల్స్‌లో కస్టమర్లను కోల్పోయింది. వొడాఫోన్ ఐడియా నుంచి అక్టోబర్‌లో భారీగా వినియోగదార్లు దూరమయ్యారు. 5జీ పర్యావరణ వ్యవస్థకు మద్దతుగా టెలికం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగం 2022-2027 మధ్య రూ.92,100 కోట్ల నుండి రూ.1.41 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు చేయనున్నట్టు డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ (డీఐపీఏ) డైరెక్టర్ జనరల్ మనోజ్ కుమార్ సింగ్ తెలిపారు. భారతీ ఎయిర్‌టెల్ రెండో త్రైమాసిక పనితీరుపై జేఎం ఫైనాన్షియల్ రిపోర్ట్ ప్రకారం టారిఫ్ పెంపులు మరింత తరచుగా జరిగే అవకాశం ఉంది. 5జీలో భారీ పెట్టుబడులు, ఐపీవోకు వచ్చే అవకాశం ఉన్నందున జియోకు అధిక ఏఆర్‌పీయూ అవసరం.

బీఎస్ఎన్ఎల్‌కు మార్పు



ధరల పెంపుదలకు దూరంగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు దాదాపు 68 లక్షల మంది కస్టమర్లు కొత్తగా వచ్చి చేరారు. నష్టాల్లో ఉన్న ఈ సంస్థ ఇప్పటికీ పాత తరం 3జీ సేవలను అందిస్తోంది. దేశవ్యాప్తంగా 4జీ సేవలను పరిచయం చేసేందుకు కసరత్తు చేస్తోంది. భారతీ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌లో సబ్‌స్క్రైబర్ వృద్ధి ఈ రంగానికి కొంత ఆశను కలిగించింది. సేవలను అందించడంలో బీఎస్ఎన్ఎల్ అసమర్థత ఈ వృద్ధికి కారణంగా కొంతమంది విశ్లేషకులు పేర్కొన్నారు. భారతీ ఎయిర్‌టెల్ అక్టోబర్‌లో వైర్‌లెస్ విభాగంలో 19.28 లక్షల మంది వినియోగదారులను జోడించింది. క్రియాశీల చందాదారులు దా దాపు 27.23 లక్షలు అధికం అ య్యారు. వొడాఫోన్ ఐడియా 19.77 లక్షల వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్‌లను కోల్పోయింది. యాక్టివ్ సబ్‌స్క్రైబర్ బేస్ దాదాపు 7.23 లక్షలు తగ్గింది. రిలయన్స్ జియో వైర్‌లెస్ కస్టమర్ల సంఖ్య అక్టోబర్‌లో మొత్తం 46 కోట్లకు వచ్చి చేరింది. సెప్టెంబర్‌లో ఈ సంఖ్య 46.37 కోట్లు నమోదైంది. క్రి యాశీల వినియోగదారుల సంఖ్య బలపడింది.

2025లో మిలియన్ టీవీ యూనిట్ల అమ్మకాలు

- సూపర్ ప్లాస్ట్రానిక్స్ లక్ష్యం
- ఆఫ్‌లైన్ ఛానళ్ల విస్తరణ
- మరో రెండు బ్రాండ్లతో చర్చలు
- కంపెనీ సీఈవో అవనీత్ సింగ్



న్యూఢిల్లీ: సూపర్ ప్లాస్ట్రానిక్స్ ప్రైవేటు లిమిటెడ్ 2025లో మిలియన్ యూనిట్ల టీవీ విక్రయాలను లక్ష్యంగా పెట్టుకుంది. పలు అంతర్జాతీయ బ్రాండ్ల భారత మార్కెట్ లైసెన్స్ కలిగిన ఈ సంస్థ టీవీలతోపాటు గృహోపకరణాలను విక్రయిస్తుంటుంది. ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియో, సామర్థ్య విస్తరణ, ఆఫ్‌లైన్ ఛానళ్ల అమ్మకాలు పెంచుకునే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు కంపెనీ సీఈవో అవనీత్ సింగ్ మార్వా తెలిపారు. థామ్సన్, కొడాక్, బ్లాపంక్ట్, వైట్-వెస్టింగ్ హౌస్ (ఎలక్ట్రోలక్స్) బ్రాండ్ లైసెన్స్ హక్కులు ఈ సంస్థకు ఉన్నాయి. మరో రెండు అంతర్జాతీయ బ్రాండ్లకు సంబంధించి భారత మార్కెట్ హక్కులను సొంతం చేసుకునే యోచనలో ఉన్నట్టు అవనీత్ సింగ్ తెలిపారు. ఇందుకు సంబంధించి చర్చలు కొనసాగుతున్నాయని, జనవరి చివరికి వీటిని ప్రవేశపెడతామని ఆశాభావం వ్యక్తం చేశారు. "ఈ ఏడాది 6,00,000 యూనిట్ల టీవీ అమ్మకాలను సాధించనున్నాం. వచ్చే ఏడాది 10,00,000 లక్షల అమ్మకాలు మా లక్ష్యం"అని చెప్పారు. అందుబాటు ధరల శ్రేణిలో వివిధ బ్రాండ్లపై స్మార్ట్ టీవీలను విక్రయిస్తున్న ఈ సంస్థ టర్నోవర్ రూ.700 కోట్లుగా ఉంది. ఆదాయంలో అధిక భాగం టీవీల విక్రయాల ద్వారానే వస్తోంది. కరోనా అనంతరం ఎక్కువ మంది ఇళ్లకే పరిమితం కావడంతో టీవీల అమ్మకాలు ఆ సమయంలో జోరుగా సాగాయి. అనంతరం ఈ మార్కెట్‌లో వృద్ధి బలహీనపడింది. అయినప్పటికీ సూపర్ ప్లాస్ట్రానిక్స్ టీవీ అమ్మకాల్లో వృద్ధి నమోదు చేస్తుండడం గమనార్హం. ఈ విభాగంలో థామ్సన్ బ్రాండ్ విక్రయాలపై ఈ కంపెనీకి అధిక ఆదాయం లభిస్తోంది. ఆ తర్వాత కొడాక్ బ్రాండ్ అమ్మకాలు ఎక్కువగా సాగుతున్నాయి.

వాషింగ్ మెషిన్లపై దృష్టి..

సూపర్ ప్లాస్ట్రానిక్స్ టీవీల తర్వాత వాషింగ్ మెషిన్ల విభాగంలో అధిక అమ్మకాలు సాధిస్తోంది. ఆన్‌లైన్ మార్కెట్లో వాషింగ్ మెషిన్ల విక్రయాల్లో ఈ సంస్థ వాటా రెండంకెల స్థాయిలో ఉంటోంది. ఆఫ్‌లైన్ ఛానళ్లనూ ఈ ఏడాది విస్తరించుకున్నామని, 2025లో రెండు లక్షల వాషింగ్ మెషిన్ యూనిట్ల అమ్మకాలు నమోదు చేయనున్నట్టు అవనీత్ సింగ్ తెలిపారు. ప్రధానంగా ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ ఈ-కామర్స్ పోర్టళ్లలో ఈ సంస్థ ఎక్కువగా అమ్మకాలు నమోదు చేస్తుంటుంది. ఇప్పుడు ఆఫ్‌లైన్ మార్కెట్లోనూ విస్తరణ దిశగా చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం తమ అమ్మకాల్లో 80 శాతం ఆన్‌లైన్ నుంచి, 20 శాతం ఆఫ్‌లైన్ నుంచి వస్తున్నాయని అవనీత్ సింగ్ తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఆఫ్‌లైన్‌లో విక్రయాల వాటాను 40 శాతానికి పెంచుకోవాలని అనుకుంటున్నట్టు చెప్పారు. టైర్-1 నగరాల నుంచి 35 అమ్మకాలు వస్తుండగా, టైర్-2 నుంచి 25 శాతం, టైర్-3 నుంచి 15 శాతం ఉంటున్నట్టు వెల్లడించారు. మిగిలిన 25 శాతం అమ్మకాలు గ్రామీణ ప్రాంతాల నుంచి ఉంటున్నాయని తెలిపారు. గత రెండేళ్లలో తాము చేసిన పెట్టుబడులు ఇప్పుడు ఫలితాలనిస్తున్నట్టు పేర్కొన్నారు.



అన్ని ఫార్మాట్లలో ఆడటమే లక్ష్యం



- సూర్యకుమార్ వల్లే మూడో స్థానంలో అవకాశం
- హైదరాబాద్ కెప్టెన్ తిలక్ వర్మ మనోగతం

భారత టి20 జట్టు సారథి సూర్యకుమార్ యాదవ్‌ను ఒప్పించి దక్షిణాఫ్రికా గడ్డపై మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి వరుస మ్యాచ్‌ల్లో సెంచరీలు కొట్టి భారత టి20 జట్టులో స్థానం సుస్థిరం చేసుకున్న తిలక్ వర్మ... మూడు ఫార్మాట్లలోనూ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే తన భవిష్యత్ లక్ష్యమని అంటున్నాడు. అంతర్జాతీయ షెడ్యూల్ కారణంగా దేశవాళీల్లో ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేకపోయిన తిలక్ వర్మ... అవకాశం వస్తే నిరూపించుకునేందుకు సిద్ధంగా ఉన్నానని వెల్లడించాడు. కేవలం బ్యాటర్‌గానే కాకుండా... బౌలింగ్‌పై కూడా దృష్టి సారించడంతో జట్టులో సమతుల్యం తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నాడు. అహ్మదాబాద్‌లో జరుగుతున్న దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ జట్టుకు సారథ్యం వహిస్తున్న తిలక్ వర్మ... కర్ణాటకపై రికార్డు ఛేదన తర్వాత తన భవిష్యత్తు లక్ష్యాలను వివరించాడు. తిలక్ చెప్పిన వివరాలు అతడి మాటల్లోనే...

→ విజయ్ హజారే టోర్నీలో భాగంగా కర్ణాటకతో మ్యాచ్‌లో 99 పరుగుల మీద బ్యాటింగ్ చేస్తున్న అనే విషయాన్ని పట్టించుకోలేదు. జట్టు ప్రయోజనాల దృష్ట్యా ఆ ఓవర్‌లో భారీ షాట్లు ఆడాలని అనుకున్నా... అది కాస్త ఫలించలేదు. ఒక ఆటగాడు 45వ ఓవర్ వరకు క్రీజులో నిలిస్తే 380–400 స్కోరు కూడా ఛేదించగలమని జట్టు సమావేశాల్లో ఎన్నోసార్లు చెప్పాను. జట్టును గెలిపించేంత వరకు క్రీజులో ఉండాలనుకున్నా కానీ దురదృష్టవశాత్తు అది సాధ్యపడలేదు.

→ కీలక సమయంలో రాణించి జట్టుకు అవసరమైన ఇన్నింగ్స్ ఆడటం ఆనందంగా ఉంది. అంతిమంగా జట్టు విజయం సాధించడమే ముఖ్యం. నా ఇన్నింగ్స్‌తో అది సాధ్యమైనందుకు ఆనందం రెండింతలైంది.

→ దక్షిణాఫ్రికా పర్యటన సమయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌తో చర్చించా. నాలుగో స్థానంలో సూర్యకు మెరుగైన రికార్డు ఉందనే విషయం గుర్తుచేశా. ఆ ప్లేస్‌లో అతడు గతంలో సెంచరీలు సాధించాడు. నాకు మూడో స్థానంలో అవకాశం ఇస్తే నిరూపించుకుంటాను అని చెప్పా. దానికి సూర్యకుమార్ ఒప్పుకోవడంతో బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోషన్ దక్కింది.

→ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బలంగా భావించా. అందుకు తగ్గట్లే దక్షిణాఫ్రికాపై వరుస మ్యాచ్‌ల్లో సెంచరీలు సాధించా. మూడో స్థానంలో బ్యాటింగ్ చేయడం ఎంతో బాగుంటుంది.

→ అండర్–19 స్థాయికి ముందు వరకు నేను ఓపెనర్‌గానే బరిలోకి దిగే వాడిని. స్వింగ్ అవుతున్న బంతులను ఆడేందుకు ఇష్టపడతా. పరిస్థితులు సవాలు విసురుతున్నప్పుడు నాలోని అత్యుత్తమ ఆట బయటకు వస్తుంది. ముందుగా క్రీజులో అడుగు పెడితే... అదనపు సమయం లభించడంతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయి.


సూర్యకుమార్‌తో తిలక్ వర్మ

→ భారత్ 'ఎ' తరఫున, దులీప్ ట్రోఫీలో మెరుగైన ప్రదర్శన చేశా. అంతర్జాతీయ మ్యాచ్‌ల కారణంగా రంజీ ట్రోఫీలో నిరూపించుకునేందుకు తగినన్ని అవకాశాలు లభించలేదు. కానీ సుదీర్ఘ ఫార్మాట్ కోసం సిద్ధంగా ఉన్నా. నా వరకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నా.

→ మూడు ఫార్మాట్లలో జాతీయ జట్టులో చోటు సుస్థిరం చేసుకోవాలని అనుకుంటున్నా. జట్టుకు వీలైనన్ని ఎక్కువ విజయాలు సాధించి పెట్టడమే నా లక్ష్యం. గతేడాది ఐపీఎల్ నుంచే బౌలింగ్‌పై మరింత దృష్టి సారించా. ఎర్ర బంతితో ఎక్కువ బౌలింగ్ సాధన చేస్తున్నా. దాని వల్ల టి20, వన్డే క్రికెట్‌లో ఆఫ్ స్పిన్నర్‌గా మరింత ప్రభావం చూపగలనని నమ్ముతున్నా.

→ జట్టును సమతుల్యంగా ఉంచేందుకు నా వంతు కృషి చేస్తా. అందుకోసం బౌలింగ్‌పై ఎక్కువ దృష్టి పెడుతున్నా. బౌలింగ్ చేయగల బ్యాటర్ ఉంటే మేనేజ్‌మెంట్‌కు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. రానున్న మ్యాచ్‌ల్లో మరిన్ని ఓవర్లు బౌలింగ్ చేసే అవకాశం లభిస్తుంది అనుకుంటున్నా. పరిస్థితులకు తగ్గట్లు ఆటతీరును మార్చుకోవడం ముఖ్యం. అందుకు నేను సిద్ధం.

'నితీశ్.. జీనియస్'


మైకేల్ క్లార్క్

- ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్ ప్రశంస
- ఆంధ్ర క్రికెటర్ ఆరో స్థానంలోనే రావాలని సూచన

సిడ్నీ: ఆస్ట్రేలియా పర్యటనలో అదరగొడుతున్న ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డిపై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకెల్ క్లార్క్ ప్రశంసలు కురిపించాడు. మెల్‌బోర్న్ టెస్టులో ఎనిమిదో స్థానంలో బరిలోకి దిగిన నితీశ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో క్లార్క్ మాట్లాడుతూ... 'నితీశ్ జీనియస్. చిన్న వయసులో అతడి ఆటతీరు అమోఘం. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి చక్కటి సెంచరీతో ఆకట్టుకున్నాడు. అతడికింకా 21 ఏళ్లే. 'బోర్డర్–గావస్కర్' సిరీస్ ప్రారంభానికి ముందు అతడి గురించి ఎవరూ పెద్దగా ఆలోచించలేదు. కానీ తన ఆటతీరుతో నితీశ్ అందరినీ ఆకట్టుకున్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లను చూసి అతడు భయపడలేదు. అవసరమైన సమయంలో సంయమనం చూపాడు. టెయిలెండర్లతో కలిసి బ్యాటింగ్ చేయడం అంత సులువు కాదు. కానీ అతడు దాన్ని చేసి చూపాడు. సమయానుకూలంగా బ్యాటింగ్ చేస్తూ పరిణతి చూపాడు. భవిష్యత్తులో అతడు ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడని భావిస్తున్నా. అదే అతడికి మంచిది. బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో ఇలాంటి చురుకైన కుర్రాడు లభించడం భారత క్రికెట్‌కు మంచి చేస్తుంది. సిడ్నీ టెస్టులో అందరి దృష్టి అతడిపైనే ఉంటుంది' అని అన్నాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో ఫామ్ దొరకబుచ్చుకోలేక తంటాలు పడుతున్న టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను ఉద్దేశించి కూడా క్లార్క్ కీలక వ్యాఖ్యలు చేశాడు. జట్టుకు భారమైనట్లు అనిపిస్తే తప్పుకోవడమే మంచిదని అన్నాడు. 'సిడ్నీ టెస్టు నుంచి రోహిత్‌ను తప్పిస్తారని అనుకోవడం లేదు. కానీ అతడి ప్రదర్శన ఏమాత్రం బాగాలేదు. ఈ సిరీస్‌లో అతడి టెస్టు కెరీర్ ముగుస్తుందని అనుకోవడం లేదు. అయితే జట్టును ఇబ్బంది పెడుతూ భారంగా కొనసాగాలని ఏ ఆటగాడు కోరుకోడు' అని క్లార్క్ అన్నాడు.

బెంగాల్ టైగర్స్ గెలుపు



రూర్కెలా: హాకీ ఇండియా లీగ్ పురుషుల టోర్నమెంట్‌లో ష్రాచి రార్ బెంగాల్ టైగర్స్ జట్టు రెండో విజయం నమోదు చేసింది. టీమ్ గోనాసిక వైజాగ్ జట్టుతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ టైగర్స్ జట్టు 2–1 గోల్స్ తేడాతో గెలుపొందింది. బెంగాల్ టైగర్స్ తరఫున రూపిందర్ పాల్ సింగ్ (31వ, 48వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేశాడు. టీమ్ గోనాసిక తరఫున మన్‌ప్రీత్ సింగ్ (32వ నిమిషంలో) ఏకైక గోల్ నమోదు చేశాడు. ఎనిమిది జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో బెంగాల్ టైగర్స్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. నేడు జరిగే మ్యాచ్‌లో సూర్మా హాకీ క్లబ్‌తో యూపీ రుద్రాస్ జట్టు తలపడుతుంది.

బుమ్రా లేకుంటే ఏకపక్షమే

భారత మేటి పేసర్ ప్రదర్శనపై మెక్‌గ్రాత్ ప్రశంసలు

సిడ్నీ: భారత జట్టులో జస్‌ప్రీత్ బుమ్రా లేకుండా 'బోర్డర్–గావస్కర్' సిరీస్ ఏకపక్షంగా సాగేదని ఆస్ట్రేలియా పేస్ దిగ్గజం మెక్‌గ్రాత్ పేర్కొన్నాడు. పరిస్థితులను అర్థం చేసుకొని అందుకు తగ్గట్లు ప్రణాళికలు రచించడంలో బుమ్రా బుర్ర చురుకైందని మెక్‌గ్రాత్ కితాబిచ్చాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటి వరకు నాలుగు టెస్టులు ముగియగా... టీమిండియా 1–2తో వెనుకబడి ఉంది. ఈ సిరీస్‌లో భారత బ్యాటర్లు విఫలమైనా... బుమ్రా ఒంటి చేత్తో జట్టును పోటీలో నిలిపాడని మెక్‌గ్రాత్ ప్రశంసించాడు. 'బుమ్రా లేకుండా సిరీస్ మరింత ఏకపక్షం అయ్యేది. అతడు టీమిండియాకు ప్రధాన బలం. అతడి బౌలింగ్‌కు నేను పెద్ద అభిమానిని. భారత జట్టు అతడిని జాగ్రత్తగా చూసుకోవాలి. భారత్‌లో క్రికెట్‌కు చాలా క్రేజ్ ఉంది. గత 12 ఏళ్లుగా ఎంఆర్ఎఫ్ పేస్ ఫౌండేషన్ తరఫున భారత్‌లో పనిచేస్తున్నా. మా సంస్థ ద్వారా ప్రసిధ్ కృష్ణ, యశస్వి జైస్వాల్ వంటి వాళ్లు ఎందరో లబ్ధి పొందారు. క్రికెట్‌లోని అన్నీ ఫార్మాట్లలో టెస్టులే అత్యుత్తమం. మెల్‌బోర్న్ టెస్టును ఐదు రోజుల్లో కలిపి 3,70,000 మంది వీక్షించడం ఆనందాన్నిచ్చింది. ఇది టెస్టు క్రికెట్‌కున్న ఆదరణను వెల్లడిస్తుంది' అని మెక్‌గ్రాత్ అన్నాడు.


ఆస్ట్రేలియా ప్రధానికి పింక్ క్యాప్ అందజేసిన మెక్‌గ్రాత్

వినోద్ కాంబ్లీ డిశ్చార్జి



థానే: ఇటీవల అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ... హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయ్యాడు. మూత్ర నాళాల ఇన్‌ఫెక్షన్‌తో రెండు వారాల క్రితం కాంబ్లీ ఆస్పత్రిలో చేరగా... అతడి మెదడులో రక్తం గడ్డకట్టినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇప్పుడు రెండు వారాల చికిత్స అనంతరం కాంబ్లీ కోలుకుని బుధవారం ఆస్పత్రి నుంచి ఇంటికి చేరాడు. నూతన సంవత్సరం సందర్భంగా కాంబ్లీ మాట్లాడుతూ... 'మద్యం, మాదక ద్రవ్యాలు జీవితాన్ని నాశనం చేస్తాయి. వాటికి దూరంగా ఉంటేనే జీవితం సాఫీగా సాగుతుంది' అని పేర్కొన్నాడు. కాంబ్లీ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాడని... కొన్ని జాగ్రత్తలు పాటించాలని ఆయనకు వైద్యం అందించిన డాక్టర్ వివేక్ త్రివేది పేర్కొన్నారు.

నాలుగో స్థానంలోనే అర్జున్

ప్రపంచ చెస్ ర్యాంకింగ్స్



న్యూఢిల్లీ: గత నెలలో క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్‌గా అవతరించిన భారత గ్రాండ్‌మాస్టర్, తమిళనాడు టీనేజర్ దొమ్మరాజు గుకేశ్ తాజా ర్యాంకింగ్స్‌లో మార్పు లేదు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) బుధవారం విడుదల చేసిన 2025 జనవరి ర్యాంకింగ్స్‌లో భారత నంబర్‌వన్‌గా తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ కొనసాగుతున్నాడు. వరంగల్ జిల్లాకు చెందిన అర్జున్ 2801 రేటింగ్ పాయింట్లతో ప్రపంచ నాలుగో ర్యాంకర్‌గా ఉన్నాడు. 18 ఏళ్ల గుకేశ్ 2783 రేటింగ్ పాయింట్లతో ఐదో ర్యాంక్‌లో నిలిచాడు. నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ 2831 పాయింట్లతో నంబర్‌వన్ స్థానంలో కొనసాగుతుండగా... ఫాబియానో కరువానా (అమెరికా; 2803 పాయింట్లు) రెండో స్థానంలో, హికారు నకమురు (అమెరికా; 2802 పాయింట్లు) మూడో స్థానంలో ఉన్నారు. భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ 2750 రేటింగ్ పాయింట్లతో 10వ ర్యాంక్‌లో నిలిచాడు. భారత్‌కే చెందిన ప్రజ్ఞానంద (2741) 13వ ర్యాంక్‌లో, అరవింద్ చిదంబరం (2726) 23వ ర్యాంక్‌లో, విదిత్ సంతోష్ గుజరాతి (2721) 24వ ర్యాంక్‌లో, పెంటేల హరికృష్ణ (2695) 36వ ర్యాంక్‌లో, నిహాల్ సరీన్ (2687 పాయింట్లు) 41వ ర్యాంక్‌లో, రౌనక్ సాధ్వాని (2675) 48వ ర్యాంక్‌లో ఉన్నారు.

ఆరో ర్యాంక్‌లో హంపి



మహిళల క్లాసికల్ ఫార్మాట్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఆరో స్థానంలో కొనసాగుతోంది. హంపి ఖాతాలో 2523 రేటింగ్ పాయింట్లున్నాయి. మహారాష్ట్ర అమ్మాయి, జూనియర్ ప్రపంచ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ 2490 పాయింట్లతో 14వ ర్యాంక్‌లో, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 2489 పాయింట్లతో 16వ ర్యాంక్‌లో, తమిళనాడుకు చెందిన వైశాలి రమేశ్‌బాబు 2476 పాయింట్లతో 19వ ర్యాంక్‌లో ఉన్నారు.

బుమ్రా ఎడమ చేత్తో బౌలింగ్ చేయాలని చట్టం తెస్తాం

- భారత పేసర్‌ను ఆకాశానికెత్తిన ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్
- సిడ్నీ టెస్టులో 'పింక్ క్యాప్'లతో బరిలోకి దిగనున్న ఇరు జట్లు


ఆస్ట్రేలియా ప్రధానమంత్రితో భారత జట్టు

సిడ్నీ: టీమిండియా మేటి పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాను ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంటోనీ అల్బనీస్ ఆకాశానికెత్తారు. ప్రతిష్టాత్మక 'బోర్డర్–గావస్కర్' ట్రోఫీలో నాలుగు మ్యాచ్‌లాడి 30 వికెట్లు పడగొట్టిన బుమ్రా... ఇకపై ఎడమ చేత్తో బౌలింగ్ చేసేలా చట్టం తీసుకొస్తామని అల్బనీస్ చమత్కరించారు. 'బుమ్రా ఎడమ చేత్తో బౌలింగ్ చేయాలి. లేదా రనప్ తగ్గించుకోవాలి. ఈ మేరకు చట్టం తీసుకొస్తాం. అతడు బౌలింగ్‌కు వచ్చిన ప్రతిసారి చూసేందుకు ఎంతో ముచ్చటగా ఉంటుంది' అని అల్బనీస్ పేర్కొన్నారు. సిడ్నీ వేదికగా శుక్రవారం నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య చివరి టెస్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇరు జట్ల ఆటగాళ్లకు బుధవారం ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ ఆతిథ్యమిచ్చారు. 'భారత్, ఆస్ట్రేలియా జట్లు ఇప్పటికే ఎంతో మజానిచ్చాయి. శుక్రవారం నుంచి చివరి టెస్టు ప్రారంభం కానుంది. మెక్‌గ్రాత్ ఫౌండేషన్ కృషితో సిడ్నీ మైదానం గులాబీ రంగు సంతరించుకోనుంది' అని అల్బనీస్ సామాజిక మాధ్యమాల్లో ఒక లేఖ విడుదల చేశారు. ఆస్ట్రేలియా మాజీ పేసర్ మెక్‌గ్రాత్ భార్య 2008లో రొమ్ము క్యాన్సర్ బారిన పడి మృతి చెందగా... అప్పటి నుంచి ఈ వ్యాధిపై మరింత అవగాహన పెంచేందుకు తన ఫౌండేషన్ తరఫున మెక్‌గ్రాత్ తీవ్రంగా కృషి చేస్తున్నాడు. ఇందులో భాగంగానే చివరి టెస్టులో భారత్, ఆస్ట్రేలియా జట్లు గులాబీ క్యాప్‌లు ధరించి బరిలోకి దిగనున్నాయి. ప్రధానితో భేటీ అనంతరం టీమిండియా హెడ్‌కోచ్ గంభీర్ మాట్లాడుతూ... 'ఆస్ట్రేలియా అందమైన దేశం. కానీ ఇక్కడ పర్యటించడం చాలా కష్టం. అభిమానుల నుంచి మంచి మద్దతు లభించింది. సిరీస్‌లో మరో టెస్టు మిగిలుంది. దీంట్లో కూడా ప్రేక్షకులను అలరించేందుకు ప్రయత్నిస్తాం' అని అన్నాడు. ఆస్ట్రేలియా సారథి కమిన్స్ మాట్లాడుతూ... 'మెల్‌బోర్న్ టెస్టును ఎప్పటికీ మరవలేం. ఐదు రోజుల పాటు హోరాహోరీగా సాగిన పోరులో విజయం సంతృప్తినిచ్చింది. సిరీస్ గెలవాలనే లక్ష్యంతో చివరి టెస్టు బరిలోకి దిగుతాం' అని పేర్కొన్నాడు.

16 రాష్ట్రాల్లో దట్టమైన పొగమంచు

యూపీ, మధ్యప్రదేశ్‌ల్లో 100 మీటర్లకు తగ్గిపోయిన విజిబిలిటీ

కశ్మీర్‌లోని గుల్‌మార్గ్‌లో ఉష్ణోగ్రత మైనస్ 8.8 డిగ్రీలు

సాక్షి, న్యూఢిల్లీ: కొత్త సంవత్సరం తొలిరోజు ఉదయమే ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్ సహా దేశంలోని 16 రాష్ట్రాలను దట్టమైన పొగమంచు పలకరించింది. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో భారీ స్థాయిలో మంచు కురుస్తోంది. ఉత్తర భారత రాష్ట్రాల్లో చలి ప్రభావం చాలా ఎక్కువగా కొనసాగుతోంది. ఉత్తరప్రదేశ్‌లోని 40 జిల్లాల్లో 100 మీటర్ల ఆవల ఏముందో కనిపించనంతగా దట్టమైన పొగమంచు కమ్ముకుంది. దీంతో రహదారులపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మధ్యప్రదేశ్‌లోని అనేక జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. హరియానాలో పొగమంచు కారణంగా 30 రైళ్లు నిలిచిపోయాయి. రాష్ట్రంలో 13 జిల్లాలకు కోల్డ్ వేవ్ అలర్ట్ జారీ చేశారు. రాజస్తాన్‌లోని 3 నగరాల్లో 5 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదైంది. మౌంట్ అబూలో ఉష్ణోగ్రత 2.2 డిగ్రీసెల్సియస్‌కు పడిపోయింది. రానున్న రోజుల్లో ఉత్తరాది రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ బుధవారం తెలిపింది. జమ్మూకశ్మీర్‌లోని పర్యాటక రంగానికి ప్రసిద్ధి చెందిన గుల్‌మార్గ్‌లో ఉష్ణోగ్రత మైనస్ 8.8 డిగ్రీసెల్సియస్‌కు పడిపోయింది. పహల్గామ్‌లో మైనస్ 7.6 డిగ్రీసెల్సియస్, ఖజీగండ్‌లో మైనస్ 6, శ్రీనగర్‌లో మైనస్ 4.4గా నమోదైంది. హిమాచల్ ప్రదేశ్‌లోనూ మరో 6 రోజుల పాటు మంచు కురుస్తుందని స్థానికులకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేశారు. మంచుతో చుట్టుపక్కల ప్రాంతాలు మంచుతో నిండిపోవడంతో పర్యాటకుల రద్దీ పెరిగింది. 2023లో 2.10 కోట్ల మంది పర్యాటకులు కశ్మీర్‌కు రాగా 2024 ఏడాదిలో ఈ సంఖ్య 2.11 కోట్లకు పెరిగింది. రాబోయే రెండు రోజుల్లో అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపురలలో దట్టమైన పొగమంచు అలుముకోనుంది. ఉత్తర భారతంలో చలిగాలుల కారణంగా ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోయాయి. ఢిల్లీలో మరసగా మూడోరోజూ అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం కేవలం 4.3 డిగ్రీసెల్సియస్‌గా నమోదైంది. మరోవైపు జనవరి మూడో తేదీన తమిళనాడు, పుదుచ్చేరిలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అంచనా వేస్తున్నారు.



కొత్త సంవత్సరం సందర్భంగా సరదాగా
బుధవారం ఢిల్లీలోని ఇండియాగేట్‌ను సందర్శించిన వేలాదిమంది జనం

కొత్త ఏడాదిలో... ఇలా చేద్దాం!

న్యూ ఇయర్‌ను 'హ్యాపీ'గా మలచుకునే మార్గాలు

కాలం ఒక మాయాజాలం. కళ్లముందే కరిగిపోతుంది. ఒడిసిపట్టేందుకు ఎంత ప్రయత్నించినా వేలి సందుల గుండా ఇట్టే జారిపోతుంది. ఆ క్రమంలో మరో ఏడాది చూస్తుండగానే కరిగిపోయింది. తీపి, చేదు అనుభవాలను మిగిల్చి 2024 చరిత్ర పుటల్లోకి జారుకుంది. కొత్త ఆశలను, సరికొత్త ఆకాంక్షలను మోసుకుంటూ 2025 వచ్చేసింది. బద్ధకం వదిలించుకుంటామని, ఇంకోటని, మరోటని... ఇలా న్యూ ఇయర్ అంటేనే ఎన్నో తీర్మానాలు, మనకు మనమే చేసుకునే వాగ్దానాలు. ఇటు చేసే పనిని, అటు ఈదే సంసారాన్ని బ్యాలెన్స్ చేసుకోవాలి. ఇంటిల్లిపాదితో పాటు మన ఆరోగ్యమూ జాగ్రత్తగా చూసుకోవాలి. పెట్టుకున్న లక్ష్యాలన్నింటినీ సాధించేయాలి. కొత్త అభిరుచులు పెంచుకోవాలి. మొత్తమ్మీద వీలైనన్ని ఆనందమయ క్షణాలను ఒడిసిపట్టుకోవాలి. ఇలాంటివన్నీ ఎవరికైనా ఉండే ఆశలే. ఇవన్నీ తీరి 2025 ఆసాంతం హాయిగా సాగేందుకు ఏమేం చేయాలంటే..!



ఆందోళనకు చెక్

ఆధునిక జీవన విధానం పుణ్యమా అని అప్పుడప్పుడు ఒత్తిళ్లు ఎవరికైనా ఉండేవే. కానీ రోజులో చాలాభాగం ఆందోళన మధ్యే గడుస్తోందంటే మాత్రం డేంజరే. కాస్త ఆగి, అర్థం చేసుకునే లోపే పూడ్చుకోలేనంత నష్టం జరిగిపోతుంటుంది. కనుక మనసును కుంగదీసే ఆలోచనల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. పరిస్థితిని ఎప్పటికప్పుడు నిష్పాక్షికంగా మదింపు చేసుకుంటూ ఉండాలి. ఇందుకోసం వారానికోసారి కొంత సమయాన్ని ప్రత్యేకించుకోవాలి. ప్రథమ కోపం వంటివేమైనా పెరుగుతున్నాయా అని ఒకటికి రెండుసార్లు పరిశీలించి చూసుకోవాలి. ఆ లక్షణాలు కనిపిస్తే మొదట్లోనే వదిలించుకోవాలి. లేదంటే ఆఫీసులోనూ, ఇంట్లోనూ లేనిపోని సమస్యలు నెత్తిన పడటం ఖాయం. లేదంటే నచ్చనిది, ఊహించనిది జరిగితే వెంటనే అరిచేసి అవతలి వారిని గాయపరచడం లాంటివి పెరిగిపోతాయి. ఇది సంబంధాలను సరిచేయలేనంతగా దెబ్బ తీస్తుందని గుర్తుంచుకోవాలి. అది ఆఫీసైనా కావచ్చు, ఇల్లయినా కావచ్చు. అయితే ఎంత ప్రయత్నించినా మనమూ మనుషులమే గనుక ఎప్పుడైనా నోరు జారవచ్చు. అప్పుడు పరిస్థితిని చక్కదిద్దేందుకు మీరే చొరవ తీసుకోండి. అవసరమైతే అవతలి వారికి సారీ చెప్పినా తప్పు లేదు. అది మీకు నామర్దా అని అస్సలు అనుకోవద్దు. అవతలి వారి దృష్టిలో వ్యక్తిగా మిమ్మల్ని మరో మెట్టు ఎక్కిస్తుందని తెలుసుకోండి.

మంచి సావాసం

మీకన్నా తెలివైన వారితో, మంచివారితో వీలైనంత ఎక్కువగా గడపండి. తెలివైనవారి సాహచర్యంలో తెలియకుండానే బోలెడు విషయాలు నేర్చుకుంటారు. మంచివారు ఆచరించి చూపే జీవిత విలువలు మనకు దారి చూపే దీపాలవుతాయి. వాటిని ఎంతగా అలవర్చుకుంటే అహంకారం వంటి అవలక్షణాలు అంతగా అణగుతాయి. మానసిక ప్రశాంతతకు, నిజమైన తృప్తికి బాటలు పడతాయి.

బద్ధకానికి బై బై

బద్ధకాన్ని వదలించుకుందాం. ప్రతిసారి మాదిరిగానే ఈసారి కూడా దీన్ని న్యూ ఇయర్ తీర్మానాల చిట్టాకు పరిమితం చేయకండి. ఈ క్షణం నుంచే ఆచరణలో పెట్టండి. దీన్నొక్కదాన్ని దూరం చేసుకుంటే చాలా సమస్యలు పరిష్కారమైనట్టేనని గుర్తుంచుకోండి. మెదడును ఖాళీగా ఉంచకపోవడమే ఈ సమస్యకు పరిష్కారం. ఏఐ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి. వృత్తి సంబంధ నైపుణ్యాలను మెరుగుపెట్టుకోండి. అది మీ ఆత్మవిశ్వాసాన్నీ అమాంతంగా పెంచేస్తుంది. నిత్యం ఏదో ఒక కొత్త విషయాన్ని గురించి ఆలోచిస్తూ ఉంటే అటు బద్ధకమూ వదులుతుంది. ఇటు చక్కని ఐడియాలూ పుట్టుకొస్తాయి. రెండిందాలా లాభమే.

అవసరాలకే జై

కోర్కెలకు, కనీస అవసరాలకు చాలా తేడా ఉంది. ఆశలు అనంతమే గానీ ఆర్జన ఎప్పుడూ పరిమితమే. ఇదొక్కటి గుర్తుంచుకుంటే అవసరాలు, సౌకర్యాలు, ఆడంబరాలకు మధ్య స్పష్టమైన గీత గీయగలం. వేటిని తీర్చుకోవాలో, వేటిని దూరం పెట్టాలో, వేటిని వదిలించుకోవాలో తేల్చుకోవ డం తేలికవుతుంది. చాలా ఆర్థిక సమస్యలు దూరమవుతాయి. అనుకోని అవసరాల కోసం కొంత మొత్తం కూడా పక్కన పెట్టుకోగలుగుతాం. ఆర్థిక ప్రశాంతత ఎంత బావుంటుందో అనుభవంలోకి వస్తుంది.

ఇతరులకు సాయపడదాం

ప్రతిఫలం ఆశించకుండా చేసే సాయం వల్ల కలిగే ఆత్మసంతృప్తి అంతా ఇంతా కాదు. అది ఎన్ని వేలు, లక్షలు ఖర్చు చేసినా దొరికేది కాదు. మనకిష్టమైన వారికి సాయపడటం పెద్ద విషయమేమీ కాదు. మీకిష్టం లేని వారికి అవసరాల్లో సాయపడితే మనిషిగా మరో మెట్టు ఎక్కినట్టే. ఇతరుల్లోని మంచిని గుర్తించడం, అభినందించడం అలవాటుగా మార్చుకుంటే మన సాన్నిధ్యాన్ని అంతా ఇష్టపడతారు.

పరిష్కారాలు సూచిద్దాం

ఎప్పుడూ సమస్యలను ఎత్తిచూపడం కాదు. అది అందరూ చేసేదే. ఇంతకాలంగా మనమూ చేస్తూ వస్తున్నదే. వాటికి ఆచరణసాధ్యమైన పరిష్కారాలను సూచించే ధోరణి అలవర్చుకుందాం. మొదట్లో కాస్త కష్టమే అనిపించినా మనల్ని అందరికీ అత్యంత ఇష్టులను చేస్తుందిది. ముఖ్యంగా ఆఫీసుల్లో మేనేజర్ వంటి పొజిషన్లలో ఉంటే ఈ ఒక్క అలవాటుతో సహోద్యోగులందరి మనసూ ఇట్టే గెలుచుకోవచ్చు. వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి వాళ్లకు సలహాలివ్వడమే గాక ఎప్పటికప్పుడు తోడు నిలిస్తే వాళ్లకూ బాగుంటుంది. మనకూ తృప్తిగా ఉంటుంది. సంస్థా లాభపడుతుంది. అలా ఆల్ హ్యాపీస్.

బంధాలే ముఖ్యం

చిన్న పొరపాట్లకు బంధాలు తెంచుకునే దాకా వెళ్లకండి. ఇందుకోసం ప్రత్యేకించి ఏమీ చేయనక్కర్లేదు. అవతలివాళ్లు కూడా మన లాగే మామూలు మనుషులేనని, అప్పుడప్పుడు తప్పులు, పొరపాట్లు చేస్తుంటారని గుర్తుంచుకుంటే చాలు. క్షమించే గుణాన్ని పెంచుకుంటే ప్రపంచమంతా మరింత అందంగా మారుతుంది. ఎప్పుడో జరిగిన అవమానాలను, చేదు సంఘటనలను మనసులో మోయకండి. ఆ భారం నానారకాల ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది.

చిన్న విజయాలనూ ఆస్వాదిద్దాం

విజయం సాపేక్షం. దానికి ఒక్కొక్కరూ ఒక్కో నిర్వచనమిస్తారు. భారీ లక్ష్యాలు సాధించినప్పుడు కలిగే విజయానందం గొప్పదే. కానీ దాని కోసమని ఆనందాన్ని అప్పటిదాకా వాయిదా వేసుకోవడమెందుకు? ఆ లక్ష్యాలను సాధించే క్రమంలో ఎదురయ్యే చిన్న చిన్న సాఫల్యాలను కూడా సెలబ్రేట్ చేసుకోవడాన్ని అలవాటుగా మార్చుకుందాం. అప్పుడిక ప్రతి రోజూ పండుగే.

ఆత్మానందమూ ముఖ్యమే

వ్యక్తిగత, వృత్తిగత, సాంసారిక సంతృప్తి చాలా ముఖ్యమే. కానీ ఆత్మానందం వీటన్నింటి కంటే విలువైనది. దాన్ని పొందేందుకు కూడా ఇప్పటినుంచే ప్రయత్నం మొదలు పెడదాం.

సహోద్యోగులు కీలకం

తిండీ, నిద్రా తదితరాలకు పోగా మన జీవితంలో మిగిలే నాణ్యమైన సమయంలో అత్యధిక భాగం గడిపేది కలిసి పనిచేసే సహోద్యోగులతోనే. వారితో సత్సంబంధాలు చాలా ముఖ్యమని గుర్తుంచుకోండి. చిన్నాచితకా కారణాలతో సహోద్యోగులతో కీచులాటలకు దిగకండి. అందుకోసం అవసరమైతే మీరే కాస్త తగ్గండి. తప్పేమీ లేదు. చక్కని పని వాతావరణం మన మానసిక, శారీరక ఆరోగ్యాలకు ఎంతో అవసరం.

అంటే ఏకాయెకిన కఠోర ఆధ్యాత్మిక సాధనలు చేసి తీరాలని కాదు. ఏ కవిత్వం, సంగీతం వంటి వాటితో లోపలి ప్రయాణాన్ని మెల్లిమెల్లిగా మొదలు పెట్టవచ్చు. నేనెవరిని అనే మూలాలోచన అంటూ ఒకటి మనసులో ఒక పక్కన సాగుతూ ఉంటే చాలు. ఆత్మాన్వేషణకు క్రమంగా బాటలు అవే పడతాయి. చివరగా, వీలైనంతగా నవ్వండి. మానసికంగా అది కలిగించే సానుకూల ప్రభావం అంతా ఇంతా కాదని ఎన్నెన్నో అధ్యయనాలు ముక్త కంఠంతో తేల్చాయి. మొహంపై చిరునవ్వు చెరగని వారికి ప్రతి క్షణమూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుస్తుంది.

మరింకెందుకు ఆలస్యం?! ఈ క్షణమే రంగంలోకి దిగుదాం. బద్ధకాన్ని వదిలించుకుందాం. మనల్ని మనం నిత్యం సానబట్టుకుంటూ సాగుదాం. 2025ను మన జీవితంలోకెల్లా అత్యంత ఆనందమయమైన ఏడాదిగా మలచుకుందాం.

– సాక్షి, నేషనల్ డెస్క్

- తల్లి, నలుగురు చెల్లెళ్ల హత్య
- ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో దారుణం

కుటుంబాన్ని కడతేర్చిన కిరాతకుడు

లక్నో: ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో దారుణం చోటుచేసుకుంది. 24 ఏళ్ల యువకుడు మొహమ్మద్ అర్షద్ తన తల్లిని, నలుగురి సోదరీమణులను కిరాతంగా హత్య చేశాడు. అనంతరం సెల్ఫీ వీడియో కూడా తీసుకున్నాడు. ఇరుగు పొరుగు ప్రజల వేధింపులు, వారిని ఏమీ చేయలేని నిస్సహాయత, నిరాశతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డానని వెల్లడించారు. అర్షద్ స్వస్థలం యూపీలోని ఆగ్రా. తన తల్లి, నలుగురు చెల్లెళ్లతో కలిసి లక్నోకు చేరుకున్నాడు. ఓ హోటల్ గదిలో వారంతా బసచేశారు. బుధవారం అర్షద్ తన ఐదుగురు కుటుంబ సభ్యులను పొట్టన పెట్టుకున్నాడు. గొంతు, మణికట్టును కత్తితో నరకడంతో వారు ప్రాణాలు కోల్పోయారు. తల్లి ఆస్మా, చెల్లెళ్లు అలియా(9), అల్షియా(19), అక్సా(16), రహ్మీన్(18) ప్రాణాలు కోల్పోయారని పోలీసులు తెలిపారు. లక్నోలో నాకా ప్రాంతంలోని శరణ్‌జీత్ హోటల్‌లో ఈ దారుణం జరిగిందని వెల్లడించారు. నిందితుడు అర్షద్‌ను ఘటనా స్థలంలోనే అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. కుటుంబంలో కలహాల కారణంగానే అతడు ఈ హత్యలు చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పేర్కొన్నారు. అయితే, హత్య జరిగిన తర్వాత అర్షద్ తీసుకున్న సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. ఇది 6.5 నిమిషాల నిడివి ఉంది. తన కుటుంబ సభ్యులను తానే హత్య చేశానని, ఇందులో తన తండ్రి హస్తం కూడా ఉందని అర్షద్ ఈ వీడియోలో పేర్కొన్నాడు. ఆగ్రాలో తాము నివసించే ప్రాంతంలోని ఇరుగు పొరుగు జనం తమను వేధించేవారని చెప్పాడు. నిస్సహాయ స్థితిలోనే తల్లి, చెల్లెళ్లను చంపాల్సి వచ్చిందని అన్నాడు. తమను వేధింపులకు గురి చేసినవారిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని కోరాడు. ఇదిలా ఉండగా, అర్షద్ కుటుంబం ఆగ్రాలో కుబేర్‌పూర్ ప్రాంతంలోని తేహ్రీ బాఘియాలో నివసించేది. ఐదుగురు హత్యల విషయంలో ఈ ప్రాంతంలో సంచలనాత్మకంగా మారింది. అర్షద్ కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. అర్షద్, అతడి తండ్రి మొహమ్మద్ బాదర్ సొంత కుటుంబంలోని మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించేవారని అలీమ్ ఖాన్ అనే స్థానికుడు చెప్పాడు.





31తేదీ అర్ధరాత్రి దాటగానే న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్ వద్ద మొదలైన సంబరాలు. (ఇన్‌సెట్లో) బాల్‌ను కిందకు దింపుతున్న దృశ్యం



- హిందూ, బౌద్ధ మందిరాలను

కూల్చే కుట్ర

- ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌పై ముఖ్యమంత్రి ఆతిశి సంచలన ఆరోపణ
- తోసిపుచ్చిన ఎల్జీ కార్యాలయం

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ రాష్ట్ర పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లోవున్న హిందూ ఆలయాలు, బౌద్ధ మందిరాలను కూల్చేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాలు చేశారని రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు ఆతిశి మార్లేనా సంచలన ఆరోపణలు చేశారు. బుధవారం ఢిల్లీలో ఆమె విలేకరుతో మాట్లాడారు. ''దేవాలయాలను తరలించడం లేదా కూల్చివేయడంపై నిర్ణయాలను తీసుకునే ధార్మిక కమిటీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా పరిధిలో పనిచేస్తుంది. ఈ కమిటీ నవంబర్ 22వ తేదీన సమావేశమైంది. ఈ సమావేశంలో వెస్ట్ పటేల్ నగర్, దిల్షాద్ గార్డెన్, సుందర్ నగరి, సీమాపురి, గోకల్‌పురి, న్యూ ఉస్మాన్‌పురి ప్రాంతాల్లోని పలు హిందూ దేవాలయాలతోపాటు సుందర్ నగరిలో ఉన్న బౌద్ధ మందిరాన్ని కూల్చివేయాలని కమిటీ నిర్ణయించింది. ఈ కూల్చివేతల ఆదేశాలకు ఇప్పటికే లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోద ముద్ర వేశారు. వీటిని కూల్చివేసేందుకు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, డీఎం కార్యాలయాలు ఆదేశాలు అందాయి. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా చర్యలు చేపట్టవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఓవైపు ఢిల్లీలోని ఆమ్ సర్కార్ హిందూ ఆలయాల్లో పూజారులకు, గురుద్వారాల్లో గ్రంథీలకు నెలకు రూ.18,000 ఆర్థికసాయం అందించాలనుకుంటుంటే మరోవైపు ఎల్జీ ఆఫీస్ ప్రార్థనాలయాలను నేలమట్టంచేసేందుకు ఉత్సాహం చూపిస్తోంది. కమిటీ ఆదేశాల దస్త్రం ఇప్పటికే ఎన్‌డీఏ సారథ్యంలోని కేంద్రప్రభుత్వానికి చేరింది''అని ఆతిశి వివరించారు. కూల్చివేతల నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలంటూ ఆతిశి మంగళవారం ఎల్జీకి ఒక లేఖ రాశారు.

ఇదంతా చెత్త రాజకీయాలు: ఎల్జీ

ఆతిశి ఆరోపణలపై ఎల్జీ కార్యాలయం స్పందించింది. ''ఈ విషయంలో ఆప్ చెత్త రాజకీయాలు చేస్తోంది. ఎలాంటి ప్రార్థనా మందిరం కూల్చివేతకు ఆదేశాలు ఇవ్వలేదు. అలాంటి దస్త్రంపై సంతకాలు చేయలేదు'' అని ఎల్జీ ఆఫీస్ స్పష్టంచేసింది. దీనిపై మళ్లీ ఆతిశి స్పందించారు. ఎల్జీ కార్యాలయం చెప్పేదంతా అబద్ధం అంటూ రిలీజియస్ మీటింగ్‌లోని మినిట్స్ కాపీని మీడియాకు ఆతిశి చూపించారు. త్వరలో కూల్చబోతున్నామని, ఇందుకు బందోబస్తు ఇవ్వాలని పోలీసులకూ ఎల్జీ ఆఫీస్ సమాచారం ఇచ్చిందని ఆమె ఆరోపించారు. ఆతిశి ఆరోపణలను బీజేపీ తిప్పికొట్టింది. ''వాస్తవానికి ఈ కమిటీకి ఆప్‌నేత అయిన ఢిల్లీ హోం శాఖ మంత్రి అధ్యక్షునిగా ఉంటారు. కమిటీ తుది నిర్ణయాలు, నివేదికలు ఎల్జీతోపాటు ముఖ్యమంత్రికీ వెళ్తాయి. సమాజంలో విద్వేషం పెంచేందుకు ఆప్ ప్రయత్నిస్తోంది''అని బీజేపీ ఢిల్లీ విభాగ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవా అన్నారు.

ముంబై దాడుల నిందితుడు తహవ్వుర్ రాణా భారత్‌కు అప్పగింత!

అమెరికా కోర్టు ఆమోదముద్ర

న్యూఢిల్లీ: 26/11 ముంబై ఉగ్ర దాడుల ఉదంతంలో కీలక నిందితుడు తహవ్వుర్ రాణాను అమెరికా అతి త్వరలో భారత్‌కు అప్పగించనుంది. అమెరికా అపీల్స్ కోర్టు గత ఆగస్టులోనే ఇందుకు అనుమతించింది. ఇరు దేశాల మధ్య ఉన్న అప్పగింత ఒప్పందం మేరకు అతన్ని 'భారత్‌కు అప్పగించదగ్గ'వ్యక్తిగా తేల్చింది. ఈ మేరకు దిగువ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ రాణా పెట్టుకున్న పిటిషన్‌ను తాజాగా కొట్టేసింది. ముంబై దాడుల్లో అతని ప్రమేయానికి సంబంధించి భారత్ ఇప్పటికే బలమైన సాక్ష్యాధారాలు సమర్పించిందన్న దిగువ కోర్టు వాదనతో ఏకీభవించింది. దాంతో అతని అప్పగింత ప్రక్రియను అమెరికా ప్రభుత్వం వేగవంతం చేసింది. రాణా పాకిస్తాన్ మూలాలున్న కెనడా వ్యాపారి. ఐఎస్ఐ, లష్కరే తొయిబా సంస్థల సభ్యునిగా ముంబై ఉగ్ర దాడుల్లో కీలక పాత్ర పోషించాడని భారత్ ఆరోపించింది. దాడుల పాత్రధారి డేవిడ్ కోల్మన్ హెడ్లీకి అతను అన్ని విధాలా సహకరించినట్టు చార్జిషీట్‌లో పోలీసులు పేర్కొన్నారు. దాడులు జరిగిన మరుసటి ఏడాదే ఎఫ్‌బీఐ అమెరికాలో అదుపులోకి తీసుకుంది. అప్పట్లో అతను షికాగోలో ట్రావెల్ ఏజెన్సీ నడిపేవాడు. ముంబైలోకి ఉగ్రవాదులు ఎక్కడి నుంచి ప్రవేశించాలి, ఏయే ప్రాంతాలపై దాడులకు తెగబడాలి వంటి వివరాలన్నింటినీ తన మిత్రుడు హెడ్లీతో కలిసి పక్కాగా ప్లాన్ చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు. 2008 నవంబర్ 26న పాక్ ముష్కరులు కొలాబా సముద్రతీరం గుండా ముంబైలోకి చొరబడ్డారు. బృందాలుగా విడిపోయి ఛత్రపతి శివాజీ రైల్వే టెర్మినల్, తాజ్ హోటల్‌తో పాటు నగరంలో ఏకంగా 12 చోట్ల విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. మూడు రోజుల పాటు సాగిన మారణకాండకు 18 మంది పోలీసు సిబ్బందితో పాటు 166 మంది అమాయకులు బలయ్యారు. మృతుల్లో పలువురు విదేశీయులున్నారు.

ఇజ్రాయెల్ డ్రోన్ దాడిలో హమాస్ కమాండర్ అల్-హాదీ సబా హతం

టెల్ అవీవ్: గాజాలోని హమాస్ మిలిటెంట్లకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై మెరుపుదాడికి సారథ్యం వహించిన హమాస్ కమాండర్ అబ్దుల్ అల్-హాదీ సబా హతమయ్యాడు. ఇజ్రాయెల్ సైన్యం గత నెలలో నిర్వహించిన డ్రోన్ దాడిలో మరణించాడు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ సైన్యం తాజాగా ధ్రువీకరించింది. అల్-హాదీ సబా హమాస్‌కు చెందిన పశ్చిమ ఖాన్ యూనిస్ బెటాలియన్‌కు నుఖ్బా ప్లాటూన్ కమాండర్‌గా వ్యవహరించాడు. ఇజ్రాయెల్‌లోని కిబుట్జ్ నిర్ ఓజ్‌లో జరిగిన మారణకాండలో అతడికే కీలక పాత్ర.

మన్మోహన్ స్మారకం ప్రక్రియకు కేంద్రం శ్రీకారం

న్యూఢిల్లీ: దివంగత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు ఢిల్లీలో స్మారకం నిర్మించేందుకు తగిన స్థలాన్ని అన్వేషించే ప్రక్రియకు కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దాన్ని ఖరారు చేసే విషయంలో ఆయన కుటుంబ సభ్యుల అభిప్రాయాలు కూడా తీసుకుంటోంది. మూడు, నాలుగు స్థలాలను ఇప్పటికే వారి ముందు ఉంచినట్టు ప్రభుత్వ వర్గాల సమాచారం. ఇందుకోసం రాష్ట్రీయ స్మృతి స్థల్ పరిసరాలను కేంద్ర ప్రజా పనుల శాఖ అధికారులు సందర్శించారు. స్మారక నిర్మాణం నిమిత్తం అక్కడ పలు స్థలాలను గుర్తించారు.

ఒకరిని కాపాడబోయి మరో నలుగురు

బావిలో మొత్తం ఐదుగురి దుర్మరణం

హజారీబాగ్: భార్యాభర్తల మధ్య గొడవ పరోక్షంగా మొత్తం ఐదుగురి ప్రాణాలు తీసింది. బావిలో పడిపోయిన మోటార్‌సైకిల్‌ను తీసుకొచ్చే క్రమంలో జరిగిన ఈ విషాద ఘటన జార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లాలోని సర్వాహా గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 27 ఏళ్ల సుందర్ కర్మాలీ తన భార్య రూపాదేవితో గొడవపడి సొంత మోటార్‌సైకిల్‌ను పక్కనే ఉన్న బావిలో పడేశాడు. తర్వాత కోపం తగ్గించుకుని బావిలో దిగి వాహనం తీయబోయి అందులోనే పడిపోయాడు. భయంతో భార్య కేకలు వేయడంతో సమీపంలోని 25–28 ఏళ్ల వయస్సున్న రాహుల్ కర్మాలీ, వినయ్ కర్మాలీ, పంకజ్ కర్మాలీ, సూరజ్ భుయాన్‌లు బావిలోకి దిగారు. తొలుత ఒకరు దిగి కాపాడబోయారు. అతనూ లోపలే పడిపోవడంతో ఇంకొకరు దిగారు. రెండో వ్యక్తీ పడటంతో మూడో వ్యక్తి దిగాడు. ఇలా సుందర్‌తో కలిపి అందరూ బావిలో చనిపోయారు. విషవాయువు పీల్చడం వల్లే చనిపోయి ఉంటారని చర్హీ పోలీస్‌స్టేషన్ అధికారి గౌతమ్ చెప్పారు. ఫోరెన్సిక్ బృందాన్ని రప్పిస్తున్నారు.

ప్రాథమిక హక్కుల పరిరక్షణ కర్త సుప్రీంకోర్టు

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ



వ్యక్తిగత స్వేచ్ఛలు, హక్కులు

ప్రకరణ-28

విద్యాలయాల్లో మత బోధన నిషేధం

ప్రకరణ 28(1): ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచే ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రత్యేక మత బోధన నిషేధం. ప్రకరణ 28(2): పై నిబంధనకు కొన్ని మినహాయింపులిచ్చారు. ప్రభుత్వం నిర్వహించే దేవాదాయ, ధర్మాదాయ సంస్థల్లో ప్రత్యేక మత బోధన చేయవచ్చు. ప్రకరణ 28(3): ప్రభుత్వ గుర్తింపు ఉన్న, ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందే విద్యాసంస్థల్లో ఒక వ్యక్తి ఐచ్ఛికంగా మత ప్రార్థనలు /బోధనల్లో పాల్గొనవచ్చు. అయితే పాల్గొనమని ఒత్తిడి చేయరాదు. ఆ వ్యక్తి మైనర్ అయితే తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి అనుమతి తీసుకోవాలి.

ప్రకరణలు-29, 30

విద్యా, సాంస్కృతిక పరమైన హక్కులు

ప్రకరణ 29(1): భారతదేశంలో నివసిస్తున్న ప్రజలకు ప్రత్యేక భాష, లిపి, సంస్కృతి ఉంటే.. వాటిని పరిరక్షించుకుని, పెంపొందించుకునే స్వేచ్ఛ వారికి ఉంటుంది.

ప్రకరణ 29(2): ప్రభుత్వం నిర్వహిస్తోన్న లేదా ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందుతున్న సంస్థల్లో ప్రవేశానికి మతం, జాతి, కులం, భాషా ప్రాతిపదికన వివక్ష చూపరాదు.

ప్రకరణ 30(1): మైనారిటీ వర్గాలవారు, ప్రత్యేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకొని, నిర్వహించుకోవచ్చు.

ప్రకరణ 30(1)(ఎ): మైనారిటీలు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు, వాటి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే, వారికి ప్రత్యేక నష్టపరిహారం చెల్లించాలి. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ క్లాజును చేర్చారు.

ప్రకరణ 30(2): ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించే సమయంలో విద్యాసంస్థల పట్ల వివక్ష చూపరాదు. అల్ప సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలు, అధిక సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలను సమ దృష్టితో చూడాలి.

వివరణ:

- ఆర్టికల్ 29, 30లలో 'మైనారిటీ' పదాన్ని ప్రస్తావించారు. కానీ ఈ పదాన్ని రాజ్యాంగంలో ఎక్కడా నిర్వచించలేదు.
- మైనారిటీల వర్గీకరణకు రాష్ట్రాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దేశంలో రెండు రకాల మైనారిటీ వర్గాలున్నాయి. అవి మతపరమైన, భాషాపరమైన మైనారిటీ వర్గాలు.
- హిందువులు మినహా మిగతా వారంతా మతపరమైన మైనారిటీలే. భాషాపరమైన మైనారిటీలు రాష్ట్రాల వారీగా మారుతుంటారు. ఉదాహరణకు.. తెలంగాణలో కన్నడిగులు, గుజరాతీలు, మరాఠీలు భాషాపరంగా మైనారిటీలు.

సుప్రీంకోర్టు తీర్పులు

కేరళ విద్య పాఠ్యాంశాల సవరణ బిల్లు (1958) కేసు: కేరళ ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవ, కమ్యూనిస్టు భావాలున్న పాఠ్యాంశాలను చేర్చారు. దీంతో ఈ బిల్లును సుప్రీంకోర్టు సలహా పరిధికి నివేదించారు. పాఠ్యాంశాల్లో తీవ్రవాద భావజాలాన్ని చేర్చడం చెల్లదని సుప్రీంకోర్టు తెలిపింది.

డి.ఎ.వి. కాలేజ్ v/s స్టేట్ ఆఫ్ పంజాబ్ (1971) కేసు: విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో పంజాబీ మాత్రమే బోధన భాషగా ఉండాలని నిర్ణయించారు. అయితే ఇది చెల్లుబాటు కాదని సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది.

అలెసెయింట్స్ v/s గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (1980) కేసు: మైనారిటీ విద్యాసంస్థల నిర్వహణలో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదని ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

టి.ఎం.ఎ.పాయ్ v/s స్టేట్ ఆఫ్ కర్ణాటక (2003) కేసు: మైనారిటీ విద్యా సంస్థల విషయంలో ప్రభుత్వం ఏ సందర్భంలో జోక్యం చేసుకోవచ్చో, జోక్యం చేసుకోరాదో వివరణ ఇస్తూ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. అవి..

- మైనారిటీ స్థాయిని నిర్ణయించడానికి రాష్ట్రాన్ని మాత్రమే యూనిట్‌గా తీసుకోవాలి.
- మైనారిటీ అనే పదంలో భాషాపరమైన, మతపరమైన మైనారిటీలు ఉండవచ్చు.
- బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు, వారిపై పాలనా నియంత్రణ సంబంధిత హక్కులు మేనేజ్‌మెంట్‌కే ఉంటాయి. ప్రభుత్వ ధనసహాయం పొందని మైనారిటీ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే అధికారం ప్రభుత్వానికి లేదు. అయితే క్యాపిటేషన్ ఫీజులను ప్రభుత్వం నియంత్రించవచ్చు.

ప్రకరణ – 31

ఆస్తిహక్కు

పార్లమెంటు ఆస్తి హక్కుకు సంబంధించి అనేక సవరణలు, చట్టాలు చేసింది. 1951లో మొదటి రాజ్యాంగ సవరణ,1964లో 17వ రాజ్యాంగ సవరణ, 1971లో 24వ రాజ్యాంగ సవరణ చేశారు. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. దాన్ని 12వ భాగంలో ప్రకరణ 300–ఎలో రాజ్యాంగ పరమైన హక్కుగా (Constitutional Rights) చేర్చారు. 1979 జూన్ 20 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. అలాగే ఆస్తి హక్కుకు సంబంధించి నూతన నిబంధనలను కూడా చేర్చారు.

ప్రకరణ 31(ఎ): ప్రభుత్వం ఆస్తిని స్వాధీనం చేసుకున్నప్పుడు వర్తించే కొన్ని మినహాయింపులను ఈ ప్రకరణలో పేర్కొన్నారు. భూ సంస్కరణల అమలు కోసం చట్టాలు చేసినప్పుడు.. అవి 14, 19 ప్రకరణలకు వ్యతిరేకమనే కారణంతో న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు.

ప్రకరణ 31(బి): కొన్ని చట్టాల వర్తింపునకు మినహాయింపులు. వీటిని 9వ షెడ్యూల్‌లో ప్రస్తావించారు. ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉన్నాయన్న కారణంతో ఇలాంటి చట్టాలను న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు. 9వ షెడ్యూల్‌లో పేర్కొన్న అంశాలు సాధారణంగా న్యాయ సమీక్షకు గురికావు. కానీ 'రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో న్యాయ సమీక్ష అంతర్భాగం. దాన్ని పరిమితం చేసే అధికారం పార్లమెంటుకు లేదు' అని కేశవానంద భారతి కేసు(1973)లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

2007లో ఐ.ఆర్. కొహెల్హో v/s తమిళనాడు కేసులో 'న్యాయ సమీక్ష రాజ్యాంగ మౌలిక నిర్మాణంలోకి వస్తుంది. కాబట్టి 1973 తర్వాత 9వ షెడ్యూల్‌లో చేర్చిన అంశాలు న్యాయ సమీక్షకు గురవుతాయి' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

ప్రకరణ 31(సి): ఆదేశిక సూత్రాల అమలు కోసం ప్రాథమిక హక్కులపై, ముఖ్యంగా ఆస్తి హక్కుపై కొన్ని పరిమితులు విధించవచ్చు. ఈ పరిమితులు రాజ్యాంగ విరుద్ధమంటూ న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీల్లేదు. ఆదేశిక సూత్రాల్లోని ప్రకరణ 39లో ఉన్న క్లాజు బి, సిలో సామ్యవాద తరహా సమాజ స్థాపన గురించి పేర్కొన్నారు. ఈ విషయమై రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు కొన్ని పరిమితులు విధిస్తే, అవి ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమని న్యాయస్థానంలో ప్రశ్నించలేం.

వివరణ:

ప్రకరణ 31(ఎ), 31(బి), 31(సి)లు ఆస్తిహక్కుపై పరిమితికి సంబంధించినవి. ఇవి ఎలాంటి ప్రాథమిక హక్కులను ప్రసాదించవు. 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కు ప్రకరణ 31ను తొలగించారు. కానీ వీటిని మాత్రం కొనసాగించారు.

మత స్వేచ్ఛ - సుప్రీంకోర్టు తీర్పులు

బిజో ఇమాన్యుయేల్ v/s స్టేట్ ఆఫ్ కేరళ (1986) కేసు:
జాతీయ గీతాన్ని ఆలపించడం తమ మత విశ్వాసాలకు విరుద్ధమని నిరూపించగలిగితే.. జాతీయ గీతం పాడాలని ఏ వ్యక్తిని ఒత్తిడి చేయరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. కేరళ పాఠశాలల్లో జాతీయ గీతం ఆలపించడం తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీన్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో ఈ కేసు దాఖలైంది.

సెయింట్ జేవియర్స్ కాలేజీ v/s స్టేట్ ఆఫ్ గుజరాత్ (1974) కేసు:
'లౌకికతత్వం' పదానికి ఈ కేసులో సుప్రీంకోర్టు వివరణ ఇచ్చింది. మతానికి, దేవుడికి అతీతంగా వ్యవహరించడమే లౌకికతత్వం. దేవుడి పట్ల ప్రత్యేక ద్వేషం, వ్యతిరేకత చూపకూడదు. దేవుణ్ని నమ్మేవారిని, నమ్మని వారిని ప్రభుత్వం ఒకే విధంగా చూడాలి.

ప్రకరణ – 32

రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies)

ప్రాథమిక హక్కుల్లో ఇది అత్యంత ముఖ్యమైంది. మూడో భాగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగినా/ఆ హక్కులను పరిమితం చేసినా/అమలు చేయకపోయినా, బాధితులు నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన రాజ్యాంగ పరిహారాలను పొందవచ్చు. మొదటి ఆరు ప్రాథమిక హక్కుల అమలు ఈ నిబంధన పైనే ఆధారపడి ఉంటుంది. హక్కులను గుర్తించడంతో పాటు, వాటి అమలుకు హామీ ఉన్నప్పుడే వాటికి విలువ ఉంటుంది. అమలు కాని హక్కులు వ్యర్థం.

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు నిబంధన 32 (4) హామీ ఇస్తోంది. అందుకే అంబేద్కర్ రాజ్యాంగ పరిహార హక్కును రాజ్యాంగ ఆత్మగా, హృదయంగా వర్ణించారు.

ప్రకరణ 32(1): ఒక వ్యక్తి ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు లేదా అవి అమలు కానప్పుడు ఆ వ్యక్తి నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన పరిహారం పొందవచ్చు.

ప్రకరణ 32(2): హక్కులను కాపాడటానికి ప్రత్యేక ఆదేశాలైన హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, కో–వారెంటో, సెర్షియరీ లాంటి రిట్లను సుప్రీంకోర్టు జారీ చేసేందుకు ఈ భాగం వీలు కల్పిస్తుంది.

ప్రకరణ32(3):సుప్రీంకోర్టు అధికారాలకు విఘాతం కలగకుండా, ఇతర న్యాయస్థానాల(స్థానిక కోర్టులు, జిల్లా కోర్టులు)కు కూడా రిట్లు జారీచేసే అధికారాన్ని పార్లమెంటు చట్టం ద్వారా కల్పించవచ్చు.

ప్రకరణ 32(4): రాజ్యాంగంలో ఇతరత్రా అనుమతించిన విధంగా తప్ప ఈ ప్రకరణ ద్వారా గుర్తించిన హక్కులు రద్దు కావు.

వివరణ:

రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో రాజ్యాంగ పరిహార హక్కు అంతర్భాగమని 1981లో ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

రిట్లు-పరిధి-పరిమితులు

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు జారీచేసే ప్రత్యేక ఆదేశాలను న్యాయశాస్త్ర పరిభాషలో రిట్లు (Writs) అంటారు. రిట్లు జారీ చేసే పద్ధతిని బ్రిటన్ రాజ్యాంగం నుంచి గ్రహించారు. నిబంధన 32 ప్రకారం సుప్రీంకోర్టుకు, నిబంధన 226 ప్రకారం రాష్ట్ర హైకోర్టులకు రిట్లు జారీ చేసే అధికారాన్ని కల్పించారు. పార్లమెంటు ప్రత్యేక చట్టం ద్వారా ఈ అధికారాన్ని జిల్లా న్యాయస్థానాలకు కల్పించవచ్చు. ఇప్పటి దాకా పార్లమెంటు అలాంటి చట్టాలను రూపొందించలేదు. కాబట్టి సుప్రీంకోర్టు, హైకోర్టులకు మాత్రమే రిట్లు జారీ చేసే అధికారం ఉంది. రిట్ల జారీ విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి. హైకోర్టులు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దవుతుంది. ప్రకరణ 226 విషయ పరిధి తక్కువ. కానీ సుప్రీంకోర్టు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దు కాదు. ప్రకరణ 32 విషయ పరిధి విస్తృతమైంది.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీం కోర్టుకు ప్రత్యేకమైన, ప్రాథమిక విచారణ పరిధి ఉంటుంది (Primary and Original). అందుకే సుప్రీం కోర్టును ప్రాథమిక హక్కుల పరిరక్షణ కర్త అంటారు.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీంకోర్టు, హైకోర్టులకు ఉమ్మడి పరిధి ఉంటుంది. అంటే పౌరులు ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ప్రకరణ 32 ప్రకారం నేరుగా సుప్రీంకోర్టును లేదా ప్రకరణ 226 ప్రకారం హైకోర్టును ఆశ్రయించవచ్చు.

సాధారణంగా హైకోర్టు ద్వారా తగిన రక్షణ, ఉపశమనం లభిస్తుందని పౌరులు భావిస్తే, మొదట హైకోర్టును ఆశ్రయించాలని కనుభాయ్ బ్రహ్మ భట్ v/s గుజరాత్ (1972) కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

వివిధ రిట్లు-అర్థం-పరిధి-ప్రాముఖ్యత

హెబియస్ కార్పస్ (Hebeas Corpus)

ఈ పదం లాటిన్ భాష నుంచి వచ్చింది. హెబియస్ అంటే 'Have', కార్పస్ అంటే 'Body' అని అర్థం. ఒక వ్యక్తిని భౌతికంగా కోర్టు ముందు హాజరుపర్చడమని దీనికి అర్థం. ఇది పురాతన రిట్. నిబంధన 19–22 వరకు పొందుపరచిన వ్యక్తిగత స్వేచ్ఛలకు భంగం కలిగినప్పుడు ఈ రిట్ జారీ చేస్తారు. అరెస్టయిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప న్యాయస్థానంలో హాజరుపరచాలి. లేని పక్షంలో ఈ రిట్ దాఖలు చేస్తే వెంటనే ఆ వ్యక్తిని న్యాయస్థానం ముందు హాజరుపరచాలని కోర్టు ఆదేశిస్తుంది.

వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణతోపాటు చట్టబద్ధత లేకుండా ఏ వ్యక్తిని నిర్బంధించకుండా, శిక్షించకుండా కాపాడటం ఈ రిట్ ప్రధాన ఉద్దేశం. ఈ రిట్‌ను ప్రభుత్వ సంస్థలకు, ప్రైవేట్ వ్యక్తులకు కూడా జారీ చేయవచ్చు.

మూడో వ్యక్తికి కూడా ఇందులో జోక్యం చేసుకునే హక్కు(లోకస్ స్టాండై) ఉంటుంది. బాధితుల తరఫున సామాజిక స్పృహ ఉన్న సంస్థ/వ్యక్తి ఈ రిట్ దాఖలు చేయవచ్చు. అందుకే దీన్ని ఉదారమైన రిట్ అని, వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణ సాధనమని అంటారు.

మినహాయింపులు:

పార్లమెంటు స్వాధికారాలకు భంగం కలిగించిన కారణంతో వ్యక్తిని నిర్బంధించినప్పుడు, కోర్టు ద్వారా నేరారోపణ నిరూపితమై జైలు శిక్ష అనుభవిస్తున్నప్పుడు ఇది వర్తించదు.

మాండమస్ (Mandamus)

భాషాపరంగా మాండమస్ అంటే ఆదేశం అని అర్థం.సుప్రీం కోర్టు లేదా హైకోర్టు జారీచేసే అత్యున్నత ఆదేశంగా దీన్ని చెప్పవచ్చు. ప్రభుత్వాధికారి/సంస్థ తమ చట్టబద్ధమైన విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని న్యాయస్థానం ఇచ్చే ఆదేశం.

ప్రభుత్వాధికారులు, సంస్థలు తమ విధులను చట్టబద్ధంగా నిర్వర్తించనప్పుడు ప్రజల హక్కులకు భంగం వాటిల్లుతుంది.అలాంటి సందర్భాల్లో వారు సక్రమంగా విధులు నిర్వర్తించడానికి ఈ రిట్ జారీ చేస్తారు. పబ్లిక్ సంస్థలు, క్వాజి పబ్లిక్ (Quasi-Public),జ్యుడీషియల్ సంస్థలు,క్వాజి జ్యుడీషియల్ సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీ చేయవచ్చు.

మినహాయింపులు:

రాష్ట్రపతి, గవర్నర్లకు ఈ రిట్ వర్తించదు. వీరు తమ అధికారాలు, విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని ఏ కోర్టు ఆదేశించలేదు.

ప్రైవేట్ వ్యక్తులు, ప్రైవేటు సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీచేయడానికి వీల్లేదు. మాండమస్ రిట్‌ను అంతిమ ప్రత్యామ్నాయంగా మాత్రమే జారీ చేస్తారు.అంటే పరిపాలనాపరమైన ప్రత్యామ్నాయాల ద్వారా పౌరులు న్యాయాన్ని పొందలేనప్పుడు ఈ రిట్ ద్వారా ఉపశమనం పొందవచ్చు. ఈ రిట్ జారీ అనేది కోర్టు విచక్షణపై ఆధారపడి ఉంటుంది. అధికారులు తప్పనిసరిగా నిర్వర్తించాల్సిన విధులకే ఇది వర్తిస్తుంది. విచక్షణ(Discretion) పూర్వకమైన విధులకు వర్తించదు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఉండాల్సిన ముఖ్య లక్షణం?



మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో విద్యా లక్ష్యం కానిది ఏది?
   1) విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించడం
   2) సమాజంతో విద్యార్థుల సంబంధాలు తెలపడం
   3) విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడం
   4) విద్యార్థులకు ఉపాధి కల్పింపజేయడం
2. ప్రాథమిక విద్యను ఎవరికి బోధించాలని రాజ్యాంగం నిర్దేశించింది?
   1) తెలివి ఉన్న వారికి
   2) వెనుకబడినవారికి
   3) 6 నుంచి 14 ఏళ్ల లోపు బాలబాలికలకు
   4) 5 - 14 ఏళ్ల లోపు వెనుకబడిన వారికి
3. నూతన విద్యా ప్రణాళికలో ప్రధానాంశం?
   1) జాతీయ సమైక్యత పెంపొందించడం
   2) ప్రజల్లో స్నేహభావాన్ని పెంపొందించడం
   3) మతం విషయంలో అవగాహన పెంపొందించడం
   4) విద్యార్థుల మానసిక శక్తులను పెంపొందించడం
4. ఉత్తమ ఉపాధ్యాయుడికి ఉండాల్సిన ముఖ్య లక్షణం?
   1) వృత్తికి న్యాయం చేయడం
   2) నైతిక జీవనం పెంపొందించడం
   3) ధనం సంపాదించడం
   4) సమాజాన్ని గౌరవించడం
5. ఉపాధ్యాయునిగా మీరు సాధించాల్సింది?
   1) మూఢనమ్మకాలను తొలగించడం
   2) అక్షరాస్యతను విస్తరించడం
   3) సమాజంలో చైతన్యం కలిగించడం
   4) ఏదీకాదు
6. సమాజంలో ఉపాధ్యాయుని స్థానం?
   1) విలువైనది 2) ఉన్నతమైనది
   3) సాధారణమైనది
   4) వ్యాపారాత్మకమైనది
7. ఉపాధ్యాయులు రాజకీయాల్లో పాల్గొనడంపై మీ అభిప్రాయం?
   1) పాల్గొనవచ్చు 2) పాల్గొనరాదు
   3) స్థానిక ఎన్నికల్లో పాల్గొనవచ్చు
   4) ప్రభుత్వ అనుమతితో పాల్గొనవచ్చు
8. ప్రస్తుతం పాఠశాలల్లో అమలవుతున్న మూల్యాంకన విధానం ఏది?
   1) నిర్మాణాత్మక మూల్యాంకనం
   2) రూపాత్మక మూల్యాంకనం
   3) గుణాత్మక మూల్యాంకనం
   4) నిరంతర సమగ్ర మూల్యాంకనం
9. క్రమశిక్షణ పాటించని విద్యార్థులపై ఉపాధ్యాయుడు చర్య తీసుకోవడాన్ని మీరు సమర్థిస్తారా?
   1) సమర్థిస్తాను
   2) కొన్ని సందర్భాల్లో సమర్థిస్తాను
   3) ఎటూ చెప్పలేను
   4) సమర్థించను
10. పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం నిర్దేశించడానికి కారణం?
    1) ప్రశాంతత కోసం
    2) అందంగా కనిపించడానికి
    3) ప్రత్యేక గుర్తింపు కోసం
    4) సమానత్వ భావన కోసం
11. గృహ సంబంధ, వృత్తి సంబంధ విషయాల్లో మీరు దేనికి ప్రాధాన్యమిస్తారు?
    1) వృత్తి సంబంధ విషయాలకు
    2) రెండింట్లో ఏది అవసరమో అది చేస్తాను
    3) గృహ విషయాలకు
    4) దేనికీ ప్రాధాన్యం ఇవ్వను
12. తరగతిలో విద్యార్థులు గోల చేస్తున్నప్పుడు ఉపాధ్యాయుడు ఏం చేస్తే బాగుంటుంది?
    1) కొంతసేపు బోధనను ఆపాలి
    2) గోలను పట్టించుకోకూడదు
    3) గట్టిగా మాట్లాడాలి
    4) కొంతమంది విద్యార్థులను బయటకు పంపించాలి
13. తరగతి గదిలోని ఏ విద్యార్థీ సరైన ప్రగతి సాధించలేకపోతే దానికి కారణం?
    1) సరైన వసతులు లేకపోవడం
    2) సరైన ప్రోత్సాహం లేకపోవడం
    3) విద్యా ప్రణాళిక లోపం
    4) ఉపాధ్యాయుడు దండించకపోవడం
14. తరగతి గదిలో ఉపాధ్యాయుడు పరిశీలించాల్సిన విషయం?
    1) అల్లరి పిల్లల ప్రవర్తన
    2) తరగతి గది పరిసరాలు
    3) విద్యార్థుల సంభాషణలు
    4) పాఠ్యాంశాలు
15. ఉపాధ్యాయుడు, విద్యార్థి మధ్య సంబంధం ఎలా ఉండాలి?
    1) భౌతికంగా దూరంగా, మానసికంగా దగ్గరగా
    2) భౌతికంగా దగ్గరగా, మానసికంగా దూరంగా
    3) అంటీ ముట్టనట్లు
    4) గాఢమైన స్నేహమైత్రి ఉండాలి
16. చక్కగా విధులు నిర్వహించే ఉపాధ్యాయుడిని విద్యార్థులు ఏవిధంగా పరిగణిస్తారు?
    1) నాయకునిగా 2) స్నేహితుడిగా
    3) మార్గదర్శకుడిగా
    4) దైవంతో సమానంగా
17. విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుడు ఎలా ఉండాలని ఆశిస్తారు?
    1) మంచి ప్రజ్ఞా – జ్ఞానం ఉన్నవారు
    2) సామర్థ్యం ఉన్నవారు
    3) నిష్పక్షపాతంగా మూల్యాంకనం చేసేవారు
    4) తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపేవారు
18. కిందివాటిలో విద్యార్థులను ఎక్కువగా ప్రభావితం చేసేది?
    1) స్నేహితులు 2) పాఠశాల
    3) సినిమాలు 4) సమాజం, ధనం
19. కిందివాటిలో ఉపాధ్యాయుడు బోధన ఆపాల్సిన సందర్భం ఏది?
    1) విద్యార్థి మానసికంగా అలసట చెందినప్పుడు
    2) ఉపాధ్యాయునికి ముఖ్యమైన పనులున్నప్పుడు
    3) ఉపాధ్యాయుడు అలసిపోయినప్పుడు
    4) విద్యార్థులు నిరాసక్తతతో ఉన్నప్పుడు
20. తరగతి గదిలో హాస్యపూరిత వాతావరణం ఏవిధంగా దోహదపడుతుంది?
    1) మంచిదికాదు
    2) ఉపాధ్యాయుడు, విద్యార్థులు మిత్రుల్లా మెలగుతారు
    3) తరగతిలో అభ్యసన ప్రక్రియ సరైన స్థితిలో ఉంటుంది
    4) అభ్యసన ప్రక్రియ కుంటుపడుతుంది
21. తరగతి గదిలో క్రమశిక్షణ దేనిపై ఆధారపడి ఉంటుంది?
    1) ఉపాధ్యాయుడి రౌద్ర స్వభావం
    2) అల్లరి చేసేవారిని వెంటనే దండించడం
    3) రాత పని ఎక్కువగా ఇవ్వడం
    4) ఉపాధ్యాయుని బోధనా పటిమ
22. విద్యార్థుల్లో క్రమశిక్షణారాహిత్యానికి కారణం ఏమిటి?
    1) పరిసరాలు, సామాజిక కారకాలు
    2) బాధ్యతారాహిత్యమైన తల్లిదండ్రులు, కుటుంబ పరిస్థితులు
    3) పాఠశాల పరిపాలన నిర్వహణ పద్ధతులు
    4) పైవన్నీ
23. విద్యార్థుల వెనుకబాటుతనానికి కారణం?
    1) సామాజికపరమైన పేదరికం
    2) శారీరక లోపం
    3) అతి గారాబం, చెడు సావాసాలు
    4) పైవన్నీ
24. పేదరికం వల్ల ఒక విద్యార్థి పాఠశాలకు రావడం పూర్తిగా మానేస్తే ఉపాధ్యాయుడిగా మీరు ఏం చేస్తారు?
    1) హాజరు పట్టీ నుంచి పేరు తొలగిస్తాను
    2) తోటి విద్యార్థులతో తల్లిదండ్రులకు కబురు పంపుతాను
    3) ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకువెళతాను
    4) అవసరమైతే విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లి దండ్రులతో మాట్లాడతాను
25. సాధారణంగా విద్యార్థులు నైతిక విలువలను ఎవరి నుంచి అలవర్చుకుంటారు?
    1) తల్లిదండ్రులు 2) ఉపాధ్యాయులు
    3) సమవయస్కులు 4) పైవారందరూ
26. తరగతి గదిలో పొరపాటు చేసిన ఉపాధ్యాయుడు?
    1) తప్పును నిజమని అందరూ నమ్మేలా చేయాలి
    2) తప్పు చేయడం సహజం అని విద్యార్థులు గుర్తించేట్లు చేయాలి
    3) విద్యార్థులు గమనించకుండా తెలివిగా వ్యవహరించాలి
    4) అంగీకరించి, సరైన దాన్ని సూచించాలి
27. విద్యార్థులు పాఠాన్ని మరింతగా అవగాహన చేసుకోవడానికి ఉపాధ్యాయుడిగా మీరు ఏం చేస్తారు?
    1) ట్యూషన్ వెళ్లమని సలహా ఇస్తాను
    2) కొత్త గ్రంథాలను చదవాలని చెబుతాను
    3) క్రమశిక్షణతో బోధిస్తాను
    4) విద్యార్థులకు మరిన్ని ఉదాహరణలతో వివరిస్తాను
28. మీరే విద్యార్థి అయితే ఉపాధ్యాయుడు బోధించే పాఠం అర్థం కాకపోతే ఏం చేస్తారు?
    1) ఉపాధ్యాయునిపై గౌరవ భావంతో నిశ్శబ్దంగా కూర్చుంటాను
    2) ఇంటివద్ద ట్యూషన్‌లో చదువుకుంటాను
    3) నిస్సంకోచంగా సమస్యను ఉపాధ్యాయుని ముందు ఉంచుతాను
    4) ప్రధానోపాధ్యాయునికి చెబుతాను
29. పరీక్షా పత్రాల మూల్యాంకనం తర్వాత అందరి కంటే తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థికి సంబంధించి ఉపాధ్యాయుడు ఏం చేయాలి?
    1) విద్యార్థికి తక్కువ మార్కులు రావడానికి కారణాలు తెలుసుకోవాలి
    2) తల్లిదండ్రులను పిలిచి అతడిని ఎక్కువ సమయం చదివించాలని చెప్పాలి
    3) విద్యార్థిని టీవీ చూడటానికి, ఆటలకు దూరంగా ఉండాలని చెప్పాలి
    4) పరీక్షా పత్రాన్ని ఎక్కువ సార్లు చూసి రాసుకు రావాలని చెప్పాలి
30. మీరు ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాలనుకోవడానికి కారణం ఏమిటి?
    1) అన్ని రకాల సౌకర్యాలు ఉంటాయి
    2) విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించవచ్చు
    3) రోజూ విద్యార్థులతో ఉల్లాసంగా గడపవచ్చు
    4) వృత్తిలో గౌరవం లభిస్తుంది
31. ఉపాధ్యాయుడు ఎక్కువ సమయం ఎవరి కోసం కేటాయించాలి?
    1) తెలివైన విద్యార్థులు
    2) వెనుకబడిన విద్యార్థులు
    3) క్రమశిక్షణారాహిత్యం ఉన్న విద్యార్థులు
    4) సహ ఉపాధ్యాయులు
32. ఉపాధ్యాయుడి ఉత్తమ అభిరుచి ఏది?
    1) నూతన జ్ఞాన సముపార్జన
    2) ఆటలాడటం
    3) ఇతరులతో మంచి సంబంధాలు కొనసాగించడం
    4) తీయని స్వరంతో మాట్లాడటం, పాటలు పాడటం
33. ఉపాధ్యాయుడు ఏ విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని బోధించాలి?
    1) బాగా చదివేవారిని
    2) బాగా వెనుకబడిన వారిని
    3) సగటు విద్యార్థిని
    4) పై వారందరినీ
34. విద్యార్థిని ప్రగతి పథంలో నడిపించడానికి ఉపాధ్యాయుడిగా మీరు సూచించే మార్గం?
    1) ఇతర విషయాల్లో దృష్టి మరల్చకుండా పాఠ్యాంశాల్లో చక్కని అవగాహన ఏర్పర్చుకునేట్లు చేస్తాను
    2) ఆటలాడటం, మ్యాగజీన్స్ చదవడం మానిపిస్తాను
    3) తరచుగా బట్టీ వేయిస్తాను
    4) పాఠ్యాంశాలు, పాఠ్యేతరాలను ఆసక్తిగా ఉండేట్లు చేస్తాను

సమాధానాలు

1) 4;	2) 3;	3) 1;	4) 1;	5) 2;
6) 2;	7) 1;	8) 4;	9) 1;	10) 4;
11) 1;	12) 1;	13) 2;	14) 4;	15) 1;
16) 3;	17) 4;	18) 2;	19) 1;	20) 3;
21) 4;	22) 4;	23) 4;	24) 4;	25) 2;
26) 4;	27) 4;	28) 3;	29) 1;	30) 4;
31) 2;	32) 1;	33) 4;	34) 4.	

విద్య, ఉద్యోగ సమాచారం

సీఎస్ఐఆర్-టీకేడీఎల్, న్యూఢిల్లీలో ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులు

న్యూఢిల్లీలోని సీఎస్ఐఆర్-ట్రెడిషనల్ నాలెడ్జ్ డిజిటల్ లైబ్రరీ యూనిట్ (టీకేడీఎల్) ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
- » **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసోసియేట్1–02, ప్రాజెక్ట్ అసోసియేట్2–03.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితోపాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్1 పోస్టుకు సీఎస్ఐఆర్–యూజీసీ/ఐసీఏఆర్/ఐసీఎంఆర్/నెట్/గేట్ ఉత్తీర్ణత ఉన్న వారికి రూ.31,000, ఇతరులకు రూ.25,000, ప్రాజెక్ట్ అసోసియేట్ 2 పోస్టుకు సీఎస్ఐఆర్–యూజీసీ/ఐసీఏఆర్/ఐసీఎంఆర్ /నెట్/గేట్ ఉత్తీర్ణత ఉన్నవారికి రూ.35,000, ఇతరులకు రూ.28,000.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.01.2025.
- » **రాతపరీక్ష తేది:** 20.01.2025.
- » **ఇంటర్వ్యూ వేదిక:** సీఎస్ఐఆర్–టీకేడీఎల్ యూనిట్, 14, సత్సంగ్ విహార్ మార్గ్, కుతుబ్ ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, న్యూఢిల్లీ.
- » **వెబ్‌సైట్:** https://www.csir.res.in

బీఐఎస్, న్యూఢిల్లీలో యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టులు

న్యూఢిల్లీలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
- » **వేతనం:** నెలకు రూ.70,000.
- » **విభాగాల వారీగా ఖాళీలు:** సీఈడీ–01, ఎఫ్ఏడీ–01, ఈఈడీ–01, ఎంఈడీ–01, ఎస్‌సీఎండీ–02.
- » **అర్హత:** సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్,ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, మెకానికల్/కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో బీటెక్/బీఈ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** విద్యార్హత, ఉద్యోగానుభవం , టెక్నికల్ నాలెడ్జ్, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.01.2025
- » **వెబ్‌సైట్:** https://www.bis.gov.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

వెయ్యేళ్ల కిందటే బతుకమ్మ ప్రారంభం!

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ

బతుకమ్మ పండుగ

తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ. రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా 2014 అక్టోబర్ 2న ఈ పండుగను అధికారికంగా నిర్వహించింది. తెలంగాణ ఉద్యమం సందర్భంగా వివిధ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు 'బతుకమ్మ' పండుగను జరుపుకొని ఈ పండుగ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. ఇప్పుడిదొక బృహత్ పండుగ.

ఇప్పటిదాకా బతుకమ్మ పండుగ మూలాలు వెలుగులోకి రాలేదు. ఈ విషయాన్ని చరిత్రకారులు, సాహితీవేత్తలు ధ్రువీకరించారు. శతాబ్దాలుగా బతుకమ్మ పండుగపై ఎన్నో జానపద గాథలు, పాటలు తెలంగాణలో ప్రచారంలో ఉన్నాయి. ఎందరో తెలుగు రీసెర్చ్ స్కాలర్లు బతుకమ్మ పండుగ ప్రాధాన్యతపై ఎన్నో పరిశోధనలు చేశారు. కానీ ఈ పండుగను ఎప్పుడు, ఎవరు ప్రారంభించారు? ఎలా మొదలైంది? లాంటి ప్రశ్నలకు సమాధానం దొరకలేదు. ప్రపంచంలోనే ఏకైక పూల పండుగ, స్త్రీల కోసం ఉన్న పండుగ బతుకమ్మే.

కొందరు సాహితీవేత్తలు ఈ పండుగలో జైన మత అడుగుజాడలను, కాకతీయులతో ఉన్న సంబంధాన్ని వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. కానీ అవి ప్రజామోదం పొందలేదు. కాకతీయులు కొంతకాలం ఆంధ్ర దేశం అంతటినీ పాలించినా ఈ పండుగ తెలంగాణాకే పరిమితం కావడం అర్థం కాని విషయం. 'బతుకమ్మ' చరిత్ర మూలాలు కనుక్కోవాలంటే వెయ్యేళ్ల క్రితం 'రాజ్యపాలన చేసిన కల్యాణి చాళుక్యుల, చోళుల చరిత్రను తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

బతుకమ్మ చరిత్ర

973లో రాష్ట్రకూటుల సామంతుడైన రెండో తైలపుడు చివరి రాష్ట్రకూటరాజైన 'కర్కుడు-2'ను ఓడించి స్వతంత్ర కల్యాణీ చాళుక్య రాజ్యం స్థాపించాడు. ప్రస్తుత తెలంగాణ ప్రాంతం ఇతడి ఆధీనంలో ఉండేది. ఈ కాలంలోనే వేములవాడ చాళుక్య రాజ్యంలోని వేములవాడ 'రాజేశ్వరాలయం' అప్పటికే ప్రసిద్ధి చెందింది. తెలంగాణ ప్రజల ఇష్ట దైవంగా రాజేశ్వరుడు పూజలు అందుకునేవాడు. రెండో అరికేసరి(930-55) వేయించిన 'దానశాసనం'లో ఈ దేవాలయ ప్రసక్తి ఉంది. వేములవాడ చాళుక్య రాజులు రాష్ట్రకూటుల సామంతులు. అందువల్ల చోళులు, రాష్ట్రకూటుల మధ్య యుద్ధం జరిగితే వీరు రా ష్ట్రకూటుల పక్షం వహించేవారు. ఈ విధంగా రెండో పరాంతకుడు వేములవాడలోని రాజేశ్వరాలయాన్ని కూడా సందర్శించాడని శాసనాల్లో పేర్కొన్నారు.

చోళుల కాలం నాటి చరిత్ర

రాజేంద్ర చోళుడు వేములవాడ దేవాలయాన్ని



ధ్వంసం చేసిన అనంతరం వేములవాడ రాజేశ్వరుడి(బృహదీశ్వరుడి) మాహాత్మ్యం తెలుసుకుని లింగరూపంలో ఉన్న రాజేశ్వరుణ్ని కంచి నగరానికి తీసుకెళ్లాడు. తన విజయానికి గుర్తుగా తండ్రి అయిన రాజరాజచోళునికి ఈ లింగాన్ని బహూకరించాడని తెలుస్తోంది. 1006లో ఈ లింగానికి(బృహదీశ్వరుడికి) తంజావూరులో దేవాలయ నిర్మాణం ప్రారంభించాడు. 1010లో లింగ ప్రతిష్ఠాపన చేసి, గోపుర కలశాభిషేకాలు నిర్వహించినట్లు శాసనాల ద్వారా స్పష్టమవుతోంది.

రాజరాజచోళుడు బృహదీశ్వరుడికి కృతజ్ఞతా పూర్వకంగా బంగారు కమలాలను సమర్పించాడు. ఈ బృహదీశ్వరాలయాన్ని వేములవాడ చాళుక్య దేశంపై జరిగిన దండయాత్రలో దోచుకున్న ధనంతో నిర్మించామని తమిళ శాసనాల్లో చోళరాజులు ప్రకటించుకున్నారు. వేములవాడ భీమన్న గుడిలోని శివలింగం, బృహదీశ్వరాలయంలోని శివలింగం ఒకేలా ఉంటాయి. తంజావురులోని బృహదీశ్వరాలయం దక్షిణ భారతదేశంలోనే ఎత్తయిన 'విమానం'(విమానం అంటే గోపురం లేదా దేవాలయ ద్వారం) ఉన్న దేవాలయం దీన్ని 'ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించింది.

బతుకమ్మ పండుగకు బృహదీశ్వరాలయం, వేములవాడ రాజన్న ఆలయాలతో సంబంధం ఏమిటి? చోళ, చాళుక్యుల చరిత్రను ఎందుకు ప్రస్తావించామనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. వేములవాడ నుంచి శివలింగాన్ని దౌర్జన్యంగా తంజావూరుకు తరలించి, అక్కడ గొప్ప దేవాలయం నిర్మించడం చోళులకు గర్వకారణమైన విషయమే కావొచ్చు. కానీ అది తెలంగాణ ప్రజలకు బాధను కలిగించింది. చోళులు బృహదేశ్వరుడిని తీసుకెళ్లినందుకు నిరసనగా సృష్టికి కారణభూతమైన శక్తిస్వరూపాన్ని బృహతమ్మ (బతుకమ్మ)గా పూజించారు. అదే 'బృహత్' బృహతమ్మ లేదా బతుకమ్మగా ప్రాచుర్యం పొందింది.

బృహత్ అమ్మ, బ్రతుకమ్మ

బతుకమ్మను బృహతమ్మ రూపాంతరంగా భావిస్తూ తంజావూరు దేవాలయానికి బృహత్ అనే పదం వినియోగించారు. బృహత్ అనే పదాన్ని బృహతమ్మ (గొప్ప అమ్మ) అనే పేరుతో ఉపయోగించారు.

'బృహత్ కథ' అనే సంస్కృత గ్రంథం భారతీయ ప్రాచీన గాథలకు, అనేక కథలు, కావ్యాలు, నాటకాలకు మూలమైంది. దీన్ని రచించిన గుణాఢ్యుడు (మెదక్ జిల్లా) తెలంగాణ తొలికవి. బృహత్ కథను పైశాచీ నామంతో రచించాడు. రెండో శతాబ్దంలో 'పెరంగదై' పేరుతో తమిళంలోకి కూడా ఈ గ్రంథాన్ని అనువదించారు. రామాయణం, మహాభారతంతో సమాన ప్రతిపత్తి ఉన్న గొప్ప గ్రంథం ఇది. అనేక మంది కవులకు 'బృహత్‌కథ' కావ్య వస్తువుగా ఉండేది. ప్రాచీనమైన బృహత్‌ధారణ ఉపనిషత్ లేదా బృహదారణ్య ఉపనిషత్ పేరులో కూడా బృహత్ అనే పద వినియోగం కనిపిస్తుంది. బృహత్ పదాన్నే బృహతమ్మ లేదా బతుకమ్మగా ప్రజలు ఉపయోగించారని భావించాలి.

బృహతమ్మ (బతుకమ్మ) ఉద్యమం

రాజేంద్రచోళుడు వేములవాడ బృహత్ శివలింగాన్ని తంజావూరుకు తరలించాక తెలంగాణ ప్రజలు తమ ఆక్రోశాన్ని ఒక ఉద్యమంగా మార్చి చోళ రాజులకు తమ నిరసనను తెలిపే ప్రయత్నమే 'బతుకమ్మ' సృష్టికి దారితీసింది. తెలంగాణ నుంచి లింగాకారమైన శివుడు వెళ్లిపోయిన తర్వాత ఇక్కడున్న పార్వతిని ఊరడించే ప్రయత్నంలో భాగంగా పూలతో(సృష్టి) మేరు పర్వతంలా బతుకమ్మను పేర్చారు. దానిపై పసుపు గౌరమ్మను రూపొందించి, దసరా సందర్భంలో తొమ్మిది రోజులు ఆటపాటలతో పదేపదే తలుస్తూ.. చివరగా తిరిగి రమ్మంటూ నీళ్లలో వదలడం ఒక పండుగగా మారింది.

బహుశా దేశ చరిత్రలోనే మొదటిసారిగా ఒక అకృత్యానికి, అన్యాయానికి అహింసా పూర్వక సత్యాగ్రహాలతో నిరసన తెలిపిన ఏకైక ప్రక్రియ బతుకమ్మ.

బతుకమ్మ పాట

బతుకమ్మ పండుగ సందర్భంగా వివిధ రకాల పాటలు పాడతారు. అందులో ఒక ప్రాచీన చోళరాజును ప్రస్తుతించడం కనిపిస్తుంది. చోళదేశ రాజైన ధర్మాంగుడు నూరునోములు నోమి నూరు మందిని పొందాడట. ఆ పాటలోని ప్రథమార్థం ఇలా ఉంటుంది..

'శ్రీ లక్ష్మిదేవియు ఉయ్యాలో సృష్టి బతుకమ్మయే ఉయ్యాలో..
పుట్టినా రీతి జెప్పె ఉయ్యాలో భట్టు నరసింహ కవి ఉయ్యాలో..
ధరచోళదేశము ఉయ్యాలో ధర్మాంగుడనరాజు ఉయ్యాలో..
ఆ రాజు భార్యయు ఉయ్యాలో అది సత్యవతి యంద్రు ఉయ్యాలో..
నూరు నోములు నోమి ఉయ్యాలో నూరు మందిని గాంచె ఉయ్యాలో..
వారు శూరులయ్యి ఉయ్యాలో వైరులచే మృతులైరి ఉయ్యాలో...

ఈ పాటలో కనిపించిన 'చోళదేశం, నూరునోముల సృష్టి, బతుకమ్మయే' అనే పదాలు బతుకమ్మ ఉద్యమానికి దగ్గరగా ఉన్నాయి. వేములవాడ బృహదీశ్వరుణ్ని తరలించింది చోళరాజు. బహుశా రాజరాజచోళుడి తండ్రి రెండో పరాంతక చోళుడు రాజేశ్వర నోము నోచి దేవుడి అనుగ్రహంతో పొందిన కుమారుడికి దేవుడి పేరుమీద 'రాజరాజ' అని నామకరణం చేసి ఉండాలి. మరోచోట పూబోణి పదం బతుకమ్మకు ప్రతిరూపంగా కనిపిస్తుంది.

బహుశా బతుకమ్మ ఉద్యమ తీవ్రతను గ్రహించిన చోళరాజులు నరసింహ కవి లాంటి కవులతో వారికి అనుగుణంగా తెలంగాణ ప్రజల ఉక్రోషాన్ని మరిపించేలా ఉయ్యాల పాటలను రాయించి ప్రజల మధ్య వ్యాప్తి చెందించారని భావించవచ్చు. ఇన్నేళ్ల బతుకమ్మ పాటల్లో చోళుల కథ జీవించి ఉండటం మరో విశేషం. దీన్ని సాహిత్య పరమైన రుజువుగా భావించవచ్చు.

ప్రతాపరుద్రుడి కాలంలో కాకతీయులు మేడారం రాజుతో యుద్ధం చేశారు. సమ్మక్క, సారక్క, పగిడిద్దరాజుకు మద్దతుగా.. తెలంగాణ ప్రజలు వారిని దేవతలుగా భావించి మరో పద్ధతిలో సత్యాగ్రహాన్ని వెలిబుచ్చారు. రెండేళ్లకు ఒకసారి లక్షల సంఖ్యలో ఒక చోట చేరి దాదాపు 700 ఏళ్ల తర్వాత కూడా తమ ఆగ్రహాన్ని ఒక తీర్థం రూపంలో వెలిబుచ్చడం తెలంగాణ చరిత్రలో మరో మరుపురాని సంఘటన. బతుకమ్మ ఉత్సవమే సమ్మక్క-సారక్క జాతరకు మూలాధారంగా భావించవచ్చు. మేడారం జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందింది.

చరిత్రలో ఏ అంశమైనా సంపూర్ణ నిర్ధారితం కానీ, సత్యం కానీ కాకపోవచ్చు. తగిన ఆధారాలు దొరకనప్పుడు కొంత ఊహ ఉంటుంది. ఊహకు ఓ ఆధారం ఉంటుంది. ఆధారం మీద ఓ ఊహ ఉంటుంది. కాబట్టి వెయ్యేళ్ల నాటి బృహతమ్మనే నేటి బతుకమ్మ. ఈ బతుకమ్మనే తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసింది. తెలంగాణ ప్రజలకు ఆరాధ్య దైవంగా కలకాలం నిలిచిపోయింది.

మాదిరి ప్రశ్నలు

1. తెలంగాణ ప్రభుత్వం బోనాలను రాష్ట్ర పండుగగా ఏ రోజున ప్రకటించింది? (2014లో)
   ఎ) జూన్ 2 బి) జూన్ 6
   సి) జూన్ 16 డి) జూన్ 18
2. బతుకమ్మ పండుగకు సంబంధించిన వాస్తవ అంశం?
   1. తంగేడి పూలు ఉపయోగించడం
   2. అశ్వయుజ మాసం మొదటిరోజు ప్రారంభమవుతుంది
   3. మొదటిరోజు ఎంగిలి పూల బతుకమ్మ
   4. రెండో రోజు అటుకుల బతుకమ్మ
   ఎ) 1, 3 మాత్రమే బి) 2, 4 మాత్రమే
   సి) 1, 2 మాత్రమే డి) 1, 3, 4 మాత్రమే
3. బోనాల పండుగకు సంబంధించి వాస్తవ అంశం?
   1. బోనం (భోజనం)
   2. ఘటోత్సవం (కలశం)
   3. రంగం (భవిష్యవాణి)
   ఎ) 1, 2 మాత్రమే వాస్తవం
   బి) 1, 3 మాత్రమే వాస్తవం
   సి) 2, 3 మాత్రమే వాస్తవాలు
   డి) పైవన్నీ వాస్తవాలే
4. ఏడుపాయల జాతర ఏ ప్రాంతంలో ప్రసిద్ధి?
   ఎ) నాగసానిపల్లి బి) రంగధాం పల్లి
   సి) కేస్లాపూర్ డి) వేలాల
5. 'సమ్మక్క-సారక్క' అతిపెద్ద గిరిజన జాతర. ఇది మేడారం(వరంగల్ జిల్లా)లో రెండేళ్లకు ఒకసారి జరుగుతుంది. దీనికి సంబంధించి సరికానిది?
   ఎ) 1996లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది
   బి) ఇది ప్రధానంగా నాలుగు రోజుల పండుగ
   సి)కన్నెపల్లి నుంచి సారక్కను తీసుకొస్తారు
   డి) సమ్మక్క - సారలమ్మ అక్కా చెల్లెళ్లు
6. హర్తాళిక పండుగను ఏ పండుగకు ముందు జరుపుకుంటారు?
   ఎ) దసరా బి) వినాయక చవితి
   సి) దీపావళి డి) పీర్ల పండగ
7. మేడారం తర్వాత అతిపెద్ద జాతరగా 'గొల్లగట్టు' జాతర ప్రసిద్ధి చెందింది. దీనికి సంబంధించిన అంశం?
   1. దీన్నే పెద్దగట్టు జాతర అంటారు
   2. నల్గొండ జిల్లాలోని సూర్యాపేట సమీపంలోని దురాజ్‌పల్లిలో ఉంది
   3. ఆరాధ్యదైవం లింగమంతుల స్వామి
   ఎ) 1 మాత్రమే
   బి) 1, 2 మాత్రమే
   సి) 2, 3 మాత్రమే
   డి) 1, 2, 3 మాత్రమే
8. సాధారణంగా వర్షాకాలం ప్రారంభమైనాట్లు పూర్తయిన తర్వాత తొమ్మిది రోజుల పాటు జరుపుకొనే ఆదివాసీల పండుగ?
   ఎ) నాగశేష బి) పెర్సాపెన్
   సి) శీతల భవానీ డి) తీజ్ పండుగ

సమాధానాలు

1) సి; 2) డి; 3) డి; 4) ఎ; 5) డి; 6) బి; 7) డి; 8) డి.

The last stage in the selling process?



BANK EXAMS

MARKETING AWARENESS

1. Which of the following information forms available to the marketing manager can usually be accessed more quickly and cheaply than other information sources?
   a) Marketing intelligence
   b) Marketing research
   c) Customer profiles
   d) External databases
   e) Internal databases
2. Banks selling Insurance and Mutual funds is:
   a) A relatively high level of diversification
   b) An example of product diversification
   c) Unlikely to reduce variability in the firm's profitability since the banks are all in same business
   d) An example of related linked diversification
   e) None of the above
3. An ideal marketing framework is designed to address three key management questions. Which of the following is one of those questions?
   a) Value Proposition - i.e. How can value propositions be made profitable?
   b) Value chain - i.e. Are there weak links in the company's value chain?
   c) Value network - i.e. How can a company effectively network?
   d) Value exploration – i.e. How can a company identify new value opportunities?
   e) All of the above
4. The biggest or greatest amount of involvement in a foreign market comes through which of the following?
   a) Exporting b) Joint venturing
   c) Licensing d) Indirect investment
   e) Direct investment
5. A strategy wherein A "three-day cooling off period" in which buyers can cancel a contract after re-thinking it is to protect the consumer is called:
   a) creative selling
   b) high pressure selling
   c) detail selling
   d) hard core selling
   e) detail hard core selling
6. The last stage in the selling process is:
   a) Approach
   b) Handling objections
   c) Closing d) Follow –up
   e) None of the above
7. The more direct connections among businesses, the more _____ is the relatedness of the diversification.
   a) linked b) constrained
   c) integrated d) intense
   e) None of the above
8. _____ are products bought by individuals and organizations for further processing or for use in conducting a business.
   a) Consumer products
   b) Services
   c) Industrial products
   d) Specialty products
   e) None of the above
9. All of the following would be forces that might be contained in a company's microenvironment EXCEPT:
   a) Economic forces
   b) The company itself
   c) Marketing channel firms
   d) Suppliers e) Dealers
10. Which of the following elements of marketing mix customer analyzes at the last, taking a decision of buying a particular product?
    a) Promotion b) Place
    c) Price d) Product
    e) People
11. Which of the following is a value-reducing reason for diversification?
    a) Enhancing the strategic competitiveness of the entire company
    b) Expanding the business portfolio in order to reduce managerial employment risk
    c) Gaining market power relative to competitors
    d) Conforming to antitrust regulation
    e) None of the above
12. _____ is the set of benefits a company promises to deliver its consumers to Satisfy their needs.
    a) A money-back guarantee
    b) An attribute
    c) A value proposition
    d) Good customer service
    e) None of the above
13. When backed by buying power, wants become _____.
    a) Demands b) Social Needs
    c) Exchanges
    d) Self-Esteem needs
    e) Social exchanges
14. The type of sales presentation approach that requires good listening and problem-solving skills is:
    a) Canned approach
    b) Formula approach
    c) Need-satisfaction approach
    d) Critical-thinking approach
    e) All of the above
15. Marketing research firms, advertising agencies, and media firms would all be examples of which of the following marketing intermediaries?
    a) Financial intermediaries
    b) Physical distribution firms
    c) Marketing service agencies
    d) Resellers
    e) None of the above
16. If a company's objective were to reach masses of buyers that were geographically dispersed at a low cost per exposure, the company would likely choose which of the following promotion forms?
    a) Advertising
    b) Personal selling
    c) Public relations
    d) Sales promotion
    e) Marketing
17. The purchasing of firms in the same industry is called:
    a) Unrelated diversification
    b) Vertical integration
    c) Networking the organization
    d) Horizontal acquisition
    e) None of the above
18. Which of the following is a disadvantage of primary market research?
    a) Up to date
    b) Expensive to collect
    c) Focused d) Exclusive
    e) Inclusive
19. Companies selling mass consumer goods and services such as soft drinks, cosmetics, air travel and athletic shoes and equipment spend a great deal of time trying to establish a superior brand image in markets is called _____.
    a) Business markets
    b) Global markets
    c) Consumer markets
    d) Nonprofit and governmental markets
    e) Dealer markets
20. If a consumer describes a car as being the "most economical car on the market," then this descriptor is a:
    a) Rule b) Attitude c) Belief
    d) Clue e) Praise
21. Through _____, many companies today are strengthening their connections to all partners, form providers of raw materials to components to final products that are carried to final buyers.
    a) Partnership relationship marketing
    b) Customized marketing
    c) Direct marketing
    d) Deviated marketing
    e) Indirect marketing
22. Wal-Mart owned Sam's club is an example of a retail form called a(n):
    a) factory outlet
    b) super specialty store
    c) seconds store
    d) warehouse club
    e) All of the above
23. The typical method of retail operation used by supermarkets and catalog showrooms is called:
    a) Self-service retailing
    b) Limited-service retailing
    c) Full-service retailing
    d) Service-merchandiser
    e) None of the above
24. Using a successful brand name to introduce additional items in a given product category under the same brand name (such as new flavors, forms, colors, added ingredients, or package sizes) is called a(n):
    a) Line extension
    b) Brand extension
    c) Multi-branding
    d) New brands
    e) None of the above
25. In terms of special product life cycles, a _____ is a basic and distinctive mode of expression.
    a) genre b) style
    c) fashion d) fad
    e) shape
26. Customers buy from stores and firms that offer the highest ____
    a) Customer perceived value
    b) Concern from society's interests
    c) Company image
    d) Level of customer satisfaction
    e) Product quality
27. ____ consists of dividing a market into distinct groups of buyers on the basis of needs, characteristics, or behavior that might require separate products or marketing mixes.
    a) Product differentiation
    b) Market segmentation
    c) Market targeting
    d) Market positioning
    e) Market differentiation
28. A(n) _____ is a retail store that carries a narrow product line with a deep assortment within that line.
    a) shopping goods store
    b) convenience store
    c) specialty store
    d) department store
    e) None of the above
29. _____ is a strategy of using a successful brand name to launch a new or modified product in a new category.
    a) Duo branding
    b) Line extension
    c) Brand extension
    d) Multi-branding
    e) Single branding
30. Minimizing pollution from production and all environmental impacts throughout the full Product life cycle is called _____
    a) Design For Environment (DFE)
    b) Green Marketing
    c) Environmental Sustainability
    d) Product Stewardship
    e) Red Marketing
31. The product concept says that a company should:
    a) Devote its energy to making continuous product improvements
    b) Make promoting products the top priority
    c) Market only those products with high customer appeal
    d) Focus on the target market and make products that meet those customers' demands
    e) All of the above
32. What went wrong with Coke in 1985?
    a) Management defined its marketing research problem too narrowly
    b) The research looked only at taste and not feeling about dropping the old Coke
    c) No account of intangibles was taken
    d) All of the above
    e) None of the above

Answers

1) e; 2) b; 3) d; 4) e; 5) b; 6) d; 7) b; 8) c; 9) a; 10) a; 11) b; 12) c; 13) a; 14) c; 15) c; 16) a; 17) d; 18) b; 19) c; 20) c; 21) b; 22) d; 23) a; 24) a; 25) b; 26) a; 27) b; 28) c; 29) c; 30) b; 31) a; 32) d.